'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 266

బుధవారం 17-12-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

కామెరాన్ గ్రీన్‌కు రూ.25.20 కోట్లు

ఐపీఎల్-2026 మినీ వేలంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్‌ను కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.25.20 కోట్లకు సొంతం చేసుకుంది. ఐపీఎల్ వేలం చరిత్రలో అత్యధిక ధర పలికిన విదేశీ ఆటగాడిగా అతను రికార్డు సృష్టించాడు. పతిరణ (రూ.18 కోట్లు), కార్తీక్ శర్మ (రూ.14.20 కోట్లు), ప్రశాంత్ వీర్ (రూ.14.20 కోట్లు)లకు భారీ మొత్తం దక్కింది.

13 లో

బెంగాల్‌లో 58 లక్షల ఓటర్లు గల్లంతు

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్‌లోనే 58 లక్షల ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగింపునకు గురయ్యాయి.

వివరాలు 6లో ▸

లూథ్రా సోదరులు అరెస్ట్

గోవా అగ్ని ప్రమాదం కేసులో.. నైట్‌క్లబ్ సహ యజమానులు గౌరవ్, సౌరభ్ లూథ్రా సోదరులను పోలీసులు అరెస్టు చేశారు.

వివరాలు 6లో ▸



'రోజ్‌గార్' బిల్లుపై గరం గరం

లోక్‌సభలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, అజీవికా మిషన్-గ్రామీణ బిల్లుపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి.

వివరాలు 6లో ▸

సాజిద్ ఫ్రం పాతబస్తీ!

ఆస్ట్రేలియాలో కాల్పులకు తెగబడ్డ ఉగ్రవాద తండ్రీ కొడుకులైన సాజిద్, నవీద్ అక్రమ్‌లలో తండ్రి హైదరాబాద్ వాసేనని తేలింది.

వివరాలు 3లో ▸

ఫేక్ సొసైటీతో భూ కబ్జా కుట్ర

విజయవాడలో పేదల ఇళ్ల కూల్చివేత బాబు సర్కారు అధికార దుర్వినియోగానికి పరాకాష్ట

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం

సీబీఐతో విచారిస్తే నిజాలన్నీ బయటికొస్తాయ్

- రూ.150 కోట్ల స్థలాన్ని కాజేసేందుకు 1981 డేట్‌తో.. 2016లో ఓ ఫేక్ సొసైటీ ఏర్పాటు
- అప్పుడు కూడా బాబే సీఎం.. టీడీపీ ప్రభుత్వమే ఉంది
- లోకేశ్, విజయవాడ ఎంపీ, జనసేన కార్పొరేటర్ సోదరుడి పాత్రపై విచారణ జరపాలి
- 25 ఏళ్లుగా పేదలు నివసిస్తున్న ఇళ్లను ధ్వంసం చేస్తారా?
- ఈ ప్రభుత్వం ఎవరి కోసం పని చేస్తోంది? పేదల తరఫున ఉందా?
- బాధితులు సీఎం చంద్రబాబును మూడుసార్లు, లోకేశ్‌ను రెండు సార్లు కలిసి అర్జీలు ఇచ్చారు
- ఆ అర్జీలు తీసుకున్న వారే కుట్ర పన్ని అన్యాయం చేశారు
- డిసెంబర్ 31 వరకు బాధితులకు సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది
- ఒకవైపు 'సుప్రీం'లో కేసు విచారణలో ఉన్నా కూల్చేస్తారా?
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వమే ఇళ్లు కట్టించి.. వారి బ్యాంకు రుణాలు తీర్చాలి
- జోజినగర్ ఘటనకు బాధ్యులను బోనులో నిలబెట్టి తీరుతాం
- బాధితుల న్యాయ పోరాటానికి మా పార్టీ తోడుగా ఉంటుంది

2 లో

విజయవాడలోని జోజినగర్‌లో ఇళ్ల కూల్చివేత బాధితుల గోడు వింటున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

"విజయవాడ నడిబొడ్డున ఖరీదైన భవానీపురంలోని జోజినగర్‌లో భూముల కబ్జాకు 2016లోనే కన్నేశారు. 1981 నాటి డేట్‌తో ఒక ఫేక్ సొసైటీని 2016లో ఏర్పాటు చేశారు. అప్పుడు టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉంది. ఇప్పుడు జోజినగర్‌లో ఏకంగా 42 మంది పేదల ఇళ్లు నిర్దాక్షిణ్యంగా కూల్చేయటాన్ని బట్టి ఇందులో కూటమి పెద్దల కుట్ర స్పష్టంగా తేలుతోంది. ఇళ్ల కూల్చివేతపై సీబీఐతో విచారణ జరిపితే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి.

"ఇలాంటి పరిస్థితి వచ్చినప్పుడు ఏ ప్రభుత్వమైనా చేయాల్సింది ఏమిటి? ఈ ప్రభుత్వం ఎవరి కోసం పని చేస్తోంది? పేదల తరఫున ఉందా? ఇక్కడి వారు సీఎం చంద్రబాబును మూడుసార్లు, లోకేశ్‌ను రెండు సార్లు కలిశారు. అర్జీలు ఇచ్చారు. ఎవరికైతే వీరు అర్జీలు ఇచ్చారో.. వారే కుట్ర పన్ని వీళ్లకు అన్యాయం చేశారు.

- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'గీతం' బకాయిలు రూ.118 కోట్లా?

తీవ్ర ఆశ్చర్యం వ్యక్తం చేసిన తెలంగాణ హైకోర్టు

- నామమాత్రపు బకాయిలున్నా పేద వినియోగదారుల విద్యుత్ కనెక్షన్లను తొలగిస్తారు. తొలగించే ముందు వినియోగదారులకు నోటీసు కూడా పంపరు. అలాంటిది రూ.118 కోట్లు బకాయిలున్నా చర్యలు తీసుకోకపోవడం తీవ్ర ఆశ్చర్యం కలిగిస్తోంది. గీతం యూనివర్సిటీకి ఎందుకీ వెసులుబాటు? విద్యుత్ కనెక్షన్ తొలగించకుండా ఏం చేస్తున్నారు?

- తెలంగాణ హైకోర్టు

3 లో

వైఎస్ జగన్‌పై దర్యాప్తు అనవసరం

వివేకా హత్య కేసులో తేల్చిచెప్పిన సీబీఐ కోర్టు

ఏ వ్యక్తి మరణించినా సమీప బంధువులకు తెలియజేయడం సహజం: సీబీఐ కోర్టు

బాబు చేతిలో పావుగా మారిన సునీత కోర్టును సైతం తప్పుదోవ పట్టించే యత్నం

తన తండ్రిని అత్యంత కిరాతకంగా చంపిన దస్తగిరి దర్జాగా తిరుగుతున్నా పట్టించుకోని సునీత

చంద్రబాబు న్యాయవాది లూథ్రాయే హంతకుడు దస్తగిరి తరఫునా వాదిస్తుంటే అర్థమేమిటి?

బాబు, సునీత, ఎల్లో మీడియా అల్లినవన్నీ కట్టుకథలేనని సీబీఐ కోర్టు తీర్పుతో స్పష్టం

3 లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹96	ఫారం వద్దర లైవ్ బర్డ్	125 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	220 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	152 కిలో	స్కిన్ లెస్	251 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

రోడ్డెక్కిన వీఆర్‌ఏలు

తమ సమస్యలు, డిమాండ్లు పరిష్కరించాలని ఏపీ వీఆర్‌ఏ సంఘాల జేఏసీ డిమాండ్

14లో

'సహకార' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

14 లో

భీమవరం, ఏలూరులోని కలెక్టరేట్ల వద్ద సహకార సంఘాల ఉద్యోగుల ధర్నా

నకిలీ విత్తనాలతో ముంచేశారు

14 లో

అప్పుల ఊబిలో కూరుకుపోయాం

ఆదుకోవాలంటూ సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం వద్ద రైతుల ధర్నా

అనంత్ అంబానీతో కలిసి 'వంతార'ను సందర్శించిన లియోనెల్ మెస్సీ

ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ, అనంత అంబానీ స్థాపించిన, వన్యప్రాణి పరిరక్షణ, పునరావాస మరియు సంరక్షణ కేంద్రమైన 'వంతార'ను సందర్శించారు. ఈ కేంద్రంలో సనాతన ధర్మం ప్రకారం ఆశీస్సులు కోరుతూ కార్యక్రమాలు సాంప్రదాయక విధానంలో ప్రారంభమవుతాయి. దీనిద్వారా ప్రకృతి పట్ల పూజ్య భావం, అన్ని జీవరాశుల పట్ల గౌరవం వ్యక్తమవుతుంది. మెస్సీ సందర్శనలో ఈ సాంస్కృతిక విలువలు ప్రతిబింబించాయి. సాంప్రదాయ హిందూ ఆచార విధానాలలో పాల్గొనడమే కాకుండా వన్యప్రాణులను పరిశీలించుటతోపాటు కేర్‌గివర్స్, సంరక్షణ బృందాలతో సంభాషించారు. ఈ సమయంలో అతని నిరాడంబరత, మానవీయ విలువలు అందరికీ వెల్లడయ్యాయి. వన్యప్రాణి సంరక్షణ పట్ల అతని నిబద్ధతను, అభిప్రాయాలను అనంత్ అంబానీతో పంచుకున్నారు.

మెస్సీతోపాటు అతని ఇంటర్ మియామి సహచరులు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డి పాల్‌లకు సాంప్రదాయ విధానంలో జానపద సంగీతంతో, ఆశీస్సులు, పవిత్రతకు చిహ్నంగా

పూలు జల్లుతూ, సాంప్రదాయ హారతితో ఘనంగా స్వాగతం పలికారు. ఫుట్‌బాల్ దిగ్గజాలు దేవాలయంలో మహ హారతిలో పాల్గొనడంతోపాటు అంబే మాత, గణేష్, హనుమాన్ పూజలు మరియు శివాభిషేకంలో కూడా పాల్గొన్నారు. అన్ని జీవుల పట్ల పూజ్యభావం కలిగిన భారతీయ జీవన విలువలను దృష్టిలో ఉంచుకుని ప్రపంచ శాంతి, ఐకమత్యం కొరకు పూజలు జరిపారు.

స్వాగత కార్యక్రమాల తరువాత విస్తృత సంరక్షణా పర్యావరణ వ్యవస్థ, ప్రపంచవ్యాప్తంగా సంరక్షించబడిన పెద్దపులులు, ఏనుగులు, శాకాహార జీవులు, సరీసృపాలు మరియు పెంపుడు జంతువులకు నిలయమైన 'వంతార'లో గైడెడ్ టూర్‌లో పాల్గొన్నారు. గ్రీన్ ఎనర్జీ కాంప్లెక్స్ మరియు ప్రపంచంలోనే అతిపెద్ద రిఫైనరీ కాంప్లెక్స్‌ను దర్శించినపుడు భారీ స్థాయి కార్యకలాపాల వెనుక గల దూరదృష్టి పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

సింహాలు, చిరుత పులులు, పులులు మరియు అంతరించిపోతున్న ఇతర జాతుల సంరక్షణ కేంద్రంలో సంపన్నమైన, సహజ వాతావరణంలో వృద్ధి చెందుతున్న జంతువులను చూశారు. తరువాత హెర్బివోర్ కేర్ సెంటర్ మరియు రెప్టైల్ కేర్ సెంటర్ సందర్శించారు. అక్కడ ప్రత్యేకమైన పశువైద్య సంరక్షణ, నిర్ణీత పోషణ, ప్రవర్తనా సంబంధ శిక్షణ మరియు జాగరూకమైన నిర్వహణలో అభివృద్ధి చెందుతున్న జంతువులను పరిశీలించారు.

వన్యప్రాణి సంరక్షణలో 'వంతార' ప్రపంచవ్యాప్త నాయకత్వాన్ని ఈ విధానాలు తెలియజేస్తున్నాయి. మల్టీస్పెషాలిటీ వైల్డ్‌లైఫ్ హాస్పిటల్‌ను కూడా సందర్శించి వాస్తవ కాలంలో చికిత్సా సంబంధ, శస్త్రచికిత్సా విధానాలు కూడా పరిశీలించారు. ఒకాపీస్, రైనోలు, జిరాఫీలు మరియు ఏనుగులకు ఆహారం అందించారు. ప్రపంచవ్యాప్త దృక్కోణంలో దేశంలో పురోగతి చెందుతున్న వన్యప్రాణి సంరక్షణ మరియు పరిరక్షణ పట్ల భారత ప్రధానమంత్రి నిబద్ధతను కూడా శ్లాఘించారు. అనాథలుగా, బలహీనంగా ఉన్న చిరుప్రాయంలో గల జంతువుల కోసం కేటాయించిన ఫాస్టర్ కేర్ సెంటర్‌లో అవి తిరిగి కోలుకునే విధానాల గురించి శ్రద్ధగా తెలుసుకున్నారు. అనంత్ అంబానీ, రాధిక అంబానీలు ఒక విశ్వాసానికి, నిరంతర అధ్యయనానికి మారుపేరైన ఫుట్‌బాల్ దిగ్గజానికి గౌరవప్రదమైన గుర్తింపుగా ఒక సింహం పిల్లకు 'లియోనెల్' అని నామకరణం చేశారు.

ఎలిఫెంట్ కేర్ సెంటర్‌లో సందర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రెండు సంవత్సరాల క్రితం కలప పరిశ్రమ చెర నుండి కాపాడబడిన తల్లి 'ప్రతిమ'తోపాటు ఏనుగు పిల్ల 'మాణిక్‌లాల్'ను కలిశారు. మెస్సీ ఆట అనే విశ్వవ్యాప్త భాషలో 'మాణిక్‌లాల్'తో ఫుట్‌బాల్‌లో పాల్గొన్నారు. ఏనుగు పిల్ల కూడా ఉత్సాహంగా పాల్గొనడమే కాకుండా దాని స్వంత నైపుణ్యాలను ప్రదర్శించి భారత సందర్శనలో మెస్సీకు ఒక మరపురాని అనుభూతిని మిగిల్చింది.

''జంతువుల పట్ల 'వంతార' చేస్తున్న ఈ పని, సంరక్షణ విధానాలు చాలా అద్భుతం'' అని మెస్సీ స్పానిష్‌లో తమ భావాలను వ్యక్తం చేశారు. సందర్శన ముగియనున్న సందర్భంలో నారియల్



ఉత్సర్గ్, మట్కా ఫోడ్ సంప్రదాయ ఉత్సవాలలో కూడా మెస్సీ పాల్గొన్నారు.

శాంతి, సౌభాగ్యం వర్ధిల్లాలనే మంత్రాలతో కార్యక్రమం ముగిసింది. ప్రపంచవ్యాప్తంగా సామాజిక విలువలు, విద్య, ఆరోగ్య సంరక్షణ మరియు పిల్లల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన 'లియో మెస్సీ ఫౌండేషన్' స్థాపకులైన మెస్సీ జంతువుల పట్ల దయ, శాస్త్రీయ విజ్ఞానంతో కూడిన 'వంతార' కార్యాచరణను ప్రశంసించారు.



విజయవాడలోని జోజినగర్‌లో అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఫేక్ సొసైటీతో భూ కబ్జా కుట్ర

విజయవాడలో 42 మంది పేదల ఇళ్ల కూల్చివేత బాబు సర్కారు అధికార దుర్వినియోగానికి పరాకాష్ట: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు జోజినగర్‌లో పోటెత్తిన ప్రజలు

సీబీఐతో విచారిస్తే నిజాలన్నీ బయటికొస్తాయ్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: చంద్రబాబు సర్కారు విజయవాడ భవానీపురంలోని జోజినగర్‌లో 42 మంది పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగానే ఇళ్ల కూల్చివేత దారుణమన్నారు. ఈ కూల్చివేతలో సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేశ్, ఎంపీ కేశినేని చిన్నితో పాటు స్థానిక జనసేన కార్పొరేటర్ సోదరుడి ప్రమేయం ఉందన్నారు. 'సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగానే ఇళ్లు ఎలా కూల్చేస్తారు? పేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వమే వారికి వ్యతిరేకంగా అఫిడవిట్లు, పిటిషన్లు వేయడం దుర్మార్గం. జోజినగర్ బాధితుల బ్యాంకు రుణాలను ప్రభుత్వమే చెల్లించాలి. కూల్చివేతలో ఇళ్లు కోల్పోయిన ఆ 42 కుటుంబాలకు తిరిగి ఇళ్లు కట్టించి ఇవ్వాలి' అని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. లేని పక్షంలో తమ ప్రభుత్వం రాగానే విచారణ జరిపించి ఈ ఘటనకు బాధ్యులను బోనులో నిలబెట్టి తీరుతామని హెచ్చరించారు. జోజినగర్ బాధితులకు పూర్తి అండగా నిలబడతామని, వారి న్యాయ పోరాటానికి పార్టీ తోడుగా ఉంటుందని ప్రకటించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మంగళవారం జోజినగర్‌లో పర్యటించి ఇళ్లు కోల్పోవడంతో రోడ్డున పడ్డ బాధిత కుటుంబాలను స్వయంగా పరామర్శించారు. కోర్టు ఉత్తర్వులున్నప్పటికీ ఏకపక్షంగా తమ ఇళ్లను కూల్చివేశారని, ఎంత ప్రాధేయపడినా ఆలకించకుండా ఈ ప్రభుత్వం తమ బతుకులను రోడ్డు పాలు చేసిందని బాధిత కుటుంబాలు ఆక్రోశించాయి. వారికి న్యాయం జరిగేవరకు తోడుగా నిలిచి పోరాడతామని వైఎస్ జగన్ భరోసానిచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే..

ప్రభుత్వ పెద్దల అండతోనే కూల్చివేతలు..

విజయవాడ జోజినగర్‌లో 42 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారు 25 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని నివసిస్తుంటే ఒక్కసారిగా వచ్చి ధ్వంసం చేశారు. ఈ స్థలం గురించి సుప్రీంకోర్టులో న్యాయపోరాటం జరుగుతోంది. దీనిపై విచారణ కొనసాగుతోంది. ఆ 42 కుటుంబాలకు డిసెంబరు 31 వరకు సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. ఒకవైపున సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నా, ఈనెల 31 వరకు ఊరట ఉండగానే.. ఒకేసారి 200 మందికి పైగా పోలీసులు వచ్చి ప్రైవేట్ పార్టీకి మద్దతు తెలుపుతూ, ఈ 42 ఇళ్లకు సంబంధించిన వారిని నిర్దాక్షిణ్యంగా, వాళ్లు ఇళ్లలో ఉండగానే, ఇళ్లన్నీ పడగొట్టి రోడ్డున పడేశారు. ప్రభుత్వ పెద్దల ప్రమేయం, వారి సహకారం, ఆశీస్సులతోనే ఇదంతా జరిగింది. అందుకే ఇంత అకస్మాత్తుగా కూల్చివేశారు. ఈ నెలాఖరు వరకు గడువు ఉందని తెలిసి కూడా అధికార దుర్వినియోగం చేస్తూ వారిని రోడ్డు పాల్జేశారు.

మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఫేక్ సొసైటీ ఏర్పాటు..

ఇక్కడ 2 ఎకరాల 17 సెంట్లకు సంబంధించి ప్రస్తుత మార్కెట్ విలువ రూ.150 కోట్లకు పైగానే ఉంది. దీంతో దీంట్లోకి ప్రైవేట్ వ్యక్తులు వచ్చారు. 2016లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే ఓ ఫేక్ సొసైటీని పెట్టారు. 1981 డేట్‌తో ఒక తప్పుడు సొసైటీని ఏర్పాటు చేసి, రూ.150 కోట్ల స్థలాన్ని కాజేసేందుకు అడుగులు పడ్డాయి. వీరంతా చంద్రబాబు సన్నిహితులు. నారా లోకేశ్, ఎంపీ కేశినేని చిన్ని, జనసేన కార్పొరేటర్ సోదరుడికి కూడా ఇందులో ప్రమేయం ఉంది. ఇంతమంది కలిశారు. అధికార దుర్వినియోగం ఎలా ఉంటుందనేందుకు ఇది నిదర్శనం. సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగానే, డిసెంబర్ 31 వరకు వెసులుబాటు ఉన్నా కూడా.. 200 మందికిపైగా పోలీసులు వచ్చి ఇంత మందిని రోడ్డు పాల్జేశారు.

ఈ స్థలాలు వేరేవారివైతే.. అనుమతులన్నీ ఎలా ఇచ్చారు?

ఈ 2.17 ఎకరాల స్థలంలో 2001కి ముందు నుంచి 25 ఏళ్లుగా వీరు ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఇందులో చాలా మంది ఇళ్లు కూడా కట్టుకున్నారు. వాటికి విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ నుంచి బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కూడా ఇచ్చారు. ఈ ఇళ్లకు కరెంటు, డ్రైనేజీ కనెక్షన్లు కూడా ఉన్నాయి. ఈ ఇళ్లకు ప్లాన్ అప్రూవల్ నుంచి అన్ని అనుమతులూ ఉన్నాయి. మరోవైపు బ్యాంకులు కూడా లోన్లు ఇచ్చాయి. ఇక్కడున్న వారిలో చాలామంది రూ.20 లక్షలు, రూ.25 లక్షలకుపైగా లోన్లు కూడా తీసుకుని ఇళ్లు కట్టుకున్నారు. మరి ఇక్కడ స్థలాలు వేరేవారివైతే.. ఎలా అనుమతి ఇచ్చారు? ఎలా రిజిస్ట్రేషన్ చేశారు? బిల్డింగ్ ప్లాన్ ఎలా అనుమతించారు? బ్యాంకులు లోన్లు ఎలా ఇచ్చాయి? వాటర్, పవర్ కనెక్షన్లు ఎలా ఇచ్చారు? మరి ఇన్ని సవ్యంగా ఉన్నప్పుడు, అన్ని అనుమతులున్నా.. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా, న్యాయం చేయాలని కనీసం ఆలోచన చేయకుండా, ప్రైవేటు వ్యక్తులకు మద్దతు ఇస్తూ, పోలీసులు వచ్చి పొక్లెయిన్లు, బుల్డోజర్లు, జేసీబీలు పెట్టి ఏకంగా బిల్డింగ్‌లు పగలగొట్టారు. గతంలో ఇక్కడ ఇళ్ల క్రయ విక్రయాలు జరిగినప్పుడు అభ్యంతరాలు ఉంటే చెప్పాలని పలు సందర్భాల్లో పత్రికా ప్రకటనలు కూడా ఇచ్చారు. కానీ ఎక్కడా, ఎవరి నుంచి అభ్యంతరాలు రాలేదు. ప్రైవేటు వ్యక్తులకు మేలు చేసేందుకు, రూ.150 కోట్లకుపైగా విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు.. చంద్రబాబు, ఆయన కుమారుడు, టీడీపీ ఎంపీ, జనసేన కార్పొరేటర్ సోదరుడు.. ఇంతమంది కలిసి ఒక్కటై పేదలను నిస్సహాయులుగా రోడ్ల మీద నిలబెట్టించారు.

సీబీఐతో విచారణ జరిపించాలి..

ఇక్కడే కాదు.. రాష్ట్రమంతా ఇదే కొనసాగుతోంది. ఎక్కడైనా చిన్న చిన్న లిటిగేషన్లు ఉంటే టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు ఎంటర్ అవుతున్నారు. ల్యాండ్ కబ్జా చేస్తున్నారు. కొన్ని చోట్ల వారే స్వయంగా లిటిగేషన్లు పెట్టి కబ్జా చేస్తున్నారు. వీరే నిషేధిత జాబితాలో ఆస్తులను బలవంతంగా చేరుస్తున్నారు. ఈ వ్యవహారంపై వెంటనే సీబీఐతో దర్యాప్తు జరిపించాలి. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, ఎంపీ కేశినేని చిన్ని, జనసేన కార్పొరేటర్ సోదరుడు.. వీరంతా కలసి ఏ రకంగా కబ్జాలు చేయిస్తున్నారో ప్రజలకు తెలియాలి. ఇక్కడ 1981 డేట్ వేసి ఓ ఫేక్ సొసైటీని 2016లో ఏర్పాటు చేశారు. అది కూడా బయటకు రావాలి. ప్రభుత్వం పేదలకు అండగా ఉండాల్సింది పోయి వారికి వ్యతిరేకంగా అఫిడవిట్లు, పిటిషన్లు వేసింది. అందుకే మొత్తం వ్యవహారంపై విచారణ జరగాలి. వాస్తవాలు బయటకు రావాలి.

ప్రభుత్వమే లోన్లు చెల్లించాలి.. ఇళ్లు కూడా కట్టించాలి

ఇక్కడ 25 ఏళ్ల నుంచి ఉంటున్నారు. వారికి బ్యాంక్ లోన్లు ఉన్నాయి. కానీ ఇప్పుడు ఇళ్లు లేవు. అందుకే ప్రభుత్వం ముందుకు రావాలి. వీరి బ్యాంక్ రుణాలు ప్రభుత్వమే కట్టాలి. వీరందరికి ఇక్కడ గానీ మరెక్కడైనా గానీ పక్కాగా ఇళ్లు కట్టించాలి.

ఇది మీ జగనన్న మాట..!

అయ్యా చంద్రబాబూ..! మీరు ఈ పని చేయకపోతే, రేపు మా ప్రభుత్వం రాగానే విచారణ జరిపిస్తాం. దోషులను కోర్టు ముందు నిలబెడతాం. ఇక్కడి బాధితులందరికీ తోడుగా నిలబడతాం. బాధితులకు ఇది మీ జగనన్న మాట అని హామీ ఇస్తున్నా. సుప్రీం కోర్టులో కానీ, హైకోర్టులో కానీ బాధితుల తరపున వాదించేందుకు వైఎస్సార్ సీపీ తరపున పూర్తి సహాయ, సహకారాలు అందిస్తాం.

ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, రుహుల్లా, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, నియోజకవర్గ సమన్వయకర్తలు మల్లాది విష్ణు, నల్లగట్ల స్వామిదాసు, తన్నీరు నాగేశ్వరరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పోతిన మహేష్, పూనూరు గౌతంరెడ్డి, ఆసిఫ్, జోగి రాజీవ్, రామిరెడ్డి, కొండారెడ్డి, సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జోజినగర్‌లో బాధితులతో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

దివ్యాంగుడితో సెల్ఫీ

ఆడపిల్లలకు పసుపు-కుంకుమ కింద ఇచ్చా

మేం 2007లో ఇక్కడ 180 గజాల ప్లాట్ కొన్నాం. నా ఇద్దరు కుమార్తెలకు 2015లో పెళ్లిళ్లు చేశాం. ఆ ప్లాట్‌ను రెండు భాగాలు చేసి 2016లో నా కుమార్తెలకు పసుపు-కుంకుమ కింద ఇచ్చాను. ఇప్పుడేమో ఆ ప్లాట్ మాది కాదని రోడ్డుపాలు చేశారు. ఇద్దరు కుమార్తెలు మా పరిస్థితి ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. అల్లుళ్లు గొడవ చేస్తున్నారు. చాలా దారుణంగా మమ్మల్ని రోడ్డుపాలు చేశారు. అన్ని విధాలా అండగా ఉంటామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాకు భరోసా ఇచ్చారు.

– కోడెబోయిన కోటేశ్వరమ్మ

ప్రైవేట్ వ్యక్తులకు కొమ్ముకాసిన ప్రభుత్వం

మేం ఎన్నో ఏళ్లపాటు డబ్బులు కూడబెట్టుకుని కొనుక్కున్న స్థలాన్ని దౌర్జన్యంగా లాక్కున్నారు. ప్రైవేట్ వ్యక్తులకు ఈ ప్రభుత్వం కొమ్ముకాసి మమ్మల్ని బజారున పడేసింది. ఇంత అడ్డగోలుగా మమ్మల్ని రోడ్డుపాలు చేసిన చంద్రబాబు ప్రభుత్వానికి పేదలంటే చిన్నచూపని అర్థమైంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వచ్చి మాకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. న్యాయ పోరాటానికి సహకారం అందిస్తామని, మాకు న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారు. ఆయన ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారు. మాకు చాలా ధైర్యం వచ్చింది.

– కె.అరుణ

ఊరిలో పొలం అమ్మి ఇక్కడ స్థలం కొన్నాం

సిటీలో స్థలం ఉంటే మా కుటుంబానికి ఆసరాగా ఉంటుందని భావించాం. 25 ఏళ్ల కిందట సొంతూరులో ఉన్న ఎకరం పొలం అమ్మి ఇక్కడ స్థలం కొన్నాం. మొత్తం 42 ప్లాట్లు కొనుగోలుచేసివారు పేదలు. రోజువారీ పనులు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుని బతికేవాళ్లు. మేం అందరం కలిసి ఈ ప్రాంతంలో ఇళ్లు కట్టుకుని కాస్త అభివృద్ధి చేసుకున్నాం. చీమలు పుట్టలు పెడితే పాములు వచ్చి ఆక్రమించినట్లుగా సొసైటీ పేరుతో అక్రమంగా మా స్థలాలను ఆక్రమించారు. ప్రశ్నిస్తే కోర్టు తీర్పు అంటూ బెదిరిస్తున్నారు.

– సుబ్బులు

ప్రభుత్వమే మమ్మల్ని రోడ్డుపాలు చేసింది

మేం అందరం డబ్బులు పెట్టి ప్లాట్లు కొనుగోలు చేశాం. అక్రమంగా ఆక్రమించుకుని ఉంటున్న స్థలాలు కాదు ఇవి. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్లు కూడా జరిగాయి. మేం కొన్న స్థలాలు 25 తర్వాత మావి కాదంటే... మేం ఏమి చేయాలి? ఏమీ అర్థంకావడం లేదు. మాకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వమే మమ్మల్ని రోడ్డుపాలు చేసింది. అధికారులు బలవంతంగా మా ఇళ్లు కూల్చేశారు. ఉన్నపళంగా రోడ్డుపాలు చేశారు. ఇంత దారుణం ఎక్కడా చూడలేదు.

– విజయలక్ష్మి

రూ.25 లక్షలు బ్యాంక్ రుణం ఎలా కట్టాలి?

కష్టపడి పైసా పైసా కూడబెట్టుకుని ఇక్కడ స్థలం కొన్నాం. కార్పొరేషన్ నుంచి ప్లాన్ తీసుకుని ఇల్లు కట్టుకున్నాం. ఇంటి నిర్మాణానికి బ్యాంకు నుంచి రూ.25 లక్షలు రుణం తీసుకున్నాం. ఇప్పుడేమో ఇంటిని దౌర్జన్యంగా కూల్చేశారు. మేం కొనుక్కున్న స్థలం మాదికాదంటున్నారు. బ్యాంక్ రుణం ఎలా కట్టాలి? మా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వ ఉద్యోగులే మా ఇంటి నిర్మాణానికి ప్లాన్ ఇచ్చారు. ఆ ఇంటికి పన్ను కట్టించుకుంటున్నారు. అదే ప్రభుత్వ ఉద్యోగులైన పోలీసులు వచ్చి మమ్మల్ని రోడ్డుపాలు చేశారు. ఇంత దారుణంగా ప్రభుత్వం వ్యవహరిస్తుంటే మేం ఎలా బతకాలి?.

– డి.స్రవంతి

లీగల్ సపోర్ట్ ఇస్తామని వైఎస్ జగన్ భరోసా

కోర్టు తీర్పులో ఇళ్లు కూల్చి 42 ప్లాట్లను స్వాధీనం చేసుకోవాలని ఎక్కడా పేర్కొనలేదు. ఈ నెలాఖరు వరకు కోర్టు గడువిచ్చింది. స్థానిక న్యాయస్థానాలు, హైకోర్టు ఇలా చాలాచోట్ల వాదోపవాదనలు జరిగాయి. అయితే బాధితులకు సరైన న్యాయం జరగలేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల బాధితుల తరపున న్యాయస్థానంలో బలమైన వాదనలు వినిపించటానికి లీగర్ సపోర్ట్ ఇస్తామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు.

– వి.స్వప్న, న్యాయవాది

రేపు గవర్నర్‌తో వైఎస్ జగన్ భేటీ

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు అందజేత
- ఉదయం సంతకాల పత్రాలున్న వాహనాలకు జెండా ఊపి పంపే కార్యక్రమం
- అనంతరం పార్టీ ముఖ్య నేతలతో భేటీ.. ఆపై లోక్‌భవన్‌కు పయనం

సాక్షి, అమరావతి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల ఉద్యమంలో భాగంగా గురువారం (డిసెంబర్ 18న) వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాయంత్రం 4 గంటలకు గవర్నర్‌తో భేటీ కానున్నారు. పార్టీకి చెందిన ముఖ్యనేతలతో కలిసి ఆయన గవర్నర్‌కు కోటి సంతకాల పత్రాలను అందించనున్నారు. దీనికి ముందు ఉదయం 10 గంటలకు పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద కోటి సంతకాల పత్రాలు ఉంచిన వాహనాలను వైఎస్ జగన్ జెండా ఊపి లోక్‌భవన్‌కు పంపనున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, రీజినల్ కోఆర్డినేటర్లు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, పార్టీకి చెందిన సీనియర్ నాయకులు పాల్గొంటారు. ఆ తర్వాత పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ వీరితో సమావేశమవుతారు. అనంతరం జగన్.. పార్టీ నాయకులతో కలిసి గవర్నర్ నివాసం లోక్‌భవన్‌కు బయల్దేరి వెళ్తారు.

మరో 36 మెడికల్ పీజీ సీట్ల మంజూరు

- మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనలో 5 వైద్య కళాశాలలు ప్రారంభం
- వాటిలో 750 ఎంబీబీఎస్, 96 పీజీ సీట్లు అందుబాటులోకి

సాక్షి, అమరావతి: మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఐదు వైద్య కళాశాలలకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) 36 పీజీ సీట్లను కొత్తగా మంజూరు చేసింది. ఈ విద్యా సంవత్సరంలో తొలి విడతలో 60 సీట్లను ఎన్‌ఎంసీ మంజూరు చేసింది. రెండో విడతలో ఏలూరు వైద్య కళాశాలకు 12, రాజమహేంద్రవరం – 4, మచిలీపట్నం – 8, నంద్యాల – 4, విజయనగరం కళాశాలకు 8 చొప్పున పీజీ సీట్లను ఎన్‌ఎంసీ కేటాయించినట్లు డీఎంఈ డాక్టర్ రఘునందన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో 5 కొత్త కళాశాలలు అందుబాటులోకి తీసుకురావడంతో ప్రస్తుతం 96 పీజీ సీట్లు రాష్ట్రానికి సమకూరినట్లయింది. రాష్ట్రంలో 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటులో భాగంగా 2023 – 24 విద్యా సంవత్సరంలో విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కాలేజీలను గత ప్రభుత్వంలో ప్రారంభించారు. తద్వారా రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఒకే ఏడాది 750 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి.

క్లుప్తంగా...

అమర జవాన్లకు వైఎస్ జగన్ ఘననివాళి

సాక్షి, అమరావతి: 1971లో జరిగిన యుద్ధంలో దేశ విజయం కోసం ప్రాణాలర్పించిన సైనికుల వీరత్వానికి, త్యాగానికి గౌరవప్రదమైన నివాళి అర్పిస్తున్నామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'విజయ్ దివస్ నాడు అమర జవాన్ల పరాక్రమాన్ని ప్రతియేటా మనం స్మరించుకుంటున్నాం. వారి సేవలు ఎప్పటికీ జ్ఞాపకంగా నిలుస్తాయి. రాబోయే తరాలకు జవాన్లు శాశ్వత ప్రేరణగా నిలుస్తారు' అని వైఎస్ జగన్ కొనియాడారు.

టీవీ9 రజనీకాంత్, ఎన్‌టీవీ సురేష్‌లకు వైఎస్ జగన్ పరామర్శ

సాక్షి,అమరావతి: టీవీ9 మేనేజింగ్ ఎడిటర్ రజనీకాంత్ తండ్రి వెల్లలచెరువు సాంబశివరావు, ఎన్‌టీవీ సీనియర్ జర్నలిస్ట్ సురేష్ తండ్రి కోటా వెంకట రామిరెడ్డి మృతి పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. రజనీకాంత్, సురేష్‌లతో మంగళవారం ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. సాంబశివరావు, వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని రజనీకాంత్, సురేష్‌లను ఓదార్చారు.

చైల్డ్ కేర్ లీవ్ పిల్లల గరిష్ట వయోపరిమితి తొలగింపు

ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ మహిళా ఉద్యోగులు, ఒంటరి పురుష ఉద్యోగులు వారి సర్వీస్ కాలంలో చైల్డ్ కేర్ లీవ్ పొందేందుకు దివ్యాంగ పిల్లలతో సహా పిల్లల గరిష్ట వయోపరిమితిని ప్రభుత్వం తొలగించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు, రేపు కలెక్టర్ల సదస్సు

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధ, గురువారాల్లో రెండు రోజుల కలెక్టర్ల సదస్సు జరగనుంది. బుధవారం జీఎస్‌డీపీ, ప్రజల సంతృప్తస్థాయి, ఫైళ్ల క్లియరెన్స్, కేంద్ర ప్రాయోజిత పథకాలు, పెట్టుబడులు, సంక్షేమ రంగాలపై సదస్సుల్లో ప్రజెంటేషన్లు చర్చ జరగనున్నాయి. గురువారం ఉత్తమ విధానాలు, స్వర్ణాంధ్ర విజన్–2047, ఆదాయ ఆర్జన శాఖలు, నైపుణ్య, ఉపాధి కల్పనపై చర్చించనున్నారు.

రుషికొండ భవనాల వినియోగంపై ప్రతిపాదనల పరిశీలన

మంత్రుల సబ్‌కమిటీ భేటీ

సాక్షి, అమరావతి: విశాఖలోని రుషికొండ భవనాల వినియోగంపై ప్రభుత్వానికి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు మంత్రుల సబ్ కమిటీ పేర్కొంది. టాటా గ్రూప్, అట్మాస్పియర్ కోర్‌తో పాటు మరికొన్ని సంస్థల నుంచి ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిపింది. మంగళవారం సచివాలయంలో మంత్రుల సబ్ కమిటీ సమావేశమైంది. అనంతరం మీడియాతో మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ..రుషికొండ భవనం వినియోగంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని, దేశీయ కంపెనీలతో పాటు విదేశీ కంపెనీలు దీనిపై ఆసక్తి చూపిస్తున్నాయని చెప్పారు. అయితే, వయబిలిటీ అనేది ముఖ్యమని, వచ్చే సమావేశంలో వయబిలిటీ గ్యాప్ ఫండ్‌పై మరోసారి చర్చిస్తామన్నారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ.. పర్యాటక ఆదాయం పెంచేలా రుషికొండ భవనాలపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

'ఉపాధి' పేరు మార్పుపై 22న సీపీఐ నిరసనలు

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి,అమరావతి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్పుపై దేశవ్యాప్తంగా 22న నిరసనలు తెలపనున్నట్లు సీపీఐ ప్రకటించింది. వీబీ–జీ రామ్ జీ బిల్లును తిరస్కరించడమే లక్ష్యంగా ఈ నిరసనలు ఉంటాయని పార్టీ జాతీయ కార్యవర్గం పేర్కొంది. మంగళవారం ఢిల్లీలో జరిగిన సీపీఐ జాతీయ కార్యవర్గంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ కార్యాలయం జాతీయ కార్యదర్శి రాయ్‌కుట్టీ తెలిపారు. ఉపాధి హామీ పథకానికి పేరు మార్పు అంటే మహాత్మ గాంధీజీని అవమానించడమేనని, పేర్ల మార్పుపై కంటే పథకాల అమలుపై శ్రద్ధ పెట్టాలని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అన్నారు.

సైనిక గ్యాలెంట్రీ పురస్కారాలకు నగదు బహుమతి పెంపు

సాక్షి, అమరావతి: భారత సైన్యంలో విశిష్ట సేవలకు అందించే గ్యాలెంట్రీ పురస్కారాలకు నగదు బహుమతిని ప్రభుత్వం రెట్టింపు చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. పరమవీర చక్ర అవార్డు పొందినవారికి ప్రస్తుతం రూ.కోటి ఇస్తుండగా, ఈ మొత్తాన్ని రూ.2 కోట్లకు పెంచారు. మహావీర్ చక్రకు రూ.80 లక్షలు ఇస్తుండగా, ఈ మొత్తాన్ని రూ.1.75 కోట్లకు పెంచారు. వీర చక్ర కింద రూ.60 లక్షలు ఇస్తుండగా, ఇకపై రూ.1.50 కోట్లు ఇవ్వనున్నారు. ఇప్పటి దాకా అశోక చక్ర పురస్కారానికి రూ.కోటి, కీర్తి చక్రకు రూ.80 లక్షలు, శౌర్యకు రూ. 60 లక్షలు ఇస్తుండగా, ఇకపై ఈ పురస్కారాలకు రూ.1.25 కోట్లు, రూ.కోటి, రూ.75 లక్షల రివార్డును అందిస్తారు. గవర్నర్ ఆదేశాల మేరకు ఈ పెంపును ఆమోదించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైఎస్ జగన్‌పై దర్యాప్తు అనవసరం

వివేకా హత్య కేసులో తేల్చిచెప్పిన సీబీఐ కోర్టు

బాబు, సునీత, ఎల్లో మీడియా అల్లినవన్నీ కట్టుకథలేనని సీబీఐ కోర్టు తీర్పుతో స్పష్టం..

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో చంద్రబాబు చేతిలో పావుగా మారి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురదజల్లేందుకు యత్నించిన చంద్రబాబు, ఎల్లో మీడియా, నర్రెడ్డి సునీతలకు సీబీఐ కోర్టు గట్టిగా అక్షింతలు వేసింది. వీళ్లంతా గత కొన్నేళ్లుగా చేస్తున్నదంతా కేవలం దుష్ప్రచారమేనని, అందులో ఎంత మాత్రమూ వాస్తవం లేదని సీబీఐ కోర్టు తీర్పు సాక్షిగా స్పష్టమయ్యింది. నిరాధార ఆరోపణలతో న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించాలనుకున్న కుట్రలన్నీ బెడిసికొట్టాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతో వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగించాలన్న పిటిషన్‌పై విచారణ చేపట్టిన సీబీఐ ప్రత్యేకన్యాయస్థానం విస్పష్టంగా తీర్పును వెల్లడించింది. రెండువారాల పాటు దాదాపు 20 గంటల సేపు వాదనలు విన్న సీబీఐ కోర్టు 161 పేజీల సుదీర్ఘమైన, స్పష్టమైన తీర్పును వెలువరించింది. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతిపై ఎలాంటి తదుపరి దర్యాప్తు అవసరం లేదని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఏ వ్యక్తి మరణించినా, అతని సమీప బంధువులకు తెలియజేయడం చాలా సహజమని.. వివేకా హత్య విషయం జగన్‌కు తెలియజేయడాన్ని తప్పుబట్టడం గానీ, అనుమానించడంగానీ సరికాదని కోర్టు స్పష్టం చేసింది. వివేకా హత్యకు సంబంధించి వైఎస్ జగన్‌కు ముందే కాల్ వచ్చిందంటూ చంద్రబాబు, ఆయన చేతిలో పావుగా మారిన సునీత, ఎల్లోమీడియా చేసిందంతా దుష్ప్రచారమేనని, అంతా కట్టుకథేనని ఈ తీర్పును బట్టి స్పష్టమయ్యింది. స్వయంగా కన్నతండ్రిని అత్యంత కిరాతకంగా హత్యచేసిన దస్తగిరి బైట దర్జాగా తిరుగుతుంటే ప్రశ్నించాల్సిన సునీత.. చంద్రబాబు కేసులు వాదించే సుప్రీంకోర్టు న్యాయవాది లూథ్రా దస్తగిరి న్యాయవాదిగా మారి వాదిస్తుంటే పట్టించుకోని సునీత.. చేస్తున్న ఆరోపణలన్నీ దిగజారుడు ఆరోపణలేనని సీబీఐ కోర్టు స్పష్టంచేసినట్లయింది. చంద్రబాబు చేతిలో పావుగా మారి సీబీఐ కోర్టును సైతం తప్పుదోవ పట్టించేందుకు సునీత ప్రయత్నించినట్లు ఈ తీర్పును బట్టి అర్థమవుతోంది. సునీత వాదనలను నిరాకరించడం ద్వారా ఆమెకు దుష్ప్రచారం తగదంటూ కోర్టు అక్షింతలు వేసినట్లయింది. 'వైఎస్ జగన్ స్వయానా వివేకా సోదరుడు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుమారుడు. జగన్ తాతగారైన రాజారెడ్డికి, వైఎస్ భాస్కర్‌రెడ్డి తండ్రి చిన్న కొండారెడ్డి కుటుంబాలకు ఏదో చిన్న ఆస్తి తగాదాలు తప్ప.. జగన్, వివేకాకు మధ్య ఎలాంటి వివాదాలు లేవన్నది ప్రాసిక్యూషన్ వాదన' అని పేర్కొంది. నాటి సీఎం ఓఎస్‌డీ కృష్ణమోహన్‌రెడ్డి, సాంబశివారెడ్డిలను విచారించినా ఎలాంటి ప్రయోజనం ఉండదంటూ సునీత విజ్ఞప్తిని తిరస్కరించింది. చార్జిషీట్ ప్రకారం వారికి హత్యతో ఏదైనా సంబంధం ఉన్నట్లు ఎక్కడా కనిపించలేదంది. హత్య జరిగిన రోజు(2019 మార్చి 15) ఉదయం 5:30 గంటలకు జగన్‌మోహన్ రెడ్డికి ఫోన్ కాల్ వచ్చిన విషయమై మరింత దర్యాప్తు చేయవలసిన అవసరం లేదని అభిప్రాయపడింది. వైఎస్ వివేకా హత్య కేసులో మరింత లోతైన దర్యాప్తు చేపట్టేలా సీబీఐని ఆదేశించాలని కోరుతూ సీబీఐ కోర్టులో నర్రెడ్డి సునీత పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై ఈ నెల 10న తీర్పును వెల్లడించిన న్యాయస్థానం.. మంగళవారం అధికారిక కాపీని విడుదల చేసింది. వివరాలు ఆ మేరకు..

చాలా అంశాలపై దర్యాప్తునకు నిరాకరణ

'ఈ కేసులో మొదటి దర్యాప్తు అధికారి జె.శంకర్. సీఆర్‌పీసీ సెక్షన్ 161 కింద ఆయన్ను విచారించారు. 2021, సెప్టెంబర్ 28న వాంగ్మూలంలో జరిగిందంతా చెప్పారు. ఈ విషయంలో తదుపరి విచారణ అవసరం లేదు. భాస్కర్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డిని రక్షించడానికి, హత్యకు బాధ్యత వహించేందుకు శివశంకర్‌రెడ్డి రూ.10 కోట్లను గంగాధర్‌రెడ్డికి ఇవ్వాలని చూశారని, అతని పాత్రపై విచారణ చేసినందున దర్యాప్తు చేయాలన్న సునీత అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేం. అవినాశ్‌రెడ్డితో సునీల్‌యాదవ్‌కు ఉన్న సంబంధం.. హత్యకు ముందు, తర్వాత వారి కదలికలకు సంబంధించి మొబైల్ ఫోన్ల కాల్ డేటా రికార్డు సేకరించి ఇప్పటికే పరిశీలించారు. హత్య జరిగిన రోజు అవినాశ్‌రెడ్డి ఎక్కడ ఉన్నారనే విషయానికి సంబంధించి ఐపీడీఆర్ విశ్లేషణ జరిగింది. ప్రాసిక్యూషన్ వాదన ప్రకారం... న్యాయవాది ఓబుల్‌రెడ్డి, భరత్‌యాదవ్‌లు అవినాశ్‌రెడ్డికి సన్నిహితులు. ఎంవీ కృష్ణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు ఇస్తున్నప్పుడు ఓబుల్‌రెడ్డి కూడా స్టేషన్‌కు వెళ్లారు. భరత్ యాదవ్ వాంగ్మూలాన్ని సెక్షన్ 161 కింద 2021, జూన్ 28న నమోదు చేశారు. ఫిర్యాదుదారుడితో పాటు స్టేషన్‌కు వెళ్లారన్న ఒక్క కారణంతో ఓబుల్ రెడ్డి పాత్రపై తదుపరి దర్యాప్తుకు ఆదేశించలేం. ఆర్థిక లావాదేవీలు ఉంటే విచారణ సమయంలో నిరూపించవచ్చు'అని పేర్కొంది.

అనుమానం ఆధారం కాదు..

'సయ్యద్ మున్నాకు చెందిన ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లోని లాకర్ తెరవడం, అందులో నగదు, ఆభరణాలు లభించడం విషయానికొస్తే.. మరో తాళంతో సీబీఐ తిరిగి వాటిని లాకర్‌లో ఉంచినందున దీనిపై తదుపరి విచారణ అవసరం లేదు. మున్నా లాకర్‌లో లభించిన మొత్తానికి సంబంధించి సీబీఐ.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు తెలియజేసింది. 2019, మార్చి 14 నాటి ఫుటేజీకి కాకుండా కేవలం 15 నాటి ఫుటేజీకి మాత్రమే సీబీఐ పరిమితమైందన్న పిటిషనర్ చేసిన వాదననూ అనుమతించలేం. ఈ విషయాన్ని ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలిస్తారు. పిటిషనర్ వద్ద తన వాదనకు ఎటువంటి ఆధారం లేదు. హత్య జరిగిన రోజు ఒకే విధమైన నడక ఉన్న వ్యక్తిని గమనించిన విషయానికి సంబంధించి పిటిషనర్ అభ్యంతరం సరికాదు. కేవలం అనుమానం ఆధారంగా, ప్రత్యేకించి చిత్రం స్పష్టంగా లేనప్పుడు, ఆ విషయంలో తదుపరి విచారణ జరిపినా ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఇదే విషయాన్ని వి.శివకుమార్ వర్సెస్ తెలంగాణ రాష్ట్రం కేసులో హైకోర్టు స్పష్టం చేసింది. నేర స్థలం ఫోటోలు, వీడియోల ఫోరెన్సిక్ నివేదిక అసంపూర్ణంగా ఉందన్నది ఈ దశలో నిర్ణయించలేం. విచారణ సమయంలో సంబంధిత సాక్షులను విచారించడం ద్వారా దానిని పరీక్షించవచ్చు'అని న్యాయస్థానం స్పష్టం చేసింది.

ఒకే ఒక్క అంశంపై దర్యాప్తు..

'కిరణ్ యాదవ్, వైఎస్ ప్రకాష్ రెడ్డి మనుమడైన అర్జున్ రెడ్డి మధ్య జరిగిన సందేశాల మార్పిడి(పిటిషనర్ న్యాయవాది ప్రకారం అర్ధరాత్రి 1.42 నిమిషాలు. కానీ, అది భారత కాలమానం ప్రకారం ఉదయం 7.12 నిమిషాలు) అనుమానం రేకెత్తిస్తోంది. ఈ విషయంపై మరింత దర్యాప్తు అవసరం. డ్రైవర్ లోవరాజు ఏప్రిల్ ఉద్యోగం మానేయడం, హత్య జరిగిన రోజు విధులకు గైర్హాజర్ కావడానికి ఎలాంటి ప్రాముఖ్యత లేదు. మొదటి దర్యాప్తు అధికారి రాజు ప్రభుత్వ ఉద్యోగులందరినీ, అవినాశ్‌రెడ్డి వ్యక్తిగత సిబ్బంది రాఘవ రెడ్డిని సరిగ్గా విచారించలేదనే పిటిషనర్ వాదనను స్వాగతించలేం. ఎందుకంటే, నిందితులతో రాఘవ రెడ్డి ఎలాంటి లావాదేవీలు జరిపారని గానీ లేదా మధ్యవర్తిగా వ్యవహరించారని గానీ చార్జిషీట్‌లో ఎక్కడా పేర్కొనలేదు. ఇప్పటికే విచారించిన సాక్షులను తిరిగి విచారించడం అంటే.. దర్యాప్తు మళ్లీ మొదటి నుంచి ప్రారంభినట్లు అవుతుంది. ఇది అనుమతించబడదు. శివశంకర్‌రెడ్డి కుమారుడైన డాక్టర్ చైతన్యరెడ్డిపైనా దర్యాప్తు అనవసరం. కొందరు సాక్షులను తిరిగి విచారించాలన్న పిటిషనర్ అభ్యర్థనను కూడా పరిగణించలేం. సాక్షులను తిరిగి విచారించమని సీబీఐని ఆదేశించడం .. పునః దర్యాప్తు చేయడమే అవుతుంది. కిరణ్‌యాదవ్, అర్జున్‌రెడ్డి అంశం తప్ప అన్ని అంశాలపై దర్యాప్తు జరిగింది. దీనిపై విచారణ జరిపి నెల రోజుల్లో నివేదిక అందజేయాలి'అని సీబీఐని ఆదేశించింది.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వెనుక భారీ అవినీతి

- అది చాలదన్నట్టు స్టాఫ్‌కి రెండేళ్లు జీతాలు కూడా చెల్లిస్తారట
- ఆ లెక్కన 10 కాలేజీలకు ఏడాదికి రూ.800 కోట్లు ముట్టజెప్పాలి
- ఇది మరో కుంభకోణం.. దీన్ని కూడా వదిలిపెట్టం
- ప్రైవేటు కాలేజీలకు ఇచ్చే రాయితీలతో కాలేజీల నిర్మాణమే పూర్తి చేయొచ్చు
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక లోతుగా దర్యాప్తు చేస్తాం
- ఎవర్నీ వదలం.. జైలుకు పంపుతాం
- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి విడదల రజని

సాక్షి, అమరావతి/తాడేపల్లి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వెనుక భారీ అవినీతి దాగి ఉందని, ప్రైవేటు వ్యక్తుల నుంచి అందే కిక్ బ్యాక్ (దొడ్డిదారి చెల్లింపు)ల కోసమే సీఎం చంద్రబాబు ప్రజారోగ్యాన్ని కూడా పణంగా పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి విడదల రజని స్పష్టం చేశారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడుతూ... పీపీపీ పేరుతో మెడికల్ కాలేజీలను, వాటికి చెందిన విలువైన భూములను అప్పనంగా కట్టబెట్టడమే కాకుండా ప్రైవేటు కాలేజీల నిర్వహణకు, స్టాఫ్ జీతాలకు రెండేళ్లు ప్రభుత్వమే నిధులు సమకూర్చడం చూస్తే ఎన్నివేల కోట్లు చేతులు మారుతున్నాయో స్పష్టంగా తెలిసిపోతుందని చెప్పారు. 10 ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు జీతాల కోసం ఏటా రూ.800 కోట్ల వరకు చెల్లించాల్సి వస్తుందని, ఆ డబ్బుతో ఏకంగా ప్రభుత్వ కాలేజీల నిర్మాణమే పూర్తిచేయొచ్చని వివరించారు. అయినా చంద్రబాబు మాత్రం ప్రైవేటుకే మొగ్గు చూపుతున్నారంటే కిక్ బ్యాక్‌ల కోసమేనని ఆరోపించారు. అధికారంలోకి రావడంతోనే దోపిడీకి వ్యూహరచన చేసిన చంద్రబాబు పెండింగ్ పనులు పూర్తి చేయకుండా సేఫ్ క్లోజ్ పేరుతో పక్కన పెట్టేశారని మండిపడ్డారు. ఏడాదికి రూ.1,000 కోట్లు ఖర్చు చేస్తే మెడికల్ కాలేజీల నిర్మాణాలు పూర్తవుతాయన్నారు. ఏడాదిన్నరలోనే రూ.2.66 లక్షల కోట్లు అప్పులు చేసిన ప్రభుత్వం పేదల ఆరోగ్యం కోసం ఆ మొత్తం వెచ్చించలేదా అని ప్రశ్నించారు.

అవినీతికి పాల్పడుతున్న ఎవర్నీ వదలం.. జైలుకు పంపుతాం

మెడికల్ కాలేజీ భూములు ఎకరం రూ.వందకు లీజుకు ఇచ్చినప్పుడే ప్రైవేటీకరణ వెనుక భారీ అవినీతి ఉందని తేలిపోయిందని విడదల రజనీ పేర్కొన్నారు. ఆ తర్వాత మెడికల్ కాలేజీల్లోని సిబ్బంది జీతాల కోసం రెండేళ్లపాటు ప్రభుత్వమే నిధులు సమకూర్చడం మరింత దారుణమైన దోపిడీ అన్నారు. ఒక్కో కాలేజీకి ఏడాదికి రూ.80 కోట్లు దోచిపెట్టే కుట్రకు చంద్రబాబు తెరలేపారని చెప్పారు. ఇలా మెడికల్ కాలేజీల ముసుగులో స్కాముల మీద స్కాములు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఈ స్కాములపై లోతైన దర్యాప్తు జరిపిస్తామని స్పష్టం చేశారు. దీనివెనుక ఎవరు ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పీపీపీ వద్దని నినదిస్తూ కోటి సంతకాలు చేసిన ప్రజల తీర్పును కూడా ధిక్కరించి దోపిడీకి పాల్పడుతున్న చంద్రబాబు.. రాబోయే రోజుల్లో కచ్చితంగా మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

స్థాయీ సంఘం సిఫార్సుల్ని వక్రీకరిస్తూ..

ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఫీజులు భారీగా ఉండటంపై పార్లమెంటరీ స్థాయీ సంఘం ఆందోళన వ్యక్తం చేసిందని విడదల రజని చెప్పారు. అంతేకాకుండా వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులను ప్రోత్సహించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఫీజు రాయితీలు కూడా కల్పించాలని సూచన చేసిందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు అందుబాటులో లేకపోతే, ప్రభుత్వాలు మెడికల్ కాలేజీలను నిర్మించలేని దుస్థితిలో ఉంటే పీపీపీ మోడల్‌లో ప్రైవేట్ మెడికల్ కాలేజీలను ఆహ్వానించాలని చెప్పిందని గుర్తు చేశారు కొత్తగా కళాశాలల ఏర్పాటుకు ముందుకొచ్చే ప్రైవేటు సంస్థలకు కేవలం పన్ను రాయితీలు చాలన్న స్థాయీ సంఘం సూచనను వక్రీకరించి.. ప్రైవేటీకరణకు పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ అనుకూలంగా నివేదిక ఇచ్చినట్టు చంద్రబాబు అండ్ కో అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. తన దోపిడీ విధానాన్ని సమర్థించుకోవడానికి చంద్రబాబు ప్రభుత్వం పార్లమెంట్ స్థాయీ సంఘం సిఫార్సులకు వక్రభాష్యం చెబుతోందని మండిపడ్డారు. 'ఇప్పటికే నిర్మాణంలో ఉన్న లేదా పూర్తయిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీకి ఇవ్వొచ్చని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సూచనలు చేసి ఉంటే చూపించాలని సీఎం చంద్రబాబుకి సవాల్ విసురుతున్నా. దీనిపై ఎక్కడైనా చర్చకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉంది. మీ పార్టీ సిద్ధమా? మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పేరుతో భారీ అవినీతికి చంద్రబాబు స్కెచ్ వేసుకున్నారు. ఆ ప్రకారమే ముందుకువెళ్తున్నారు' అని విడదల రజని చెప్పారు.

సవాల్‌కి సిద్ధమా చంద్రబాబూ..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మొదలుపెట్టిన మెడికల్ కాలేజీలను పూర్తిచేస్తే ఆయనకు మంచి పేరు వస్తుందనే భయంతో చంద్రబాబు అధికారంలోకి రావడంతోనే సేఫ్ క్లోజ్ పేరుతో పనులన్నీ ఆపేసిందని రజిని మండిపడ్డారు. చివరికి మెడికల్ సీట్లు ఇస్తామని ముందుకొస్తే, వద్దని లేఖ రాసిన దుర్మార్గుడు చంద్రబాబు.. పీపీపీ విధానం మేలని పార్లమెంట్ స్థాయీ సంఘం చెప్పిందంటూ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న లేదా పూర్తయిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీకి ఇవ్వొచ్చని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సూచనలు చేసి ఉంటే చూపించాలని సీఎం చంద్రబాబును నిలదీశారు. 'దీనిపై ఎక్కడైనా చర్చకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉంది. మీ పార్టీ సిద్ధమా?' అని రజిని సవాల్ విసిరారు.

'గీతం' బకాయిలు రూ.118 కోట్లా?

- తీవ్ర ఆశ్చర్యం వ్యక్తం చేసిన తెలంగాణ హైకోర్టు
- సామాన్యుడికో నీతి.. పదవుల్లో ఉన్నవారికో నీతా?
- రూ.800 కట్టలేదని మా ఇంటి కనెక్షనే తొలగించారు
- ఇన్ని కోట్ల బకాయిలున్న కరెంట్ కనెక్షన్ తొలగించకుండా ఏం చేస్తున్నారు?
- విద్యుత్ శాఖ అధికారుల తీరుపై అసహనం

సాక్షి, హైదరాబాద్: దాదాపు రెండు దశాబ్దాలుగా ఓ సంస్థ విద్యుత్ బిల్లు చెల్లించకుంటే అధికారులు ఏం చేస్తున్నారని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. రూ.118.13 కోట్ల బకాయిలున్న ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం టీడీపీ ఎంపీ ఎం.భరత్‌కు చెందిన గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (గీతం) యూనివర్సిటీపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సామాన్య ప్రజలకు ఓ నీతి.. ఆర్థికంగా ఉన్నవారికో నీతా..? అని ఆగ్రహం వ్యక్తం చేసింది. బకాయిలను చెల్లించాలని, లేకపోతే విద్యుత్ సరఫరా నిలిపేస్తామంటూ గత సెప్టెంబర్‌లో సూపరింటెండింగ్ ఇంజినీర్ గీతం వర్సిటీకి నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాల్ చేస్తూ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం వర్సిటీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ గీతం వర్సిటీకి విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని నోటీసులు జారీ చేయడం అన్యాయమన్నారు. టీజీఎస్పీడీసీఎల్ స్టాండింగ్ కౌన్సెల్ శ్రీధర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ గతంలోనూ గీతం వర్సిటీకి నోటీసులు జారీ చేశామన్నారు. మొత్తం రూ.118,13,46,432 బకాయిలున్నాయని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి పెద్దఎత్తున, దీర్ఘకాలిక బకాయిలున్నా గీతం వర్సిటీపై ఎటువంటి చర్య తీసుకోకపోవడాన్ని తప్పుబట్టారు. బాల్యంలో తన ఇంటికి రూ.800 బకాయి ఉంటే అధికారులు సరఫరాను ఎలా నిలిపివేశారో ఈ సందర్భంగా జస్టిస్ నగేశ్ భీమపాక గుర్తు చేశారు. అలాంటి విద్యుత్ అధికారులు గీతం వర్సిటీకి ఎందుకు వెసులుబాటు ఇవ్వాల్సి వచ్చిందని ప్రశ్నించారు. పదవుల్లో ఉన్న వారి కోసం ప్రత్యేక నిబంధనలు రూపొందించారా అని ప్రశ్నించారు. విద్యుత్ కనెక్షన్ తొలగించకుండా మీనమేషాలు లెక్కబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తదుపరి విచారణకు టీజీఎస్పీడీసీఎల్‌లోని ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ స్వయంగా హాజరు కావాలని ఆదేశిస్తూ డిసెంబర్ 22కు వాయిదా వేశారు.

ఈడీ స్పెషల్ పీపీగా వెన్నా కళ్యాణ్ చక్రవర్తి

విజయవాడ లీగల్: దేశవ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులను సమర్థంగా విచారించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీన్లో భాగంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్టు (పిఎంఎల్ఎ), 2002 పరిధిలోకి వచ్చే క్లిష్టమైన కేసుల పరిష్కార నిమిత్తం చట్టపరమైన ప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ అదనంగా 125 మంది న్యాయవాదులను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా నియమించింది. గత సెప్టెంబరులో 54 మంది న్యాయవాదులతో తొలి జాబితాను విడుదల చేసిన తర్వాత, ఈడీ రెండో జాబితాను మంగళవారం విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారం తెలంగాణకు 8మంది, ఏపీకి 4గురు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి విజయవాడ సీబీఐ కోర్టులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న వెన్నా కళ్యాణ్ చక్రవర్తిని నియమించారు. దీంతో సీబీఐ కోర్టుతోపాటు ఈడీ న్యాయస్థానంలో ఏకకాలంలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించనున్నారు.

సాజిద్ ఫ్రం పాతబస్తీ!

- 'ఆస్ట్రేలియా ఉగ్రవాది' హైదరాబాద్ వాసే.. స్వస్థలం దూద్‌బౌలి
- 1998లో ఉన్నత చదువుల కోసం స్టూడెంట్ వీసాపై ఆస్ట్రేలియాకు
- 2022లో ఆస్తుల విక్రయం కోసం చివరిసారిగా భాగ్యనగరానికి రాక
- ఫిలిప్పీన్స్ వెళ్లి ఉగ్ర శిక్షణ పొందినట్లు గుర్తింపు

అల్ హసన్ కాలనీలోని ఇల్లు

సాక్షి, హైదరాబాద్: ఆస్ట్రేలియాలోని సిడ్నీలో బాండీ బీచ్‌లో యూదులపై కాల్పులకు తెగబడ్డ ఐసిస్ ఉగ్రవాద తండ్రీ కొడుకులైన సాజిద్ అక్రమ్ (50), నవీద్ అక్రమ్ (24)లలో తండ్రి హైదరాబాద్ వాసేనని వెల్లడైంది. తండ్రీకొడుకుల ఉగ్ర ఘాతుకానికి 16 మంది బలవగా 40 మందికిపైగా గాయపడ్డారు. పోలీసుల ఎదురుకాల్పుల్లో సాజిద్ మృతిచెందగా తీవ్రంగా గాయపడిన నవీద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సాజిద్‌ను పాతబస్తీలోని దూద్‌బౌలికి చెందిన వ్యక్తిగా ఆస్ట్రేలియా అధికారులు గుర్తించారు. యూఏఈ సైన్యంలో పనిచేసిన సాజిద్ తండ్రి 1984లో రిటైరయ్యారు. ప్రస్తుతం ఆయన కుటుంబం దూద్‌బౌలి నుంచి టోలిచౌకి అల్–హసన్ కాలనీకి వచ్చి స్థిరపడింది. సాజిద్ ఉన్న చదువుల కోసం 1998లో స్టూడెంట్ వీసాపై ఆస్ట్రేలియా వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. 1999లో వెనీరా గ్రాసో అనే యూరోపియన్ మహిళను వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు సంతానం కాగా పెద్ద కుమారుడైన నవీద్ 2001 ఆగస్టు 12న ఆస్ట్రేలియాలోనే జన్మించడంతో అక్కడి పౌరసత్వం పొందాడు. సాజిద్ పండ్ల వ్యాపారం చేస్తుండగా నవీద్ మేస్త్రీ పని చేసేవాడు. కొంతకాలం క్రితం చెయ్యి విరగడంతో ఇంటికే పరిమితమయ్యాడు. నవీద్ ద్వారానే సాజిద్ ఉగ్ర బాట పట్టినట్లు నిఘావర్గాలు చెబుతున్నారు. తండ్రీ కొడుకులు గత నెలలో ఫిలిప్పీన్స్ వెళ్లి వారంపాటు ఐసిస్ నుంచి ఉగ్ర శిక్షణ పొందినట్లు వెలుగులోకి వచ్చింది. పోలీసులు వారి ఇంట్లో సాజిద్ వాడిన భారత పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రోజులు చేపల వేటకు వెళ్లొస్తామని చెప్పి వారిద్దరూ ఇంటి నుంచి వెళ్లినట్లు అక్కడి కుటుంబ సభ్యులు చెప్పినట్లు ఆస్ట్రేలియా పోలీసులు పేర్కొన్నారు. సోమవారం సాజిద్ మరణ వార్తతో రాష్ట్ర నిఘా వర్గాలు రంగంలోకి దిగాయి. పాస్‌పోర్టులోని చిరునామా ఆధారంగా తొలుత దూద్‌బౌలి వెళ్లి ఆరా తీశాయి. స్థానికుల సమాచారం అల్–హసన్ కాలనీలోని ఇంటిని గుర్తించాయి. ప్రస్తుతం ఈ ఇంటికి తాళం వేసి కుటుంబీకులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పోలీసులు, నిఘా వర్గాలతో మాత్రం సంప్రదింపులు జరుపుతూ వారికి సమాచారం అందిస్తున్నారు. సాజిద్ అక్రమ్‌కు తన అన్న, పాతబస్తీలోని ఓ ఆస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న షాహిద్ అక్రమ్‌తో ఆస్తి వివాదాలు ఉన్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే 2017లో తండ్రి చనిపోయినప్పుడు సైతం సాజిద్ రాలేదని తెలియవచ్చింది. సాజిద్ చివరిసారిగా 2022లో హైదరాబాద్ వచ్చినప్పుడు టోలిచౌకిలోని కొన్ని ఉమ్మడి ఆస్తుల్ని అమ్మి వెళ్లాడు.

రఘురామకు సుప్రీంకోర్టులో భారీ షాక్

రూ.వందల కోట్ల రుణాల స్కామ్‌లో సీబీఐ దర్యాప్తునకు గ్రీన్ సిగ్నల్

సాక్షి, అమరావతి: వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని బ్యాంకుల నుంచి రుణాల రూపంలో తీసుకుని ఎగ్గొట్టిన వ్యవహారంలో మాజీ ఎంపీ, ప్రస్తుత ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, ఆయన చైర్మన్, ఎండీగా ఉన్న ఇండ్ భారత్ కంపెనీకి సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బ్యాంకు రుణాలు ఎగ్గొట్టినందుకు నమోదు చేసిన కేసులో దర్యాప్తు చేపట్టేందుకు సీబీఐకి లైన్ క్లియర్ చేసింది. ఈ కేసు విషయంలో ముందుకెళ్లొద్దంటూ 2022 సెప్టెంబర్ 30న తానిచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఎత్తివేసింది. అలాగే కేసులు నమోదు చేసే ముందు సీబీఐ తమకు నోటీసులు ఇవ్వలేదని, ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్న రఘురామకృష్ణరాజు, ఆయన కంపెనీ వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఎఫ్ఐఆర్ నమోదు సమయంలో నిందితులకు ముందస్తు నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తి జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది.

ఇదీ జరిగింది..

రఘురామకృష్ణరాజు, ఆయన చైర్మన్, ఎండీగా ఉన్న ఇండ్ భారత్ పవర్, ఇండ్ భారత్ ఇన్‌ఫ్రాలతో సహా ఇతర అనుబంధ సంస్థలు పలు ఆర్థిక సంస్థల నుంచి దాదాపు రూ.947.71 కోట్ల రుణం తీసుకున్నాయి. అలాగే పలు జాతీయ బ్యాంకుల కన్సార్షియం నుంచి కూడా రూ.826.17 కోట్ల రుణాలు తీసుకున్నాయి. థర్మల్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తామంటూ బ్యాంకుల నుంచి తీసుకున్న ఈ రుణాలను రఘురామరాజు కంపెనీలు దారి మళ్లించాయి. ఇతర బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేశారు. విచిత్రమేమిటంటే.. ఆ ఫిక్స్‌డ్ డిపాజిట్లను మళ్లీ తనఖా పెట్టి, మరోసారి రుణాలు తీసుకున్నారు. ఈ మొత్తాన్ని కూడా దారి మళ్లించారు. మే 2012 నుంచి మే 2017 వరకు ఐదేళ్ల పాటు నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో ఈ అక్రమాలు వెలుగుచూశాయి. రుణాల ఎగవేతపై, రఘురామకృష్ణరాజు మోసాలపై పలు ఆర్థిక సంస్థలు, బ్యాంకుల కన్సార్షియం 2019లో సీబీఐకి ఫిర్యాదు చేశాయి. ఈ ఫిర్యాదు ఆధారంగా సీబీఐ రఘురామకృష్ణరాజు, ఆయన కంపెనీలపై ఫోర్జరీ పత్రాల సృష్టి, నిధులు స్వాహా చేయడం వంటి అభియోగాలపై ఐపీసీ సెక్షన్లు 120బీ (కుట్ర), 420 (మోసం), 467, 468, 471 (ఫోర్జరీ) కింద కేసులు నమోదు చేసింది. దీనిపై రఘురామకృష్ణరాజు, ఆయన కంపెనీలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం, రఘురామకృష్ణరాజు, ఆయన కంపెనీలపై ఎలాంటి కఠిన చర్యలేవీ తీసుకోవద్దని ఆదేశించింది. అటు తరువాత ఈ ఉత్తర్వులను 2021లో హైకోర్టు ఎత్తివేసింది.

హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీంకోర్టుకు..

హైకోర్టు ఇచ్చిన ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రఘురామకృష్ణరాజు, ఆయన కంపెనీ ఇండ్ భారత్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా 2022లో సుప్రీంకోర్టు ధర్మాసనం, రఘురామకృష్ణరాజుపై నమోదు చేసిన కేసులో ముందుకెళ్లొద్దని సీబీఐని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. తాజాగా మంగళవారం ఈ వ్యాజ్యంపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం విచారణ జరిపింది. కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ (ఎస్‌జీ) తుషార్ మెహతా వాదనలు వినిపించారు. కాగా రఘురామకృష్ణరాజు తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదిస్తూ.. తమకు సహజ న్యాయ సూత్రాల ప్రకారం నోటీసు ఇవ్వలేదని, తమ వాదన వినకుండానే కేసులు పెట్టారని అభ్యంతరం వ్యక్తం చేశారు. హైకోర్టులో ఇంకా తుది తీర్పు రాలేదని, తమకు వాదన వినిపించే హక్కు కల్పించలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఫ్రాడ్ డిక్లరేషన్ వల్లే ఎఫ్ఐఆర్ వచ్చిందని, కాబట్టి రక్షణ కల్పించాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ఎఫ్ఐఆర్ నమోదు చేసే దశలో అది వర్తించదని స్పష్టం చేసింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేసింది. బ్యాంకులు ఇచ్చిన ఫ్రాడ్ డిక్లరేషన్‌పై గానీ, ఎఫ్ఐఆర్‌లోని అంశాలపై గానీ పిటిషనర్లకు అభ్యంతరాలు ఉంటే చట్టప్రకారం సంబంధిత న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని సూచించింది.

మాజీ ఎమ్మెల్సీ కేసులోనూ..

బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి, ఆయన కంపెనీల విషయంలో కూడా సుప్రీంకోర్టు ఇదే రకమైన ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనపై నమోదు చేసిన కేసు విషయంలో ముందుకెళ్లేందుకు సీబీఐ, బ్యాంకులకు అనుమతిచ్చింది. నారాయణరెడ్డి , ఆయన కంపెనీలు సైతం పలు బ్యాంకుల నుంచి దాదాపు రూ.500 కోట్ల మేర రుణాలు తీసుకుని ఎగవేశారు. దీనిపై పలు బ్యాంకులు సీబీఐకి ఫిర్యాదు చేశాయి. దీంతో సీబీఐ నారాయణ రెడ్డి, ఆయన కంపెనీలపై కేసులు నమోదు చేసింది.

మీరు అంటిపెట్టుకుని ఉన్నదానిని మాత్రమే కోల్పోతారు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 17 డిసెంబర్ 2025

‘ఉపాధి’కి కొత్త రూపు!

గ్రామీణ ప్రాంతాల్లో కాయకష్టం చేయగలిగేవారికి ఏడాదికి కనీసం వంద రోజుల పని దినాలు కల్పించేందుకు ఇరవయ్యేళ్ల క్రితం తీసుకొచ్చిన ‘మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం’ కనుమరుగు కావటానికి రంగం సిద్ధమైంది. దాని స్థానంలో తీసుకురాదల్చిన ‘వికసిత భారత్ రోజ్‌గార్ అజీవికా మిషన్ గ్రామీణ్’ (వీబీ–జీ రాం జీ) బిల్లు పార్లమెంటులో రంగప్రవేశం చేసింది. అమలులో ఉన్న పథకం కన్నా ఇది అనేక రెట్లు మేలైనదని కేంద్రం చెబుతోంది. ఆ మాటెలా ఉన్నా ప్రతి పథకమూ హిందీ భాషా పదాల మేళవింపుతో ఉండటం, పదాది అక్షరాలతో గుర్తుండిపోయే పదం వచ్చేలా రూపొందించటం ఎన్డీయే ప్రభుత్వ ప్రత్యేకత. ఈసారైతే గ్రామాల్లో ప్రతి పేద కుటుంబమూ ‘జీ రాం జీ’ అని స్మరించుకునేలా వాటంగా రూపుదిద్దారు. మహాత్మా గాంధీ పేరు తొలగించారు. పార్టీల మధ్య వాదప్రతివాదాల సంగతెలా ఉన్నా సాధారణ జనం పథకం పేరు కన్నా ప్రయోజనం ఏమేరకన్నదే ప్రధానంగా చూస్తారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వచ్చిన నేపథ్యం ఒకింత విషాదకరమైనది. ‘పల్లె కన్నీరు బెడుతుందో...’ అంటూ ప్రజాకవి గోరటి వెంకన్న రాసిన పాట అప్పటి పరిస్థితుల్ని ప్రభావవంతంగా చూపింది. వరస కరువులతో, ఆర్థిక సంస్కరణలతో కుదేలై గ్రామీణ భారతం తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న రోజులవి. రైతుల ఆత్మహత్యలు, ఉపాధి కరువై వలసపోవటాలు, చేతివృత్తులు దెబ్బతినటం రివాజయ్యాయి. దేశంలో అనేక జిల్లాలు ఆకలితో అలమటించాయి. అప్పుడు కేంద్రంలో అధికారంలోకొచ్చిన యూపీఏ ప్రభుత్వం ‘జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం’ తీసుకొచ్చింది. 2006 నుంచి దశలవారీగా అమలు ప్రారంభించింది. పని చూపాలని కోరితే పక్షం రోజుల్లో పని కల్పించటం లేదా నిరుద్యోగ భృతి కల్పించటం, ఉపాధిని దయాధర్మ భిక్షంగా కాక, హక్కుగా గుర్తించటం, కూలీల్లో మూడోవంతు మంది తప్పనిసరిగా మహిళలుండాలనే షరతు, నివాస స్థలానికి అయిదు కిలోమీటర్ల లోపునే పనిచూపటం, అంతకు మించితే అదనపు వేతనం చెల్లించటం దాని ప్రత్యేకతలు. ప్రపంచంలోనే అతి పెద్ద ఉపాధి కల్పనా పథకమది. పల్లెసీమల్లో ఈ పథకం కింద రహదారులు, చెరువుల్లో పూడిక తీయటం, భూసార పరిరక్షణ, నీటిపారుదల సదుపాయాల మెరుగు వగైరా పనులు చేయించటానికి వినియోగించారు.

అయితే లోపాలు లేవని కాదు. ఈ పథకం వల్ల తమకు కూలీల లభ్యత తగ్గిందని రైతుల ఫిర్యాదు. అలాగే వేతనాల చెల్లింపులో ఆలస్యం, నిధుల అరకొర కేటాయింపు, అన్నిచోట్లా ఒకేలా అమలు చేయకపోవటం, బయటి రేట్లతో పోలిస్తే వేతనాలు తక్కువ ఉండటం వగైరాలు సమస్యలు. వీటిని ‘జీ రాం జీ’ పరిష్కరిస్తుందా? వంద రోజులు కాదు... 125 రోజులు ఉపాధి గ్యారెంటీ అంటున్నది కొత్త పథకం. సాగు పనులు జోరుగా ఉండే రెండు నెలలూ దీన్ని తాత్కాలికంగా నిలిపేస్తారు. ఈశాన్య రాష్ట్రాలూ, కశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ వగైరాలు మినహా మెజారిటీ రాష్ట్రాలు ఈ పథకంలో 40 శాతాన్ని భరించాల్సి రావటం ఇందులోని ప్రధాన సమస్య. ఇంతవరకూ ఇది 10 శాతం మాత్రమే. ఇకపై రాష్ట్రాలు ఏటా కనీసం రూ. 50,000 కోట్లు వెచ్చించాలి. పైగా ప్రతి ఏటా నిర్దిష్ట మొత్తంలో నిధులు కేటాయించటం, అంతకుమించి పెరిగితే రాష్ట్రాలే భరించాల్సి రావటం అదనపు సమస్య. రాష్ట్రాల ఆదాయ వనరులకు గండికొడుతూ అదనంగా ఇంత పెద్ద భారాన్ని మోపటం సరైందేనా? ఎన్డీయేను భుజాలకెత్తుకున్న జేడీ(యూ), టీడీపీ ఏమంటాయి? ఈ పథకం కూడా గతంలో మాదిరే హక్కు ప్రాతిపదికగా ఉంటుందంటున్నా నిధుల లేమితో ఆచరణలో ఆవిరి కాదా?

గత అయిదేళ్లలో ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు తగ్గుతున్నది. ఏటా ప్రవేశపెట్టే బడ్జెట్ గణాంకాలు ఆ సంగతి చెబుతున్నాయి. రాష్ట్రాలపై అదనపు భారం మోపితే పథకం నీరసిస్తుంది. రాష్ట్రాలకు కేటాయింపుల్లో కేంద్రం అనుసరించబోయే గీటురాళ్లేమిటో ఇంకా తెలియాల్సి ఉంది. తమకేం అవసరమో రాష్ట్రాలు నిర్ణయించుకోవటానికి బదులు ఎక్కడెక్కడ ఖర్చు చేయాలో కేంద్రం నిర్దేశిస్తుంది. వికేంద్రీకరణ అవసరం నానాటికీ పెరుగుతుండగా అందుకు భిన్నమైన మార్గం సమర్థనీయం కాదు. మొత్తానికి దీనివల్ల ఒరిగేదేమిటో, కష్టనష్టాలేమిటో ముమ్మందు తెలుస్తాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.త్రయోదశి రా.2.11 వరకు తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** విశాఖ సా.5.43 వరకు తదుపరి అనూరాధ, **వర్జ్యం:** రా.10.09 నుండి 11.55 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.34 నుండి 12.18 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.58 నుండి 9.44 వరకు.

సూర్యోదయం : 6.27
సూర్యాస్తమయం: 5.24
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

సోషల్ టాక్

సందేహాలు

ప్రతిదాన్నీ సందేహించటం లీడర్‌కు ఉండవలసిన విలువైన లక్షణం అని నేను భావిస్తాను. నిరంతరం ప్రశ్నలు అడగటం ద్వారా లీడర్ తన వ్యూహంలోని లోపాలను గ్రహించగలడు. అతడి ఒక్క సందేహం, టీమ్‌లో ప్రయోజనకరమైన పది ఆలోచనల్ని కలిగిస్తుంది.

– దినేశ్ సి. పాలీవాల్, వ్యాపారవేత్త

స్థిరత్వం

జిమ్‌కు వెళ్లాలనీ, వర్క్ అవుట్ చేయాలనీ, ఫిట్‌గా ఉండాలనీ నాకు ప్రతి రోజూ ఉంటుంది. ఇది లక్ష్యమో, ధ్యేయమో కాదు. ఇష్టం! నా ఆరోగ్య రహస్యం వెనుక ఉన్న మాయాజాలం ఈ స్థిరత్వమే. శరీరం దేవాలయం. స్వీయ శారీరక సంరక్షణ నా మతం.

– జాన్ అబ్రహామ్, నటుడు

‘తెలిసిన కష్టం’

విజ్ఞాన శాస్త్రంలో నిజమైన పురోగతి తార్కికమైన ఒక పరిష్కారాన్ని అభివృద్ధి చేయటంలో ఉంటుంది. అది, గతంలో పరిష్కారం కాని సమస్యలకూ పరిష్కారం అందించ గలదు. ‘తెలిసిన కష్టం’ సమస్య కాదు. ‘తెలియని అసాధ్యం’ పైనే మనం పని చేయాలి.

– దేవాశీష్ ముఖర్జీ, కెమిస్ట్

కల్లోలాలు

జీవితం అంటే ఉప్పెనల మీద పడవలో ప్రయాణించినట్లే! నిశ్చలమైన నీటిని చేరుకునే వరకూ మీరు తెడ్డు వేస్తూనే ఉండాలి. మీరు ఏ రంగంలో ఉన్నా అక్కడ కొన్ని నిజమైన సంబంధాలను ఏర్పరచుకోండి. ఆ వ్యక్తిగత బంధాలే మీ జీవన కల్లోలాలలో బలాన్ని ఇస్తాయి.

– జయసుధ, సినీ నటి

ఒడుపు

ఇరవై ఏళ్లకు పైగా స్విమ్మింగ్‌లో ఉన్నాను. నా శరీరం దాదాపు 35,000 కి.మీ. ఈత కొట్టింది. ఇంత చేసినప్పటికీ ఒక ఈతగాడు భారత జట్టులో చోటు దక్కించుకుంటాడని గ్యారెంటీ ఏమీ లేదు. టన్నుల కొద్దీ స్విమ్మర్‌లు ఇక్కడ వేచి ఉంటారు. వారిని దాటేసే ఒడుపు ఉండాలి.

– అన్షుల్ కొఠారీ, స్విమ్మర్

విజేత



విజయం అంటే వేలాది మంది చూస్తుండగా, గ్రౌండ్‌లో మీరు ఆడిన ఆ 90 నిమిషాలు మాత్రమే కాదు. ఎవరూ చూడనప్పుడు ప్రాక్టీస్ కోసం మీరు కేటాయించిన వేల గంటలు కూడా! ఆటలో గెలుపు టీమ్‌దే అయినా, టీమ్‌ను గెలిపించిన మీ సాధన కూడా విజేతే!

– గౌరంగ బిస్వాస్, ఫుట్‌బాలర్

జాప్యానికి విరుగుడు చర్యలు

విశ్లేషణ

సుష్మా రామచంద్రన్

జాతీయ ప్రజాస్వామిక కూటమి (ఎన్డీయే) ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలను కొన్నాళ్లు అటకెక్కించింది. ఇటీవలి సంవత్సరాల్లో రాజకీయ ప్రయోజనాలను మూటగట్టుకోవడం, ఎన్నికల్లో విజయం సాధించడంపైనే అది దృష్టిని కేంద్రీకరించింది. వ్యవసాయ సంస్కరణలు తెచ్చేందుకు చేసిన ప్రయత్నం విఫలమైనప్పటి నుంచి మరింత ఆచితూచి అడుగులు వేయడం మొదలెట్టింది. అయితే, భారతీయ ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించడంతో విధాన నిర్ణేతలు మళ్ళీ కార్యాచరణకు ఉపక్రమిస్తున్నారు.

జీఎస్టీతో మొదటి అడుగు

సుంకాల ప్రభావంతో ఆర్థిక వృద్ధి ఏమాత్రం కుంటుపడకుండా నివారించడం ప్రభుత్వానికి తక్షణ కర్తవ్యంగా మారింది. అమెరికా సుంకాలు ఎగుమతులపైనే కాకుండా, ప్రపంచంలోని అతి పెద్ద మార్కెట్ అయిన అమెరికాకు వస్తువులు సరఫరా చేసే సంస్థలలోని ఉద్యోగాలపైన కూడా ప్రభావం చూపుతున్నాయి. చాలా కాలంగా జాప్యం చేస్తూ వచ్చిన వస్తు–సేవల పన్ను (జీఎస్టీ) మార్పు చేర్పులను పూర్తి చేయడాన్ని ప్రభుత్వం ఆ దిశగా వేసిన మొదటి అడుగుగా చెప్పవచ్చు. ఆగస్టు నెలలో అమెరికా సుంకాలు ప్రకటించడంతోనే, సెప్టెంబర్‌లో జీఎస్టీ రేట్లకు కోత పెట్టారు. శ్లాబులను తగ్గించారు. క్రమరాహిత్యాలను వేగంగా తొలగించారు.

ఫలితంగా పండుగల సీజన్‌లో అమ్మకాలు విజృంభించాయి. కొన్నేళ్ళుగా మందగొడిగా సాగుతున్న అమ్మకాలతో నీరసించిన వ్యాపార వర్గాల్లో సంతోషం వెల్లివిరిసింది. జీఎస్టీ తేవడంలోని అసలు లక్ష్యం ఒకే పన్ను విధానాన్ని తీసుకురావడం. తీరా, అది అనేక తలల జీవిలా తయారైంది. అంతకుముందు, కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అనేక రకాలుగా ఉన్న పన్నుల వ్యవస్థతో పోలిస్తే జీఎస్టీ మెరుగైనదనడంలో సందేహం లేదు. కానీ, సులభతరం చేయడానికి, వ్యాపార సంస్థలకు మరింత స్నేహ పూర్వకంగా మార్చడానికి జీఎస్టీలో మార్పులు అవసరమయ్యాయి.

కార్మికుల కోసం రెండో అడుగు

రెండవ అడుగు వేయడంలో కూడా ప్రభుత్వం ఎట్టకేలకు తెగువను ప్రదర్శించింది. కార్మిక అంశాలకు సంబంధించి ఇప్పుడున్న 29 చట్టాల స్థానంలో నాలుగు స్మృతులను ప్రభుత్వం నోటిఫై చేసింది. ఇది ప్రభుత్వాన్ని ఒక రకంగా ఇరుకునపెట్టే నిర్ణయమే. ఇది రాజకీయంగా సున్నితమైన అంశం. వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగాల్లో పనిచేస్తున్న కోట్లాది మంది కార్మికులకు సంబంధించినది.

నిజానికి, ఈ స్మృతులను పార్లమెంట్ 2020లోనే ఆమోదించింది. కానీ, వాటిని నోటిఫై చేయలేదు. నిబంధనలను అధికారికంగా అమలులోకి తేలేదు. ఇప్పుడు నోటిఫై చేశారు కనుక, నిబంధనలు వచ్చే రెండు నెలల్లోపల వాస్తవ రూపం ధరిస్తాయి. యాజమాన్యాలు వాటిని అమలు చేసేందుకు కొంత సమయం పట్టవచ్చు. కార్మిక సంఘాలు వీటిపై రుసరుస లాడుతున్నప్పటికీ, వాస్తవానికి, అవి విస్తృతమైన సంఖ్యలో కార్మికులను భద్రతా వలయంలోకి తెస్తున్నాయి. ఇవి కేవలం షెడ్యూల్డు వాటికే కాకుండా, అన్ని రకాల సంస్థలకూ వర్తిస్తాయి. వేగంగా విస్తరిస్తూ పోతున్న కంప్యూటర్ సిబ్బంది కూడా వాటి పరిధిలోకి వస్తున్నారు. వీటిలో వివిధ చర్యలను రాష్ట్రాలు ఇప్పటికే అమలులోకి తెచ్చాయి. కానీ, కేంద్రం ఆ నిబంధనలను నోటిఫై చేయడంతో, దేశవ్యాప్త ప్రాతిపదికన ఇప్పుడు విస్తరింపజేసినట్లు అయింది.

◆ దశాబ్దాల తరబడి పరిశ్రమలను కట్టిపడేసిన శృంఖలాలను తెగ్గొట్టి, ఆర్థికాభివృద్ధిని పెంపొందించడమే మన లక్ష్యమైతే, సత్వర కార్యాచరణను చూపాల్సిన అవసరం ఉంది.

పరస్పర వైరుధ్యంతో కూడిన నిబంధనలున్న 29 చట్టాలను, కార్మికులకు సంబంధించిన అన్ని అంశాలలోని అన్ని కోణాలను లెక్కలోకి తీసుకుంటూ, నాలుగు స్థూలమైన స్మృతులుగా తీసుకురావడం గణనీయమైన చర్యే. దీనివల్ల, వ్యాపార నిర్వహణ ప్రక్రియ సులభతరం అవుతుంది. ఇవి వలస పాలనలో 1930ల నుంచి అమలులోకి వచ్చినవి. అప్పటి నుంచి అవి శాసనాల పుస్తకాలలో అలాగే పడి ఉన్నాయి.

అధికార యంత్రాంగపు జాప్యం తగ్గేలా...

పాలనా యంత్రాంగంలోని రెగ్యులేటరీ కొలెస్ట్రాల్‌ను పెద్ద యెత్తున తగ్గించే విధంగా స్థూలమైన ప్రణాళికలతో నీతి ఆయోగ్ కమిటీ ఈమధ్యనే నివేదిక సమర్పించింది. ఆగస్టులో నెలకొల్పిన ఆ కమిటీకి మాజీ క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ అధ్యక్షుడిగా వ్యవహరించారు. అభివృద్ధి కార్యకలాపాలకు విఘాతంగా పరిణమిస్తున్న అధికార యంత్రాంగపు నియమ నిబంధనలు, విధానాలకు కోత పెడుతూ, అనేకానేక చర్యలను ఈ కమిటీ ప్రతిపాదించింది. వ్యాపారాలు సాఫీగా సాగకుండా అడ్డం పడుతున్న రెగ్యులేటరీ ప్రక్రియలు కేంద్ర స్థాయిలోనే కొనసాగుతున్నాయని అదృష్టవశాత్తూ ఈ కమిటీ గుర్తించింది.

దేశ రెగ్యులేటరీ చట్రాన్ని విప్లవాత్మకంగా మార్చి వేయాలని కమిటీ ప్రతిపాదించింది. జన్ విశ్వాస్ సిద్ధాంత్ పేరుతో సంస్థలపై నమ్మకం ఉంచే విధానంతో మెలగాలని పేర్కొంది. నూతన ప్రతిపాదనలను ఆ విశ్వాస ఆధారిత వైఖరిలో భాగంగా పేర్కొంది. లైసెన్సులు, పర్మిట్లు, నో–అబ్జెక్షన్ సర్టిఫికెట్లు వంటి వాటిని రద్దు చేయడం ద్వారా ‘ఇన్‌స్పెక్టర్ రాజ్’ను అంతమొందించాలని కమిటీ సిఫార్సు చేసింది. క్రమానుగత తనిఖీల బాధ్యతను అక్రెడిటెడ్ మూడవ పక్షాలకు అప్పగించాలని కూడా కమిటీ కోరింది. ఈ చర్యలు అధికారుల విచక్షణాయుత పాత్రను తగ్గిస్తాయి. మొదటి విడత ఆర్థిక సంస్కరణలు, సరళీకరణ చర్యలు 1991లో మొదలైన దశాబ్దాల తర్వాత కూడా అధికారులు వేళ్లూనుకునే ఉన్నారు.

విధానాలలో హఠాత్తుగా మార్పులు తీసుకురావద్దనీ, నియంత్రణ విధానాలను అప్‌డేట్ చేయడానికి ఒక స్థిరమైన కాల వ్యవధిని పెట్టుకోవాలనీ కూడా కమిటీ సిఫార్సు చేసింది. అప్పుడే నిబంధనలలో మార్పుల గతి కొంతవరకు ఊహకందేదిగా ఉంటుందని పేర్కొంది. చిన్నా చితక పొరపాట్లు లేదా సాంకేతికపరమైన ఉల్లంఘనల్లో పీనల్ నిబంధనలకు వెళ్ళడాన్ని రద్దు చేయాలనీ, తీవ్రమైన నేరాల విషయంలో మాత్రమే అటువంటి శిక్షలు, జరిమానాలు విధించాలనీ కమిటీ ప్రతిపాదించింది.

మరో సమాంతర నీతి ఆయోగ్ కమిటీ కూడా వరుసగా అనేక సంస్కరణలను, ముఖ్యంగా చిన్న, మధ్య తరహా సంస్థల విషయంలో ప్రతిపాదించింది. కంపెనీల చట్టం కింద పాటించవలసిన నియమాలను వాటి విషయంలో సడలించాలని ఆ కమిటీ కోరింది. చిన్న, మధ్య తరహా సంస్థలకు ప్రభుత్వ సంస్థల నుంచి చెల్లింపులలో జాప్యం వల్ల తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలని కూడా కమిటీ కోరింది. ఈ రంగం ప్రయోజనాలను నేరుగా దెబ్బ తీస్తున్న, కొనసాగుతున్న సమస్యగా కమిటీ దాన్ని పేర్కొంది.

జీడీపీ వృద్ధికి సంబంధించి 2025–26 సంవత్సరపు ద్వితీయ త్రైమాసికపు డేటా 8.2 శాతంగా ఉండటం ఉత్సాహపరచేదిగా ఉంది. కానీ, పూర్తి సంవత్సరానికి సంబంధించిన అంచనా దాదాపు 6.5 నుంచి 7 శాతంగా మాత్రమే ఉంది. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల కేటగిరీలో అడుగు పెట్టేందుకు ఇంకా వేగంగా ముందుకు సాగుతూ 9 నుంచి 10 శాతం వృద్ధి రేటును కనబరచవలసిన అవసరం ఉంది. అందుకు, అమెరికా సుంకాల ప్రభావం లేకుండా చేసేందుకు ఇప్పటి మాదిరిగానే, లోతైన సంస్కరణలు తీసుకురావాలి. ఈ ఆచరణాత్మక, సానుకూల అడుగులు దీర్ఘకాలంలో కూడా స్థిరంగా ముందుకు పడాలి.

వ్యాసకర్త సీనియర్ ఫినాన్షియల్ జర్నలిస్ట్
(‘ద ట్రిబ్యూన్’ సౌజన్యంతో)

ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణేనా సంపద సృష్టి?

నేడు ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఆస్తులు ‘పీపీపీ’ ద్వారా క్రమంగా ప్రైవేటు పరం అవుతున్నాయి. చేపల వేట కోసం వై.ఎస్.జగన్ ప్రభుత్వం నిర్మించిన హార్బర్లను తాజాగా ‘పీపీపీ’ పేరిట ప్రైవేట్ కంపెనీలకు అప్పగించాలన్న ప్రయత్నం ఇందుకు ఉదాహరణ. ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలు, రాష్ట్ర భూములు, టూరిజం ప్రాజెక్టులు – ఏదీ మినహాయింపు లేకుండా ఈ ప్రభుత్వం తమవారు అనుకున్న వారందరికీ కట్టబెడుతోంది. గత ప్రభుత్వం ప్రజల డబ్బుతో నిర్మించిన చేపల హార్బర్లు, పోర్టులు ప్రైవేటు పరం అయితే ప్రజలకు వాటిపై హక్కు లేకుండా పోయే ప్రమాదం ఉంది. వాటి నుంచి వచ్చే లాభాలు అందకపోగా ఇప్పుడు ప్రజలకు అవే భారమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

ఇది ఒక్క హార్బర్లకే పరిమితం కాదు. చట్టబద్ధంగా ప్రభుత్వానికి చెందిన వేల కోట్ల విలువైన భూములను పరిశ్రమల పేరుతో 99 పైసలకే కేటాయించడం, పర్యాటక అభివృద్ధి పేరిట కీలక స్థలాలు నిర్దిష్ట వర్గాలకు ఇస్తున్నారనే అభిప్రాయాలూ ఉన్నాయి. అమరావతి రైతులు ఇచ్చిన భూములను కూడా కొత్త ఎస్‌పీవీ పేరుతో మానిటైజ్ చేయాలన్న ప్రయత్నం ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ‘డబ్బుల్లేవు’ అంటూ... వేల కోట్లలో రుణాలు తీసుకుని సీఎం, మంత్రులు, అధికారులు ప్రతి నెలా విదేశీ పర్యటనలు చేయడం విడ్డూరం. ప్రత్యేక విమాన ప్రయాణాలకు వందల కోట్ల వ్యయం చేస్తున్నారు. ఇవన్నీ ప్రజల్లో మరింత అసంతృప్తి పెంచుతున్నాయి. డబ్బు లేకపోవడం వల్ల ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆసుపత్రులు కొనసాగడం కష్టమని పీపీపీ పద్ధతిలో ప్రైవేటుపరం చేయడం, అందులో పనిచేసే వారికీ జీతాలు ప్రభుత్వమే చెల్లిస్తుందనటంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావటం లేదు.

‘ఇండిగో’ వంటి ఒకే కంపెనీకి విమానయాన రంగంలో ఏకాధిపత్యం వచ్చినప్పుడు ప్రజలు ఎన్ని అవస్థలు పడ్డారో, విమాన టికెట్లు ఎలా అమాంతం పెరిగాయో ప్రజలు చూశారు. అదే రీతిలో హార్బర్లు, పోర్టులు, మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులు అన్నీ ప్రైవేట్ చేతుల్లోకి వెళ్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడం కష్టం కాదు. ప్రజలకు ఎంపికలు, ప్రత్యామ్నాయం లేకుండా పోతే, కార్పొరేట్ల ఇష్టానుసారం రేట్లు, నిబంధనలు, సేవల ప్రమాణాలు మారతాయి.

అయితే, వైఎస్ జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక మెగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రభుత్వమే నిర్మించే విధానం రూపొందించారు. నిర్మించిన ఆ యూనిట్లను అనుభవమున్న కంపెనీలకు లీజుకు ఇవ్వటం... వాటి ద్వారా వచ్చే లాభాన్ని ప్రభుత్వం కొంత తీసుకొని రుణాలను తిరిగి చెల్లించేలా చూశారు. స్థూలంగా వ్యవస్థలన్నీ ప్రజల వద్దే, ప్రజలకు చెందే విధంగా రూపొందించిన విధానం ఆయనది. పర్యాటక అభివృద్ధికైనా, మరేదైనా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమం అయినా ప్రాజెక్ట్‌కు భూమి ఇవ్వాలంటే కచ్చితంగా టెండర్ విధానాన్ని అనుసరించడం జరిగేది. కానీ ఇప్పుడు అడిగిన వాడు తమవాడైతే చాలు అన్నట్టుంది పరిస్థితి. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ పీపీపీ ప్రభుత్వ దోపిడీలు చాలానే కనబడతాయి. జగన్ ప్రభుత్వం ప్రజల ఆస్తులను తయారు చేసి రాష్ట్ర నెట్–వర్త్ పెంచితే... ఈ కూటమి ప్రభుత్వం వాటినన్నీ తెగనమ్మి లిక్విడేట్ చేస్తూ... దాన్నే ‘సంపద సృష్టి’ అంటూ ప్రజలను మోసం చేస్తున్నది.

– తలకోల రాహుల్ రెడ్డి | మౌలిక సదుపాయాల రంగ నిపుణుడు

పెన్షనర్ల హక్కుల కోసం...

ఇన్ బాక్స్

2004 నుండి అమలులోకి వచ్చిన ‘కాంట్రిబ్యూటరీ’ పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ రెండున్నర దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా ఉద్యోగులు ఉద్యమిస్తున్నారు. పులి మీద పుట్ర లాగా ‘ఆర్థిక బిల్లు–2025’ ద్వారా 2026 తర్వాత పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు మాత్రమే వేతన సవరణ కమిటీ సిఫార్సులను అమలు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. అంతకుముందు రిటైరైన పెన్షనర్లకు వేతన సవరణ ప్రయోజనాలు కానీ, డి.ఎ. పెంపుదల కానీ ఈ చట్టం ప్రకారం ఉండవు. దీనివల్ల 2026కు పూర్వం పదవీవిరమణ పొందిన పెన్షనర్ల పెన్షన్‌లో మార్పు ఉండదు. పెరుగుతున్న ధరలు, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా డియర్‌నెస్ రిలీఫ్ కూడా వర్తింపజేయరు. ఫలితంగా వారి పెన్షన్‌లో మార్పు లేకుండా వృద్ధాప్య జీవితంలో ఆర్థిక ఇబ్బందులతో జీవితాన్ని గడిపే పరిస్థితులు రానున్నాయి.

1977వ సంవత్సరం ముందు రిటైర్ అయినవారు అతి తక్కువ పెన్షన్‌తో, దుర్భర పరిస్థితుల్లో వృద్ధాప్యాన్ని గడిపేవారు. ఈ పరిస్థితిని గమనించిన ధరమ్ స్వరూప్ నకారా సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన పిటిషన్ వేశారు. దీనిపై సుప్రీంకోర్ట్ జడ్జీల ధర్మాసనం 1982 డిసెంబర్ 17న చరిత్రాత్మక తీర్పునిచ్చింది. ఈ తీర్పులో పెన్షనర్స్ మనోభావాలను ఉత్తేజపరిచే హక్కులను, విధులను కూడా ప్రస్తావించింది. ‘పెన్షన్ ఒక హక్కు, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా డి.ఎ. లేదా డి.ఆర్. చెల్లించాలి. ఆరోగ్య సదుపాయాలు కల్పించాలి. మరణ పరిహారం (డెత్ కాంపెన్సేషన్) చెల్లించాలి’ అని చెప్పింది. అంతేకాదు ‘పెన్షన్ ప్రభుత్వ విచక్షణపై ఆధారపడి లేదు, పెన్షన్ గతసేవలకు ప్రతిఫలం మాత్రమే! పెన్షన్ సుదీర్ఘ కాలం పని చేసినందుకు, వృద్ధాప్యంలో లేమిని నివారించుటకు ఇచ్చే ఆర్థిక సహాయం’ అని తీర్పులో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లందరూ సకాలంలో పెన్షన్ పొందుతూ ప్రశాంత జీవనం గడపడం వెనుక డి.ఎస్. నకారా చేసిన కృషి, సాగించిన పోరాటం చిరస్మరణీయం. ఆయన 1972లో ఆర్థిక మంత్రిత్వ శాఖలో అదనపు కార్యదర్శిగా, రక్షణ శాఖకు ఆర్థిక సలహాదారుగా సేవలందిస్తూ పదవీ విరమణ చేశారు.



డి.ఎస్. నకారా

డిసెంబర్ 17వ తేదీన చరిత్రాత్మకమైన తీర్పు వెలువడిన ఆ రోజుకు గుర్తుగా ‘పెన్షనర్స్ డే’గా జరుపుకొంటూ పెన్షన్ హక్కులను కాపాడిన నకారా కృషిని గుర్తు చేసుకుంటున్నారు. అన్ని రకాల పెన్షన్లకు ప్రమాదం ఏర్పడిన ప్రస్తుత తరుణంలో నకారా పోరాటస్ఫూర్తితో రాజ్యాంగబద్ధమైన పెన్షన్ హక్కును కాపాడుకోవడమే మనం ఆయనకిచ్చే ఘన నివాళి.

– కె. వేణుగోపాల్ | ఉపాధ్యాయ సంఘ నాయకుడు
(నేడు ‘నేషనల్ పెన్షనర్స్ డే’)

డేటా పాయింట్



వైరాగ్య బోధన

జ్యోతిర్మయం

అరేబియన్ నైట్స్ కథలను మనం చదివాం. అందులో షహరియార్ ఒక విశాల సామ్రాజ్యానికి రాజు. తన భార్య చెడు ప్రవర్తన గురించి తెలిసికొని ఆమెకు మరణదండన విధిస్తాడు. అంతేగాక, స్త్రీలందరిపై ద్వేషాన్ని పెంచుకొని రోజుకొక యువతి చొప్పున తన రాజ్యంలోని ఎందరో స్త్రీలను హతమారుస్తాడు.

మన దేశంలోనూ ఒక రాజుకు అలాంటి పరిస్థితి ఏర్పడింది. ఆయనే భర్తృహరి. ఆయన భార్య పింగళి. విలువైన ఆభరణాలు, వస్త్రాలు, సకల రాజభోగాలను భర్తృహరి సమకూర్చినా ఆమె చెడు ప్రవర్తనను అలవరచుకొంది. దీనివల్ల భర్తృహరిలో ఆమె పట్ల ద్వేషం పెరగలేదు గానీ ప్రాపంచిక సుఖాల పట్ల వైరాగ్యం వృద్ధి చెందింది. ఆయన తన భార్యతో, ‘ఓ పింగళీ! నీవే నా గురువు. ఎంతోమంది గురువులు వచ్చి వైరాగ్యం గురించి నాకు బోధించారు గానీ ఆ బోధనలేవీ నాపై ప్రభావం చూపలేదు – నీవు సాధారాణ పద్ధతి ప్రకారం కాక విలక్షణంగా నాకు వైరాగ్యం బోధించావు. ఇతరులెవరూ చేయలేని విధంగా నా కళ్ళు తెరిపించావు. నీకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు’ అని చెప్పి, తన తమ్ముడైన విక్రమాదిత్యునికి రాజ్యపాలనను అప్పగించి, తపస్సు చేసుకోవటానికి అడవులకు వెళ్ళిపోతాడు. (పుట 35, ‘శ్రీరామకృష్ణ ప్రభ’– జూలై 2013).

వేల ఏండ్లుగా ఆధ్యాత్మికతతో నిండిన వాతావరణం గల ఈ పుణ్యభూమి ప్రభావం ఈ మట్టిలో పుట్టిన వారిపై ఎంత ఉంటుందో దీని వల్ల తెలుస్తుంది. ఆధ్యాత్మిక అభివృద్ధికి అత్యంత ఆవశ్యకమైన వైరాగ్యం కలగటానికి ఏ చిన్న కష్టమో, నష్టమో ఉపకరిస్తుంది. జ్ఞానార్జనకు పురిగొల్పుతుంది. పరమహంసలు, మహర్షులు, యోగులు ఎందరో ఇలా ఈ గడ్డపై ఉద్భవించారు. వారి వారసత్వాన్ని అందుకొందాం!

– రాచమడుగు శ్రీనివాసులు

పరాకాష్టకు 'గుమ్మనూరు' గూండాగిరి

రైల్వే అభివృద్ధి పనుల్లో రూ.70 లక్షల కమీషన్‌కు డిమాండ్

సొంత పార్టీ ఎంపీకే బెదిరింపు
చేష్టలుడిగి చూస్తున్న టీడీపీ అధిష్టానం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అనంతపురం జిల్లా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరులు, అనుచరుల ఆగడాలు పరాకాష్టకు చేరాయి. గుంతకల్లు నియోజకవర్గాన్ని సొంత సామ్రాజ్యంగా భావిస్తున్న గుమ్మనూరు కుటుంబీకులు.. ఎవరు ఏం చేయాలన్నా కమీషన్ చెల్లించాల్సిందేనంటూ ఆదేశాలిచ్చారు. ఎవరైనా ప్రశ్నిస్తే భౌతిక దాడులకూ వెనుకాడటం లేదు. వారి రౌడీయిజానికి ఏకంగా టీడీపీ ఎంపీయే టార్గెట్ అయ్యారు. కమీషన్ల కోసం సొంత పార్టీ ఎంపీనే వేధిస్తున్న గుమ్మనూరును కట్టడి చేయలేక చంద్రబాబు సైతం నిస్సహాయంగా ఉండిపోతున్నారు.

ఏం జరిగిందంటే..

వెస్ట్ గుంతకల్లులోని ఎస్ఎస్ ట్యాంకు నుంచి కొత్త పైప్‌లైన్ల నిర్మాణానికి సెప్టెంబర్‌లో టెండర్లు ఖరారయ్యాయి. రాజమండ్రికి చెందిన సుబ్బారాయుడు అనే కాంట్రాక్టర్ రూ.7 కోట్లతో పనులు చేపట్టేలా టెండర్ దాఖలు చేసి పనులు చేజిక్కించుకున్నారు. ఆ తరువాత స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు దౌర్జన్యం గురించి తెలుసుకున్న ఆ కాంట్రాక్టర్ ఆ పనులను అనంతపురానికి చెందిన మారుతీప్రసాద్ అనే వ్యక్తికి సబ్ కాంట్రాక్ట్‌కు ఇచ్చాడు. మారుతీప్రసాద్ అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు అత్యంత సమీప బంధువు అని సమాచారం. ఈ భారీ కాంట్రాక్ట్ విషయం తెలుసుకున్న

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తమ్ముడు నారాయణస్వామి రూ.7 కోట్ల టెండర్‌లో కమీషన్‌గా తమకు రూ.70 లక్షలు ఇవ్వాలని కాంట్రాక్టర్ సుబ్బరాయుడుని డిమాండ్ చేశారు. తాను ఆ పనులను అనంతపురం ఎంపీ బంధువుకు సబ్ కాంట్రాక్ట్ ఇచ్చినట్టు చెప్పడంతో.. ఎమ్మెల్యే సోదరుడు ఎంపీ లక్ష్మీనారాయణకు ఫోన్‌చేసి కమీషన్ డిమాండ్ చేసినట్టు తెలిసింది. రూ.70 లక్షల కమీషన్ ఇవ్వకపోతే పనులు జరగనిచ్చేది లేదని బెదిరించడంతో కంగుతున్న ఎంపీ లక్ష్మీనారాయణ విషయాన్ని అధిష్టాన వర్గానికి చేరవేశారు. మంత్రి నారా లోకేశ్‌కు కూడా ఫోన్ చేసి గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు అరాచకాల గురించి ఎంపీ లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

అనంతలోనూ అదే తీరు

అనంతపురంలోనూ ఈ కమీషన్ల దందా సాగుతున్నట్టు తెలుస్తోంది. అనంతపురం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో సైతం అక్కడ ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరుల ఆగడాలు ఎక్కువగా ఉన్నాయని ఆరోపణలున్నాయి. అమృత్ రైల్వేస్టేషన్‌లో భాగంగా రూ.కోట్లతో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఇందులో తమకూ 10 శాతం కమీషన్ ఇవ్వాల్సిందేనంటూ అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు సంబంధిత కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేస్తున్నట్టు తెలిసింది.

అధిష్టానమా.. అయితే నాకేంటి?

కమీషన్లు, బెదిరింపులు విషయం చంద్రబాబుకు తెలిసినా గుమ్మనూరు ఏ మాత్రం బెదరడం లేదు. అధిష్టానం అయితే నాకేంటి? నా కమీషన్లు నాకు ముఖ్యం అంటూ భీష్మించుకుని కూర్చున్నట్టు సమాచారం. తమ సొంత సామ్రాజ్యంలో అధిష్టానం జోక్యాన్ని కూడా సహించబోని గుమ్మనూరు కుటుంబీకులు వ్యాఖ్యానిస్తున్నట్టు తెలుస్తోంది. గుమ్మనూరు తీరుతో టీడీపీ అధిష్టానం నిర్ఘాంతపోయినట్టు సమాచారం. ఈ విషయమై సంబంధిత విభాగపు అధికారి వివరణ కోరగా.. పైప్‌లైన్ పనులుతోపాటు రైల్వేస్టేషన్‌లో పైప్‌లైన్లను ఆధునికీకరించడంతోపాటు సంప్, ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాన్ని రూ.7 కోట్లతో చేపట్టేందుకు రాజమండ్రికి చెందిన కాంట్రాక్టర్ సుబ్బారాయుడు పనులు దక్కించుకుని సబ్ కాంట్రాక్ట్‌కు ఇచ్చినట్టు తెలిసిందన్నారు. మూడు నెలలు గడిచినా ఇంతవరకు పనులు ప్రారంభించలేదన్నారు. ఈ విషయమై ఆరా తీయగా కొన్ని సమస్యలు తలెత్తడం వల్ల పనులు ప్రారంభించలేకపోతున్నామని కాంట్రాక్టర్ చెప్పినట్టు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ వర్గీయుల దాడి

ముగ్గురికి గాయాలు.. పల్నాడు జిల్లా మంచికల్లులో ఉద్రిక్తత

మంచికల్లు (రెంటచింతల): పల్నాడు జిల్లా రెంటచింతల మండలంలోని మంచికల్లు గ్రామంలో సోమవారం టీడీపీ వర్గీయులు కర్రలతో దాడిచేసి ముగ్గురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్ని గాయపరిచారు. గాయపడిన పొట్లపాటి శ్రీనివాసరెడ్డి, వెన్నా శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల తరువాత టీడీపీ అరాచకాలతో విసిగిపోయి గ్రామానికి చెందిన 27 మంది వైఎస్సార్‌సీపీ వారు ఇతర గ్రామాల్లో తలదాచుకుంటున్నారు. గురజాల డీఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు ఎస్ఐ సీహెచ్ నాగార్జున ఈ నెల 11వ తేదీన ఈ 27 మందిని తహసీల్దార్ మేరి కనకం ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం వారిని గ్రామంలోకి పంపించారు. ఈ నేపథ్యంలో సోమవారం టీడీపీ వర్గీయులు మరోసారి రెచ్చిపోయారు. కర్రలతో వీరంగం చేశారు. గ్రామంలోకి వచ్చి ఇళ్లవద్ద ఉంటున్న వైఎస్సార్‌సీపీ వర్గీయులు పొట్లపాటి శ్రీనివాసరెడ్డి, వెన్నా శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డిపై దాడిచేసి కొట్టి గాయపరిచారు. దీంతో స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. దీంతో 11వ తేదీ గ్రామానికి తిరిగివచ్చిన వారు గ్రామం విడిచి వెళ్లిపోయారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. సోమవారం రాత్రి గ్రామానికి వచ్చి పరిస్థితిని సమీక్షించిన కారంపూడి సీఐ శ్రీనివాసరావు అవాంఛనీయ ఘటనలు జరగకుండా గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

పలుమార్లు దాడి : గత ఏడాది ఎన్నికలు జరిగి చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తరువాత తెలుగుదేశం వర్గీయులు పలుమార్లు వైఎస్సార్‌సీపీ వారిపై దాడిచేసి కొట్టారు. వైఎస్సార్‌సీపీకి చెందిన మేకపోతుల పేర్రెడ్డి, విజయమ్మ, పొట్లపాటి లక్ష్మమ్మ, నందా అరుణ్‌కుమార్‌లపై దాడిచేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ వర్గీయులు పలువురు గ్రామం విడిచి ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. పోలీసుల చొరవతో వైఎస్సార్‌సీపీ వర్గీయులు తిరిగి గ్రామంలో తమ ఇళ్లకు వచ్చారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం వర్గీయులు మళ్లీ దాడికి తెగబడ్డారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఫ్యాక్షన్ గ్రామంగా పేరుపొందిన మంచికల్లులో ప్రశాంత వాతావరణం నెలకొనడానికి పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా...

నాయీబ్రాహ్మణ వృత్తికి స్పా సెంటర్లు అన్యాయం

ఏపీ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూషిడిపల్లి రమణ

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): బ్యూటీ పార్లర్లు, స్పాల కారణంగా తమ వృత్తికి అన్యాయం జరుగుతోందని, ఆర్థికంగా నష్టం వాటిల్లుతోందని ఏపీ నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మూషిడిపల్లి రమణ తెలిపారు. మంగళవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హిందూ సంప్రదాయ, ఆచారాల్లో భాగమైన క్షౌరవృత్తిపై ఆధారపడి నాయీ బ్రాహ్మణులు తరతరాలుగా జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే స్పాలు, బ్యూటీ పార్లర్ల పేరుతో కొందరు తమకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన చెందారు. కొంతమంది స్పాసెంటర్ల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, దీనివల్ల నాయీ బ్రాహ్మణుల ప్రతిష్టకు భంగం వాటిల్లుతోందన్నారు. ప్రభుత్వం స్పందించి మెడికల్ షాపులకు బీఫార్మసీ సర్టిఫికెట్ మాదిరి సెలూన్ షాపులకు కూడా నాయీ బ్రాహ్మణ సర్టిఫికెట్ తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

తొండవాడలో స్క్రబ్‌టైఫస్ కేసు

చంద్రగిరి: తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలోని తొండవాడలో స్క్రబ్‌టైఫస్ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలిక కొంత కాలంగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతోంది. బాలిక కుటుంబ సభ్యులు ఆమెకు రక్తపరీక్షలను నిర్వహించగా స్క్రబ్‌టైఫస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో బాలికను మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. బాలిక ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు. డాక్టర్ కుసుమ ఆదేశాలతో చంద్రగిరి వైద్యాధికారులు గ్రామంలో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. బాలిక నివాస గృహ పరిసరాలతో పాటు గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ జల్లారు. గ్రామంలో నీటి నిల్వలు ఉన్న కాలువలు నీటితొట్టెలను తొలగించారు. స్థానికుల వివరాలను నమోదు చేసి, ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

అంబేడ్కర్ స్మృతి వనంలో మిగిలిన పనులు పూర్తి చేయించండి

జాతీయ ఎస్సీ కమిషన్‌కు దళిత సంఘాల విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనంలో మిగిలిన పనులను పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలంటూ జాతీయ ఎస్సీ కమిషన్‌ను దళిత సంఘాల నాయకులు కోరారు. మంగళవారం ఢిల్లీలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌ను ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, సమత సైనిక్ దళ్ నాయకులు కలిశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా ఈ స్మృతి వనాన్ని నిర్మించారని చెప్పారు. ఇది సామాజిక న్యాయం, కోట్లాది మంది దళితుల ఆశలకు ప్రతీక అని పేర్కొన్నారు. దీనిపై చంద్రబాబు ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ తీరు వల్ల సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో పనులు పూర్తయ్యేవరకు పర్యవేక్షించాలని, ఈ ప్రాజెక్టుపై పబ్లిక్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని కమిషన్‌ను కోరారు. ఈ సమావేశంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు, సమత సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

నార్కోటిక్ అధికారుల దాడులు

అల్ప్రాజోలం డ్రగ్ తయారీ పరికరాలు స్వాధీనం

డ్రగ్ తయారీ కేంద్రంపై దాడులు చేస్తున్న ఎన్‌డీపీసీ అధికారులు

నందికొట్కూరు: నంద్యాల జిల్లా నందికొట్కూరులోని ఓ ఇల్లు బాడుగకు తీసుకొని అల్ప్రాజోలం డ్రగ్ తయారీ చేస్తున్న కేంద్రంపై తెలంగాణ నేషనల్ డొమెస్టిక్ ప్రిపేర్డ్‌నెస్ కన్సార్టియం అధికారులు మంగళవారం దాడులు చేశారు. ముడిసరుకు తెచ్చి నందికొట్కూరులో యువకులు లిక్విడ్ తయారు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో ఎన్‌డీపీసీ అధికారులు దాడులు చేశారు. లిక్విడ్ తయారీ పరికరాలు, డ్రగ్‌ను ఎన్‌డీపీసీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. కర్నూలులోని ఓ ప్రైవేట్ కళాశాలలో నందికొట్కూరు పట్టణానికి చెందిన ఓ యువకుడు ఎంబీఏ చదువుతున్నాడు. తెలంగాణలోని గద్వాల జిల్లా కేంద్రంలో డ్రగ్‌ను విక్రయిస్తున్న సమయంలో ఎన్‌డీపీసీ అధికారులు దాడులు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా ముడి సరుకు తయారీ చేసే కేంద్రం నంద్యాల జిల్లా నందికొట్కూరులో ఉన్నట్లు గుర్తించారు. దీంతో అధికారులు వేకువజాము నుంచి తయారీ కేంద్రంలో యువకులను విచారించారు. గుంటూరుకు చెందిన ప్రధాన సూత్రధారి తప్పించుకున్నట్టు సమాచారం.

'అండగా ఉంటా.. సెంటర్‌లో పడేసి కొట్టండి'

- టీడీపీ కార్యకర్తల సమావేశంలో పెదకూరపాడు ఎమ్మెల్యే ప్రవీణ్ వివాదాస్పద వ్యాఖ్యలు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- ప్రజాప్రతినిధిగా ఉండి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయటంపై విస్తుపోతున్న ప్రజలు
- ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై గతంలోనూ దాడులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'టీడీపీని గాని, వ్యక్తులపై గాని తప్పుడు మాటలు మాట్లాడితే దేహశుద్ధి చేయండి. నేను మీకు అండగా ఉంటా. ఎవరైనా ఎక్కువ మాట్లాడితే సెంటర్‌లో పడేసి కొట్టండి' అంటూ టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన పెదకూరపాడు టీడీపీ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రసంగం వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇటీవల పల్నాడు జిల్లా అమరావతిలో గ్రామ టీడీపీ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పై వ్యాఖ్యలు చేయగా.. తాజాగా ఆయన ప్రసంగం వీడియో సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. 'నాపై ఊరికే గడ్డ కాల్చి ముఖాన వేస్తే ఊరుకునే ప్రసక్తి లేదు. ఇలా మాట్లాడిన వారికి కార్యకర్తలు దేహశుద్ధి చేయాలి. వారిని సెంటర్‌లో పడేసి కొట్టాలి' అని ఎమ్మెల్యే ప్రవీణ్ వివాదాస్పద వ్యాఖ్యలు

గ్రామ టీడీపీ అధ్యక్షుల ప్రమాణ స్వీకారంలో మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ (ఫైల్)

చేశారు. అంతేకాకుండా అలా చేసే వారికి అభయమిస్తూ 'నేను మీకు అండగా ఉంటా' అని ప్రకటించారు. ప్రజాప్రతినిధిగా ఉండి కార్యకర్తలను రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు చేయటం సరికాదని టీడీపీ సీనియర్ నాయకులు సైతం చర్చించుకుంటున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా భాష్యం ప్రవీణ్ ఎమ్మెల్యే అయినప్పటి నుంచి ప్రతిపక్ష పార్టీ నాయకులపై దాడులు పెరిగాయని అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా సొంత పార్టీ నాయకులను సైతం ప్రవీణ్ అనుచరులు ముసుగులు వేసుకుని మరీ దారికాసి దాడి చేసిన ఘటనలను నియోజకవర్గ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. ప్రశాంతంగా ఉండే పెదకూరపాడు నియోజకవర్గంలో ఇలాంటి దాడులకు పాల్పడుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సాక్షాత్తు ఎమ్మెల్యేనే పడేసి కొట్టండి, దేహశుద్ధి చేయండి అంటూ కార్యకర్తలను రెచ్చగొడితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

ఆపద్బాంధవుడి చెంత అపచారం!

భూదేవి కాంప్లెక్స్ వద్ద బహిరంగ ప్రదేశంలో పడవేసిన మద్యం బాటిల్, బిరియాని బాక్స్

తిరుపతిలోని అలిపిరి వద్ద ఉన్న భూదేవి కాంప్లెక్స్ టీటీడీ పాత చెక్ పాయింట్ పార్కింగ్ స్థలం నిత్యం గోవింద నామస్మరణలతో మారుమోగుతుంటుంది. ఇక్కడ బయట ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సౌకర్యార్థం పార్కింగ్‌ను టీటీడీ ఏర్పాటు చేసింది. అయితే ఈ ప్రాంతంలో ఎటు చూసినా ఇప్పుడు మద్యం బాటిళ్లే దర్శనమిస్తున్నాయి. టీటీడీకి సంబంధించిన పరిసర ప్రాంతాల్లో నిషేధ కార్యకలాపాలు ఇటీవల ఎక్కువగా జరుగుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ సూచిక బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ ఇదే తీరు కొనసాగుతుండటం గమనార్హం.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

స్థాయీ సంఘ నివేదికను వక్రీకరించడం తగదు

మాట్లాడుతున్న ఆలా వెంకటేశ్వర్లు, కేఎస్ లక్ష్మణరావు, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

గుంటూరు (మెడికల్): వైద్య విద్యపై ఇటీవల పార్లమెంట్ స్థాయీ సంఘం ఇచ్చిన నివేదికకు వక్ర భాష్యాలు పలుకుతూ ప్రజలను మభ్యపెట్టడం సబబు కాదని ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ పేర్కొంది. గుంటూరులోని జనచైతన్య వేదిక హాల్‌లో మంగళవారం ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ సమావేశమైంది. అనంతరం కమిటీ కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంట్ స్థాయీ సంఘ నివేదికలో పీపీపీ పద్ధతిలో కొత్త మెడికల్ కళాశాలలకు పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వాలని పేర్కొంటే ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు సంబంధించిన దాదాపు 600 ఎకరాల అత్యంత విలువైన భూములు, నిర్మాణాలు ప్రైవేటుకు కట్టబెట్టడం, రెండేళ్లపాటు ప్రైవేట్ యాజమాన్యం నియమించిన వైద్యులు, ఇతర సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వమే జీతభత్యాలు చెల్లిస్తామని ప్రకటించడం ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు పంచిపెట్టడమేనన్నారు. విద్యార్థులపై ఆర్థిక భారాన్ని తగ్గించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించగా.. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదన్నారు. పీపీపీలో అమలు కాబోతున్న వైద్య కళాశాలలపై యాజమాన్య హక్కు రాష్ట్ర ప్రభుత్వానికే ఉంటుందని చెబుతున్న సీఎం చంద్రబాబు ఆ కళాశాలల్లో సిబ్బంది నియామకాలు, రిజర్వేషన్ల అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ కో–కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయాన్ని గౌరవించి టీడీపీ ప్రభుత్వం వెంటనే పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. కో–కన్వీనర్, జనచైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. పీపీపీ విధానాన్ని వ్యతిరేకించే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులందరినీ కలుపుకుని ఐక్యంగా ఉద్యమించాలన్నారు. జనవరి 9న విజయవాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా, డిసెంబర్ 22న ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాలని సూచించారు సమావేశంలో జనచైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

ఎట్టకేలకు మోక్షం

- 18 నెలల తర్వాత పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రికి నిధులు
- ఆధునిక వసతులకు రూ.48 కోట్లు మంజూరు
- టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్ణయాలు

మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల: వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాలయ ఆస్పత్రి ఆధునికీకరణకు ఎట్టకేలకు టీటీడీ కదిలింది. ఈ ఆస్పత్రిలో గత ఏడాది ఎన్నికలనాటికే 75 శాతం పనులు పూర్తయి, వినియోగానికి సిద్ధమైంది. గత ఏడాది చంద్రబాబు ప్రభుత్వం రావడంతో మిగిలిన వసతుల కల్పన పనులు నిలిపివేశారు. ఇది పూర్తయితే వైఎస్ జగన్‌కు పేరు వస్తుందన్న అక్కసుతో పనులకు అడ్డుకట్ట వేశారు. అయితే ప్రజల నుంచి తీవ్రమైన విమర్శలు రావడంతో ఎట్టకేలకు ఈ ఆస్పత్రిలో ఆధునిక సౌకర్యాల కల్పనకు పాలక మండలి రూ.48 కోట్లు మంజూరు చేసింది. మంగళవారం తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, పలువురు బోర్డు సభ్యులు, జెఈవో వి. వీరబ్రహ్మం పాల్గొన్నారు. చిత్తూరు జిల్లా పలమనేరులో టీటీడీ గోశాల నిర్మాణానికి కేటాయించిన 400 ఎకరాల భూమిలో 100 ఎకరాలను ఆలయాలకు ధ్వజస్తంభం, రథాలు తయారు చేసేందుకు అవసరమైన దివ్య వృక్షాలు పెంచేందుకు వినియోగించాలని ఈ సమావేశంలో టీటీడీ నిర్ణయం తీసుకుంది. దీంతో అంచెలంచెలుగా గోశాలకు మంగళం పాడినట్లేనని భావిస్తున్నారు.

అర్చకులు, పోటు వర్కర్ల వేతనాల పెంపు

టీటీడీ అనుబంధ ఆలయాల్లో పనిచేస్తున్న 62 మంది అర్చక, పరిచారక, పోటు వర్కర్లు, ప్రసాదం డిస్ట్రిబ్యూటర్లకు వేతనాలు పెంచాలని నిర్ణయం. ఆమేరకు.. అర్చకులకు రూ.25,000 నుంచి రూ.45,000కు, పరిచారకులకు రూ.23,140 నుంచి రూ.30,000కు, పోటు వర్కర్లకు రూ.24,279 నుంచి రూ.30,000కు ప్రసాదం డిస్ట్రిబ్యూటర్లకు రూ.23,640 నుంచి రూ.30,000 కు పెంపు

మరికొన్ని ముఖ్య నిర్ణయాలు..

- టీటీడీలోని 31 విద్యా సంస్థల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు, సీసీ కెమెరాలు, కంప్యూటర్లు, అందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్లు, సిబ్బంది తదితర సౌకర్యాల కల్పనకు ఆమోదం.
- ముంబైలోని బాంద్రాలో రూ.14.40 కోట్లతో శ్రీవారి ఆలయం నిర్మాణానికి ఆమోదం
- దాతల కాటేజీల నిర్వహణ, నిర్మాణాలపై నూతన విధానం తేవాలని నిర్ణయం

దొంగ కార్ల గుట్టు వీడేనా!

నకిలీ నంబర్‌తో కారు వాడిన ఏఎస్ఐ కుమారుడు

చిలకలూరిపేట పోలీసు క్వార్టర్స్‌లో కారు

సాక్షి, నరసరావుపేట : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు మరణించిన కేసు విచారణలో విస్తుగొలిపే విషయాలు వెలుగుచూస్తున్నాయి. నకిలీ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ అవతారం ఎత్తి అక్రమంగా డబ్బులు వసూలు చేసేందుకు ఏఎస్ఐ కుమారుడి ముఠా చిలకలూరిపేట హైవేపై కంటైనర్ నిలపడంతో రోడ్డు ప్రమాదం సంభవించి ఈ నెల 4న ఐదుగురు విద్యార్థులు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. దీంతో ఉలిక్కిపడ్డ పోలీసు అధికారులు ఘటనకు కారణమైన ఏఎస్ఐ కుమారుడు వెంకట్‌నాయుడుతో పాటు మరో నలుగుర్ని ఇటీవల అరెస్ట్ చేశారు. ఐదుగురు నిందితులూ ఉపయోగించిన కారుపై ఆరా తీయగా దొంగకార్ల వ్యవహారం వెలుగుచూసింది. దీంతో కేసును ఛేదించేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు.

ఫైనాన్స్ కారు.. దొంగ నంబర్

అక్రమానికి వినియోగించిన కారుకు విజయవాడలోని ఓ ప్రైవేట్ వెహికల్ ఫైనాన్స్ సంస్థ నుంచి రుణం పొందారు. సుమారు 15 నెలల నుంచి కిస్తీలు కట్టడం లేదు. దీంతో కారును ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లు జప్తు చేస్తారన్న భయంతో హైదరాబాద్‌లో ప్రమాదానికి గురైన కారు నంబర్ వేసి తిరుగుతున్నారు. ఈ కారుతో పాటు పదుల సంఖ్యలో తనకు నకరికల్లుకు చెందిన భాను అనే యువకుడు ఇచ్చినట్టు ప్రధాన నిందితుడు వెంకట్‌నాయుడు విచారణలో చెప్పినట్టు సమాచారం. భాను ద్వారా తీసుకున్న కార్లలో కొన్నింటిని తన తండ్రి పనిచేస్తున్న పోలీసు శాఖలోని అధికారులకు తక్కువ ధరకే విక్రయించినట్టు తెలుస్తోంది. నకిలీ కార్ల వ్యవహారంలో కుమారుడికి సహకరించాడని తండ్రి ఏఎస్ఐ శ్రీనివాసరావుపై బదిలీ వేటు వేయగా, నిందితులతో సత్సంబంధాలున్నాయన్న ఆరోపణలతో చిలకలూరిపేట ఎస్ఐ రహంతుల్లాను ఇప్పటికే సస్పెండ్ చేశారు. ఇంకా నకిలీ కార్లు వినియోగించిన, కొనుగోలు చేసిన పోలీసు అధికారుల పాత్రపై గోప్యంగా విచారణ జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఘటన జరిగిన రోజు నుంచి భాను అజ్ఞాతంలోకి వెళ్లాడు. అతడు విశాఖలో తలదాచుకున్నాడని తెలుసుకున్న చిలకలూరిపేట పోలీసులు సోమవారం రాత్రి అక్కడకు వెళ్లగా.. భాను గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు సమాచారం. అతను కోలుకుంటే నకిలీ కార్ల వ్యవహారం ఓ కొలిక్కి వచ్చే అవకాశముంది.

మోటారు సైకిల్‌లో దూరిన పాము

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలో మోటారుసైకిల్‌లో పాము దూరి వాహనదారులను భయభ్రాంతులకు గురిచేసింది. మంగళవారం పార్క్ చేసిన మోటారు సైకిల్‌లోని చైన్ స్ప్రాకెట్‌లోకి జెర్రిపోతు పాము దూరింది. దీనిని గమనించిన వాహనదారుడు చుట్టుపక్కల వారికి చెప్పడంతో కర్రతో బయటకు తీసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆ పాము పక్కనే ఉన్న యాక్టివా బైక్ సీటు కిందకు వెళ్లింది. దీంతో నెమ్మదిగా బైక్ పార్టులను ఊడదీయడంతో పాము బయటపడింది. స్థానికులు ఆ పామును కర్రలతో కొట్టి చంపారు.

జాబ్ కార్డు ఈకేవైసీకి రూ.1500

- టన్ను ఇసుకకు రూ.300 చొప్పున వసూలు
- ఎరిక్షన్‌బాబు అండతోనే అక్రమాలు, అవినీతి
- యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జిపై సొంత పార్టీ నేతల ధ్వజం

మాట్లాడుతున్న మన్నె రవీంద్ర, టీడీపీ నాయకులు

యర్రగొండపాలెం : ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబుపై సొంత పార్టీ వర్గీయులే మరోసారి ధ్వజమెత్తారు. ఆయన చేసిన, చేస్తున్న అవినీతి బాగోతాన్ని ఎండగట్టారు. పెద్దదోర్నాల మండల టీడీపీ కార్యకర్తలు, టెక్నాలజీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, జెడ్పీ ఉపాధ్యక్షుడు మన్నె రవీంద్రతో కలిసి మంగళవారం స్థానిక ఓ ఆస్పత్రిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే అభివృద్ధి జరుగుతుందని ఎన్నికల్లో పని చేశామని... తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఆగడాలతో తామంతా ప్రజల ముందుకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పర్సంటేజీలు ఇచ్చిన వారికే పనులు అప్పగిస్తున్నారని ఆరోపించారు. యర్రగొండపాలెం నియోజకవర్గానికి చెందిన టీడీపీ వర్గీయులకు కాకుండా ఎరిక్షన్‌బాబు సొంత నియోజకవర్గమైన కనిగిరి నుంచి మనుషులను రప్పించి వారితో పనులు చేయిస్తున్నారన్నారు. అధికారం అండతో ఇసుక, బియ్యం, మద్యం, మట్టి రవాణా చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. కంభం ప్రాంతానికి చెందిన బచ్చల శ్రీను అనే వ్యక్తిని రప్పించి టన్ను ఇసుకకు రూ.300 చొప్పున వసూలు చేయిస్తున్నారని, జాబ్ కార్డు ఈకేవైసీకి రూ.1500 వసూలు చేస్తున్నారని, ఇదంతా ఎరిక్షన్‌బాబుకు తెలిసే జరుగుతోందని ఆరోపించారు.

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో లైంగిక వేధింపుల కలకలం

మెయిల్ ద్వారా ఉన్నతాధికారులకు విద్యార్థినుల ఫిర్యాదు

ఎచ్చెర్ల : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం శ్రీకాకుళం ప్రాంగణం పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో కొంత మంది అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తమను వేధిస్తున్నారని ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థినులు ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్, డైరెక్టర్లకు ఈ – మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. తమతో అనుచితంగా ప్రవర్తిస్తున్నారని, పరీక్షల నిర్వహణ విభాగంలోని బోధనేతర సిబ్బంది పాస్ చేయిస్తామంటూ డబ్బులు వసూలు చేస్తున్నారని, లైంగికంగా వేధిస్తున్నారని మెయిల్‌లో ఆరోపించారు. స్కాలర్‌షిప్‌ల కోసం వేలి ముద్రలు వేసే సమయంలో కొందరు బోధనేతర సిబ్బంది అసభ్యకరంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినులు ఈ నెల 11న ఫిర్యాదు చేయడంతో అప్పటి నుంచి క్యాంపస్‌లో దీనిపైనే చర్చ జరుగుతోంది. అయితే ఇది అనాధారిత మెయిల్ అని అధికారులు చెబుతున్నప్పటికీ... తమ పేరు బయటకు రాకుండా ఉన్నతాధికారులకు సమస్యలు నివేదించడానికి విద్యార్థినులు ఇలా చేసి ఉండొచ్చని కొందరంటున్నారు. మెయిల్ ఎవరు చేశారనే కోణంలో కాకుండా ఫిర్యాదులోని వాస్తవాలపై విచారణ నిర్వహించాలని కోరుతున్నారు. మరోవైపు బోధనా సిబ్బందిలో చాలా మంది పాఠాలు చెప్పకుండా యూట్యూబ్, చాట్ జీపీటీలో చూసుకోమని సూచిస్తున్నారని విద్యార్థి సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు నేపథ్యంలో విద్యార్థినుల భద్రత కోసం చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేజీవీడీ బాలాజీ తెలిపారు.

స్టేషన్‌కు రా.. కేసు రాజీ చేసుకో..!

మహిళా న్యాయవాదికి పోలీసు అధికారి బెదిరింపు

చిత్తూరు అర్బన్: 'ఏం నీకు ఎన్నిసార్లు చెప్పాలి? మాకేం వేరే పనిలేదా? ముందు స్టేషన్‌కి రా.. వచ్చి కేసును రాజీచేసుకో..' అంటూ ఓ పోలీసు అధికారి మహిళా న్యాయవాదికి ఫోన్‌చేసి బెదిరించారు. జిల్లా కేంద్రం చిత్తూరులో జరిగిన ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. నగరానికి చెందిన ఓ మహిళా న్యాయవాది ఒకరిపై గతంలో ఫిర్యాదు చేయగా స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆమెపైన కూడా కౌంటర్ కేసు ఉంది. దీనిపై చట్టప్రకారం ముందుకెళ్లాలని నిర్ణయించుకున్న మహిళా న్యాయవాది కేసును కోర్టులోనే తేల్చుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు చెప్పారు. కానీ రాజకీయ నేతల నుంచి ఆ పోలీసు అధికారికి ఫోన్ వచ్చింది. కేసు రాజీచేయించాలని ఆదేశించారు. దీంతో రెచ్చిపోయిన ఆ అధికారి.. మహిళా న్యాయవాదికి ఫోన్‌చేసి దురుసుగా మాట్లాడారు. దీంతో ఫోన్‌కాల్ కట్‌చేసిన ఆమె ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కేటాయించండి

కేసన శంకరరావు విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: ఓబీసీలకు జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లు కేటాయించాలని కేంద్రాన్ని బీసీ సంక్షేమ సంఘం ఏపీ అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంగళవారం పార్లమెంట్ ఆవరణలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రిజర్వేషన్ల కేటాయింపు కోసం రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. ఆ రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలన్నారు.

HINDUPUR MUNICIPALITY

Roc.No. 2015/2025-26/E1, Dt: 16-12-2025

Expression of Interest (EOI)

The under signed is invited Expression of Interest (EOI) from the experienced and interested consultants for estimates designs and plans for **"Development of Infrastructure facilities in Hindupur Town under SDF".** For preparation of DPR with the present SSR rates duly considering the extended areas.

Last date for submission sealed quotation : **24-12-2025 by 5-00 PM**

The Commissioner, Hindupur Municipality reserves all rights to cancel, reject or postpone of fix up any special conditions for the above work without assigning any reasons thereof.

For more details please contact Cell No. 9490724606

Sd/- Commissioner, Hindupur Municipality

ఐదేళ్లలో 5 బిలియన్ డాలర్లు

భారత్-జోర్డాన్ ద్వైపాక్షిక వాణిజ్యం రెండు రెట్లు పెరగాలి

- భారత్‌లో ఆర్థిక వృద్ధికి అద్భుతమైన అవకాశాలున్నాయి
- పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకురావాలి
- బిజినెస్ ఫోరమ్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

అమ్మాన్: భారత్-జోర్డాన్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం రెండు రెట్లు వృద్ధి చెందాలని, రాబోయే ఐదేళ్లలో 5 బిలియన్ డాలర్లకు చేరుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. భారత్‌లో ఆర్థిక అభివృద్ధికి అత్యధిక అవకాశాలు ఉన్నాయని, భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని జోర్డాన్ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం జోర్డాన్ చేరుకున్న ప్రధాని మోదీ మంగళవారం రాజధాని అమ్మాన్‌లో జోర్డాన్ రాజు అబ్దుల్లా-2, యువరాజు అల్ హుస్సేన్‌తో కలిసి బిజినెస్ ఫోరమ్ సదస్సులో పాల్గొన్నారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా పరుగులు తీస్తోందని చెప్పారు. త్వరలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. దేశంలో వ్యాపార అభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. 140 కోట్ల మందితో కూడిన వినియోగ మార్కెట్, బలమైన తయారీ కేంద్రాలు, స్థిరమైన, పారదర్శక ప్రభుత్వ విధానాలు భారత్ సొంతమని వెల్లడించారు. ఈ అవకాశాలు అందిపుచ్చుకోవాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. భారత్-జోర్డాన్ మధ్య చరిత్రాత్మక సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ఈ బంధం మరింత బలపడనుందని ఉద్ఘాటించారు. ఇరుదేశాల ఆర్థిక సంబంధాలు బలోపేతం కావాలని చెప్పారు.

పరస్పరం సహకరించుకుంటూ ముందుకెళ్లాలి

''భారత ఆర్థిక వ్యవస్థ 8 శాతానికిపైగానే వృద్ధి సాధిస్తోంది. ఉత్పత్తికి ప్రోత్సాహం ఇచ్చే పాలన, నవీన ఆవిష్కరణలకు ఊతం ఇచ్చే విధానాల వల్ల జీడీపీ అత్యధికంగా నమోదవుతోంది. జోర్డాన్‌కు మూడో అతిపెద్ద వ్యాపార భాగస్వామి భారత్. నేటి వ్యాపార ప్రపంచంలో అంకెలే కీలకం. కానీ, నేను అంకెలు వల్లెవేయడానికి ఇక్కడికి రాలేదు. గణాంకాలకు అతీతంగా జోర్డాన్‌తో దీర్ఘకాలిక, విశ్వసనీయ సంబంధాలు నిర్మించుకోవడానికి వచ్చా. ఇరుదేశాల నాగరికతల మధ్య చక్కటి సంబంధాలున్నాయి. రాబోయే ఐదేళ్లలో ద్వైపాక్షిక

'ఇండియా-జోర్డాన్ బిజినెస్ ఫోరం' సదస్సులో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

వాణిజ్యాన్ని 5 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేద్దాం. ఇండియాలో డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, ఐటీ, ఫిన్‌టెక్, హెల్త్‌టెక్, అగ్రిటెక్ రంగాలతోపాటు విభిన్న స్టార్టప్‌లలో పెట్టుబడులకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఫార్మా, వైద్య పరికరాల తయారీ రంగాలు ఇండియాకు ప్రధాన బలం. భౌగోళికంగా కీలక స్థానంలో జోర్డాన్‌కు సహకరించడానికి సిద్ధంగా ఉన్నాం. ఫార్మా, వైద్య పరికరాల విషయంలో పశ్చిమ ఆసియా, ఆఫ్రికా దేశాలకు జోర్డాన్ ఒక హబ్‌గా మారాలి. అలాగే వ్యవసాయం, కోల్డ్ చైన్, ఫుడ్ పార్కులు, ఎరువులు, మౌలిక సదుపాయాలు, ఆటోమొబైల్, హరిత రవాణా, సాంస్కృతిక పర్యాటకం వంటి రంగాల్లో ఇరుదేశాలు పరస్పరం సహకరించుకుంటూ ముందుకెళ్లాలి. పునరుత్పాదక ఇంధన వనరులు, నిర్లవణీకరణ, నీటి శుద్ధి, పునర్వినియోగం వంటి అంశాల్లో రెండు దేశాల్లో పారిశ్రామిక వర్గాలు భాగస్వామ్యం ఏర్పర్చుకోవాలి'' అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. జోర్డాన్ రాజు అబ్దుల్లా-2తో మాట్లాడుతూ.. తమ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, భారత ఆర్థిక వృద్ధి ఒక్కటైతే ఇక తిరుగుండదని అన్నారు. దక్షిణాసియా, పశ్చిమాసియా మధ్య ఎకనామిక్ కారిడార్‌ను సృష్టించాల్సిన అవసరం ఉందని చెప్పారు.

అబ్దుల్లా-2తో మోదీ భేటీ

ప్రధాని మోదీ జోర్డాన్ రాజు అబ్దుల్లా-2తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భారత్, జోర్డాన్ ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. పునరుత్పాదక ఇంధన వనరులు, నీటి నిర్వహణ, డిజిటల్ మార్పు, సాంస్కృతిక సంబంధాలు సహా కీలక రంగాల్లో సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై చర్చలు జరిపారు. రెండు దేశాల పౌరుల అభివృద్ధి, సౌభాగ్యానికి నూతన ద్వారాలు తెరుచుకుంటాయని మోదీ ఉద్ఘాటించారు. జోర్డాన్ పర్యటన ఫలవంతంగా సాగిందని పేర్కొన్నారు. జోర్డాన్ రాజుకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అబ్దుల్లా-2, మోదీ ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఇరుదేశాల సంబంధాల్లో పురోగతి పట్ల హర్షం వ్యక్తంచేశారు. నరేంద్ర మోదీ మంగళవారం జోర్డాన్ పర్యటన ముగించుకొని ఇథియోపియాకు చేరుకున్నారు.

కారు నడుపుతూ మోదీని తీసుకెళ్లిన యువరాజు

ప్రధాని మోదీ పట్ల జోర్డాన్ యువరాజు అల్ హుస్సేన్ బిన్ అబ్దుల్లా-2 ప్రత్యేకంగా గౌరవాభిమానాలు ప్రదర్శించారు. మంగళవారం తానే స్వయంగా కారు నడుపుతూ మోదీని జోర్డాన్ మ్యూజియానికి తీసుకెళ్లారు. భారత్-జోర్డాన్ మధ్యనున్న స్నేహ సంబంధాలను మరోసారి చాటిచెప్పారు. మహ్మద్ ప్రవక్త వంశంలో 42వ తరానికి చెందిన వారసుడు అల్ హుస్సేన్ బిన్ అబ్దుల్లా-2. మ్యూజియంలో జోర్డాన్ చరిత్ర, సంస్కృతిని తనకు కళ్లకు కట్టేలా వివరించినందుకు యువరాజుకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అల్ హుస్సేన్‌తో ఎన్నో అంశాలపై చర్చించానని, జోర్డాన్ ప్రగతి పట్ల ఆయన తపన ఎంతగానో ఆకట్టుకుందని వెల్లడించారు. జోర్డాన్ మ్యూజియాన్ని 2014లో నిర్మించారు. ఇందులో ఎన్నో విలువైన కళాఖండాలు, వస్తువులు ఉన్నాయి.

ప్రాణాలు తీసిన పొగమంచు

13 మంది దుర్మరణం

43 మందికి గాయాలు

రహదారిపై ఒకదాని వెంట మరొకటి ఢీకొన్న పలు వాహనాలు

- మంటలు చెలరేగి దగ్ధమైన పలు వాహనాలు
- కాలిపోయిన వాహనాల శిథిలాల కుప్పగా మారిన యమునా ఎక్స్‌ప్రెస్‌వే రహదారి
- ఉత్తరప్రదేశ్‌లోని మథుర జిల్లాలో దారుణ రోడ్డు ప్రమాదం

మథుర: చిమ్మచీకట్లో శీతాకాలపు పొగమంచు ఉత్తరాదిన పలువురికి యమపాశంగా మారింది. యమునా ఎక్స్‌ప్రెస్‌వే రహదారిపై దట్టంగా అలుముకున్న పొగమంచు 13 మంది ప్రయాణికుల ప్రాణాలను అనంతలోకాల్లో కలిపేసింది. మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో ముందుఏముందో కనపడనంతగా విపరీతంగా ఉన్న పొగమంచు కారణంగా ఆగ్రా-నోయిడా పరిధిలో రహదారిపై ఎనిమిది బస్సులు, మూడు చిన్న వాహనాలు ఒకదానికి వెంట మరొకటి ఢీకొని ధ్వంసమయ్యాయి. వీటిల్లో చిక్కుకుపోయి రక్తమోడుతూ 13 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. 43 మంది క్షతగాత్రులను హుటాహుటిన ఆగ్రాలోని ఎస్ఎన్ వైద్య బోధనాస్పత్రి, బృందావన్, ఢిల్లీ ఆస్పత్రుల్లో చేర్పించామని మథుర సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శ్లోక్ కుమార్ చెప్పారు. అయితే 60 మందికిపైగా గాయపడినట్లు జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి. స్వల్ప గాయాలైన ప్రయాణికులను యూపీ ప్రభుత్వ వాహనాల్లో తమతమ గమ్యస్థానాలకు చేర్చారు. ఉత్తరప్రదేశ్‌లోని బల్‌దేవ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రహదారిపై 127 నంబర్ మైలురాయి వద్ద ఈ ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.

వరుసబెట్టి ఢీ.. వెనువెంటనే చెలరేగిన మంటలు

క్షతగాత్రులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం పూట తొలుత ఒక బస్సును మరో వాహనం మాత్రమే ఒకదానివెనుక మరొకటి ఢీకొన్నాయి. వాటిలోని ప్రయాణికులు గాయపడ్డారు. వాళ్లు ప్రమాదం షాక్ నుంచి తేరుకుని కిందకు దిగి తర్వాత అటుగా వచ్చే వాహనాలను అప్రమత్తం చేసేలోపే వెనకనుంచి మరికొన్ని వాహనాలు అతివేగంతో ఢీకొట్టాయి. ''కొన్ని వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ పక్కకు పోనిద్దామని చూసినా అప్పటికే గాయపడిన ఇతరవాహన ప్రయాణికులు రోడ్డుకు అడ్డంగా నిలబడటంతో మరోదారిలేక వీటినే గుద్దేశారు. ఘటనాస్థలికి నేను వెళ్లిచూసేసరికి అక్కడ దృగ్గోచరత(విజిబిలిటీ) కేవలం మీటర్ మాత్రమే. అంతకుమించి దూరంలో ఏముందో కనిపించనంతా పొగమంచు అలుముకుంది''అని ఎస్పీ శ్లోక్ కుమార్ వెల్లడించారు. ఇలా మొత్తం ఎనిమిది బస్సులు, కార్లు, వాహనాలు ఢీకొని తుక్కుతుక్కయ్యాయి. దీంతో ఇంధన ట్యాంక్‌లు బద్దలై మంటలు చెలరేగాయి. నుజ్జునుజ్జయిన వాహనాల్లో కొందరు, అగ్నికీలల కారణంగా తీవ్రంగా కాలిన గాయాలతో మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. వరుసబెట్టి బస్సులు, కార్లు తగలబడుతున్న వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కాలిపోయిన వాహనాలు కుప్పగా రహదారిపై అడ్డుగా ఉండటంతో భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. విషయం తెల్సుకున్న అగ్నిమాపక సిబ్బంది, మథుర జిల్లా పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వాహనాలను క్రేన్లతో పక్కకు తీసుకొచ్చారు. మంటల్ని ఆర్పేందుకు ప్రయత్నించారు.

సంఘటనా స్థలంలో కాలిపోయిన వాహనాలు

అంతటా భీతావహస్థితి..

చిమ్మచీకటి, చలిలో వాహనాల్లో తమతమ సీట్లలో మఫ్లర్లు ధరించి, బెడ్‌షీట్లు కప్పుకుని ముసుగుతన్ని నిద్రపోతున్న పలువురు అగ్నికీలల్లో కాలి బూడిదయ్యారు. కొందరు శరీరాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయి మాంసపుముద్దలుగా మారిపోయారు. వాహనాల నుంచి ఎగసిపడుతున్న అగ్నికీలలు, దట్టమైన పొగ, బంధువుల రోదనలతో ఆ ప్రాంతమంతా భీతావహకంగా మారింది. వేగంగా వాహనాలు ఢీకొన్న శబ్దం సుదూరంలోని తమకూ వినిపించిందని సమీప గ్రామాల ప్రజలు చెప్పారు. మృతదేహాల నుంచి డీఎన్ఏ శాంపిళ్లను సేకరించి కుటుంబసభ్యులు, బంధువుల డీఎన్ఏతో పోల్చి చూశాక పార్థివదేహాలను పోలీసులు అప్పగించనున్నారు. ఇప్పటికే 17 మృతదేహాలను పోస్ట్‌మార్టమ్ కోసం తరలించారు. డీఎన్ఏ ప్రక్రియ కోసం రెండు వైద్య బృందాలను నియమించామని చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధా వల్లభ్ చెప్పారు. కొందరు మృతుల జాడ గుర్తించారు. వాళ్ల అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మథుర జిల్లా మేజిస్ట్రేట్ చంద్ర ప్రకాశ్ సింగ్ చెప్పారు. దుర్ఘటనపై అదనపు జిల్లా మేజిస్ట్రేట్ సారథ్యంలో నలుగురు సభ్యులతో మేజిస్ట్రియల్ విచారణకు ఆదేశించారు. రెండ్రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఘటనపై ఒక అనామక డ్రైవర్‌పై తొలుత ఒక కేసు నమోదుచేసి నేరదర్యాప్తు ఆరంభించారు.

పిల్లలను బయటకు విసిరేసి..

బలంగా ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన వాహనాలకు హఠాత్తుగా మంటలంటుకోవడంతో అందులోని ప్రయాణికులు తమ చిన్నారులను కాపాడేందుకు శతథా ప్రయత్నించారు. పార్వతి అనే 42 ఏళ్ల మహిళ తన ఇద్దరు చిన్నారులు ప్రాచీ, సన్నీలను వెంటనే బస్సు నుంచి బయటకు విసిరేశారు. కానీ బద్దలైన బస్సు కిటికీ అద్దాలు ఆమె మెడకు గుచ్చుకోవడంతో రక్తమోడుతూ లోపలికి పడిపోయారు. ''పిల్లల్ని విసిరేశాక ఆమెను నేను చూడలేదు. ఆమెకు ఏమైందో ఎక్కడుందో అర్థంకావట్లేదు''అని ఆమె సమీప బంధువు గుల్జారీ ఏడుస్తూ చెప్పారు. ''క్షతగాత్రులను చేర్పించిన ఆస్పత్రుల చుట్టూ ఆమె జాడ కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా. ఆమె ఎక్కడా కన్పించట్లేదు''అని గుల్జారీ రోదిస్తూ చెప్పారు.

దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన ప్రధాని

ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు తలో రూ.2 లక్షలను ప్రధానమంత్రి అత్యవసర నిధి నుంచి కేటాయించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సైతం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ''ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచారకరం. మృతులు, గాయపడిన వారి కుటుంబాలకు అండగా ఉంటాం''అని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రధాని మోదీ మృతుల కుటుంబాలకు తలో రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు తలో రూ.50,000 ఆర్థికసాయం ప్రకటించారు.

లూథ్రా సోదరుల అప్పగింత.. అరెస్ట్

న్యూఢిల్లీ: గోవా అగ్నిప్రమాదంలో 25 మంది మరణించిన కేసులో, 'బిర్చ్ బై రోమియో లేన్' నైట్‌క్లబ్ సహ యజమానులైన గౌరవ్, సౌరభ్ లూథ్రా సోదరులను థాయ్‌లాండ్ అప్పగించిన అనంతరం మంగళవారం అరెస్టు చేశారు. ప్రమాదం జరిగిన గంటల వ్యవధిలో ఈ సోదరులిద్దరూ థాయ్‌లాండ్‌లోని పుకెట్‌కు పారిపోవడం తెలిసిందే. దీంతో అధికారులు ఇంటర్‌పోల్ బ్లూ కార్నర్ నోటీసు జారీ చేసి, వారి పాస్‌పోర్ట్‌లను రద్దు చేశారు. డిసెంబర్ 11న, భారత ప్రభుత్వం అభ్యర్థన మేరకు థాయ్ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న న్యాయ ఒప్పందాల కింద లూథ్రా సోదరులను బ్యాంకాక్ నుండి ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి తరలించి, అధికారులకు అప్పగించారు. 44 ఏళ్ల గౌరవ్, 40 ఏళ్ల సౌరభ్‌లను పటియాలా హౌస్ కోర్టులో జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ట్వింకిల్ చావ్లా ముందు హాజరుపరచగా, గోవా పోలీసుల అభ్యర్థన మేరకు రెండు రోజుల ట్రాన్సిట్ రిమాండ్ మంజూరైంది. నిందితులను బుధవారం ఉదయానికల్లా విమానంలో గోవాకు తీసుకురానున్నట్లు గోవా పోలీసు శాఖ ప్రతినిధి తెలిపారు.

రాష్ట్రానికో ఎన్ఐఏ కోర్టు

సుప్రీంకోర్టులో కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ: ఉగ్రవాద, సంబంధిత కేసుల్లో విచారణ వేగవంతమయ్యేలా చూసేందుకు ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలోనూ ఒక జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కోర్టు ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 10కి మించిన ఉగ్రవాద కేసులున్న రాష్ట్రాల్లో ఒకటికి మించి కోర్టులు ఏర్పాటు చేస్తామంది. కేంద్ర ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి మంగళవారం సుప్రీంకోర్టుకు ఈ మేరకు నివేదించారు. వ్యవస్థీకృత నేరాల సత్వర విచారణ నిమిత్తం ఢిల్లీలో 16 ప్రత్యేక కోర్టులు నెలకొల్పుతామని ఆ రాష్ట్ర సొలిసిటర్ జనరల్ కూడా వెల్లడించారు. వ్యవస్థీకృత నేరాల కట్టడికి, విచారణకు న్యాయ పరిధి అడ్డంకిగా మారకుండా చూడాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తి జస్టిస్ జోయ్ మాలా బాగ్చీ ధర్మాసనం ఈ సందర్భంగా ఢిల్లీ ప్రభుత్వానికి సూచించింది. ఇందుకోసం ఎంకోకా తరహాలో ఢిల్లీ మొత్తానికీ వర్తించేలా ఒక సమగ్ర చట్టం తేవాలని అభిప్రాయపడింది. గ్యాంగ్ స్టర్ మహేశ్ ఖత్రీ, మహారాష్ట్రకు చెందిన నక్సల్స్ సానుభూతిపరుడు కైలాష్ రామ్ చాందినీ బెయిల్ పిటిషన్ల విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ మేరకు పేర్కొంది. 'ఖత్రీపై ఢిల్లీలోనే పలు ప్రాంతాల్లో చాలా కేసులు నమోదయ్యాయి. అవన్నీ పలు కోర్టుల పరిధిలో ఉన్నాయి. దాంతో వాటి విచారణ ఆలస్యమవుతుంది. దీన్ని సాకు చూపుతూ అతను బెయిల్ కోసం ఏకంగా మమ్మల్నే ఆశ్రయించాడు! మొత్తం నగరమంతా ఒకే న్యాయ పరిధిలోకి వచ్చేలా చూస్తే ఈ చిక్కులు ఉండవు' అని చెప్పింది.

'రోజ్‌గార్' బిల్లుపై గరం గరం

- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కొత్త చట్టం
- లోక్‌సభలో 'వీబీ-జీ రామ్ జీ' బిల్లును ప్రవేశపెట్టిన కేంద్రం
- తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్ష సభ్యులు
- లోక్‌సభ లోపల, బయట ఆందోళనలు
- బిల్లును పార్లమెంటరీ కమిటీకి పంపించాలని డిమాండ్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 20 ఏళ్లుగా అమలవుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో.. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ప్రతిఏటా 125 పనిదినాలకు హామీ ఇస్తూ మరో చట్టాన్ని తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళవారం లోక్‌సభలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, అజీవికా మిషన్-గ్రామీణ(వీబీ-జీ రామ్ జీ) బిల్లు-2025ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాయి. చట్టం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడం పట్ల మండిపడ్డాయి. బిల్లును క్షుణ్నంగా పరిశీలించాలని, అందుకోసం పార్లమెంటరీ కమిటీకి పంపించాలని డిమాండ్ చేశాయి. చరిత్రాత్మకమైన ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చడానికి మోదీ సర్కార్ కుట్రలు చేస్తోందని ఆరోపించాయి. విపక్షాల అభ్యంతరాలను శివరాజ్‌సింగ్ చౌహాన్ కొట్టిపారేశారు. తమ ప్రభుత్వం గాంధీజీ ఆశయాలు, ఆదర్శాలను విశ్వసించడమే కాకుండా త్రికరణ శుద్ధిగా అమలు చేస్తోందని వివరించారు.

పార్లమెంట్ ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఖిలేష్ యాదవ్, డీఎంకే ఎంపీ టీ.ఆర్.బాలు తదితరులు

ఉపాధి హక్కుపై దెబ్బ: ప్రియాంక

మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ముసాయిదా బిల్లు రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా విమర్శించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిరుపేదలకు ఏడాదికి 100 రోజులపాటు పని దొరుకుతోందని అన్నారు. మోదీ ప్రభుత్వం పేదల ఉపాధి హక్కును దెబ్బతీస్తోందని ధ్వజమెత్తారు. ఉపాధి హామీ చట్టం అమలుకు కేంద్రం 90 శాతం నిధులు ఇస్తోందని, ప్రస్తుతం దీన్ని 60 శాతానికి కుదిస్తున్నారని తప్పుపట్టారు. దీనివల్ల రాష్ట్రాలపై ఆర్థిక భారం పడుతుందన్నారు. పథకం నుంచి గాంధీజీ పేరు తొలగించడం అన్యాయమని అన్నారు.

గాంధీజీ ఆదర్శాలకు అవమానం

మహాత్మా గాంధీ ఆదర్శాలను ప్రభుత్వం అవమానిస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. కేంద్రం తెచ్చిన బిల్లును తప్పుపడుతూ 'ఎక్స్'లో పోస్టుచేశారు. గ్రామీణ పేదల జీవనోపాధిని దెబ్బకొట్టాలన్నదే మోదీ ప్రభుత్వ అసలు ఉద్దేశమని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందని, యువత భవిష్యత్తు నాశనమవుతోందని ఆందోళన వ్యక్తంచేశారు.

నేడు దేశవ్యాప్తంగా ఆందోళనలు

వీబీ-జీ రామ్ జీ బిల్లుకు వ్యతిరేకంగా బుధవారం దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ఈ మేరకు అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ అధ్యక్షులకు లేఖ రాశారు. మహాత్మాగాంధీ చిత్రపటాలు చేతబూని అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

జాతిపితను అపహాస్యం చేస్తున్నారు: బాలు

గాంధీజీ గ్రామాల్లో నివసించారని, పేదల సంక్షేమం కోసం పనిచేశారని డీఎంకే సభ్యుడు టి.ఆర్.బాలు చెప్పారు. పేదలకు ఉపాధి కల్పించడానికి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాన్ని నీరుగార్చవద్దని కేంద్రాన్ని కోరారు. జాతిపితను మోదీ ప్రభుత్వం అపహాస్యం చేస్తోందని విమర్శించారు. వీబీ-జీ రామ్ జీ బిల్లును వ్యతిరేకిస్తూ విపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకొచ్చారు. గాంధీజీ ఫొటోలను ప్రదర్శించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. అనంతరం పార్లమెంట్ ప్రాంగణంలో గాంధీ విగ్రహం ఆందోళనకు దిగారు. గాంధీజీకి జరిగిన అవమానాన్ని దేశం సహించబోదంటూ నినదించారు.

రాముడి పేరును బద్నాం చేయొద్దు: థరూర్

వీబీ-జీ రామ్ జీ బిల్లును లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ వ్యతిరేకించారు. 1971 నాటి బాలీవుడ్ పాటను ప్రస్తావించారు. 'ఈ పని చేయొద్దు, రాముడి పేరును బద్నాం చేయొద్దు' అని కేంద్ర ప్రభుత్వానికి హితవు పలికారు. పేదలకు అండగా నిలస్తున్న పథకాన్ని బలహీనపర్చొద్దని తేల్చిచెప్పారు.

అనుమానాలు వద్దు: కేంద్రం

బిల్లుపై అనుమానాలు అవసరం లేదని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ వివరణ ఇచ్చింది. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధన దిశగా గ్రామీణ పేదల ఉపాధికి హామీ ఇస్తూ చట్టం తీసుకొస్తున్నట్లు వెల్లడించింది. ఇది ఆధునిక చట్టబద్ధమైన ఏర్పాటు అని పేర్కొంది. పేదలకు ఉపాధి కల్పించడంతోపాటు గ్రామీణ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం దీని ఉద్దేశమని వివరించింది.

విప్ జారీ చేసిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ తమ లోక్‌సభ సభ్యులకు మంగళవారం విప్ జారీ చేసింది. రాబోయే మూడు రోజులపాటు తప్పనిసరిగా సభకు హాజరు కావాలని ఆదేశించింది. వీబీ-జీ రామ్ జీ సహా కీలకమైన బిల్లులపై చర్చ, ఓటింగ్ జరిగే అవకాశం ఉందని పేర్కొంది. బిల్లులపై జరిగే చర్చల్లో పాల్గొనాలని, ప్రజల గొంతుకను వినిపించాలని సూచించింది.

'బీమా' బిల్లు ఆమోదం

న్యూఢిల్లీ: దేశంలో బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను(ఎఫ్‌డీఐ) అనుమతిస్తూ కేంద్రం ప్రవేశపెట్టిన సబ్‌కా బీమా సబ్‌కీ రక్షా(బీమా చట్టాల సవరణ) బిల్లు-2025 మంగళవారం లోక్‌సభలో ఆమోదం పొందింది. 2047 నాటికి ప్రజలందరికీ బీమా సదుపాయం కల్పించడం బిల్లు ఉద్దేశమని ప్రభుత్వం తెలియజేసింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ విపక్షాల నిరసనల మధ్యే ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం బిల్లుపై జరిగిన చర్చకు సమాధానమిచ్చారు. ఎఫ్‌డీఐలను పెంచడం ద్వారా ఈ రంగంలో మరి కొంతమంది విదేశీ పెట్టుబడిదారులు అడుగుపెడతారని, అంతిమంగా ప్రజలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. బీమా పాలసీలు చౌకగా, సులభంగా అందుబాటులోకి వస్తాయన్నారు. గుత్తాధిపత్యం అంతరించి, పోటీ పెరిగితే ప్రజలకే మేలు కలుగుతుందని పేర్కొన్నారు. అదే సమయంలో ప్రభుత్వ రంగంలోని బీమా కంపెనీలను బలోపేతం చేయడానికి చర్యలు చేపట్టినట్లు గుర్తుచేశారు. బీమా రంగంలో ప్రస్తుతం 74 శాతం ఎఫ్‌డీఐలను అనుమతిస్తున్నారు. ఇకపై 100 శాతం అనుమతిస్తారు. నాన్-ఇన్సూరెన్స్ కంపెనీలు బీమా కంపెనీల్లో విలీనం కావడానికి బిల్లు వీలు కల్పిస్తోంది.

ఆ బిల్లు జాయింట్ కమిటీకి..

ఉన్నత విద్యా సంస్థల నియంత్రణ కోసం 13 మంది సభ్యులతో ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయడానికి తీసుకొచ్చిన బిల్లును పార్లమెంట్ జాయింట్ కమిటీకి పరిశీలనకు పంపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ మేరకు తీర్మానాన్ని గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టగా, మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. జాయింట్ కమిటీలో 10 మంది రాజ్యసభ సభ్యులు, 21 మంది లోక్‌సభ సభ్యులు ఉంటారు. ఈ కమిటీ తమ నివేదికను వచ్చే ఏడాది పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో చివరిరోజుకల్లా సమర్పిస్తుంది.

71 చట్టాల రద్దుకు ఆమోదం

కాలం చెల్లిన 71 చట్టాల రద్దుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలియజేసింది. ఈ మేరకు బిల్లును సభలో మూజువాణి ఆమోదించారు. పాత చట్టాల రద్దుతో ప్రజల జీవనం మరింత సులభతరంగా మారుతుందని న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ స్పష్టంచేశారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ చార్జిషీట్ స్వీకరించలేం

ఢిల్లీ కోర్టు స్పష్టీకరణ • సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఊరట

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ వ్యవహారానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు మరో ఐదుగురికి ఊరట లభించింది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోవడానికి ఢిల్లీ కోర్టు మంగళవారం నిరాకరించింది. చార్జిషీట్‌ను తిరస్కరిస్తూ ఉత్తర్వు జారీ చేసింది. ఈ కేసులో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా కాకుండా, ప్రైవేట్ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై జరిపిన విచారణ ఆధారంగా చార్జిషీట్ దాఖలు చేశారని ఢిల్లీ కోర్టు ప్రత్యేక జడ్జి విశాల్ గాగ్నే తప్పుపట్టారు. చట్టప్రకారం దీన్ని స్వీకరించడం సాధ్యం కాదని తేల్చిచెప్పారు. ఢిల్లీ పోలీసు శాఖకు చెందిన ఆర్థిక నేరాల విభాగం ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు న్యాయమూర్తి గుర్తుచేశారు. మనీ లాండరింగ్ వ్యవహారంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దూబే, శామ్ పిట్రోడాతోపాటు యంగ్ ఇండియా కంపెనీ పాత్ర ఉన్నట్లు ఈడీ ఆరోపిస్తోంది. నేషనల్ హెరాల్డ్ పత్రికను ప్రచురించే అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్(ఏజేఎల్)కు చెందిన రూ.2,000 కోట్ల విలువైన ఆస్తులను వారు అక్రమంగా కొట్టేశారని చెబుతోంది. యంగ్ ఇండియా కంపెనీలో సోనియా గాంధీకి 76 శాతం వాటా ఉంది. ఏజేఎల్‌కు ఈ కంపెనీ రూ.90 కోట్లు రుణంగా ఇచ్చింది. రుణాన్ని తిరిగి చెల్లించే పరిస్థితి లేకపోవడంతో ఏజేఎల్ ఆస్తులను కుట్రపూరితంగా లాక్కున్నారని ఈడీ వాదిస్తోంది. మరోవైపు ఢిల్లీ ప్రత్యేక కోర్టు ఉత్తర్వుపై అప్పీల్ చేస్తామని ఈడీ వెల్లడించింది.

బెంగాల్లో 58 లక్షల ఓటర్లు గల్లంతు

3 రాష్ట్రాలు, 2 యూటీల్లో కోటికి పైగా • అక్కడ ఎస్ఐఆర్ కొలిక్కి

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ మూడు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో కొలిక్కి వచ్చింది. వాటికి సంబంధించిన ఓటర్ జాబితా ముసాయిదాలు సిద్ధమయ్యాయి. అయితే ఆ ఐదు చోట్లా కలిపి ఏకంగా కోటి మందికి పైగా పేర్లు ఓటర్ల జాబితా నుంచి గల్లంతవడం విశేషం. ముఖ్యంగా త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్ లోనే 58 లక్షల ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగింపునకు గురయ్యాయి! వారంతా ఓటర్ నమోదు ఫారాలు నింపి తిరిగివ్వని వారేనని ఈసీ అధికారులు చెప్పారు. వారి పేర్లు ఆబ్సెంట్, షిఫ్టెడ్, మృతులు/డూప్లికేట్ ఓటర్లు (ఏఎస్డీ) జాబితాలో చోటుచేసుకున్నట్టు తెలిపారు. 'ఆ పేర్లను మేం ఓటర్ల జాబితా నుంచి తొలగించలేదు. దానిపై ఆయా నియోజకవర్గాల ఎన్నికల నమోదు అధికారులే నిర్ణయం తీసుకుంటారు' అని వివరించారు. 'నిజమైన ఓటర్ల పేర్లు తొలగింపుకు గురైతే ఆందోళన పడాల్సిన అవసరం లేదు. తమ పేరు పునరుద్ధరించాలంటూ జనవరి 15 దాకా ఫారం 16 సమర్పించవచ్చు' అని తెలిపారు. పశ్చిమ బెంగాల్ మాదిరిగానే రాజస్తాన్ లో 44 లక్షలు, గోవాలో 1.01 లక్షలు, పుదుచ్చేరిలో 1.03 లక్షలు, లక్షద్వీప్ లో 1,616 మంది పే ఓటర్ల జాబితా నుంచి ఏఎస్డీ జాబితాలోకి చేరాయి. బిహార్ లో కూడా ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిపిన ఎస్ఐఆర్ లో ఏకంగా 68 లక్షల ఓట్లు తొలగింపుకు గురవడం తెలిసిందే.

సాక్షి
గుంటూరు
బుధవారం । 17 । డిసెంబర్ । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 571.90 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 51,004 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీటి విడుదల నిలిచిపోయింది. దిగువకు 2400 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 42.0293 టీఎంసీలు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల:ప్రకాశం బ్యారేజ్ నుంచి 1,818 క్యూసెక్కులు పశ్చిమ డెల్టా కాలువలకు విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. 12 అడుగుల నీటిమట్టం ఉంది.

న్యూస్‌రీల్

విజయకీలాద్రిపై ధనుర్మాస వేడుకలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ధనుర్మాస వేడుకలను మంగళవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో ధనుర్మాస వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం ఉదయం గోదా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన, మంగళాశాసనం నిర్వహించారు. అనంతరం 1వ పాశుర విన్నపం, తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోదా అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రీ సాక్షి భావనారాయణ స్వామి ఆలయంలో...

పొన్నూరు: పట్టణంలోని స్వయంభూ శ్రీ సాక్షి భావనారాయణస్వామి, కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. దేవాలయం అర్చకులు గోవర్ధనం రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగ్నిక స్వామి వేదాంతం అనంత శ్రీనివాస భట్టాచార్యులు, తిరుప్పావై ప్రవచకులు తిరువాయిపాటి గోవర్ధనాచార్యులు పాల్గొన్నారు. భక్తులు గోదాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

వాజ్‌పేయి విగ్రహానికి రూ.8 లక్షలు విరాళం

గుంటూరుమెడికల్: మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్‌బిహారీ వాజ్‌పేయి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి గుంటూరులో సోమవారం శంకుస్థాపన జరిగింది. గుంటూరు లక్ష్మీపురం నాలుగు రోడ్ల కూడలిలో విగ్రహాన్ని ఏర్పాటుచేయనున్నారు. ఈ విగ్రహ ప్రతిష్టకు గుంటూరుకు చెందిన పారిశ్రామికవేత్త మాదల రత్నగిరిబాబు రూ.8 లక్షలు విగ్రహ నిర్మాణ కమిటీకి మంగళవారం అందజేశారు.

వైభవంగా స్వామి వారి ఆరాధన మహోత్సవం

నగరంపాలెం(గుంటూరువెస్ట్):గుంటూరులోని శ్రీకంచి కామకోటి పీఠ శ్రీమారుతీ దేవాలయ ప్రాంగణంలో శ్రీకంచి కామ కోటి పీఠం 68వ పీఠాధిపతులు చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారి 32వ ఆరాధన మహోత్సవాన్ని మంగళవారం అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

శ్రీ లక్ష్మీ నృసింహస్వామికి విశేష పూజలు

తెనాలి: నాజరుపేటలోని శ్రీ శృంగేరి శ్రీ విరూపాక్ష శ్రీ పీఠపాలిత శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామి వారికి విశేష కార్యక్రమాలు జరిపారు. స్వామి వారికి పంచామృత అభిషేకం, విశేష అలంకరణ చేశారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. అప్పికట్ల వెంకటేశ్వరరావు సిద్ధాంతి ప్రవచనం చెప్పారు. 30న ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 5.45 గంటలకు ఉత్తర ద్వారా దర్శనం నిర్వహిస్తారు.

నిమ్మ రైతులకు తప్పని కన్నీరు

- చలికాలంలో హఠాత్తుగా తగ్గిన ధర
- కాయ ఆధారంగా కిలో రూ. 12–18
- నగటున కిలో ధర రూ.12–15
- నెల రోజులుగా ఇదే తీరులో అమ్మకాలు
- ఖర్చులు కూడా రావని రైతుల గగ్గోలు

నిమ్మ రైతులకు మార్కెట్ ధరలు కన్నీరు తెప్పిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల వరకు కిలో రూ.90 వరకు పలికినా, తర్వాత ధరలు తగ్గినప్పటికీ నిలకడగానే ఉంటూ వచ్చాయి. నెల రోజులుగా ధరలు భారీగా పతనం చెందాయి. ఇటీవల వరకు కిలో రూ.6–12 వరకు అమ్మకాలు జరిగాయి. సగటు ధర రూ.10–12 మధ్యనే ఉంటూ వచ్చింది. తాజా రూ.15కు చేరుకుంది. అయినా ఈ ధరలతో నష్టపోక తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తెనాలి: దేశంలో నిమ్మకాయల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న ఏడు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. రాష్ట్రంలో గూడూరు, ఏలూరు మార్కెట్ల తర్వాత నిమ్మకాయలకు ప్రసిద్ధి తెనాలి మార్కెట్. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆరు వేల ఎకరాలకుపైగా నిమ్మతోటలు సాగులో ఉంటే అందులో అత్యధికం తెనాలి డివిజనులోనే ఉన్నాయి. తెనాలి మార్కెట్ యార్డు ఆవరణలోని నిమ్మ మార్కెట్లో ప్రతిరోజూ లావాదేవీలు జరుగుతుంటాయి. ఇక్కడి నుంచి ఉత్తర భారతదేశంలోని కాశీ, కోల్‌కతా, ఢిల్లీ, కాన్పూర్‌లకు ఎగుమతి చేస్తున్నారు. నిత్యం సీజనులో 12–15 లారీలు, అన్ సీజన్‌లో 4–5 లారీల సరుకు ఎగుమతి అవుతుంటుంది.

నికర ఆదాయం...

నిమ్మతోటలు ఏటా జూలై, డిసెంబరు, మే నెలలో మూడు కాపులనిస్తాయి. ఒక్కో కాపు మూడేసి నెలలు దిగుబడి ఇస్తుంటుంది. ప్రతి కాపునకు సుమారు 150–200 టిక్కీల వరకు కాయ వస్తుంది. కాయ సైజు ఆధారంగా ఒక్కో టిక్కీకి 45–55 కిలోలు వస్తాయి. కొన్నేళ్లుగా నిమ్మతోటల రైతులకు నికరమైన ఆదాయం వస్తున్నందున కౌలు ధరలు పెరిగాయి. ఎకరా కౌలు రూ.90వేల నుంచి రూ.1.20 లక్షల వరకు చేరిన సందర్భాలున్నాయి. ఎరువులు, పురుగు మందులు, నీటి తడులకు కలిపి ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేయాలి. అయినా సరే, లాభాలు వస్తున్నందున మెట్ట సాగుకు పరిమితమైన నిమ్మ తోటలను డెల్టా రైతులు కొందరు, మాగాణి భూముల్లోనూ పెంచసాగారు.

2017–18లో చేదు అనుభవాలు...

లాభదాయకమైన నిమ్మతోటల సాగు 2017, 2018 సంవత్సరాల్లో రైతులకు చేదు అనుభవాలను మిగిల్చింది. 2017 ఏప్రిల్‌లో కిలో రూ.20–30 మధ్య పలికిన ధర, మరో నెలకు రూ.12–20కి దిగజారింది. జూన్‌లో మరింతగా పతనమై రూ.5–10లకు పడిపోయింది. జూలైలో రూ.7లకు మించలేదు. మళ్లీ 2018లోనూ అదే పరిస్థితి ఎదురైంది. కిలో రూ.3–7లకు మించటం లేదని రైతులు వాపోయాన్నారు. కోత కూలీ కూడా దక్కదన్న భావనతో కాపు కోయకుండా వదిలేశారు. ఖర్చులు లెక్కేసుకుంటే ఒక్కో నిమ్మకాయకు రైతుకు మిగిలేది 10 పైసలు.

కరోనాలో ఆదుకున్న ప్రభుత్వం...

కరోనా మహమ్మారి సమయంలో దేశవ్యాప్త లాక్‌డౌన్ కారణంగా అమ్మకాలకు బ్రేక్ పడింది. తర్వాత కూడా ఇతర రాష్ట్రాల నుంచి ఆర్డర్లు లేకుండా పోయాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో మార్కెటింగ్ శాఖ చొరవ తీసుకుని వారానికి మూడు రోజులు కొనుగోళ్లు చేసి ఆదుకున్న విషయం తెలిసిందే. అప్పట్లో కేవలం నెల రోజుల్లో 850 టన్నులను రైతుల నుంచి కొనుగోలు చేసి ఎగుమతి చేసింది. తర్వాత లారీల సమ్మె రోజుల్లోనూ నిమ్మ రైతులు ఇబ్బందులు పడ్డారు. తర్వాత నుంచి నిలకడగా మంచి ధర రావటం ఆరంభించింది.

మళ్లీ పెరిగిన ధర...

2023–24 సంవత్సరం నిమ్మ సాగు రైతులకు సంతృప్తినిచ్చింది. తెనాలి నిమ్మ మార్కెట్లో కిలో రూ.50–70 మధ్య అమ్మకాలు జరిగాయి. ఆ ఏడాది ఏప్రిల్‌లో కనిష్ట ధర రూ.68, గరిష్టంగా రూ.80, రూ.90 వరకు కొనుగోళ్లు జరిగాయి. ఏప్రిల్ 24న కిలో రూ.90కు విక్రయించారు. ఏప్రిల్ 28వ తేదీ నుంచి కిలో రూ.65పైనే మార్కెట్ లావాదేవీలు కొనసాగుతూ వచ్చాయి. మే ఒకటో తేదీన గరిష్ఠ ధర రూ.78 పలికింది. ఫుల్ జోష్‌లో ఉన్న రైతులకు, సీజను ముగింపు దశలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తర్వాత ధరల్లో తగ్గుదల కొంత నిరాశపరిచింది.

ప్రస్తుతం భారీగా పతనం...

కొంతమేర ధరలు తగ్గినా నిలకడగా ఉంటున్నందున రైతులు ఇబ్బందులు పడలేదు. ప్రస్తుతం డిసెంబరు కాపు వచ్చేసరికి పరిస్థితి మారిపోయింది. గత నెల రోజులుగా కిలో రూ.6–12 ధర మీదనే మార్కెట్ నడుస్తోంది. మంగళవారం రూ.8–12కు ధర పడిపోయింది. సగటు ధర రూ.10. అప్పుడప్పుడు రూ.15కు పలికినా, అది కాయ బాగా నాణ్యంగా ఉంటేనే సుమా. ఒక్కో టిక్కీకి 50 కిలోలనుకుంటే కిలో రూ.10 చొప్పున రైతుకు రూ.500 వస్తాయి. కాయ కోత కూలీ రూ.250, మార్కెట్‌కు తీసుకొచ్చినందుకు బాడుగ రూ.50, దించుడు కూలీ రూ.20, మార్కెట్లో కమీషన్ రూ.12 చొప్పున ఒక్కో బస్తాకు రూ.332 ఖర్చు తప్పడం లేదు. కిలో రూ.6–8 ధర పడినప్పుడు ఖర్చులు కూడా రావటం లేదని రైతులు చెబుతున్నారు. సోమవారం సగటు ధర రూ.15 పలికింది. నీటి తడుల ఆధారంగా కాపునిచ్చే నిమ్మకు ఈ పర్యాయం వర్షాలు బాగా కలిసొచ్చాయి. దీంతో డిసెంబరులో తోటలన్నీ ఒకేసారి కోతకు వచ్చాయని రైతులు చెబుతున్నారు.

ఇంధన పొదుపు అందరి బాధ్యత

విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాత్సవ

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: ఇంధన వనరుల పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. జాతీయ ఇంధన వనరుల పొదుపు వారోత్సవాలలో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీని మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవతో కలసి కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంధన వనరుల పొదుపు పాటించటం వల్ల భవిష్యత్ తరాలకు ఇంధన భద్రత, భరోసా కల్పించటం సాధ్యం అవుతుందన్నారు. జాతీయ ఇంధన వనరుల వారోత్సవాలు ప్రతి ఏటా డిసెంబరు 14వ తేదీ నుంచి 20 వరకు నిర్వహించటం జరుగుతుందన్నారు. వారోత్సవాలలో విద్యుత్ వంటి ఇంధన వనరులను వృథా చేయకుండా పొదుపుగా వినియోగించటంపై ప్రజలకు ముఖ్యంగా మహిళలకు, విద్యార్థులకు, యువతకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. సోలార్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ ఇంధన పరిరక్షణ , పొదుపు చిట్కాల ప్రచార పోస్టర్లును ఆవిష్కరించి, ఇంధన వనరులను పొదుపు పాటిస్తామని, వృథాను అరికడతామని ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో డీఆర్వో షేక్ ఖాజావలి, సీపీడీసీఎల్ ఎస్ఈ చల్లా రమేష్, సీఆర్‌డీఏ సర్కిల్ ఎస్ఈ ఎం. శ్రీనివాసరావు, ఈఈ కె.సత్యనారాయణ, డీఈలు శ్రీనివాసబాబు, నాగేశ్వరరావు, జె.హరిబాబు, సూర్యప్రకాష్, ఎస్ఏఓ రామిరెడ్డి, ఏడీఈలు బి.రాజమోహనరావు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థినికి దండన ఘటనపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: మూడో తరగతి విద్యార్థినిని మోకాళ్లపై కూర్చోబెట్టిన సంఘటనలో ప్రైవేటు పాఠశాలకు చెందిన ఇన్‌చార్జ్ హెచ్‌ఎంతో పాటు మరొక ఉద్యోగినిపై పాఠశాల యాజమాన్యం చర్యలు తీసుకుంది. విద్యార్థిని తల్లి గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీమ్ బాషా ఆదేశాలతో మంగళవారం గుంటూరు తూర్పు ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్ పాఠశాలకు వెళ్లి విచారణ నిర్వహించారు. అత్యవసరంగా టాయిలెట్‌కు వెళ్లేందుకు మూడో తరగతి విద్యార్థిని పడిన ఇబ్బందిని గుర్తించకుండా నిర్ధాక్షిణ్యంగా మోకాళ్లపై కూర్చోబెట్టిన సంఘటనకు సంబంధించిన సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను తిలకించారు. ఎంఈవో సమర్పించిన నివేదిక ఆధారంగా విద్యార్థినిపై క్రమశిక్షణ చర్యల పేరుతో విద్యా హక్కు చట్టం ఉల్లంఘనకు పాల్పడ్డారని అధికారులు నిర్ధారణకు వచ్చారు. డీఈవో సలీమ్‌బాషా ఆదేశాలతో జరిగిన సంఘటనకు బాధ్యులను చేస్తూ ఇన్‌చార్జ్ హెచ్‌ఎంతో పాటు మరొక నాన్ టీచింగ్ ఉద్యోగినిని పాఠశాల యాజమాన్యం విధుల నుంచి తొలగించింది.

ముంచెత్తుతున్న మురుగు

పొంగిపొర్లుతున్న ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కాలువ

ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ వద్ద నిండుకుండలా ఉన్న సంపు

- పంప్ హౌస్‌లోకి చేరుతున్న మురుగు
- పంట పొలాలకు పొంచి ఉన్న ముప్పు
- ఆందోళనలో రైతులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లి బైపాస్ రోడ్డుకు మురుగు నీటి ముంపు తీవ్రమౌతోంది. చుట్టు పక్కల ప్రాంతాల్లోని నివాసాల నుంచి వెలువడే మురుగుతోపాటు ఇతర వ్యర్థాలు ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కాలువలోకి వచ్చి చేరుతున్నాయి. రైతులు కోతలు కోయడంతో కాలువలో మురుగు పంట పొలాల్లోకి రాకుండా ప్రాతూరు రోడ్డులోని అపర్ణ సమీపంలో కాలువకు అడ్డంగా కట్ట ఏర్పాటు చేశారు. కట్ట ఏర్పాటు చేసిన మూడు రోజుల వ్యవధిలోనే సుమారు 2 కి.మీ. పొడవున ఉన్న ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌లో కుంచనపల్లి బైపాస్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో మురుగునీరు వచ్చి పంట కాలువలో చేరడంతో పొంగిపొర్లుతోంది.



చెత్తతో నిండిపోయిన ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ కాలువ

పంట పొలాలకు తప్పని ముప్పు

మురుగు పంట పొలాల్లోకి వచ్చి చేరుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ వద్ద మురుగు షెడ్డులోకి చేరుతున్నాయి. కుంచనపల్లి, ప్రాతూరు రోడ్డులో కుంచనపల్లి బ్రిడ్జి వద్ద నుంచి రైతులు కాలువకు అడ్డు వేసిన కట్ట వరకు సుమారు 30 నుంచి 40 ఎకరాల్లో అరటి, పసుపు, ఆకుకూరలు పండిస్తున్నారు. ఎక్కడైనా కాలువ కట్ట తెగితే ఆ మురుగు అంతా ఒక్కసారిగా వచ్చి పంటపొలాలను ముంచెత్తుతుందని, పండించిన పంటలు దేనికీ పనికి రాకుండా పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌కి మురుగు భారీగా వచ్చి చేరుతోందని రైతులు చెబుతున్నారు. కొన్నిప్రాంతాల వారు మురుగు ఎత్తి ఈ కాలువలోకి పంపిస్తున్నారని రైతులు అంటున్నారు. పలు బహుళ అంతస్తుల నుంచి ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌కు మురుగు వచ్చి చేరుతోంది. ఆ కాలువకు అడ్డు కట్ట వేయడంతో అపార్ట్‌మెంట్లలో మురుగు వెనక్కి తంతున్నట్లు అపార్ట్‌మెంట్ వాసులు తెలుపుతున్నారు.

ఇప్పటికి మూడుసార్లు పొంగింది

అర ఎకరంలో పసుపు పంట సాగు చేశా. కాలువలో మురుగు పొంగి పొర్లడంతో పసుపు పంట తడిసి పోయింది. దీని వల్ల పసుపు కుళ్లిపోతోంది. ఇప్పటికే మూడుసార్లు ఇలా జరిగింది. ఇది నాల్గవ సారి. పంటను ఎలా కాపాడుకోవాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం మురుగుని మళ్లించే మార్గాన్ని ఏర్పాటు చేయాలి.

–దాసెట్టి శంకరరావు, రైతు

ఇంటర్ పరీక్షల మార్పులకు సన్నద్ధం కావాలి

- ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణాధికారి సైమన్ విక్టర్
- జూనియర్ ఇంటర్ పరీక్ష మార్పులపై అవగాహన సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న సైమన్ విక్టర్

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో తీసుకువస్తున్న మార్పులకు అనుగుణంగా సన్నద్ధం కావాలని ఇంటర్మీడియెట్ బోర్డు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సైమన్ విక్టర్ తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో భాగంగా ఫిబ్రవరి 23 నుంచి జరగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై మంగళవారం శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో పల్నాడుజిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్, పరీక్ష నిర్వహణ అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సైమన్ విక్టర్ మాట్లాడుతూ, ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల నిర్వహణకు పాత విధానాన్నే అమలు చేస్తుండగా, ప్రథమ సంవత్సరం పరీక్షల్లో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ప్రథమ సంవత్సరం సిలబస్‌లో భారీ మార్పులు జరిగాయనీ, అందుకు అనుగుణంగా పరీక్షా విధానంలోనూ మార్పులు చేసినట్టు పేర్కొన్నారు. ఈసందర్భంగా ప్రశ్నల సరళి, మార్కుల కేటాయింపు, అన్సర్ బుక్‌లెట్ తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బోటనీ, జువాలజీ పేపర్లు వేర్వేరుగా ఉంటాయని తెలిపారు. వీటి ప్రశ్నాపత్రం 43, 42 మార్కులకు కేటాయించగా ద్వితీయ సంవత్సరంలో 30 మార్కులకు ప్రాక్టికల్స్ ఉంటాయని, రెండు సంవత్సరాలకు కలిపి 200 మార్కులకు పరీక్ష ఉంటుందని వివరించారు. మార్పులను గుర్తించి అందుకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. మార్పులను విద్యార్థులకు వివరించి వారిని సన్నద్ధం చేయాలని తెలిపారు. పరీక్షల స్పెషల్ ఆఫీసర్ వి.వి.సుబ్బారావు, రమేష్, ఆర్‌జేడి జె.పద్మా, జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు టి.ప్రభాకర్, కె.వేణు, ఎస్ఎస్ అండ్ ఎన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాససాయి తదితరులు పాల్గొన్నారు.

కార్టూనిస్ట్ సుభానీకి ‘బాపు’ అవార్డు

కారంచేడు: ప్రముఖ కార్టూనిస్ట్‌గా, అనతికాలంలోనే కార్టూన్ ఎడిటర్‌గా అంచలంచలుగా ఎదిగిన పొలిటికల్ కార్టూనిస్ట్ షేక్ సుభానీకి ‘బాపు అవార్డు’ దక్కింది. కారంచేడు గ్రామానికి చెందిన సుభానీ షేక్ గత 40 సంవత్సరాలుగా హైదరాబాద్‌లోని డెక్కన్ క్రానికల్ దినపత్రికలో కార్టూనిస్ట్‌గా పనిచేశారు. కార్టూన్ ఎడిటర్‌గా.. ఎన్నో పొలిటికల్ కార్టూలను వేసి అనేక మంది మన్ననలు పొందారు. 40 సంవత్సరాల సుదీర్ఘ అనుభవంతో ఆయన అనేక అవార్డులు తీసుకున్నారు. దీంతో హైదరాబాద్‌లోని బాపు–రమణ అకాడమీ వారు గుర్తించి సుభానీకి బాపు అవార్డును అందించారు. నాంపల్లి తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో కవి, రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావుకు రమణ అవార్డు, సినీ నటుడు మురళీమోహన్‌కు జీవన సాఫల్య పురస్కారం అందించారు. సుభానీకి పలువురు అభినందనలు తెలిపారు.

పగలు రెక్కీ.. రాత్రిళ్లు చోరీ

- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- చోరీ సొత్తు స్వాధీనం

చోరీ కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతరావు, వెనుక నిందితులు

స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

నరసరావుపేట టౌన్: పగలు దుప్పట్లు విక్రయిస్తూ రెక్కీ నిర్వహించి తాళ్లాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.హనుమంతరావు తెలిపారు. మంగళవారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. చిలకలూరిపేట పట్టణానికి చెందిన బైరా సుజాత గృహంలో దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి గృహంలోని 21 సెవర్ల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, వాచీలు, రూ.లక్ష నగదును ఈ ఏడాది నవంబర్ 28న దోచుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి చిలకలూరిపేట పట్టణ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారన్నారు. ఉత్తరాఖండ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా గుర్రాలచావిడి, పాత బాలాజీ సినిమా హాల్ దగ్గర సోమవారం సంచరిస్తుండటంతో వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణలో పైనేరాన్ని వారే చేసినట్లుగా అంగీకరించారన్నారు. నిందితులు నూర్ హసన్, నౌసద్, మిన్నా యామిన్, అబ్దుల్ గప్ఫార్, సాహుల్ జబ్బార్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.1,25,800 విలువైన చోరీ సొత్తును, దొంగతనానికి ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచిన అనంతరం మిగిలిన సొత్తు రికవరీ కోసం పోలీస్ కస్టడీ కోరతామన్నారు. ఈ దొంగల ముఠాపై హర్యానా, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్, బీహార్, ఒడిశాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల్లో కేసులు నమోదై ఉన్నాయని డీఎస్పీ తెలిపారు. కేసు దర్యాప్తులో ముఖ్యపాత్ర వహించిన చిలకలూరిపేట అర్బన్ సీఐ పి.రమేష్ , ఎస్ఐ హజరత్తయ్య, సిబ్బంది వై.శ్రీనివాస్, ఎస్.వణుకుమార్, వి.హరీష్, కె.శ్రీరాములు, వి.నారాయణరావు, జి.జాన్‌బాబు, కె.శివకృష్ణ, షేక్ జాన్‌బాషా సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)

వచ్చిన బస్తాలు	59,113
అమ్మకాలు	56,159
నిల్వ	11,549

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–17,000
నంబరు-5	11,500–15,400
273	11,500–14,300
341	10,500–16,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–16,700
నంబరు-5	11,000–15,300
341	11,000–16,500
4884	11,000–14,300
సూపర్-10	12,000–16,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,800
బాడిగ-355	10,500 – 16,400
దేవనూరు డీలక్స్	11,000 – 17,000
ఆర్మూర్	10,000 – 12,500
తాలుకాయలు	5,000 – 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	11,000–14,800
బాడిగ – 355	10,000–16,300
దేవనూరు డీలక్స్	10,500–15,800
తాలు	5,200 – 6,600

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(మంగళవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 983

కొమ్ములు : 843 బస్తాలు

(ధర రూ.ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
11,400	12,900	12,600

కాయలు : 140 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
11,200	12,411	12,411

మొత్తం అమ్మకాలు : 737.25 క్వింటాళ్లు

–దుగ్గిరాల

క్లుప్తంగా

ఐజేయూ సభ్యుడిగా రాంబాబు

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) లో పలు పదవులు నిర్వహించిన మాచర్లకు చెందిన మాగులూరి రాంబాబును ఐజేయూ నేషనల్ కౌన్సిల్ సభ్యుడుగా నియమించినట్లు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి విద్యాధరణి మురళి తెలిపారు. ఇటీవల జరిగిన ఇండియన్ జర్నలిస్టు యూనియన్ సమావేశంలో మాచర్ల నుంచి ఐజేయూ సభ్యుడిగా రాంబాబును ఎంపిక చేసినట్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తన ఎంపికకు కృషి చేసిన ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావుతో పాటు పలువురికి కృతజ్ఞతలు తెలిపారు. రాంబాబును సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్.జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి విద్యాధరణి మురళి, పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డీవీఆర్‌కే భువన, పి.నాగరాజుతో పాటు పలువురు అభినందించారు.

పోలీస్ ఉద్యోగం అంటేనే సేవ
జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్



బాపట్ల టౌన్: పోలీస్ ఉద్యోగం అంటేనే సేవ అని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లాలో కానిస్టేబుళ్లుగా ఎన్నికైన 191 మందికి మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పరేడ్ నిర్వహించారు. ఎస్పీ బి.ఉమామహేశ్వర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కానిస్టేబుల్ ఉద్యోగాలకు మొత్తం 5,757 మంది ఎంపిక కాగా, వారిలో బాపట్ల జిల్లా నుంచి 191 మంది ఉన్నారన్నారు. పోలీస్ శాఖలో ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాకుండా, ప్రజలకు శాంతి భద్రతలు కల్పించే అంకిత భావంతో కూడిన సేవ అని తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, ఆలోచనా ధోరణిని మార్చుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, ఎస్బీ సీఐ జి.నారాయణ, అడ్మిన్ ఆర్ఐ షేక్ మౌలుద్దీన్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రేయస్సును విస్మరిస్తే
ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తప్పవు

డీఈఓ సలీమ్ బాషా

మాట్లాడుతున్న డీఈఓ సలీమ్ బాషా

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల శ్రేయస్సుకు భిన్నంగా వ్యవహరిస్తే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో షేక్ సలీమ్ బాషా హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం గుంటూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరిషత్ భవన్‌లో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో సలీమ్ బాషా మాట్లాడుతూ విద్యార్థులను ఎటువంటి పరిస్థితుల్లోనూ ఇబ్బందులకు గురి చేయవద్దని స్పష్టం చేశారు.

● వివిధ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అనైతిక అక్రమాలకు పాల్పడుతున్నాయని, ఒక పాఠశాలలో విద్యార్థులను మరొక పాఠశాలలో చేర్చుకుని, ఫీజుల విషయంలో వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఈ విధమైన చర్యలతో విద్యార్థులు మానసికంగా ఇబ్బందులు పడటంతోపాటు తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంటోందన్నారు. ఇటువంటి చర్యలకు ఎవరూ పాల్పడవద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వం రూపొందించిన విధి, విధానాల ప్రకారం పాఠశాలలు నిర్వహించుకోవాలన్నారు. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా పరీక్ష ఫీజులు వసూలు చేయడం తగదని స్పష్టం చేశారు.

● నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో తెనాలి డీవైఈవో శాంతకుమారి, గుంటూరు తూర్పు ఎంఈవో నాగేంద్రమ్మ, డీసీఈబీ కార్యదర్శి ఏ. తిరుమలేశ్, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వలస కుటుంబాల్లోని పిల్లలకు విద్య నేర్పించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: వలస కుటుంబాల్లోని పిల్లలకు విద్యను అందించడాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీమ్ బాషా పేర్కొన్నారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో గుంటూరులోని మిర్చియార్డు పరిసర ప్రాంతాల్లో బిహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి వలస వచ్చిన పిల్లలకు విద్యనందిస్తున్న వలంటీర్లకు, కేర్ టేకర్లకు కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాన్ని మంగళవారం సాంబశివపేటలోని సెయింట్ జోసఫ్ బీఈడీ కళాశాలలో ప్రారంభించారు.

● ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈవో సలీమ్ బాషా మాట్లాడుతూ ఉపాధి కోసం వివిధ రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కుటుంబాల్లోని పిల్లలకు విద్యను అందించడం మన బాధ్యత అని అన్నారు.

● ఉపాధి కోసం వలస వచ్చిన కుటుంబాల్లో బిహార్ వాసులు అత్యధికంగా ఉన్నారని, వారి పిల్లలకు లెర్నింగ్ సపోర్ట్ ఇచ్చే విషయమై బిహార్ నుంచి ప్రథమ్ ఎన్జీవో టీం ప్రత్యేకంగా వచ్చారని, సంబంధిత ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ ప్రథమ్ టీంతో సమన్వయం చేసుకుని మూడు రోజులపాటు కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు.

● బిహార్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పిల్లలకు, ఇక్కడి పిల్లల స్వభావంతో భిన్నంగా ఉన్నాయని, ప్రధానంగా భాషకు సంబంధించిన సమస్య ఉత్పన్నమవుతోందన్నారు.

● గుంటూరు జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ ఐ.పద్మావతి మాట్లాడుతూ ఎన్‌సీపీసీఆర్ గైడెన్స్, సమగ్రశిక్ష ఎస్పీడీ ఆదేశాల మేరకు గత సెప్టెంబర్‌లో నిర్వహించిన సర్వే ద్వారా వలస కుటుంబాల్లోని 2,196 మంది పిల్లల వివరాలు సేకరించామని, వారికి విద్యను కొనసాగించేందుకు అవసరమైన లెర్నింగ్ సపోర్ట్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ్ టీం కంటెంట్ ప్రతినిధి లీలా పద్మావతి, బిహార్ ప్రథమ్ టీం ప్రతినిధి దీనానాద్ కుమార్ సిన్హా, గుంటూరు ఈస్ట్ ఎంఈవో ఎస్ఎంఎం అబ్దుల్ ఖుద్దూస్ పాల్గొన్నారు.

పీఎఫ్ రుణాలపై ఆడిట్ అభ్యంతరాలు తొలగించాలి

ఏపీటీఎఫ్ డిమాండ్

జిల్లా ఆడిట్ అధికారి మధురిమకు సమస్యలతో కూడిన పత్రాన్ని అందజేస్తున్న ఏపీటీఎఫ్ బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: అత్యవసర ఖర్చుల కోసం ఉపాధ్యాయులు దాఖలు చేస్తున్న పీఎఫ్ రుణాల దరఖాస్తులను అసంబద్ధమైన ఆడిట్ అభ్యంతరాలతో తిరస్కరించడం మానుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవ లింగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఆడిట్ అధికారి బి.మధురిమను గుంటూరులోని ఆడిట్ కార్యాలయంలో కలిసిన ఏపీటీఎఫ్ బృందం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. బసవ లింగారావు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ పాఠశాలల్లో వివిధ కేడర్లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల అవసరాలకు ఉపయోగపడతాయని నెల నెలా పీఎఫ్‌లో దాచుకున్న సొమ్ము అనారోగ్య పరిస్థితుల్లో వైద్య చికిత్సల కోసం దాఖలు చేసుకున్న రుణ దరఖాస్తుల్లో రూ.ఐదు లక్షలు దాటితే అసిస్టెంట్ సివిల్ సర్జన్, మెడికల్ సర్టిఫికెట్ తేవాలని లేదంటే పీఎఫ్ దరఖాస్తును తిరస్కరిస్తున్నారని అన్నారు.

● పీఎఫ్ రుణాల మంజూరులో అర్థం లేని నిబంధనలు విధించడం తగదని, లేని నిబంధనలు చూపి దరఖాస్తులను ఏ విధంగా తిరస్కరిస్తారని ప్రశ్నించారు. ఆడిట్ కార్యాలయం నుంచి లేవనెత్తుతున్న అభ్యంతరాలు పూర్తిగా విరుద్ధమన్నారు.

● ఎన్జీవోలకు వర్తించే నిబంధనలను ఉపాధ్యాయులకు అన్వయించడం సహేతుకం కాదని, కేంద్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన ఏ మెడికల్ ప్రాక్టీషనర్ నుంచి అయినా సర్టిఫికెట్ సమర్పిస్తే సరిపోతుందన్నారు.

● పీఎఫ్ డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియక ఆందోళనలో ఉపాధ్యాయులు ఉన్న పరిస్థితుల్లో జెడ్పీ పీఎఫ్ విభాగం, జిల్లా ఆడిట్ కార్యాలయం ఒకరిపై ఒకరు చెప్పుకుని రుణ దరఖాస్తులను కొర్రీలు వేస్తూ, కాలయాపనతో ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు.

● ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ పీఎఫ్ రుణాలపై జెడ్పీ కార్యాలయ సిబ్బంది వ్యవహరిస్తున్న అసంబద్ధ విధానాలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు.

● రుణానికి దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులతో పాటు, ఉద్యోగ విరమణ అనంతర తుది చెల్లింపులకు ఉపాధ్యాయులకు ఫోన్ చేసి వ్యక్తిగతంగా కలవాలని చెబుతున్నారని, ఈ విధంగా ప్రవర్తించడ సరికాదన్నారు.

● జిల్లా ఆడిట్ అధికారి బి.మధురిమ స్పందిస్తూ ఉపాధ్యాయులకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

ఆడిట్ అధికారిని కలసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి.నాగశివన్నారాయణ, జి.దాస్, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ యూ.వందనం, జిల్లా కౌన్సిలర్లు సయ్యద్ జహంగీర్, కృష్ణారావు, గురుమూర్తి, అప్పారావు, తదితరులు ఉన్నారు.

చలపతి ఫార్మసీలో ఏబీఏపీ 19వ వార్షిక మహాసభ

జాతీయ అంతర్జాతీయ నిపుణులతో ప్రారంభమైన గ్లోబల్ కాన్ఫరెన్స్

కార్యక్రమం సావనీర్‌ను విడుదల చేస్తున్న అతిథులు, కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: గుంటూరు నగర శివారులోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మసీ (ఏబీఏపీ) సహకారంతో నిర్వహిస్తున్న ఏబీఏపీ 19వ వార్షిక మహాసభ అంతర్జాతీయ సదస్సు (గ్లోబల్ కాన్ఫరెన్స్) మంగళవారం ప్రారంభమైంది. స్థిరమైన అభివృద్ధి కోసం హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, అగ్రికల్చర్ బయో మెడికల్ సైన్సెస్‌తో సాంకేతికత సమన్వయం అనే ప్రధాన అంశంతో మూడు రోజులపాటు ఈ సదస్సు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. కార్యక్రమంలో దేశ విదేశాల నుంచి వచ్చిన ప్రముఖ శాస్త్రవేత్తలు, అకడమిషీయన్లు, పరిశ్రమ నిపుణులు, పరిశోధకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే అరుదైన అవకాశాన్ని కల్పించిందని ఆయన తెలిపారు. కార్యక్రమానికి చలపతి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వైవి ఆంజనేయులు, సెక్రటరీ వై. సుజిత్‌కుమార్‌లు అధ్యక్షత వహించారు. ఏబీఏపీ జనరల్ సెక్రటరీ డాక్టర్ కె.ఆర్.ఎస్.సాంబశివరావు కార్యక్రమంలో కీలకపాత్ర పోషించారు.

● ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, చైర్మన్ ప్రొఫెసర్ కె. మధుమూర్తి మాట్లాడుతూ ఉన్నతవిద్య, పరిశోధన నాణ్యత, పరిశ్రమ అకాడమీ అనుసంధానం వంటి అంశాలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

● ఏఎన్‌యూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధరరావు మాట్లాడుతూ గ్లోబల్ స్థాయిలో జరుగుతున్న పరిశోధనాధోరణులు, వైద్య శాస్త్రాల్లో సాంకేతికతపై విలువైన అవగాహన కల్పించారు.

● యూనివర్సిటీ ఆఫ్ అలబామా, ట్రాన్స్లేషనల్ సైన్స్ మెడిసిన్ విభాగం డాక్టర్ ఎం.ఎస్.వి.రవికుమార్ మాట్లాడుతూ ప్రయోగశాల స్థాయి పరిశోధనలు, వైద్య ఆవిష్కరణలుగా సమాజానికి ఉపయోగపడే విధానాన్ని వివరించారు.

● ఫిలిప్పీన్స్ ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ నేసె శ్రీనివాసులు వ్యవసాయ పరిశోధనల్లో బయోటెక్నాలజీ పాత్ర, ఆహార భద్రత, సమగ్ర అభివృద్ధి అంశాలపై వివరించారు.

● హైదరాబాద్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ జి. నరహరిశాస్త్రి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అంతర శాఖల పరిశోధనలు ఇన్నోవేషన్‌పై సమాచారాన్ని అందించారు.

● అలబామా స్టేట్ యూనివర్సిటీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోలాజికల్ సైన్సెస్ ప్రొఫెసర్ మనోజ్ కె. మిశ్రా బయోమెడికల్ సైన్సెస్, గ్లోబల్ రీసెర్చ్ సహకారం యువ పరిశోధకులకు ఉన్న అవకాశాలను వివరించారు.

కార్యక్రమంలో దేశంలోని సుమారు 12 రాష్ట్రాలకు చెందిన 50కి పైగా ప్రముఖ విద్యాసంస్థల నుంచి 1250 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

కొల్లూరు: ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృత్యువాత చెందగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. క్రాప గ్రామానికి చెందిన యేమినేని నాగమల్లేశ్వరరావు (51) తన టీవీఎస్ మోపెడ్‌పై కొల్లూరు నుంచి స్వగ్రామమైన క్రాప వెళుతున్నాడు. అదే గ్రామానికి చెందిన గొరికపూడి మోజెస్ (రవికుమార్) తన పల్సర్ వాహనంపై తెనాలి ప్రధాన రహదారి వైపు వెళుతున్నాడు. క్రాప అడ్డరోడ్డు నుంచి క్రాప గ్రామంలోకి వెళ్లే మార్గంలో ఇరువురు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఇరువురిలో నాగమల్లేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన ఇరువురిని ఆటోలో వేమూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు నాగేశ్వరరావు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. తీవ్ర గాయాలైన మోజెస్‌ను ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాద ఘటనపై కొల్లూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. నాగమల్లేశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఉప్పుటూరులో క్షుద్రపూజల కలకలం

పర్చూరు(చినగంజాం): మండలంలోని ఉప్పుటూరు గ్రామ పరిధిలో క్షుద్రపూజల ఆనవాళ్లు కనబడటంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గ్రామానికి వెళ్లే జాతీయ రహదారి పక్కన.. పర్చూరు వాగు వంతెనపై ఉన్న పైపులైను పక్కన గుర్తించిన ప్రజలు, ప్రయాణికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆదివారం అర్ధరాత్రి ప్రాంతంలో గుడ్డ సంచిని పరిచి దానిపై పసుపు, కుంకుమలు, నిమ్మకాయలు, కొబ్బరి కాయలు కొట్టారు. కోడి గుడ్లతో పాటు దీపారాధన చేసినట్లుగా గుర్తులు కనిపించాయి.

21న సెంట్రల్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

వాక్‌థాన్‌లో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ రాజేష్ రంజన్, వెంకటేశ్వరరావు తదితరులు

కొరిటెపాడు(గుంటూరు వెస్ట్): సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 115వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఈ నెల 21వ తేదీన జరుపుకుంటోందని ఆ బ్యాంక్ చీఫ్ మేనేజర్ రాకేష్ రంజన్ తెలిపారు. అందులో భాగంగా మంగళవారం 'భూమిని రక్షించండి.. ఆరోగ్యంగా ఉండండి' అంటూ వాకథాన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ రంజన్ మాట్లాడుతూ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 115వ వ్యవస్థాపక దినోత్సవానికి దారితీసే కార్యకలాపాలలో భాగంగా, కడప ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో 'ఆరోగ్యంగా ఉండండి, ఫిట్‌గా ఉండండి' అనే థీమ్‌తో ఫిట్‌నెస్ అవగాహన వాకథాన్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. శారీరక ఫిట్‌నెస్, ఆరోగ్యకరమైన జీవనాన్ని ప్రోత్సహించడానికి కడప ప్రాంతీయ కార్యాలయం, నగరపాలెం ప్రాంతంలో ఒక వాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రాంతీయ అధిపతి ఇ. వెంకటేశ్వరరావు సమక్షంలో ఈ కార్యక్రమం జరిగిందని వివరించారు.

ఉపాధ్యాయులకు ఐడీఈ బూట్ క్యాంప్

కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

ప్రత్తిపాడు: పీఎంశ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఐడీఈ బూట్ క్యాంప్ తమ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు కిట్స్ కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు తెలిపారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ), కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో కిట్స్ కళాశాలలో పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఇన్నోవేషన్, డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్షిప్ (ఐడీఈ) బూట్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, ఏఐసీటీఈ, ఎంవోఈ ఇన్నోవేషన్ సెల్, ఎస్‌సీఈఆర్టీ, స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్, వాద్వానీ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో జరిగే ఈ క్యాంప్‌కు కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి సంబంధిత స్కూల్స్ ఉపాధ్యాయులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయుల్లో ఇన్నోవేషన్, డిజైన్ థింకింగ్ వ్యాపారోన్ముఖ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ క్యాంప్ చేపడుతుందని వివరించారు. బూట్ క్యాంప్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఆర్జేడీ వి.లింగేశ్వర రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు నిపుణులైన రిసోర్స్ పర్సన్లతో లెక్చర్లు, వర్క్ షాపులు, హ్యాండ్స్-ఆన్ సెషన్లు నిర్వహించబడతాయని తెలిపారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేందుకు బూట్ క్యాంప్ దోహదపడుతుందన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమావేశంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, బూట్ క్యాంప్ ఇన్‌చార్జి ఎస్‌పీవోసీ డాక్టర్ అరుణ పాల్గొన్నారు.

80 లోనూ పతకాల పంట

పతకాలు సాధించిన బుల్లయ్య, వీరారెడ్డి

తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం గ్రామానికి చెందిన ఆళ్ళ వీరారెడ్డి, సోమిశెట్టి బుల్లయ్య 80 సంవత్సరాల వయస్సులోనూ అథ్లెటిక్స్‌లో పాల్గొని మెడల్స్ సాధిస్తున్నారు. బాపట్లలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో 7వ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో జావెలెన్ త్రో, లాంగ్ జంప్, త్రో బాల్ పోటీలు 80 సంవత్సరాలు దాటిన వారికి నిర్వహించారు. కఠెవరం గ్రామానికి చెందిన ఆళ్ళ వీరారెడ్డి, సోమిశెట్టి బుల్లయ్య పాల్గొన్నారు.

● బుల్లయ్య జావెలెన్ త్రో, త్రోబాల్, లాంగ్ జంప్‌లో ప్రథమ బహుమతి సాధించగా, ఆళ్ళ వీరారెడ్డి షార్ట్‌పుట్‌లో ప్రథమ బహుమతి సాధించినట్లు చెప్పారు.

● చిన్ననాటి నుంచి క్రీడల్లో ఈ ఇరువురు ఉత్సాహంగా పాల్గొంటారని గ్రామస్తులు వివరించారు. ఈ సందర్భంగా ఇరువురుని సత్కరించి అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో లక్కరాజు శ్రీనివాసరావు, లక్కరాజు ఉమాకాంత్, కొల్లి ఉమాశంకర్‌రెడ్డి, పుట్టా రవికిషోర్, లక్కరాజు హరి, ఎం.నరేంద్ర, ఎస్.కోటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

బస్సు కింద ఇరుక్కుపోయిన బైక్

తెనాలి రూరల్: ఆర్టీసీ బస్సు ఢీకొని బైక్‌పై వెళుతున్న ఇరువురు వ్యక్తులు గాయపడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం తెనాలి నుంచి నందివెలుగు మీదుగా ఆర్టీసీ బస్సు గుంటూరు వెళుతుండగా కాజీపేట ఏ-వన్ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఓ సైకిల్, బైక్ ఢీకొని దానిపై ప్రయాణిస్తున్న వారు రోడ్డుపై పడ్డారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ రోడ్డుపై పడిన వారిని తప్పించబోయి ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టాడు. బైక్ పై ప్రయాణిస్తున్న కొలకలూరు బాపయ్యపేటకు చెందిన పురంశెట్టి రామకృష్ణ, నీలి శ్రీనివాసరావు గాయపడ్డారు. ఇరువురిని స్థానికులు తెనాలి వైద్యశాలకు తరలించారు. రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా వైద్యశాలలో నాలుగు స్క్రబ్ టైఫస్ అనుమానిత కేసులు

తెనాలి అర్బన్: జిల్లాను వణికిస్తున్న స్క్రబ్ టైఫస్ కేసుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. తెనాలి జిల్లా వైద్యశాలలో ఇప్పటికే 10 మంది చికిత్స పొందారు.మరి కొందరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వీరిలో పొన్నూరుకు చెందిన ఓ వ్యక్తి పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపినట్లు వైద్యులు తెలిపారు. మంగళవారం మరో నలుగురు స్క్రబ్ టైఫస్ లక్షణాలతో చేరినట్లు చెప్పారు. వీరికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశామని, బుధవారం రిపోర్టులు వచ్చే అవకాశం ఉందన్నారు.

బాలుడు బలవన్మరణం



మార్టూరు: ఓ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మార్టూరులో మంగళవారం ఉదయం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. స్థానిక విద్యానగర్ కాలనీకి చెందిన దేసు ప్రసన్నకుమార్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు భద్రి (14) సంతానం. భద్రి స్థానిక ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. క్లాసులో మెరిట్ స్టూడెంట్‌గా ఉండే భద్రి.. ఇటీవల తన అమ్మమ్మ మృతి చెందినప్పటి నుంచి మానసికంగా బాధపడుతూ స్కూల్‌కు సరిగా వెళ్లడం లేదు. ఈ క్రమంలో ఉదయం 7:30 గంటల సమయంలో భద్రి తన తాతయ్యకు టీ పెట్టి ఇచ్చి.. ఇంట్లోకి వెళ్లి తిరిగి బయటికి రాలేదు. మనుమడు ఎంతకూ బయటకు రాకపోవడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా.. సీలింగ్ ఫ్యాన్‌కు తల్లి చీరతో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. కేకలు వేస్తూ స్థానికులను అప్రమత్తం చేయగా వారు కిందదించి స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఎప్పుడూ చదువులో ముందుండే భద్రి అకాల మరణంతో శోకసంద్రంలో మునిగిపోయిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

మనస్తాపంతో లారీ డ్రైవర్ ఆత్మహత్య

బల్లికురవ: మనస్తాపంతో ఓ లారీ డ్రైవర్ మద్యంలో గడ్డి నివారణకు వాడే పురుగు మందు కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 65 గంటలపాటు మృత్యువుతో పోరాడి మంగళవారం ఉదయం చనిపోయాడు. అందిన సమాచారం ప్రకారం మండలంలోని వైదన గ్రామానికి చెందిన శాయిని వేణుగోపాల్ (52) లారీ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈయనకు భార్య రామాంజమ్మ ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయాడు. ఎస్సై వై. నాగరాజు కేసు నమోదుతో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
■ జిల్లా కేంద్రం నరసరావుపేటలో బైపాస్ రోడ్డుకు దగ్గరగా అతి తక్కువ ధరకు ఇంటి స్థలాలు లభించును. వివరాలకు: 73869 48543

SERVICES

BUSINESS OFFER
■ చిన్న వ్యాపార యజమానులకు మంచి అవకాశం. ZED MSME ప్రభుత్వ పథకంలో RSJతో భాగస్వామ్యం చేయండి. ఈ అవకాశాన్ని మిస్ కావద్దు. ✆ 8595924917

GOLD FINANCE
■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 8333833368
■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071
■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. ✆ 87907 41166

WANTED
■ గుంటూరుసిటీ ప్రముఖ హోటల్ నందు హౌస్‌కీపింగ్ స్టాఫ్, రూమ్ బాయ్స్ కావలెను. (హోటల్ మేనేజ్మెంట్ వారికి ప్రాధాన్యత) 8185826270, 8247814976
■ గుంటూరు మరియు నరసరావుపేట లోని ప్రముఖ అడ్వకేట్ ఆఫీస్ నందు Legal Opinions టైప్ చేయుటకు అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. Cont: 9346983822
■ కేర్‌టేకర్ కావలెను. గుంటూరులో ఇంట్లోనే ఉండి పెద్ద వయస్సు గల మగవారిని చూసుకోవలెను. ఏ బాదరాబందీ లేకుండా ఉన్న మగవారు మాత్రమే కావలెను. 10వ తరగతి చదివి ఉండవలెను. జీతము: నెలకు 12000/- రూ॥లు, సంవత్సరమునకు బోనస్: 40000/- రూ॥లు మరియు భోజనం, వసతి కల్పించబడును. వివరములకు ఫోన్ నెంబర్: 90102 99252
■ మా ఆఫీసు నందు పనిచేయుటకు టాలీ అకౌంటెంట్స్, సివిల్ డిప్లొమా ఇంజనీర్స్, కారు డ్రైవర్స్, ఆఫీస్‌బాయ్స్, ఆఫీస్‌బాయ్స్ GNTలో నివసించే వారు మాత్రమే. 9985288800, 9394107300

■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు Senior Construction Site Incharges గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 50000/- నుండి 60000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: Civil Diploma మరియు Civil Engineering, వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429
■ తెనాలి దగ్గర, దుగ్గిరాలలో ప్రముఖ కాఫీ పరిశ్రమకు ASO (Ex. Service Man & Civil), సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సంప్రదించండి ✆ 80961 61777, 70939 24466
■ సె॥ గార్డ్స్ అమరావతి కొత్త CRDA ప్రాంతంలో 12 గం కావలెను. వ: 45 Q: 10 P/F, జీ: 17 వేలు + PF, ESI. సంప్ర: 94903 80213, 94902 48039
■ ఉద్యోగ అవకాశం డిగ్రీ పూర్తిచేసిన వారికి ఫీల్డ్‌వర్క్ (Field Work) కోసం అవకాశం, వయస్సు : 30 సం॥లోపు. ✆ +91 88006 29648, RSJ Inspection Service Ltd.
■ నరసరావు పేట ఊర్లో ప్రముఖ హాస్పిటల్ లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను .8గం డ్యూటీ ఈఎస్ఐ , పీఎఫ్ కలదు. ✆ 7386688787
■ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శ్రీ స్టార్ గోల్డ్ కంపెనీలో ఫీల్డ్ మేనేజర్స్, గోల్డ్ వాల్యూయర్స్ ఏజ్ 22-35 ఫ్రెషర్స్ కూడా కావలెను. Ph : 6281037879

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు
7075167663
7075167541

గమనిక

క్లుప్తంగా

పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలి

తాడేపల్లి రూరల్: ఉండవల్లి బాపనయ్య నగర్ ప్రాంత వాసులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి డిమాండ్ చేశారు. మంగళవారం బాపనయ్య నగర్ నివాసితులతో ఆయన మాట్లాడారు. యువగళం పాదయాత్ర సందర్భంగా సీతానగరం వద్ద నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలో 20 వేల మంది పేదలకు ఇళ్లస్థలాలు, పట్టాలు ఇస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేశారు. పేదలు తమకు ఇళ్లస్థలాలు కేటాయించాలని ఇప్పటికే అధికారులకు దరఖాస్తులు అందజేశారు.. కానీ నేటికీ స్పందన లేదని విమర్శించారు. అధికారులు వెంటనే విచారణ చేసి ఇళ్ల స్థలాల లబ్ధిదారుల లిస్టును ప్రకటించాలని డిమాండ్ చేశారు. సోమవారం ఉండవల్లి సెంటర్‌లోని సచివాలయం వద్ద ఇళ్లస్థలాలు కావాల్సిన పేదలతో అర్జీలు అందజేస్తామని, పేదలందరూ సచివాలయం వద్దకు రావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సైకం వెంకట నారాయణ, కె.రామకృష్ణ, వల్లభాపురం వెంకటేశ్వరరావు, బక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యపై యాజమాన్యం స్పందించాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్య పరిష్కరించడంలో యాజమాన్యం స్పందించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధి బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ.. గత 378 రోజులుగా కార్మికులు దీక్షలు నిర్వహిస్తున్నారని, యాజమాన్యం లేదా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అన్నారు. ప్రతి కార్మికుడికి వయసు మీద పడి తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సుభాని, గురవయ్య, శివకుమార్, తుమాటి నాగేశ్వరరావు, బూరగ అంకయ్య, ఆశీర్వాదం, సుబ్బారావు, యహోషువా తదితరులు పాల్గొన్నారు. దీక్షలో శాంతమ్మ, రమణమ్మ, శారద, నాగమల్లేశ్వరి, సువర్ణకుమారి కూర్చున్నారు.

తాగునీటి పైపులైనుకు మరమ్మతులు

తాడికొండ: తుళ్లూరు ప్రధాన రహదారిలో తాగునీటి పైపులైను మరమ్మతులకు గురైయింది. దీంతో మంగళవారం తెల్లవారుజామున ప్రధాన రహదారిలో మరమ్మతులు చేపట్టారు. గ్రామంలో 40 ఏళ్ల క్రితం వేసిన ప్రధాన పైపులైను మరమ్మతులకు గురవడంతో జేసీబీ సాయంతో రోడ్డు తవ్వించి మరమ్మతులు చేపట్టినట్లు కార్యదర్శి రఘునాథకుమారి తెలిపారు. వీలైనంత త్వరగా మరమ్మతులు పూర్తిచేసి గ్రామంలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

ఫిరంగిపురం: రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని మార్కెట్ యార్డు చైర్మన్ టి.శేషరావు అన్నారు. మండలంలోని రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో పాలకవర్గ స్వీకార కార్యక్రమంలో భాగంగా, వ్యవసాయ సిబ్బందితో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు, ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోళ్లు గురించి రైతులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో వాసంతి, సీసీఐ అసిస్టెంట్ బయ్యర్ రజత్‌ప్రియా, విస్తరణాధికారి షేక్ సుభాని, ఐక్యరైతులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

తాడికొండ: ఇంటి నుంచి వెళ్లిన బాలిక తిరిగి రాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేశారు. ఈ ఘటన తాడికొండ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికొండ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఈనెల 14న ఇంటి నుంచి అదృశ్యమైంది. బాలిక గుంటూరులో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుంది. ఆదివారం కళాశాలకు సెలవు కావడంతో ఇంటివద్దే ఉన్న బాలిక సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి నుంచి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో బాలిక తల్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

ఉపాధిహామీ చట్టాన్ని రక్షించాలి

బిల్లు కాపీలను దహనం చేస్తున్న ఈమని అప్పారావు, నాయకులు

చిలువూరు నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు

ఫిరంగిపురం: జాతీయ ఉపాధిహామీ చట్టం 2005ను రక్షించాలని.. కేంద్రం తీసుకువస్తున్న వికసిత్ భారత్ గ్యారెంటీ రోజ్‌గార్ అండ్ అజీవక కమిషన్ గ్రామీణ బిల్లును ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు అన్నారు. మండలంలోని పొనుగుపాడు, గుండాలపాడు గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం, ఉపాధిహామీ కూలీల ఆధ్వర్యంలో మంగళవారం కొత్త బిల్లు కాపీలను దహనం చేశారు. అప్పారావు మాట్లాడుతూ.. కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు అనేక పోరాటాలు చేసిన ఫలితంగా 2005లో యూపీఏ ప్రభుత్వానికి కమ్యూనిస్టులు ఒత్తిడి మేరకు పని గ్యారెంటీని హక్కుగా చేస్తూ ఉపాధిహామీ చట్టం తీసుకువచ్చారని వివరించారు. నేడు కేంద్రం ఉపాధిహామీ కొత్త బిల్లు తీసుకు వచ్చిందని.. ఇది కార్మికులు, పేదరైతుల హక్కులు కాలరాసే విధంగా ఉందని అన్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి, నాయకులు డి.సుబ్బారావు, ఎం.కోటేశ్వరమ్మ, శివమ్మ, దుర్గమ్మ, భాస్కరరావు, హనుమంతురావు, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి చట్టం రద్దుపై నిరసన

దుగ్గిరాల: మహాత్మా గాంధీ ఉపాధిహామీ చట్టాన్ని రద్దుచేసి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకురాలు వి.రాణి తెలిపారు. మంగళవారం దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామం సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ.. వామపక్షాల ఆధ్వర్యంలో 2005లో బిల్లు తీసుకువచ్చిన ఉపాధిహామీ చట్టానికి నేడు బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని మండిపడ్డారు. ఈ పథకం వల్ల గ్రామంలోని పేదలు, వ్యవసాయ కార్మికులకు కొంతమేర ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని వివరించారు. ఇప్పటికే ఈ పథకాన్ని నిర్వీర్యం చేయాలని రెండు పూటలా పని విధానాన్ని తీసుకొచ్చిందని.. అది చాలదన్నట్లు పేరు మార్చి పథకాన్ని అంచెలంచెలుగా తీసివేయాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు, కె.జోజి, జి.బాలచంద్రుడు, ఎం.అంజయ్య, కె.ప్రభాకర్‌రావు, బి.దిబ్బరాజు, టి.బుజ్జి, కె.శ్రీరాములు, ఎన్.నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

తాడికొండ: కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజాగ్రహం తప్పదని సీఐటీయూ జిల్లా నాయకులు యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు అన్నారు. తాడికొండ ప్రధాన రహదారిపై గల సీఐటీయూ కార్యాలయం వద్ద మంగళవారం జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈనెల 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని, కార్మిక హక్కులను కాపాడి ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చింతల భాస్కరరావు, అంగన్‌వాడీలు, ఆశాలు, ఆటో వర్కర్లు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై మహాసభలో తీర్మాణం

తాడేపల్లి రూరల్: విశాఖలో ఈనెల 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలకు కార్మికులు తరలి రావాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని మున్సిపల్ కార్మికుల మచ్చర్ పాయింట్ల వద్ద మంగళవారం కార్మికులతో నాయకులు బూరగ వెంకటేశ్వర్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేయడానికి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చాయని అన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని తొలగించి 12 గంటల పనివిధానం తీసుకురావడం దుర్మార్గమన్నారు. హక్కుల సాధన కోసం కార్మికుల లక్ష్యాలను సీఐటీయూ అఖిల భారత మహాసభల్లో చర్చించనున్నామన్నారు. కార్యక్రమంలో కార్మికులు మేరి, సతీష్, కామాక్షి, లక్ష్మి, అనూష, సువార్త, రాణి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

కొల్లిపర ఎస్ఐ ప్రసాద్

కొల్లిపర: ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ప్రతి వ్యక్తి తప్పనిసరిగా హెల్మెట్ ధరించి క్షేమంగా గమ్యం చేరుకోవాలని ఎస్ఐ ఎన్.సి.ప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలో కృష్ణా నది కరకట్ట వద్ద వాహన తనిఖీలో భాగంగా వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ప్రాముఖ్యత గురించి యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వలన ప్రయాణంలో ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ జరిగితే తలకు బలమైన గాయాలు తగలకుండా ప్రాణాలు కాపాడుకోవటం, హెల్మెట్ పాత్ర ముఖ్యమైనదన్నారు. చిన్నచిన్న కారణాలు చూపించి హెల్మెట్ ధరించకుండా పక్కన పెట్టడం సరైన కారణం కాదని హెచ్చరించారు. వాహనాలు నడిపే సమయంలో మద్యం సేవించి వాహనం నడిపితే అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనంపై త్రిబుల్ రైడింగ్ చేయరాదని విజ్ఞప్తి చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని హెల్మెట్ ధరించకపోవడం వలన రోడ్డు ప్రమాదాలకు గురైనప్పుడు తలకు బలమైన గాయం తగలడం వల్ల చాలామంది ప్రస్తుతం ప్రాణాలు కోల్పోతున్నారని గ్రహించి ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ఉంటే తలకు ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని గుర్తు చేశారు. ప్రస్తుత కాలంలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు వలన మరణించే వారిలో ఎక్కువగా తలకు గాయాలై మరణించడం జరుగుతోందన్నారు. దానిని నివారించాలంటే తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని వారు తెలిపారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడిపితే, వారి తో పాటు వారి తల్లిదండ్రులపై కూడా కేసు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

హెల్మెట్ ప్రాముఖ్యత గురించి వివరిస్తున్న ఎస్ఐ ప్రసాద్

బహిరంగ క్షమాపణ చెప్పాలి

దుగ్గిరాల: ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ప్రవర్తించడం దారుణమని.. వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షుడు షేక్ సుభానీ అన్నారు. మండల కేంద్రం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా మెడికల్ కళాశాలలో హిజాబ్ ధరించిన విద్యార్థినిపై జరిగిన అమానుష ఘటన మరువక ముందే నితీష్‌కుమార్ ముస్లిం మహిళా డాక్టర్‌కు పత్రం అందజేసిన అనంతరం బహిరంగ వేదికపై ఆమె అంగీకారం లేకుండా బలవంతంగా హిజాబ్ తొలగించడం అవమానకరం అని అన్నారు. ఈ చర్య మహిళల గౌరవానికి తీవ్ర విఘాతం కలిగించిందని పేర్కొన్నారు. సమావేశంలో ముస్లిం పెద్దలు షేక్ జానీ సాహెబ్, మహబూబ్ సుభాని పాల్గొన్నారు.

వాజ్‌పేయి జయంతిని జయప్రదం చేయాలి

తెనాలిటౌన్: భారతదేశ మాజీ ప్రధానమంత్రి, అజాతశత్రువు అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి వేడుకలను బీజేపీ కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు అడపా సంపత్‌రాయుడు విజ్ఞప్తి చేశారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారి వాజ్‌పేయి శతజయంతి వేడుకలు వైభవంగా జరగనున్న సందర్భంగా తెనాలికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు అడపా సంపత్‌రాయుడు మంగళ వారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు.

అజాత శత్రువు, పరిపాలన దక్షుడు వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఆయన విగ్రహాలను నెలకొల్పాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎ మాధవ్ సంకల్పించినట్టు గుర్తు చేశారు. అందులో భాగంగా మంగళవారం ధర్మవరంలో ఆయన విగ్రహావిష్కరణ జరిగిందన్నారు. ఆ క్ర మంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ వాజ్‌పేయి విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ఆయన అడుగుజాడల్లోనే నేటి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఇతర మంత్రులు భారత్‌ను విశ్వగురుగా, వికసిత భారత్‌గా తీర్చిదిద్దే కృషి చేస్తున్నారని తెలిపారు. డిసెంబర్ 25న వాజ్‌పేయి శతజయంతి రోజున ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఆయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నా యుడు ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. ఆ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగానూ, జిల్లాలోని బీజేపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అనంతవరంలో నైపుణ్యాభివృద్ధిపై సమావేశం

తాడికొండ: తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో మంగళవారం ఏపీ సీఆర్డీఏ ఆధ్వర్యంలో ఉపాధి కల్పన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన గ్రూప్ డైరెక్టర్(సోషల్ డెవలప్‌మెంట్) శ్రీరాములు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, యువత ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఉద్దేశించిన వినూత్న జీవనోపాధి కార్యక్రమాలను వివరించారు. ఏపీ సీఆర్డీఏ ఆధ్వర్యంలో అమలయ్యే ఈ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ఆర్థికాభివృద్ధికి బలం చేకూర్చనుందని.. ఇందులో భాగంగా మహిళలకు స్వయం ఉపాధి కల్పన లక్ష్యంగా క్లౌడ్ కిచెన్‌ల ఏర్పాటు, బ్యూటీషియన్, హౌస్‌కీపింగ్, వస్త్ర పరిశ్రమ సంబంధిత విభాగాలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంస్థ సభ్యులు, స్థానిక ప్రతినిధులు, గ్రామస్తులు హాజరయ్యారు.

గోదాముల్లో ధాన్యం నిల్వ చేసుకోండి

యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి సుబ్బారావు

తెనాలిటౌన్: వరి పండించిన రైతులు ధాన్యాన్ని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాముల్లో నిల్వ చేసుకోవచ్చని యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి డి.సి.హెచ్.సుబ్బారావు సూచించారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ యార్డులో 17 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ధాన్యాన్ని నిల్వ చేసుకోవచ్చని చెప్పారు. ధాన్యానికి ధర ఆశాజనకంగా లేని యెడల రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, కౌలు రైతులు కౌలు కార్డు తీసుకువచ్చి ధాన్యాన్ని గోడౌన్‌లలో నిల్వ చేసుకోవచ్చని తెలిపారు. ఆరు నెలల పాటు ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా నిల్వ చేసేందుకు అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం రైతులు ఇక్కడ యార్డు ప్రాంగణంలో ధాన్యాన్ని ఆరబెట్టుకుని మద్దతు ధరకు అమ్ముకుంటున్నారని, కొందరూ గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ధాన్యానికి సంబంధించి సెస్ నాలుగు చెక్ పోస్టుల ద్వారా వసూలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో తెనాలి యార్డు సెస్ వసూల్లో ప్రథమ స్థానంలో ఉన్నట్లు వివరించారు.

లారీలు, ట్రాక్టర్‌ల నుంచి ధాన్యం గోదాముల్లో దింపుతున్న దృశ్యం

మరింత చేరువగా రెవెన్యూ సేవలు

తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలి రూరల్: రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తామని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ చెప్పారు. స్థానిక కార్యాలయంలో వీఆర్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కార్యాలయాన్ని ఎంత ఉత్సాహంతో ఆధునీకరించామో, అదే ఉత్సాహంతో రెవెన్యూ శాఖకు సంబంధించి ప్రతి సర్వీసును ప్రజలు మెచ్చే విధంగా అందిస్తామన్నారు. 'మన ఊరు.. మన కార్యాలయం' పేరిట ఆధునీకరించిన తహసీల్దార్ కార్యాలయం పునః ప్రారంభోత్సవం విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యాలయం ఆధునీకరణలో దాతల సహకారం ఎంతో ఉందని, దానికి తోడు ప్రతి పనిలోనూ సిబ్బంది భాగస్వాములయ్యారని చెప్పారు. కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు సొంత గ్రామాల్లోనే ప్లాట్లు కేటాయించాలి

సీపీఎం రాజధాని కమిటీ డిమాండ్

తాడికొండ: రాజధాని నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన అమరావతి రైతులకు సొంత గ్రామాల్లోనే ప్లాట్లు కేటాయించాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తుళ్లూరులో ఓ ప్రకటన విడుదల చేశారు. రాయపూడి సీఆర్డీఏ కార్యాలయంలో సోమవారం ఈ–లాటరీ పద్ధతిలో జరిగిన ప్లాట్ల కేటాయింపుపై రైతులు అసంతృప్తితో నిరసన వ్యక్తం చేసిన నేపథ్యంలో అధికారులు రైతుల నిరసనను పరిగణలోకి తీసుకుని రైతులు కోరుతున్నట్లుగా వారి సొంత గ్రామాల్లోనే ప్లాట్లు కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. దూర గ్రామాలలో ప్లాట్లు ఇవ్వడం వల్ల తమకు ఏమాత్రం ఉపయోగం లేదని రైతులు పేర్కొంటున్న విషయాన్ని అధికారులు, ప్రభుత్వం ఎందుకు పరిగణలోకి తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించి రైతులు కోరుతున్న విధంగా ప్లాట్లు కేటాయింపు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి

తాడేపల్లి రూరల్: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 75 కేజీల బస్తా రూ.1,792కు ధాన్యం కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఉండవల్లి గ్రామంలోని రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శివశంకరావు మాట్లాడుతూ.. రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు 75 కేజీల బస్తాను రూ.1,400లకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఖరీఫ్‌లో కురిసిన వర్షాలు, రెండు తుపానుల ప్రభావం వల్ల రెండుసార్లు పంట వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, విత్తనాలు నాటిన దగ్గర నుంచి రైతులు ఎన్నో కష్టాలను ఎదుర్కొని పంట పండిస్తే తుఫాన్ ప్రభావం వల్ల 40 బస్తాలు రావాల్సిన దిగుబడి 25 నుంచి 30 బస్తాలలోపే వచ్చిందని తెలిపారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు రాక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తేమశాతం ఆంక్షలు సడలించి ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజధాని రైతు సంఘం అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, వీరాస్వామి, తాడేపల్లి మండల అధ్యక్షులు బి.శ్రీనివాసరెడ్డి, రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, రైతులు గాంధీ, రామారావు, బాలయేసు, కోటేశ్వరరావు, శ్రీనివాస నాయుడు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

బాలల హక్కులను కాపాడుదాం

తాడికొండ: ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా బాలల హక్కులను కాపాడాలని డిప్యూటీ ఎంపీడీవో రెహమాన్ అన్నారు. మంగళవారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో బాలల హక్కులు, పిల్లలు, యువతపై జరుగుతున్న హింసపై జీవో, ఎన్జీవో ప్రతినిధులతో సెమినార్ నిర్వహించారు. తండు లక్ష్మణ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ.. బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. బాలలు ఎదుర్కొంటున్న సమస్యలను రిసోర్స్ పర్సన్ బచ్పన్ బచావో ఆందోళన స్టేట్ కోఆర్డినేటర్ తిరుపతిరావు వివరించారు. సిస్టర్ డియానా మాట్లాడుతూ.. తమ సంస్థ 74 దేశాల్లో బాలలు, మహిళల హక్కులపై పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలతో పాటు తల్లిదండ్రులకు కూడా పిల్లలపై బాధ్యత ఉండాలన్నారు. బాలలు ఇంటర్నెట్‌కు దూరంగా ఉండే విధంగా తల్లిదండ్రులు చూడాలన్నారు. కార్యక్రమంలో బత్తుల బాబు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో రెహమాన్

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం

ఫిరంగిపురం: మండలంలోని గరుడాచలపాలెం, 113.తాళ్లూరు, మేరికపూడి, మునగపాడు, వేములూరిపాడు గ్రామాల్లో మంగళవారం విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు ఆశాఖ ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. తనిఖీల్లో మీటర్ లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. మీటరు ఉన్నా అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఆరుగురు.. అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుతున్న ముగ్గురు.. అనుమతించిన లోడుకన్నా అదనంగా వాడుతున్న 33 మంది నుంచి మొత్తంగా రూ.4.86 లక్షల అపరాధరుసుము విధించినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో సీఆర్డీఏ పర్యవేక్షక ఇంజినీర్ ఎం.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్ఏ కరీం, అపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.ఏడుకొండలు, డీఈఈలు జి.గుర్నాదరావు, డీపీఈ విజిలెన్స్ డీఈఈలు కె.రవికుమార్, ఎన్.మల్లికార్జునరావు, ఎస్.శ్రీనివాసరావు, ఏఈఈలు దుర్గాప్రసాద్, సతీష్‌కుమార్, శివశంకర్, కె.కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంత.. ప్రయాణానికి చింత!

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలం యర్రబాలెం గ్రామం నుంచి వెలగపూడి సచివాలయానికి వెళ్లే రహదారిలో ఓ గుంత ప్రమాదకరంగా మారిందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినాయకుని ఆలయం సమీపంలో రహదారి మధ్యలో లోతైన గుంత ఏర్పడింది. రాత్రి సమయాల్లో గుంత కనిపించకపోవడంతో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. తరచూ ఈ మార్గంలోనే ఏపీ సచివాలయానికి పలువురు మంత్రులు, శాసనసభ్యులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు వెళుతూనే ఉంటారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అయితే స్థానికులు వాహనదారులు ప్రమాదానికి గురికాకుండా గుంత చుట్టూ సూచికగా రాళ్లను అమర్చారు. రోడ్డుపై ఉన్న గుంతను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని.. పలువురు వాహనదారులు కోరుతున్నారు.

గుంత చుట్టూ స్థానికులు ఏర్పాటు చేసిన రాళ్లు

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ

మంగళగిరి టౌన్: హార్ట్ సర్జరీ చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు చాగంటి కోటిరెడ్డిని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మంగళవారం పరామర్శించారు. చాగంటి కోటిరెడ్డి నివాసానికి వెళ్లిన వేమారెడ్డి కోటిరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో తాడేపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్యలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పోలీసు విధుల్లో బాధ్యతాయుతంగా రాణించాలి

పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన మాజీ సైనికులతో రాష్ట్ర అధ్యక్షుడు మోటూరి శంకరరావు

తెనాలి: దేశరక్షణలో చిత్తశుద్ధితో సైనికులుగా పని చేసిన మీరంతా ఇకపై ప్రజాక్షేత్రంలో పోలీసులుగా అంకితభావంతో బాధ్యతలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోటూరి శంకరరావు సూచించారు. సైన్యంలో వివిధ రెజిమెంట్లలో విధులు నిర్వర్తించి, రాష్ట్రంలోని పోలీసు కానిస్టేబుల్ పరీక్షలు రాసిన ఉద్యోగం సాధించిన గుంటూరు, కృష్ణాజిల్లాలకు చెందిన మాజీ సైనికులతో మంగళవారం స్థానిక రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో మోటూరి శంకరరావు సమావేశమయ్యారు. మిలటరీ ప్రసాద్ అధ్యక్షత వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు పోలీసు విధుల్లో బాధితులకు సాయం చేయడంలో ముందుండాలని, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా ఆయన సూచించారు. దేశరక్షణ ప్రజారక్షణ రెండూ అత్యధిక ప్రాధాన్యతగల బాధ్యతలేనని ఆయన చెప్పారు. సమావేశానికీ అధ్యక్షత వహించిన మిలటరీ ప్రసాద్ మాట్లాడుతూ 2022 లో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన పోలీస్ రిక్రూట్మెంట్ పరీక్షల్లో విజయం సాధించిన మాజీ సైనికులందరూ పోలీసులుగా విధి నిర్వహణలోనూ సంపూర్ణ విజయం సాధించాలని ఆకాంక్షను వ్యక్తంచేశారు. పోలీసులుగా ఎంపికైన మాజీ సైనికులను సత్కరించారు. వివిధ జిల్లాలకు చెందిన మాజీ సైనికులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన మాజీ సైనికులకు అభినందన

ఏదైనా పనిని గొప్పగా
చేసేందుకు ఏకైక మార్గం..
ఆ పనిని అమితంగా ప్రేమించడమే!

-స్టీవ్ జాబ్స్, యాపిల్ మాజీ సీఈఓ

టెక్ ఉద్యోగాల్లో సరికొత్త మార్పు

ఏఐ

రాతియుగంలో నిప్పు, చక్రం తదితర ఆవిష్కరణలతో మానవాళి జీవన విధానం పూర్తిగా మారింది. నాటి మార్పును మించిన స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. అన్ని రంగాల్లో ఏఐ వినియోగం పెరుగుతోంది. అయితే ఏఐ... ఉద్యోగాల సంఖ్యను తగ్గిస్తోందనే భావన చాలా మందిలో ఏర్పడుతోంది. కానీ టెక్నాలజీలు పాత ఉద్యోగాల స్థానంలో వాటికంటే ఎక్కువ కొత్త ఉద్యోగాలు సృష్టిస్తున్నాయి. ఏఐ విషయంలోనూ అదే జరగనుంది. కాబట్టి ఏఐతో టెక్ ఉద్యోగాల్లో సరికొత్త మార్పులు చోటుచేసుకుంటాయంటున్న జేఎన్‌టీయూ హైదరాబాద్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ **ప్రొఫెసర్ కె. నాగ సుజాత**తో ఇంటర్వ్యూ..

జాబ్ మార్కెట్‌లో ఉద్యోగ అవకాశాలు ఎలా ఉన్నాయి?

ప్రస్తుతం జాబ్ మార్కెట్ చాలా గందరగోళంగా ఉంది. చాలా సంస్థలు ఏఐ (కృత్రిమ మేధస్సు) తదితర టెక్నాలజీలపై చాలా ఆసక్తిగా ఉన్నాయి. వాటిని త్వరలో తమ కార్యకలాపాల్లో వినియోగించేందుకు మొగ్గుచూపుతున్నాయి. ముఖ్యంగా టెక్, హెల్త్‌కేర్, తయారీ, ఆటోమేషన్ వంటి రంగాల్లో కొత్త ఉద్యోగాల నియామక పరిస్థితులు ఎప్పటికప్పుడు మారుతున్నాయి. అంటే ఉద్యోగాలు పూర్తిగా తగ్గిపోవడం లేదు. కానీ వాటి తీరు మారుతోంది. మనుషులతో ఎక్కువ సంబంధం ఉండే, సేవలకు సంబంధించిన ఉద్యోగాల్లో నియామకాలు కొనసాగుతున్నాయి. అయితే యంత్రాలు చేయగలిగే, ఆర్థిక మార్పులకు లోనయ్యే రంగాల్లో ఉద్యోగాలు తగ్గుతున్నాయి.

ప్లేస్‌మెంట్స్‌లో జాబ్స్ సాధించేలా విద్యార్థులు ఏయే అంశాలపై దృష్టి సారించాలి?

నాలెడ్జ్, స్కిల్స్, ఆటిట్యూడ్ వంటి కీలకమైన అంశాలలో విద్యార్థులను తీర్చిదిద్దడానికి ప్లేస్‌మెంట్ విభాగం నిర్వహించే శిక్షణ, మాక్ ఇంటర్వ్యూలను సద్వినియోగం చేసుకోవాలి. ఉద్యోగాలకు అవసరమయ్యే ప్రాథమిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. ప్రధానంగా ఆప్టిట్యూడ్ ట్రెనింగ్ ద్వారా క్వాంటిటేటివ్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీ వంటి అంశాలపై పట్టు సాధించాలి. కంపెనీలు పెట్టే మొదటి రౌండ్‌లో విజయం సాధించడానికి ఇవి చాలా ముఖ్యం. అలాగే, సాఫ్ట్ స్కిల్స్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించి, కమ్యూనికేషన్ స్కిల్స్, బాడీ లాంగ్వేజ్, ప్రెజెంటేషన్ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి. ఆకర్షణీయమైన రెజ్యూమె రైటింగ్ పద్ధతులను తెలుసుకోవాలి. ప్లేస్‌మెంట్స్‌లో భయపడకుండా, సరైన ప్రదర్శన ఇవ్వడానికి సిద్ధమయ్యేలా మాక్ టెస్టులు, మాక్ గ్రూప్‌డిస్కషన్స్, మాక్ ఇంటర్వ్యూలు ప్రాక్టీస్ చేయాలి.

ఏఐ ద్వారా గణనీయమైన మార్పులకు గురయ్యే రంగాలు ఏవి?

డేటా–ఆధారిత రంగాలు ఏఐ, ఆటోమేషన్ ద్వారా గణనీయమైన మార్పులకు గురవుతున్నాయి. ఫైనాన్స్ రంగంలో ట్రేడింగ్ అల్గారిథమ్‌లు సానుకూల ఫలితాలనిస్తున్నాయి. హెల్త్‌కేర్‌లో వేగవంతమైన డేటా విశ్లేషణ జరుగుతోంది. తయారీలో ఆటోమేషన్ శారీరక శ్రమను తగ్గిస్తోంది. అలాగే, కస్టమర్ సర్వీస్‌ను ఏఐ ఏజెంట్లు చేపడుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్‌లో ఏఐ అల్గారిథమ్‌లు కోడ్‌ను ఉత్పత్తి చేస్తూ సామర్థ్యాన్ని పెంచుతున్నాయి. చాలా కంపెనీలు ఏఐ వినియోగం తప్పనిసరి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాయి.

ఉద్యోగార్థులు తమ దరఖాస్తులు ప్రత్యేకంగా కనిపించేలా ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి?

ఈ రోజుల్లో చాలా దరఖాస్తులను కంపెనీలు సంక్లిష్టమైన అల్గోరిథం నమూనాలను ఉపయోగించి ఫిల్టర్ చేస్తాయి. అందుకోసం అభ్యర్థులు తమ దరఖాస్తుల దశలోనే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అందులో విద్యార్థుల లక్ష్యాలు, సాధించిన విజయాలను తప్పనిసరిగా ప్రస్తావించాలి. రిక్రూటర్స్‌ను ఆకట్టుకునేలా దరఖాస్తులను రూపొందించాలి.

ఏఐ ద్వారా ఉద్యోగాల నియామకాల్లో మార్పులు ఎలా ఉండబోతున్నాయి?

ఏఐ ఉద్యోగులను తొలగించడం కంటే, పనుల విస్తరణలు, ఆటోమేషన్ ద్వారా ఉద్యోగాల స్వభావాన్ని పునర్నిర్మిస్తోంది. స్వల్పకాలంలో, ప్రోగ్రామర్లు, అకౌంటెంట్లు, కస్టమర్ సర్వీస్ వంటి వృత్తులలోని నిత్య పనులను ఏఐ సహాయంతో చేయగలదు. దీని ద్వారా ప్రస్తుత ఉద్యోగులు ఉత్పాదకతను పెంచడానికి ఏఐ సాధనాలతో కలిసి పని చేస్తారు. దీర్ఘకాలిక పరిణామాలు అవసరమైన నైపుణ్యాలలో భారీ మార్పును సూచిస్తున్నాయి. ఏఐ కొంతమంది ఉద్యోగులను తొలగించినప్పటికీ, కోల్పోయే ఉద్యోగాల కంటే ఎక్కువ కొత్త ఉద్యోగాలను అది సృష్టించగలదని ఐబీఎం, వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ నివేదికలు పేర్కొంటున్నాయి. ఏఐతో నిరుద్యోగం స్వల్పంగా పెరిగినా... తట్టుకొని నిలవచ్చని గోల్డ్‌మన్ సాచ్ నివేదిక స్పష్టం చేస్తోంది. అంటే ఏఐ నేపథ్యంలో ఉద్యోగుల శైలిలోనూ మార్పు తప్పనిసరి అవుతుంది. ఉద్యోగుల దృష్టి విషయపరిజ్ఞానం నుంచి తెలిసిన విషయాలను ఏ విధంగా ఉపయోగిస్తున్నారో అనే అంశంపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి క్లిష్టమైన ఆలోచన, భావోద్వేగ మేధస్సు, సృజనాత్మకత, సంక్లిష్ట, సమస్య–పరిష్కార నైపుణ్యాలకు భవిష్యత్తులో ఎక్కువ డిమాండ్ ఉంటుంది.

భవిష్యత్ జాబ్ మార్కెట్ డిమాండ్ తీర్చేలా విద్యా సంస్థలు విద్యార్థులను ఎలా సన్నద్ధం చేయాలి?

పాఠ్యాంశాల్లో ఎప్పటికప్పుడు జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా మార్పులు చేయాలి. నైపుణ్యాల ఆధారిత బోధన జరగాలి. పరిశ్రమ అవసరాల అంచనాలకు తగిన విధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలి. విద్యార్థులు రియల్ టైమ్ పని అనుభవాన్ని పొందేలా రియల్ టైమ్ వర్క్ ప్రాజెక్టుల కోసం సాంకేతిక సంస్థలతో కలిసి విద్యాసంస్థలు పనిచేయాలి.

ఇంజనీరింగ్ ప్లేస్‌మెంట్స్‌లో కోర్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఐటీ/ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు ఎలా ఉన్నాయి?

సివిల్, మెకానికల్, కెమికల్ తదితర కోర్ ఇంజనీరింగ్ కోర్సుల విద్యార్థులకు ప్రధానంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయి. అయితే, పెద్ద ఐటీ కంపెనీలు సాఫ్ట్‌వేర్ లేదా సపోర్ట్ ఉద్యోగాల కోసం అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులను తీసుకుంటున్నాయి. దీని ఫలితంగా, కోర్ ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా ఐటీ ఉద్యోగాల వైపు మళ్లుతున్నారు. కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్(ఈసీఈ) తదితర ఐటీ సంబంధిత కోర్సుల విద్యార్థులకు 90% కన్నా ఎక్కువ ప్లేస్‌మెంట్స్ లభిస్తున్నాయి.

ఎస్ఎస్‌సీ జీడీ కానిస్టేబుల్... 25,487 ఖాళీలు
సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో ఉచిత స్టడీ మెటీరియల్

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. భర్తీచేయనున్న 25,487 కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్ ఉచిత స్టడీ మెటీరియల్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. సిలబస్‌కు అనుగుణంగా సమగ్ర మెటీరియల్, రోజువారీ కరెంట్ అఫైర్స్, వాటికి సంబంధించిన నెలవారీ మేగజీన్‌లతోపాటు కరెంట్ అఫైర్స్ బిట్ బ్యాంక్‌ను ఉచితంగా పొందవచ్చు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఈ స్టడీ మెటీరియల్స్‌ను నేరుగా చదువుకోవచ్చు.

కెరీర్ గైడెన్స్

సైబర్ టెక్ నిపుణులకు పెరుగుతున్న డిమాండ్
అన్ని రంగాల్లోనూ అవకాశాలు విస్తృతం
నిపుణుల కోసం అన్వేషిస్తున్న సంస్థలు

నేడు అన్ని రంగాల్లో ఆన్‌లైన్, ఇంటర్నెట్ ఆధారిత కార్యకలాపాలు విస్తృతమవుతున్నాయి. కృత్రిమ మేధ ప్రవేశంతో డిజిటలైజేషన్ మరింత ఊపందుకుంది. ఇదే అదునుగా సైబర్ దాడులు, హ్యాకింగ్, ఫిషింగ్, రాన్‌సమ్‌వేర్, డీప్‌ఫేక్, డిజిటల్ అరెస్టుల ముప్పు పెరుగుతోంది. వ్యక్తులు, సంస్థలు ఆర్థికంగా భారీగా నష్టపోతున్న ఉదంతాలు ఎన్నో!! దీంతో సైబర్ దాడులను అడ్డుకునేందుకు అవసరమైన నైపుణ్యాలున్న నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. సైబర్ సెక్యూరిటీ విభాగంలో స్కిల్స్ ఉంటే.. కంపెనీలు రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో.. సైబర్ సెక్యూరిటీ రంగంలో తాజా ట్రెండ్స్, జాబ్ రోల్స్, డిమాండింగ్ నైపుణ్యాలు, అందుకునేందుకు మార్గాలు తదితర అంశాలపై విశ్లేషణ..

సైబర్ సెక్యూరిటీ.. కెరీర్ గ్యారెంటీ

మీ ఫోన్‌లో అవాంఛిత యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేయొద్దు. అలా చేస్తే హ్యాకర్ల బారిన పడి.. మీ వ్యక్తిగత డేటా చౌర్యానికి గురయ్యే ప్రమాదం ఉంది. ఇటీవల కాలంలో బ్యాంకులు, ఇతర సంస్థల నుంచి వస్తున్న మెసేజ్‌లు!! దీనికి పరిష్కారంగా ప్రస్తుతం సంస్థలు సైబర్ సెక్యూరిటీకి ప్రాధాన్యమిస్తున్నాయి. నిర్దిష్టంగా ఆన్‌లైన్ అప్లికేషన్‌ను రూపొందించే ముందు దాని భద్రతను పరీక్షించేందుకు, అదే విధంగా సదరు అప్లికేషన్ వినియోగంలోకి వచ్చాక.. సైబర్ దాడికి గురి కాకుండా ఉండేలా నిరంతరం వాటిని పర్యవేక్షించేలా సైబర్ నిపుణులను సంస్థలు నియమించుకుంటున్నాయి.

సైబర్ సెక్యూరిటీ అంటే..: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరికరాలను వినియోగించి ఆన్‌లైన్ కార్యకలాపాల భద్రతను పర్యవేక్షించడాన్ని సైబర్ సెక్యూరిటీగా పేర్కొనొచ్చు. కంప్యూటర్లు, నెట్‌వర్క్ సిస్టమ్స్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్, డేటా చోరీ(హ్యాకింగ్) కాకుండా.. సైబర్ సెక్యూరిటీ రక్షణగా నిలుస్తుంది. దీంతో ఆన్‌లైన్ విధానంలో కార్యకలాపాలు నిర్వహించే చిన్నపాటి ప్రైవేటు సంస్థల నుంచి బహుళ జాతి కంపెనీలు, ప్రభుత్వ విభాగాల వరకూ.. అన్నింటా నేడు సైబర్ సెక్యూరిటీ నిపుణుల అవసరం పెరిగింది.

ఈ రంగాల్లో తప్పనిసరి..: ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ సెక్యూరిటీ అనేది ఐటీ నుంచి సర్వీస్ సెక్టార్ వరకూ.. అన్ని రంగాల్లోనూ తప్పనిసరిగా మారింది. ఐటీ, క్లౌడ్ సర్వీసెస్, ఈ–కామర్స్, రిటైల్ సెక్టార్, హెల్త్‌కేర్, ఎడ్‌టెక్, ఫిన్‌టెక్, బీఎఫ్ఎస్ఐలలో సైబర్ భద్రత అవసరం మరింత ఎక్కువగా ఉంటోంది. కారణం.. ఈ రంగాల్లోని సంస్థలు ఆన్‌లైన్ విధానంలో సేవలందించడంలో ముందంజలో నిలుస్తుండడమే.

నిపుణుల కొరత..: సైబర్ సెక్యూరిటీ రంగంలో డిమాండ్‌కు తగ్గట్టు నిపుణులైన మానవ వనరులు లభ్యత లేదు. దీంతో.. కంపెనీలు నిపుణుల కొరతను ఎదుర్కొంటున్నాయి. ఇటీవల ఐఎస్‌సీ సంస్థ నిర్వహించిన నివేదిక ప్రకారం–సైబర్ సెక్యూరిటీ విభాగంలో నిపుణుల ఖాళీలను భర్తీ చేయలేకపోతున్నామని 49 శాతం కంపెనీలు చెప్పడమే ఇందుకు నిదర్శనం. అదే విధంగా సోఫోస్ సర్వే ప్రకారం–60 శాతం సంస్థలు సైబర్ సెక్యూరిటీ నిపుణుల కొరతను ఎదుర్కొంటున్నాయి.

ఎవరైనా నేర్చుకోవచ్చు..: సైబర్ సెక్యూరిటీ పేరు వినగానే కంప్యూటర్ సైన్స్/ఐటీ నేపథ్యమున్న అభ్యర్థులే సరితూగుతారు అనే అభిప్రాయం కలుగుతుంది. కాని అన్ని అకడెమిక్ నేపథ్యాల అభ్యర్థులు ఈ విభాగంలో కొలువుదీరే అవకాశం ఉంది. సంప్రదాయ డిగ్రీ విద్యార్థులు సైతం సైబర్ సెక్యూరిటీ రంగంలో ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. సాధారణ డిగ్రీ విద్యార్థులు కూడా ఇంటర్నెట్, డేటా మేనేజ్‌మెంట్/ఇన్ఫర్మేషన్, ఎథికల్ హ్యాకింగ్ తదితర అంశాలపై పట్టు సాధిస్తే.. ఈ రంగంలో ఉజ్వల అవకాశాలు అందుకోవచ్చు.అయితే టెక్నికల్ గ్రాడ్యుయేట్స్‌లో ఐటీ అప్లికేషన్స్ బేసిక్స్‌పై అవగాహన కొంత ఎక్కువగా ఉంటుందని చెప్పొచ్చు.

ఎన్నో విభాగాలు..: వాస్తవానికి ఆన్‌లైన్ కార్యకలాపాలు, వెబ్‌సైట్స్ భద్రతకు సంబంధించిందిగాసైబర్ సెక్యూరిటీని పేర్కొంటున్నప్పటికీ.. ఇందులోనూ పలు విభాగాలు ఉన్నాయి. వీటిలో ప్రధానమైనవి.. డేటా సెక్యూరిటీ, అప్లికేషన్ సెక్యూరిటీ, ఇన్‌సిడెంట్ మేనేజ్‌మెంట్ అండ్ సెక్యూరిటీ మానిటరింగ్, క్లౌడ్ సెక్యూరిటీ.

సర్కారీ కొలువులు..: ప్రభుత్వ విభాగాలు సైతం తమ కార్యకలాపాలను ఆన్‌లైన్‌లో నిర్వహించే దిశగా చర్యలు తీసుకుంటున్నాయి. ముఖ్యంగా డీబీటీ(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్), బ్లాక్ చైన్ టెక్నాలజీ వినియోగం తదితరాల కారణంగా ప్రభుత్వ విభాగాల్లో సైబర్ సెక్యూరిటీ నిపుణుల అవసరం ఏర్పడుతోంది.

అవసరమైన నైపుణ్యాలు..: సైబర్ సెక్యూరిటీ రంగంలో కెరీర్‌లో రాణించేందుకు నెట్‌వర్కింగ్(టీసీపీ/ఐపీ, డీఎన్ఎస్, వీపీఎన్ఎస్, ఫైర్‌వాల్స్), ఆపరేటింగ్ సిస్టమ్స్(విండోస్, లినిక్స్), క్లౌడ్ ప్లాట్‌ఫార్మ్స్(ఏడబ్ల్యూఎస్, అజూర్, జీసీపీ), స్క్రిప్టింగ్(పైథాన్, బాష్, పవర్‌షెల్), సెక్యూరిటీ టూల్స్(వైర్‌షార్క్, బర్ప్‌సూట్, సీమ్ టూల్స్), వల్నరబిలిటీ స్కానింగ్(నెస్సెస్, క్వాలిస్) వంటి టెక్నికల్ స్కిల్స్‌పై అవగాహన పెంచుకోవాలి. వీటితోపాటు అనలిటికల్ థింకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ దృక్పథం ఉండాలి.

అకడమిక్ మార్గాలు..: సైబర్ సెక్యూరిటీ ఆవశ్యకత, అందుకు కొత్త నైపుణ్యాల ఆవశ్యకతను గుర్తించిన యూనివర్సిటీలు, టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లు.. అకడమిక్ స్థాయిలోనే నైపుణ్యాలు అందుకునే అవకాశం కల్పిస్తున్నాయి. సైబర్ సెక్యూరిటీ/ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ప్రోగ్రామ్‌లను అందిస్తున్నాయి.

సర్టిఫికేషన్లు తప్పనిసరి..: సైబర్ సెక్యూరిటీ విభాగంలో ప్రవేశించడానికి జనరల్ డిగ్రీ మొదలు, ఐటీ ప్రొఫెషనల్స్ వరకు అందరూ అర్హులే. ఈ విభాగంలో ప్రత్యేకంగా శిక్షణనిచ్చే సర్టిఫికేషన్లు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి..

- సిస్కో సంస్థ అందించే సీసీఎన్ఏ సెక్యూరిటీ; సీసీఎన్‌పీ సెక్యూరిటీ; సీసీఐఈ సెక్యూరిటీ, వెబ్‌సైట్: www.cisco.com
- EC కౌన్సిల్ నిర్వహించే సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్ వెబ్‌సైట్: www.eccouncil.org
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ కోర్సులు వెబ్‌సైట్: www.iisecurity.in
- డేటా సెక్యూరిటీ కౌన్సిల్ అందించే సర్టిఫికేషన్ కోర్సులు వెబ్‌సైట్: www.dsci.in

ఉద్యోగ సమాచారం

విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో 90 అప్రెంటిస్‌లు

తిరువనంతపురం(కేరళ)లో ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో)–విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్(వీఎస్ఎస్‌సీ) 2025–26 సంవత్సరానికి సంబంధించి గ్రాడ్యుయేట్ అండ్ టెక్నీషియన్, డిప్లొమా అప్రెంటిస్ ట్రెనీ సెలక్షన్ డ్రైవ్(ఇంటర్వ్యూ) నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థులు ఎంపిక డ్రైవ్‌లో హాజరుకావాలి.

- మొత్తం ఖాళీల సంఖ్య: 90.
- ఖాళీల వివరాలు: జనరల్ స్ట్రీమ్(నాన్ ఇంజనీరింగ్) గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–23, డిప్లొమా టెక్నీషియన్ అప్రెంటిస్–67.
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. చివరి ఏడాది చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- వయసు: 31.12.2025 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
- స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్‌కు రూ.9000, డిప్లొమా టెక్నీషియన్‌కు రూ.8000.
- దరఖాస్తు విధానం: దరఖాస్తులను సెలక్షన్ డ్రైవ్ రోజున మాత్రమే స్వీకరిస్తారు.
- ఎంపిక డ్రైవ్ తేది: 29.12.2025.
- ఇంటర్వ్యూ వేదిక: వి.ఎస్.ఎస్.సి గెస్ట్ హౌస్, ఏ.టి.ఎఫ్ ఏరియా, వేలి, వేలి చర్చికి దగ్గర, తిరువనంతపురం జిల్లా, కేరళ.
- వెబ్‌సైట్: https://www.vssc.gov.in/

ఇండియా ఆప్టెల్ లిమిటెడ్‌లో 149 టెక్నీషియన్ పోస్టులు

రాయ్‌పూర్‌లోని ఇండియా ఆప్టెల్ లిమిటెడ్(ఐవోఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ప్రాజెక్ట్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 149.
- పోస్టుల వివరాలు: ప్రాజెక్ట్ టెక్నీషియన్(ఫిట్టర్ ఇన్‌స్ట్రుమెంట్స్)–61, ప్రాజెక్ట్ టెక్నీషియన్(ఫిట్టర్ ఎలక్ట్రానిక్స్)–49, ప్రాజెక్ట్ టెక్నీషియన్(మెషినిస్ట్)–07, ప్రాజెక్ట్ టెక్నీషియన్(ఆప్టికల్ వర్కర్)–23, ప్రాజెక్ట్ టెక్నీషియన్(ఎలక్ట్రోప్లేటర్)–05, ప్రాజెక్ట్ టెక్నీషియన్ (పెయింటర్)–04.
- అర్హత: పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. ఎన్‌సీవీటీ జారీ చేసిన ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, అడ్వాన్స్ మెకానిక్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానిక్ మెకాట్రానిక్స్, మెకానిక్ ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్, మెకానిక్(ఎంబెడెడ్ సిస్టమ్స్ అండ్ పీఎల్‌సీ), మెకానిక్ పవర్ ఎలక్ట్రానిక్స్(ఇన్వర్టర్, యూపీఎస్ అండ్ మెయింటెనెన్స్ ఆఫ్ డ్రైవ్స్), మెషినిస్ట్, ఆప్టికల్ వర్కర్, ఎలక్ట్రోప్లేటర్, పెయింటర్(జనరల్).
- వయసు: 18 నుంచి 32 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక విధానం: మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది చైర్మన్–మేనేజింగ్ డైరెక్టర్, ఇండియా ఆప్టెల్ లిమిటెడ్, ఓఫిల్డ్ క్యాంపస్, రాయ్‌పూర్, ఉత్తరాఖండ్ చిరునామకు పంపించాలి.
- దరఖాస్తులకు చివరితేది: 29.12.2025.
- వెబ్‌సైట్: https://ddpdoo.gov.in/

బెల్ ఘజియాబాద్‌లో 84 గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఘజియాబాద్ యూనిట్‌లోని వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీల సంఖ్య: 84.
- విభాగాల వారీగా ఖాళీలు: మెకానికల్ ఇంజనీరింగ్–24, కంప్యూటర్ సైన్స్–20, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్–30, సివిల్ ఇంజనీరింగ్–10.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్)లో ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: 31.12.2025 నాటికి 25 ఏళ్లు ఉండాలి.
- స్టైపెండ్: నెలకు రూ.17,500.
- ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ద్వారా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 25.12.2025.
- ఇంటర్వ్యూ తేది: 16.01.2026, 17.01.2026.
- ఇంటర్వ్యూ వేదిక: బెల్, సైట్–4, సహిబాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, భరత్ నగర్ పోస్ట్, ఘజియాబాద్–201010.
- వెబ్‌సైట్: https://belindia.in/

పటియాలా లోకోమోటివ్ వర్క్స్‌లో 225 అప్రెంటిస్‌లు

పంజాబ్‌లోని పటియాల లోకోమోటివ్ వర్క్స్ ఇండియన్ రైల్వేస్(పీఎల్‌డబ్ల్యూ) వివిధ విభాగాల్లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీల సంఖ్య: 225.
- ఖాళీల వివరాలు: ఎలక్ట్రీషియన్–120, మెకానిక్(డీజిల్)–25, మెషినిస్ట్–12, ఫిట్టర్–50, వెల్డర్–18.
- అర్హత: సంబంధిత విభాగంలో టెన్త్, ఇంటర్, ఐటీఐ
- వయసు: 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- స్టైపెండ్: నెలకు రూ.9,600 నుంచి రూ.11,040.
- ఎంపిక విధానం: మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 01.12.2025.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 22.12.2025.
- వెబ్‌సైట్: https://plw.indianrailways.gov.in/

బీఆర్ఐసీ-ఎన్ఐఐ, న్యూఢిల్లీలో 12 పోస్టులు

న్యూఢిల్లీలోని బయోటెక్నాలజీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ కౌన్సిల్(బీఆర్ఐసీ)–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ(ఎన్ఐఐ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా డిప్యుటేషన్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 12.
- పోస్టుల వివరాలు: డిప్యూటీ డైరెక్టర్ జనరల్(సైన్స్)–02, డైరెక్టర్(సైన్స్)–02, డిప్యూటీ డైరెక్టర్(సైన్స్)–02, డైరెక్టర్(అడ్మినిస్ట్రేషన్)–01, డైరెక్టర్(ఫైనాన్స్)–01, సెక్షన్ ఆఫీసర్–04.
- అర్హత: సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ, అనుభవం
- వయసు: 50 ఏళ్లు ఉండాలి.
- ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తులకు చివరితేది: 22.12.2025.
- వెబ్‌సైట్: https://www.nii.res.in/

764 టెక్నికల్ అసిస్టెంట్, టెక్నీషియన్ పోస్టులు

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో)–సెంటర్ ఫర్ పర్సనల్ టాలెంట్ మేనేజ్‌మెంట్(సీఈపీటీఏఎం) సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్–బి, టెక్నీషియన్–ఏ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 764.
- పోస్టుల వివరాలు: సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ బి–561, టెక్నీషియన్ ఏ–203.
- వేతనం: నెలకు సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.35,400 నుంచి రూ.1,12,400, టెక్నీషియన్–ఏకు రూ.19,900 నుంచి రూ.63,200.
- వయసు: 18 ఏళ్ల నుంచి 28 ఏళ్లు మించకూడదు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 01.01.2026.
- వెబ్‌సైట్: https://www.drdo.gov.in/

ఐఓసీఎల్, కోల్‌కతాలో 509 అప్రెంటిస్‌లు

కోల్‌కతాలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్) ఈస్టర్న్ రీజియన్‌లో వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, డిప్లొమా, ఐటీఐ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీల సంఖ్య: 509.
- ఖాళీల వివరాలు: డిప్లొమా టెక్నీషియన్ అప్రెంటిస్–248, ట్రేడ్ అప్రెంటిస్–127, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–107, డేటా ఎంట్రీ ఆపరేటర్–27.
- అర్హత: సంబంధిత విభాగంలో ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: 31.12.2025 నాటికి 18 నుంచి 24 ఏళ్లు
- ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 09.01.2026.
- వెబ్‌సైట్: https://iocl.com/

అరువు కోసం అడ్డదారులు

సంపద సృష్టిస్తానంటూ అధికవడ్డీకి అధిక అప్పులు చేస్తున్న చంద్రబాబు

వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అప్పుల్లో 80 శాతం ఈ 18 నెలల్లోనే దాటేసిన బాబు

ఇలాగైతే రాష్ట్రం సౌత్ సూడానే అంటున్న ఆర్థిక నిపుణులు

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారు రాజ్యాంగ నిబంధనలను ఉల్లఘించి, ఎఫ్ఆర్‌బీఎం (ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్) నిబంధనలకు విరుద్ధంగా వివిధ కార్పొరేషన్ల ద్వారా భారీగా అప్పులు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన వార్షిక రుణ పరిమితికి మించి చంద్రబాబు అప్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగానే తాజాగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) నుంచి అధిక వడ్డీకి బాండ్లు జారీ చేయడం ద్వారా అప్పు చేశారు. అంటే మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి ఈ అప్పు చేశారన్నమాట. ఏపీఎస్‌బీసీఎల్ ద్వారా అప్పు చేయడం రాజ్యాంగంలోని అధికరణ 293 (3) కింద కేంద్ర విధించిన వార్షిక రుణ పరిమితిని ఉల్లఘించడమేనని కేంద్ర ఆర్థిక శాఖ రాష్ట్రాలకు రాసిన లేఖలో స్పష్టంగా పేర్కొంది. కేంద్రం ఆదేశాల ప్రకారం ఏపీఎస్‌బీసీఎల్ ద్వారా సేకరించే అప్పులు వార్షిక రుణ పరిమితిలో భాగమవుతాయని తెలిసినా కూడా చంద్రబాబు ప్రభుత్వం మద్యం బాండ్లు జారీచేయడం ద్వారా అప్పులు చేయడం ఆందోళనకరమని నిపుణులంటున్నారు. ఇలా చేయడం వల్ల అధికవడ్డీ భారంతో పాటు కమీషన్ కూడా చెల్లించాల్సి రావడం వల్ల రాష్ట్ర ప్రజలపై భారీ భారం పడుతుందని వారు పేర్కొంటున్నారు.


surpassing the targets set for fiscal indicators under State FRBM Act. Therefore, borrowings by State Public Sector companies/corporations, SPVs and other equivalent instruments (hereinafter referred as 'State owned entities'), where principal and/or interest are to be serviced out of the State Budgets and/or by assignment of taxes/cess or any other State's revenue, shall be considered as Borrowings made by the State itself for the purpose of issuing the consent under Article 293(3) of the Constitution of India.

ప్రభుత్వ రంగ సంస్థల నుంచి తెచ్చే అప్పులు నిర్దేశించిన రుణ పరిమితిలోకే వస్తాయని కేంద్రం రాసిన లేఖలో భాగం

నాడు గగ్గోలు పెట్టి...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాచురేషన్ స్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేసింది. నాడు మద్యం ఆదాయంపై చేసిన అప్పులపై చంద్రబాబు బృందం గగ్గోలు పెట్టింది. అంతే కాకుండా కేంద్ర ఆర్థికశాఖకు, ఆర్‌బీఐకి, సెబీకి ఫిర్యాదులు చేసింది. రాష్ట్రం శ్రీలంక అయిపోతోందంటూ ఎల్లోమీడియాలో ఎన్నో కథనాలు వండి వార్చారు.. ఎన్నికల ప్రచారాస్త్రంగా వాడుకున్నారు. మద్యం ఆదాయాన్ని తాకట్టుపెట్టి అప్పులు చేస్తున్నారంటూ ఎల్లో మీడియా, చంద్రబాబు బృందం గగ్గోలు పెట్టింది. ఇపుడు చంద్రబాబు చేసిందేమిటి? అదే మద్యం ఆదాయాన్ని తాకట్టు పెట్టి అధికవడ్డీకి రూ.5,490 కోట్లు అప్పు చేశారు. ఆ ఆదాయం తగ్గకుండా ఉండడం కోసమే ఊరూ వాడా బెల్ట్ షాపులు, పర్మిట్ రూములతో జనాన్ని మద్యం మత్తులో ముంచేస్తున్నారు.

అధిక వడ్డీ... కమీషన్..

ఏపీఎస్‌బీసీఎల్ ద్వారా 9.15 శాతం అధికవడ్డీకి రూ.5,490 కోట్లు అప్పు చేశారు. కేంద్రం నిబంధనలకు లోబడి చేసే అప్పులైతే 7శాతం వడ్డీకే వస్తాయి. కానీ ఎఫ్ఆర్‌బీఎం పరిమితులను, కేంద్రం మార్గదర్శకాలను చంద్రబాబు ప్రభుత్వం ఎప్పుడో అతిక్రమించేసింది. అందుకే 9.15శాతం అధికవడ్డీతో అప్పులు చేస్తున్నారు. అంతేకాదు ఈ అప్పు చేయడం కోసం అప్పు మొత్తంపై 1.5 శాతం కమీషన్‌గా చెల్లించారు. అంటే కమీషన్ రూపంలో ఏకంగా రూ.80 కోట్లకు పైగా చెల్లించారు. బాండ్లు జారీ అరేంజర్‌కు ఈ కమీషన్ చెల్లించారు. 6 నుంచి 7 శాతానికి రుణం దొరికే అవకాశం ఉన్నా 9.15 శాతానికి తీసుకున్నారు. ఇందులో కూడా కుంభకోణం ఉందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికవడ్డీకి సిద్ధపడడం, భారీ కమీషన్ చెల్లించడం అనుమానాస్పదంగా ఉందని, దీనిపై అత్యవసర దర్యాప్తు జరగాల్సిందేనని ఆర్థిక నిపుణులంటున్నారు.

రుణ పరిమితికి మించి అప్పులు..

కేంద్రం నిర్ధేశించిన రుణ పరిమితికి మించి అప్పులు చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారింది. 2014–19 మధ్య కేంద్రం నిర్ధేశించిన రుణ పరిమితికి మించి ఏకంగా రూ.16,418 కోట్లు అప్పు చేశారు. ఆ అప్పు మొత్తం మేర రుణపరిమితిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రం తగ్గించేసింది. కోవిడ్ సంక్షోభంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ కేంద్రం అంతకుముందు చంద్రబాబు పరిమితికి మించి అప్పు చేసిన పాపానికి వైఎస్సార్సీపీ ప్రభుత్వానికి శిక్ష వేసింది. అప్పులు చేయడానికి చంద్రబాబు రాజ్యాంగ విరుద్ధమైన మార్గాలను యథేచ్ఛగా అనుసరిస్తున్నారు. ఇప్పటికే మే 25వ తేదీ ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఎన్‌సీడీ (నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లు) బాండ్లు జారీ చేశారు. ప్రభుత్వ హామీతో పాటు.. ఎన్‌సీడీ హోల్డర్లు ప్రభుత్వం అనుమతి లేకుండానే రాష్ట్ర కన్సాలిడేటెడ్ ఫండ్‌ను నేరుగా యాక్సెస్ చేయడానికి అనుమతించారు. ఇది ఒక రకంగా ప్రభుత్వ ఖజానాను ప్రైవేట్ వ్యక్తులకు తాకట్టుపెట్టడమే. ఈ మార్గం ద్వారా రూ.9,000 కోట్లు అప్పు చేశారు. ఇందుకోసం ఏకంగా రూ.1,91,000 కోట్ల విలువైన మైనింగ్ లీజులను సెక్యూరిటీగా పెట్టారు.

సౌత్ సూడాన్‌తో పోటీ తథ్యం..

నాడు తక్కువ వడ్డీకి తక్కువ అప్పులు చేసినా రాష్ట్రం శ్రీలంక అయిపోతోందని గగ్గోలు పెట్టిన చంద్రబాబు సంపద సృష్టిస్తానంటూ అధికారంలోకి వచ్చారు. ఇపుడు నిబంధనలకు విరుద్ధంగా అధికవడ్డీలకు అధిక అప్పులు చేస్తున్నారు. 2019–24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన అప్పుల్లో 80 శాతం అప్పులను ఈ 18 నెలల్లోనే చేసేశారు. ఈ వేగంతో మరి మిగిలిన 42 నెలల్లో చంద్రబాబు చేసే అప్పులు ఎక్కడకు చేరుకుంటాయో.. వడ్డీలు ఏపీ పరిస్థితిని ఏ మేరకు దిగజారుస్థాయో ఊహలకందడం లేదని ఆర్థిక నిపుణులంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వం అస్తవ్యస్థ ఆర్థిక నిర్వహణతో రాష్ట్ర ఆదాయ వృద్ధి దారుణంగా క్షీణిస్తోంది. మరోపక్క మూలధన వ్యయం తగ్గిపోతోంది. రెవెన్యూ వ్యయానికి కూడా భారీగా అప్పులు చేస్తున్నారు. ఇలానే ఉంటే ఏపీ పరిస్థితి శ్రీలంక ఏమో గానీ ఆఫ్రికన్ దేశమైన సౌత్ సూడాన్ కన్నా దిగజారడం ఖాయమని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

చంద్రబాబు హయాంలో అప్పుల శాతం పెరుగుతోంది

రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి వెల్లడి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అప్పుల శాతం పెరుగుతున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పార్లమెంట్‌కు వెల్లడించారు. 2023–24 ఆర్థిక సంవత్సరం జీఎస్‌డీపీలో అప్పుల శాతం 33.1 శాతమే ఉండగా, 2024–25లో 34.3 శాతానికి, 2025–26లో 34.7 శాతానికి పెరిగినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు, స్పెషల్ పర్పస్ వెహికిల్స్ (ఎస్‌పీవీలు) ద్వారా చేసే అప్పులను ఆయా రాష్ట్రాలు స్వయంగా చేసిన అప్పుగానే పరిగణిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వరంగ సంస్థల ద్వారా చేసే అప్పులకు అసలు, వడ్డీలను రాష్ట్ర బడ్జెట్ నుంచే చెల్లిస్తారని, ఈ నేపథ్యంలో కేంద్రం నిర్దేశించిన రుణ పరిమితికి లోబడే ఆ అప్పులు కూడా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. కేంద్రం నిర్దేశించిన రుణ పరిమితికి మించి గతంలో అప్పులు చేస్తే ఆ రుణాలను తదుపరి సంవత్సరాల రుణ పరిమితిలో తగ్గించనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 293 (3) ప్రకారం రాష్ట్రాలకు నికర రుణ పరిమితిని ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు.

పోలీసు శాఖలోనూ పీపీపీ విధానమే

ముఖ్యమంత్రి చంద్రబాబు

కానిస్టేబుల్ నియామక పత్రాల ప్రధానం 'యువగళం' పేరుతో రాజకీయ కార్యక్రమంగా నిర్వహించిన దృశ్యం

సాక్షి, అమరావతి: పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని పోలీసు శాఖ కూడా అనుసరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. విజిబుల్ పోలీసింగ్, ఇన్విజిబుల్ పోలీసింగ్ అన్నది పోలీసు శాఖ విధానంగా మారాలన్నారు. మంగళగిరిలోని పోలీస్ బెటాలియన్ మైదానంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగా ఎంపికైన పోలీసు కానిస్టేబుళ్లకు నియామక పత్రాలను ప్రదానం చేశారు. 2022లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి ప్రిలిమినరీ పరీక్ష కూడా నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ ప్రక్రియను కొనసాగిస్తూనే 6,100 మంది పోలీస్ కానిస్టేబుళ్లను రాష్ట్ర పోలీసు నియామక మండలి ఎంపిక చేసింది. ఎంపికైన కానిస్టేబుళ్లకు బ్లాక్ టీషర్ట్, ఖాకీ ప్యాంట్ యూనిఫాంగా ధరింపజేసి మరీ 'యువగళం' పేరుతో పక్తు రాజకీయ పార్టీ కార్యక్రమం మాదిరిగా నియామకపత్రాల ప్రదానం ప్రక్రియను నిర్వహించడం గమనార్హం. ఎంపికైన కానిస్టేబుళ్లకు స్టైఫెండ్‌ను రూ.12,500కు పెంచుతున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్‌గా ఎంపికైన లాకే బాబూరావు అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలంలోని తెనుములబండ గ్రామానికి రోడ్డు వేయాలని కోరారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందిస్తూ ఆ గ్రామంలో రూ.2కోట్లతో రోడ్డు నిర్మిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో టెక్నాలజీ వినియోగించుకోండి: సీఎం

వైద్యసేవల్లో టెక్నాలజీని వినియోగించుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం వైద్య, ఆరోగ్యశాఖపై సీఎం సమీక్షించారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పంతోపాటు చిత్తూరు జిల్లా అంతటా డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించి ఇంటిగ్రేట్ చేస్తున్నామని సీఎం తెలిపారు. సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వై.వై.టియో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యువతలో డయాలసిస్ (కిడ్నీ)పేషెంట్లు పెరుగుతున్నారని, దీనికి కాలుష్యమే ప్రధాన కారణమన్నారు. ఈ సమావేశంలో యూఎన్ ఎయిడ్స్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పీటర్ పాయిట్, ప్రపంచ ఆరోగ్య సంస్థ సీనియర్ శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్, ఏఐజీ హస్పిటల్ చైర్మన్ డి.నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏపీ రైతుల సమస్యలపై వాయిదా తీర్మానానికి వైఎస్సార్‌సీపీ నోటీసు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో పంటలకు తగిన ధరలు రాకపోవడం వలన రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి కేంద్రం దృష్టికి తెచ్చారు. మధ్యవర్తుల దోపిడీ కారణంగా రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. పంటలకు ధరల సంక్షోభంపై ఆయన మంగళవారం లోక్‌సభలో వాయిదా తీర్మానానికి నోటీసు ఇచ్చారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోవడం, కనీస మద్దతు ధరకు చట్టబద్ధ హామీ లేకపోవడం వలన దేశవ్యాప్తంగా రైతులు తీవ్రమైన ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంట ఉత్పత్తి ఖర్చు కంటే కనీసం 50 శాతం అధికంగా కనీస మద్దతు ధర ఇవ్వాలన్న సూచన ఇప్పటికీ అమలుకాలేదని విమర్శించారు. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు, విద్యుత్, నీరు, రవాణా వంటి వ్యవసాయ వ్యయాలు విపరీతంగా పెరిగినప్పటికీ రైతులకు తగిన ధరలు దక్కడం లేదని పేర్కొన్నారు. చెల్లింపుల్లో ఆలస్యం, మధ్యవర్తుల దోపిడీ కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర చట్టాన్ని వెంటనే తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఏజెన్సీలో బలగాలకు చిక్కిన మావోయిస్టులు !

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన డీవీసీఎం(డివిజన్ కమిటీ) ఇన్‌చార్జ్‌తో సహా మొత్తం 16 మంది మావోయిస్టులు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అడవుల్లో పోలీసు బలగాలకు చిక్కినట్టు సమాచారం. కొద్దిరోజుల క్రితం సిర్పూర్ యూ మండలం బాబ్జిపేట, కకర్‌బుడ్డి ఏజెన్సీ ప్రాంతంలోకి వచ్చిన కామారెడ్డి జిల్లాకు చెందిన డీవీసీఎం ఎర్రగొల్ల రవితో మరో ఇద్దరు డీవీసీఎం కేడర్‌తోపాటు 16 మంది పోలీసుల అదుపులో ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. వీరిని ఏకే 47, ఇన్సాస్ రైఫిల్ వంటి ఆయుధాలతో సహా అదుపులోకి తీసుకున్నట్టుగా తెలిసింది. దీనిపై పోలీసులు మాత్రం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయడం లేదు. మొదటగా రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడె చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నట్టు ప్రచారం జరిగింది. అయితే పట్టుబడిన వారిలో ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చినవారు ఉన్నారు. వీరిలో 9 మంది మహిళా మావోయిస్టులు ఉన్నట్టు తెలిసింది. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లో తీవ్ర నిర్బంధ పరిస్థితులు ఏర్పడడంతో సేఫ్ జోన్‌గా భావించి వీరంతా ఏజెన్సీకి వచ్చారా, లేక పోలీసులకు లొంగుబాటులో ఇది ఓ భాగమా? ఇంకా ఏదైనా కారణమా? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.

ఇంటర్ పరీక్ష ఫీజుకు 'తత్కాల్' అవకాశం

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ ఫిబ్రవరి/మార్చి–2026 పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు బోర్డు మరో అవకాశం ఇచ్చింది. ఇప్పటి వరకు ఫీజు చెల్లించలేని విద్యార్థులు తత్కాల్ కింద రూ.5 వేలు ఆలస్య రుసుంతో ఫీజు చెల్లించవచ్చని ఇంటర్ విద్యా కార్యదర్శి రంజిత్ బాషా తెలిపారు. ఈనెల 22 నుంచి జనవరి 5 వరకు తత్కాల్ ఫీజు చెల్లింపు విధానం అందుబాటులో ఉంటుందన్నారు.

ఆ గనుల పాత దరఖాస్తులు కొనసాగుతాయి

మేజర్ మినరల్స్‌గా మారిన ఖనిజాలపై ప్రభుత్వం ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: క్వార్ట్జ, మైకా, పల్స్‌పర్, బెరైటీస్‌ను మేజర్ మినరల్స్‌గా గుర్తించిన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. లీజుల కోసం ఇప్పటికే దాఖలైన గనుల దరఖాస్తులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఇప్పటికే ఆమోదం పొందిన మైనింగ్ ప్లాన్లు 2027 మార్చి 31 వరకు కొనసాగుతాయని తెలిపింది. 2026 మార్చి 31 వరకు పాత రాయల్టీ రేట్లే అమల్లో ఉంటాయని పేర్కొంది. ఈ మధ్యకాలంలో విధించిన పలు జరిమానాలు కూడా వాటికి వర్తించవని స్పష్టం చేసింది. కొత్తగా మేజర్ మినరల్స్‌గా మారిన ఈ ఖనిజాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మార్గదర్శకాలు ఇస్తూ జీవో జారీచేసింది.

ఏవియేషన్ ఎడ్యుసిటీకి అంకురార్పణ

ఒప్పంద పత్రాలు మార్చుకున్న జీఎంఆర్, మాన్సాస్ ప్రతినిధులు

మహారాణిపేట (విశాఖ): ప్రముఖ సంస్థల రాకతో ఉత్తరాంధ్ర అభివృద్ధి దిశగా కీలక అడుగులు పడుతున్నాయని గోవా గవర్నర్, మాన్సాస్ ట్రస్ట్ చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు చెప్పారు. జీఎంఆర్, మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ అంకురార్పణ, ఒప్పందాల మార్పిడికి సంబంధించిన కార్యక్రమం మంగళవారం విశాఖలో జరిగింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఇరు సంస్థలు ఒప్పంద పత్రాలు మార్చుకున్నాయి. కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఎంఎస్ఎంఈ సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జీఎంఆర్ రాజు, పలువురు ఎమ్మెల్యేలు, విశాఖ కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్‌భరత్ పాల్గొన్నారు.

పెద్దలు చెబితేనే తీసుకుంటాం..!

టెండర్ దరఖాస్తుల స్వీకరణ విషయంలో ఏపీసీపీడీసీఎల్ అధికారుల వింత పోకడ

50 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి టెండర్లు పిలిచిన ఏపీసీపీడీసీఎల్

సాక్షి, అమరావతి: విద్యుత్ సంస్థల్లో టెండర్ దక్కాలంటే ప్రభుత్వ పెద్దల అండ ఉండాలి. కనీసం టెండర్లు వేయాలన్నా కూడా వారు సిఫార్సు చేయాలి. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనధికారికంగా అమలు జరుగుతున్న కఠిన నిబంధనలు ఇవి. దీనికి మంగళవారం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీసీపీడీసీఎల్) కార్యాలయంలో జరిగిన ఉదంతమే నిదర్శనం. ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి కృష్ణా, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ఒక్కొక్కటి 33/11కేవీ సామర్థ్యంతో 50 విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి ఆరు ప్యాకేజీలుగా రూ.230 కోట్లతో టెండర్లను గత నెల 20న ఆహ్వానించారు. ఈ నెల 16వ తేదీ(మంగళవారం) సాయంత్రం 4 గంటల్లోపు ఆన్‌లైన్‌లో టెండర్ దరఖాస్తు సమర్పించడంతోపాటు ఆ దరఖాస్తు పత్రాలను నేరుగా విజయవాడలోని ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో అందజేయాలని నిబంధన విధించారు. దానికి తగ్గట్టుగానే కొందరు కాంట్రాక్టర్లు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుని, ఆ పత్రాలతో మంగళవారం విజయవాడలోని కార్యాలయానికి వచ్చారు. కానీ, ఇక్కడ వారికి వింత అనుభవం ఎదురైంది. టెండర్ పత్రాలను స్వీకరించేందుకు అధికారులు నిరాకరించారు. ఎందుకు తీసుకోరని నిలదీస్తే... అధికారుల నుంచి సరైన సమాధానం రాలేదు. ప్రభుత్వ పెద్దలు చెప్పిన వారి దరఖాస్తులనే తీసుకుంటున్నారని, మిగతావారివి తీసుకోవద్దన్నారని అక్కడి సిబ్బంది కాంట్రాక్టర్లకు బదులిచ్చారు. దీంతో ఇదెక్కడి అన్యాయమంటూ కాంట్రాక్టర్లు మీడియాను ఆశ్రయించారు. పలు మీడియా సంస్థల ప్రతినిధులకు ఫోన్లు చేసి ఈ విషయం తెలియజేశారు. అదంతా చూసిన అధికారులు విషయం పెద్దదయ్యేలా ఉందని భావించి, టెండర్ దరఖాస్తులను గడువు ముగిసిన గంట తర్వాత సాయంత్రం 5 గంటలకు తీసుకున్నారు. ఇక వాటిని చెత్తబుట్టలో పడేస్తారా? లేక పరిశీలిస్తారా? అనేది వారి ఇష్టం.

మంత్రి పేషీలో ముందే నిర్ణయం

రాష్ట్రంలో టెండర్ల ప్రక్రియను మొత్తం కొందరికి అనుకూలంగానే నిర్వహించడమనేది కొన్ని నెలులుగా జరుగుతోంది. టెండర్ నిబంధనలు రూపొందించడం దగ్గరే అసలు పనంతా పూర్తవుతోంది. ఏ సంస్థలు టెండర్లలో పాల్గొనాలి, ఎవరికి టెండర్ దక్కాలి అనేది మంత్రి పేషీలోనే నిర్ణయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దానికి తగ్గట్టుగానే నిబంధనలు రూపొందిస్తున్నారని కొందరు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. అయితే సబ్ స్టేషన్ల టెండర్ ప్రక్రియలో అధికారులు మరో అడుగు ముందుకేశారు. ఎప్పుడో తీసేసిన నిబంధనను కొత్తగా తెరపైకి తెచ్చారు. నిజానికి ఆన్‌లైన్‌లో టెండర్ దరఖాస్తు సమర్పించిన తర్వాత ఆఫ్‌లైన్‌లో దానికి సంబంధించిన పత్రాలు ఇచ్చేందుకు ఎటువంటి కచ్చితమైన గడువు ఉండదు. కానీ, ఇప్పుడు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు తప్పనిసరిగా గడువులోగా ఇవ్వాలంటూ షరతు పెట్టారు. దానికి కూడా కాంట్రాక్టర్లు అంగీకరించి దరఖాస్తులు తీసుకుని వెళితే, వాటిని తీసుకోవడానికి అధికారులు నిరాకరించి హైడ్రామా నడిపారు. ప్రతిసారీ ఇదే విధంగా ఏదో ఒక వంక పెట్టి టెండర్లు వేయకుండా అడ్డుకుంటున్నారని, ఒకవేళ టెండర్ వేసినా అర్హత సాధించకుండా చేస్తున్నారని పలువురు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కేవలం ప్రభుత్వ పెద్దలు చెప్పిన కొన్ని సంస్థలకే టెండర్లు ఇస్తున్నారని, దీనివెనుక భారీ మొత్తంలో సొమ్ములు చేతులు మారుతున్నాయని ఆరోపిస్తున్నారు. దీనిపై ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డిని వివరణ కోరేందుకు 'సాక్షి' ఫోన్ ద్వారా ప్రయత్నించగా, ఆయన స్పందించలేదు.

శివయోగి స్వామి జయంతి వేడుకల్లో రాష్ట్రపతి

మైసూరు: మాండ్య జిల్లా మళవళ్లిలో సుత్తూరు ఆది జగద్గురు శివరాత్రి శివయోగి 1,066వ జయంతి మహోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం మైసూరు విమానాశ్రయానికి వచ్చారు. ఆమెకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్, సుత్తూరు మఠాధిపతి శివరాత్రి దేశికేంద్ర స్వామి, కేంద్ర మంత్రి కుమారస్వామి, మంత్రి కె.వెంకటేష్ స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి ప్రత్యేక హెలికాప్టర్‌లో మళవళ్లికి వెళ్లారు. అక్కడ శివయోగి జయంతి వేడుకలకు శ్రీకారం చుట్టి స్మారక సంచికను ఆవిష్కరించారు. అనంతరం మైసూరుకు వచ్చి ప్రైవేట్ హోటల్‌లో బస చేశారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతున్న గవర్నర్, స్వామీజీ తదితరులు

బాబు మద్యం కుంభకోణం డాక్యుమెంట్లన్నీ ఇవ్వండి

- ఏసీబీ కోర్టుకు నివేదించిన న్యాయవాది శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి
- 19న నిర్ణయం వెలువరిస్తామన్న ఏసీబీ కోర్టు

సాక్షి, అమరావతి: 2014–19 మధ్య కాలంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన మద్యం కుంభకోణానికి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో సీఐడీ నమోదు చేసిన కేసుకు సంబంధించిన అన్నీ డాక్యుమెంట్లను తమకు అందజేయాలని స్వర్ణాంధ్ర తెలుగు పత్రిక ఎడిటర్ కొట్టి బాలగంగాధర్ తిలక్ తరపు న్యాయవాది శెట్టిపల్లి దుష్యంతరెడ్డి మంగళవారం విజయవాడ ఏసీబీ కోర్టును అభ్యర్థించారు. 2014–19 మధ్య కాలంలో జరిగిన పలు కుంభకోణాల్లో సీబీఐ దర్యాప్తును కోరుతూ తిలక్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారని, అందులో తదుపరి చర్యల నిమిత్తం తమకు అన్ని డాక్యుమెంట్లూ అవసరమని దుష్యంత్‌రెడ్డి కోర్టుకు నివేదించారు. వాదనలు విన్న ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు ఈ నెల 19న నిర్ణయం వెలువరిస్తామని స్పష్టం చేశారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులోనూ డాక్యుమెంట్లు ఇప్పించండి

విజయవాడలీగల్: సీఎం చంద్రబాబుపై నమోదైన కేసులను ఉపసంహరించుకున్నందున అందుకు సంబంధించి పోలీసులు ఫైల్ చేసిన ఫైనల్ రిపోర్ట్, కోర్టు ఆర్డర్ డాక్యుమెంట్లు ఇప్పించాల్సిందిగా మాజీ రైల్వే ఉద్యోగి వేము కొండలరావు ఏసీబీ కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. చంద్రబాబు సీఎం హోదాలో సీఐడీని ప్రభావితం చేసి గతంలో తనపై నమోదైన కేసులు ఉపసంహరించుకుంటున్నారని వివరించారు.

పరకామణిలో చోరీ ఇదే తొలిసారి కాదు..చివరి సారి కాదు

గతంలో ఎన్నోసార్లు దొంగతనాలు జరిగాయి

- వాటిని నివారించేందుకు సంస్కరణలు అవసరం
- ఈ వ్యవహారంలో తగిన సూచనలు, సలహాలు ఇవ్వండి
- ఇరుపక్షాలకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి పరకామణిలో శ్రీవారి కానుకల లెక్కింపు సందర్భంగా దొంగతనాలు జరగడం ఇదే మొదటిసారి, ఇదే చివరిసారి కాదని హైకోర్టు వ్యాఖ్యానించింది. పరకామణిలో గతంలో కూడా అనేకసార్లు దొంగతనాలు జరిగాయంది. వీటిని నివారించేందుకు పరకామణిలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ సంస్కరణలపై తగిన సలహాలు, సూచనలతో రావాలని ఇరుపక్షాలను ఆదేశించింది. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో శ్రీవారికి కానుకలు సమర్పిస్తుంటారని, అవి చోరీకి గురైతే వారి మనోభావాలు దెబ్బతింటాయని తెలిపింది. స్వామి వారి కానుకల లెక్కింపు విషయంలో మానవ ప్రమేయాన్ని బాగా తగ్గించాలని తెలిపింది. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయిన నేపథ్యంలో యంత్రాలను, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని ఉపయోగించే విషయాన్ని పరిశీలించాలని టీటీడీకి సూచించింది. పరకామణిలో శ్రీవారి కానుకలను లెక్కించేందుకు వచ్చే భక్తులను డ్రాయర్లపై ఉంచి తనిఖీలు చేయడం అవమానకరమైనదే కాక జుగుప్సాకరమైనది కూడానని వ్యాఖ్యానించింది. పరకామణిలో ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. మానవ వనరులను తగ్గించి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచితే పరకామణిలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలిపింది. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత టీటీడీపై ఉందని, ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ ప్రకియ మొత్తం గందరగోళంగా ఉంది...

తిరుమల శ్రీవారి పరకామణిలో రూ.72 వేల విలువైన 900 డాలర్ల చోరీ కేసు వ్యవహారంపై సీఐడీ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ తిరుపతికి చెందిన పాత్రికేయుడు శ్రీనివాసులు దాఖలు చేసిన వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ స్పందిస్తూ.. సీఐడీ అదనపు డీజీ నివేదికతో పాటు పరకామణిలో కానుకల లెక్కింపు ప్రక్రియపై సమర్పించిన ఫోటోలను పరిశీలించానని తెలిపారు. వాటిని పరిశీలిస్తే హుండీలో భక్తులు వేసిన కానుకల తరలింపు నుంచి లెక్కింపు వరకు మానవ ప్రమేయం చాలా ఎక్కువగా ఉందని, దీనిని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ మొత్తం ప్రక్రియ చాలా గందరగోళంగా ఉందని, భద్రతను మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఎంత నైతిక విలువలున్న వ్యక్తి అయినా తప్పు చేసేందుకు సులభమైన అవకాశం దొరికితే ప్రలోభానికి గురయ్యే అవకాశం ఉంటుందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. భద్రతను గణనీయంగా పెంచాలని సూచించారు.

అవినీతి ఆరోపణలున్నా.. అందలమెక్కిద్దాం!

వక్ఫ్ బోర్డులో 16 మంది పదోన్నతులకు రంగం సిద్ధం

- జాబితాలోని పలువురిపై అవినీతి ఆరోపణలు
- విస్తుపోతున్న ముస్లిం నాయకులు– ఇలాగైతే వక్ఫ్ ఆస్తులకు రక్షణ ఎలా? అంటూ ఆగ్రహం

సాక్షి, అమరావతి: అవినీతి ఫిర్యాదులపై చట్టపరమైన చర్యలు లేవు.. అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై విచారణ అసలే లేదు.. పైగా పదోన్నతులు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఇది రాష్ట్ర వక్ఫ్ బోర్డులోని పరిస్థితి. వక్ఫ్ బోర్డులో పనిచేస్తున్న 16 మంది పదోన్నతుల ప్రక్రియ తుది దశకు చేరింది. అసిస్టెంట్ సెక్రటరీ పదోన్నతుల జాబితాలో జానీ బాషా, నజీర్ హుస్సేన్, రూఫ్, ఇన్యత్, ఇబ్రహీం, మహమ్మద్ హుస్సేన్, హైదర్, షావలి, గౌస్.. సీనియర్ అసిస్టెంట్ సెక్రటరీ పదోన్నతుల జాబితాలో హుస్సేన్ బాషా, రహంతుల్లా, అల్తాఫ్, అక్రమ్ బాషా, అలీమ్, హహమ్మద్ బాషా, అన్సారీ ఉన్నారు. ఈ జాబితాల్లో ఉన్న పలువురిపై అవినీతి ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్నాయి. వక్ఫ్ బోర్డు సీఈవోకు దగ్గరి బంధువైన మహమ్మద్ హుస్సేన్ ప్రస్తుతం నెల్లూరు జిల్లా ఏఎస్ పేట దర్గాలో ఈవోగా పనిచేస్తున్నారు. అక్కడ రూ.లక్షల అవినీతి జరిగిందని.. అందుకు బాధ్యుడైన హుస్సేన్‌పై చర్యలు తీసుకోవాలంటూ స్వయంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్ ఇటీవల అధికారులను ఆదేశించారు. అయినా ఆయనపై చట్టపరమైన చర్యలేవీ తీసుకోలేదు. హుస్సేన్ గతంలో పెదకాకాని దర్గాలో ఈవోగా, గుంటూరు జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించినప్పుడు సైతం అవినీతి ఆరోపణలు వచ్చాయి. అదే వ్యక్తి ఇప్పుడు అజీజ్‌కు ఓఎస్డీగా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దీనిపై ముస్లిం నాయకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి విచారణ, చట్టపరమైన చర్యలు తీసుకోకుండానే పదోన్నతి కల్పించేందుకు సిద్ధమవ్వడంపై మండిపడుతున్నారు. ఇలాగైతే వక్ఫ్ ఆస్తులకు రక్షణ ఉంటుందా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆమె తానొక స్త్రీ అనే మర్చిపోయింది.
పల్లెటూళ్లో ఒక గొడ్డులా కష్టపడి
ఇద్దరు కొడుకులను సాకింది.
పల్లెటూరి పలుకుబడి... పల్లెటూరి కట్టుబడి...
ఇవి మాత్రమే ఆమెకు తెలుసు.
కొడుకు ప్రయోజకుడై
నగరం అమ్మాయిని పెళ్లి చేసుకుంటూ
తల్లికి ఒక కండిషన్ పెట్టాడు.
ఆమె సంస్కృతిని తక్కువ చేస్తూ
బట్టలు కట్టుకునే పద్ధతి మార్చుకోవాలన్నాడు.
తమిళంలో తాజాగా విడుదలైన 'అంగమ్మాల్'
ఆలోచనలు రేకెత్తిస్తోంది.

అమ్మకు 'కట్టుబాటు'

జీవితాంతం పంచె కట్టులో, భుజం మీద తుండుతో వ్యవసాయం చేస్తూ వచ్చిన తండ్రిని తన పెళ్లి కోసం 'నువ్వు సూట్ వేసుకోవాల్సిందే నాన్నా' అని కొడుకు పట్టుబడితే ఆ తండ్రికి ఊపిరి ఆడుతుందా? అసలు సూట్ వేసుకుని తిర్గగలడా? బట్టలతోనా తండ్రికి గౌరవం? అయితే తండ్రి తొడుక్కునే బట్టలు 'తక్కువ రకానివి' అని నిర్ణయించేదెవరు?

అలాగే జీవితాంతం రవికంటే ఏమిటో ఎరగక బండ చాకిరీ చేస్తూ వచ్చిన తల్లిని మాత్రం 'నువ్వు నా పెళ్లి సందర్భంగా రవిక తొడగాల్సిందే' అని కొడుకు పట్టుబడితే?

ఆ తల్లి ఏం చేస్తుంది? ఏం చేయాలి?

అటు కొడుకు మథనం... ఇటు తల్లి అంతర్మథనం. వెరసి 'అంగమ్మాల్' చిత్ర కథనం. తమిళ రచయిత పెరుమాళ్ మురుగన్ రాసిన 'కొడు తుని' అనే కథ ఆధారంగా దర్శకుడు విపిన్ రాధాకృష్ణన్ తెరకెక్కించిన చిత్రం ఇది. దిగ్దర్శకుడు కె.బాలచందర్ కోడలైన గీతా కైలాసం ఈ చిత్రంలో ప్రధాన పాత్ర 'అంగమ్మాల్'గా నటించారు. ఆమె పెద్దకొడుకుగా భరణి, చిన్నకొడుకుగా శరన్ శక్తి నటించారు.

భర్త పోయిన తర్వాత ఇద్దరు కొడుకుల్ని కడుపులో దాచుకుని సాక్కున్న తల్లి అంగమ్మాల్ జీవిత పద్ధతి వేరే, ఆమె తీరు వేరే. భర్త లేని స్త్రీ ఊళ్లో బతకడం కష్టం కనుక ఆమె బండగా మారిపోయింది. మగరాయుడిలా తనను తాను మలుచుకుంది. జాకెట్ వేసుకోవడం ఆమె ఎరుగదు. బీడీ తాగుతూ, అందర్నీ అదిలిస్తూ, కుటుంబాన్ని అధీనంలో ఉంచుకొని బతకడం అలవాటైన మనిషి. కోపధారి, రోషనారి. ఇటువంటి మనిషికి ఇప్పుడు చిన్నకొడుకు వల్ల కలిగిన సంకటమే ఈ కథలోని మూలాంశం. కొడుకు పట్నానికి వెళ్లి చదువుకుంటూ ఓ అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. ఆ అమ్మాయి ఇంట్లోవాళ్లు పెళ్లికి ఒప్పుకున్నారు. సంబంధం మాట్లాడటానికి అతని ఊరొస్తామంటున్నారు.

వాళ్లు పట్నవాసపు మనుషులు. హైక్లాసులో పెరిగినవారు. వారు వచ్చి, తన అమ్మ పద్ధతి, ప్రవర్తన చూస్తే ఏమనుకుంటారు? పెళ్లి విషయంలో పేచీ పెట్టరా? రవిక లేకుండా ఆమెను చూసి హవ్వా అనుకోరా? ఇదంతా ఆలోచించిన చిన్నకొడుకు రవిక వేసుకోమని పట్టుబట్టాడు. ఆమెతో పంతానికి పోయాడు. తల్లికి కొడుకు మీద ప్రేమ, అతని బతుకు మీద ఆరాటం. కానీ తన అస్థిత్వాన్ని తానెలా వదులుకోగలదు?

ఆమె భుజం మీద ఒక అడవి పువ్వు పచ్చబొట్టు ఉంటుంది. అది ఆ ప్రాంతంలో కొండల్లో పాతికేళ్లకు ఒకసారి పూస్తుంది. భలే సువాసన. ఆ పువ్వు ఆమె భుజం మీద ఆమెకో అస్తిత్వంలా ఉంటుంది. ఆ అడవి పువ్వు పాతికేళ్లకు ఒకసారే ఎందుకు పూస్తుంది అనంటే ఏం చెప్పగలం? అది దాని స్వభావం. దానిని ప్రతి సంవత్సరం పూయమంటే పూస్తుందా? అంగమ్మాల్ రవిక వేసుకోకుండా ఎందుకుంది అనంటే ఆమెకు అలా అలవాటైంది. చీరను ఒంటికి కప్పుకుని ఇన్నాళ్లు బతికింది. ఊరికి కూడా అదే అలవాటైంది. వారికి లేని ఇబ్బంది. అంగమ్మాల్‌కు లేని చింత ఇప్పుడు కొడుక్కు వచ్చింది– అదీ పట్నం నుంచి వచ్చే ఎవరి కోసమో. ఆమె బాగా ఆలోచించింది. చివరకు ఆమె తీసుకున్న నిర్ణయం ఆమెకూ, ఆమె కుటుంబంలోని వారికీ ఎలాంటి పరిస్థితులను కల్పించిందనేది చిత్రకథ.

తమిళనాడులోని ఓ పల్లెలో కెమెరాను పాతి, చుట్టూ జరుగుతున్న అంశాలను చూపించిన సినిమా ఇది. అంత సహజమైన లొకేషన్లు, అక్కడి మనుషులు, వారి మనస్తత్వాలను ఈ చిత్రంలో చూపించారు. వారికి తగ్గ భాషనే డైలాగుల్లో వాడారు. గతంలో నిర్మాతగా వ్యవహరించిన గీతా కైలాసం అనంతరం నటిగా మారారు. ఆమె కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోదగ్గ సినిమా ఇది. ఈ సినిమా మొత్తానికి ఆమె నటన అద్భుతం అనిపిస్తుంది. కుటుంబం కోసం రాయిలా మారిన మనిషి పద్ధతి చివరకు ఆ కుటుంబానికే ఇబ్బందికరంగా మారిన పరిస్థితుల్లో ఆ అమ్మ ఏం చేయాలో ఈ చిత్రం చూసి ఆలోచనలో పడాలి.

పైకి ఎదిగిన పిల్లలు తమ తల్లిదండ్రుల సంస్కృతిని వెనుకబాటుగా చూడటం, వారిని నలుగురి ఎదుటకూ తేకపోవడం, వారిని 'సంస్కరించాల'ని చూడటం మన సమాజంలో వినబడుతూనే ఉంది. మనల్ని కన్నవాళ్లను మనం 'కరెక్ట్' చేయాలనుకోవడం వారు 'గాయపడే' స్థాయిలో జరగాలా? వారిని వారిలా ఉండనివ్వండి అని చెప్పే సినిమా 'అంగమ్మాల్'. త్వరలో ఓటీటీలో రావచ్చు.

● ముగ్గు ముచ్చట

18 చుక్కలు, 6 వరసలు అటు ఇటు వదిలి 6 వరకు

సుమతి ఉన్నవ
విద్యానగర్
హైదరాబాద్

15 చుక్కలు మధ్య చుక్కతో 8 వరకు

కాసర లక్ష్మీసరోజారెడ్డి,
జంగారెడ్డిగూడెం

17 చుక్కలు, 7 వరసలు 7 వచ్చేవరకు

శ్రీలత
కరీంనగర్

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com

● ఆహా

మనసు దోచే వరమాల

ఈ వెడ్డింగ్ సీజన్ ట్రెండ్... 'క్రోచెట్ వరమాల'

కాస్త వెనక్కి వెళితే... వివాహం చేసుకోబోయే ఒక జంట నుంచి ఒక మహిళకు 'వరమాల' తయారుచేయాల్సిందిగా ఆర్డర్ వచ్చింది.

'ఎప్పుడూ పూలతోనే చేస్తే ఏం వెరైటీ ఉంటుంది. కొత్తగా చేయాలి' అని ఆలోచించింది. ఆమె ఆలోచనలో నుంచి వచ్చిందే... క్రోచెట్ వరమాల.

మృదువైన రంగుల ఉన్ని దారాలను ఉపయోగించి ఆమె తయారుచేసిన 'వరమాల' ఆహా అనిపించింది. వరమాల మేకింగ్ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన తరువాత ఈ వరమాలకు 'క్రోచెట్ వరమాల'గా పేరు వచ్చింది. ఆ తరువాత ట్రెండ్‌గా మారింది. ఇలాంటి అందాల వరమాలను మీరు కూడా తయారుచేయాలనుకుంటున్నారా? 'క్రోచెట్' హ్యాండిల్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియోను చూసి నేర్చుకోండి. వధూవరులకు సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇవ్వండి!

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) డిసెంబర్ 16న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,32,400	1,36,320	1,33, 860	1,36,320	1,31,600	1,34,730
బంగారం (22 క్యారెట్లు)	1,18,560	1,22,700	1,22,700	1,26,380	1,21,070	1,23,500
వెండి	1,91,500	1,96,200	2,11,000	1,96,200	1,92,000	2,11,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి సినిమా

● రామ్‌చరణ్

చికిరి రికార్డ్

'చికిరి చికిరి...' అంటూ 'పెద్ది' సినిమాలో రామ్‌చరణ్ వేసిన స్టెప్పులకు అద్భుతమైన స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. ఈ పాట విడుదలైన నెలలోనే తెలుగులో వంద మిలియన్ల వ్యూస్ దాటిందని, అలాగే తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 150 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించడం ఓ రికార్డ్ అని చిత్ర బృందం పేర్కొంది. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పెద్ది'. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. జగపతిబాబు, శివ రాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ మూవీ 2026 మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'చికిరి చికిరి...' అంటూ సాగే తొలి లిరికల్ వీడియోను నవంబరులో విడుదల చేశారు. బాలాజీ సాహిత్యం అందించిన ఈ పాటని మోహిత్ చౌహాన్ పాడగా జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు.

చాంపియన్‌కి అతిథిగా... రోషన్, అనస్వర రాజన్ జోడీగా నటించిన చిత్రం 'చాంపియన్'. ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌పై రూపొందిన ఈ సినిమా ఈ నెల 25న రిలీజ్ కానుంది. ఈ నెల 18న జరగనున్న ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి హీరో రామ్ చరణ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని యూనిట్ ప్రకటించింది.

ఒకటో తేదీన నలభై ఐదు

● శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర, ఎం. రమేశ్‌రెడ్డి

శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి. శెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం '45 ది మూవీ'. సంగీత దర్శకుడు అర్జున్ జన్యా ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఉమా రమేశ్ రెడ్డి, ఎం. రమేశ్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని నూతన సంవత్సరం కానుకగా జనవరి 1న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, ట్రైలర్‌ని విడుదల చేశారు. ''45 ది మూవీ' నుంచి ఇప్పటివరకు విడుదలైన పోస్టర్, గ్లింప్స్ మా సినిమాపై భారీ అంచనాల్ని పెంచేశాయి. ఈ సినిమాలో శివ రాజ్‌కుమార్ లుక్ అదిరిపోతుంది. ఉపేంద్ర యాక్షన్, డైలాగ్ డెలివరీ అందర్నీ ఆకట్టుకునేలా ఉంటాయి. విజువల్స్, నేపథ్య సంగీతం అంతర్జాతీయ స్థాయిలో ఉంటాయి. ఇంట్రెస్టింగ్ స్క్రీన్‌ప్లేతో '45 ది మూవీ' ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని నిర్మాతలు తెలిపారు.

నన్ను దాటి ఏమీ చేయలేవు!

● మోహన్ లాల్

మోహన్ లాల్ హీరోగా నటించిన హిస్టారికల్ మూవీ 'వృషభ'. ఈ ద్విభాషా (తెలుగు, మలయాళం) చిత్రంలో సమర్జీత్ లంకేష్, రాగిణి ద్వివేది, నయన్ సారిక, అజయ్, నేహా సక్సేనా కీలక పాత్రల్లో నటించారు. నందకిశోర్ దర్శకత్వంలో శోభా కపూర్, ఏక్తా ఆర్. కపూర్, సీకే పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్. వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. తండ్రీ కొడుకుల అనుబంధం ప్రధానాంశంగా సాగే ఈ చిత్రం తెలుగు వెర్షన్ గీతా ఫిలిం డిస్ట్రిబ్యూషన్ సంస్థ ద్వారా విడుదల కానుంది. మంగళవారం ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. 'నన్ను దాటి మా నాన్నను నువ్వు ఏమీ చేయలేవు, నీతో యుద్ధం చేయడానికి నేను సిద్ధం' వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.

ఫైట్‌కి నేను రెడీ

● హవీష్

ఫైట్‌కి, పాటకీ రెడీ అయ్యారు హవీష్. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో హవీష్ హీరోగా రూపొందుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నేను రెడీ'. ఈ చిత్రంలో కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. హార్నిక్స్ ఇండియా ఎల్‌ఎల్‌పీ పతాకంపై నిఖిల కోనేరు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇటీవల హవీష్, కావ్యతో పాటు చిత్రంలోని ప్రధాన తారాగణం పాల్గొనగా క్లైమాక్స్ సాంగ్‌ను చిత్రీకరించారు. ప్రస్తుతం యాక్షన్ కొరియోగ్రాఫర్ 'డ్రాగన్' ప్రకాశ్ నేతృత్వంలో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారు. ఆ తర్వాత గ్రాండ్‌గా ఓ వెడ్డింగ్ రిసెప్షన్ సాంగ్‌ను చిత్రీకరించనున్నారు. ఈ పాటకు దినేష్ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తారు. ఈ పాట, ఫైట్‌తో ఈ సినిమా చిత్రీకరణ దాదాపు 95 శాతం పూర్తవుతుందని యూనిట్ పేర్కొంది. గోపరాజు రమణ, హరితేజ, మహతి, రూపాలక్ష్మి, జయవాణి, మాణిక్ రెడ్డి, బలగం సత్యనారాయణ, రోహన్ రాయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జె. మేయర్.

అది చాలా గొప్ప అనుభూతి

- బోయపాటి శ్రీను

''అఖండ 2 తాండవం'ని పవర్‌ఫుల్‌గా అన్ని వాణిజ్య అంశాలతో తీశాం. థియేటర్స్‌లో ప్రేక్షకులు ఊపిరి బిగబట్టుకొని చూస్తున్నారు. ఈ సినిమా సక్సెస్ చాలా ఆనందాన్నిచ్చింది... గొప్ప గౌరవాన్ని తీసుకొచ్చింది'' అని దర్శకుడు బోయపాటి శ్రీను తెలిపారు. బాలకృష్ణ హీరోగా నటించిన చిత్రం 'అఖండ 2: తాండవం'. సంయుక్త, ఆది పినిశెట్టి, హర్షాలీ మల్హోత్రా కీలక పాత్రలు పోషించారు. ఎం. తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలైంది. ఈ సందర్భంగా బోయపాటి శ్రీను విలేకరులతో మాట్లాడుతూ– ''అఖండ 2' భారత దేశం ఆత్మ లాంటిది. అందరికీ చేరాలనే ఉద్దేశంతో తీసిన సినిమా ఇది... డబ్బు కోసం తీయలేదు. మా సినిమా విడుదల వాయిదా పడినప్పుడు బాలకృష్ణగారి ఫ్యాన్స్ ఎలా అర్థం చేసుకుంటారా? అనిపించింది. అంతేకానీ రిలీజ్ పోస్ట్‌పోన్ కావడం గురించి మేం భయపడలేదు. మా సినిమా ఆడుతున్న థియేటర్స్‌కి వెళ్లినప్పుడు ప్రేక్షకులు నిలబడి విజిల్స్, క్లాప్స్ కొట్టడం, చేతులెత్తి దండం పెట్టడం చూశాను. మాకిది చాలా గొప్ప అనుభూతి. ధర్మం మన తల్లి లాంటిది. మన తల్లి గురించి మా సినిమాలో చెప్పాం. 'అవెంజర్స్, సూపర్ మాన్, బ్యాట్ మాన్'... ఇవన్నీ సృష్టించిన పాత్రలు. కానీ మనకున్న పాత్రలన్నీ సత్యాలు. కురుక్షేత్రంలో అన్ని ఆయుధాలు వాడినట్లు రేడియేషన్ కనిపిస్తుంటుంది. మనకంత ఘనమైన చరిత్ర ఉంది. మా సినిమా కర్ణాటక, చెన్నై, హిందీలోనూ ఉగ్రరూపం ఉత్రాత లూగిస్తోంది. మా మూవీ రెవెన్యూ స్ట్రాంగ్‌గా ఉంది. అయితే హిందీలో థియేటర్ల కొరత ఉంది. మా సినిమాని సెప్టెంబరు 25న రిలీజ్ అన్నాం. అయితే అప్పుడు 'ఓజీ' సినిమా ఉండటంతో డిసెంబరులో రిలీజ్ చేశాం. 'అఖండ 2' త్రీడీలో ఇంకా అద్భుతంగా ఉంటుంది. పిల్లలకు ఒక్కసారి చూపిస్తే మరోసారి వెళ్దామంటారు'' అని చెప్పారు.

● మురళీ మనోహర్, ఫరియా అబ్దుల్లా, బ్రహ్మానందం, నరేశ్, అమర్

కొత్తవాళ్లను ప్రోత్సహిస్తే ఇండస్ట్రీ బాగుంటుంది

- బ్రహ్మానందం

''గుర్రం పాపిరెడ్డి' డిఫరెంట్ స్టోరీ. ఇప్పటి ప్రేక్షకులకు నచ్చేలా, ఈ సినిమాను కొత్త పద్ధతిలో తీశాడు మురళీ మనోహర్. ఈ చిత్రంలో కథను ప్రేక్షకులకు తెలియజేసే జడ్జి పాత్ర చేశాను. ప్రొడ్యూసర్స్ రాజీ పడకుండా నిర్మించారు. కొత్తవాళ్లు చేసిన ఇలాంటి చిత్రాలను ప్రోత్సహించి, ప్రేక్షకులు ఆదరిస్తే ఇండస్ట్రీ బాగుంటుంది'' అని బ్రహ్మానందం అన్నారు. నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. బ్రహ్మానందం, యోగి బాబు, జీవన్ కుమార్, రాజ్‌కుమార్ కసిరెడ్డి, వంశీధర్ కోసిగి ప్రధాన పాత్రల్లో నటించారు. మురళీ మనోహర్ దర్శకత్వంలో డా. సంధ్య గోలీ సమర్పణలో వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నరేశ్ అగస్త్య మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మూడ్నాలుగు గెటప్స్‌లో కనిపిస్తాను. ఓల్డ్ ఏజ్ గెటప్ కోసం చాలా కష్టపడాల్సి వచ్చింది'' అని చెప్పారు. ''తెలుగు ఆడియన్స్‌కు ఒక కొత్త రకం సినిమా చూపించాలని అందరం ఎఫర్ట్స్ పెట్టి, ఈ సినిమా చేశాం'' అన్నారు మురళీ మనోహర్. ''ఈ సినిమా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను'' అని చెప్పారు అమర్ బురా. ''ఇందులో సౌధామిని అనే పాత్ర చేశాను. అలాగే ఒక సాంగ్ రాసి, పాడటంతో పాటు కొరియోగ్రఫీ కూడా చేశాను'' అని తెలిపారు ఫరియా అబ్దుల్లా.

ప్రేమ... పగ

● వరలక్ష్మి

నవీన్ చంద్ర, వరలక్ష్మీ శరత్ కుమార్ లీడ్ రోల్స్‌లో నటించిన హారర్ థ్రిల్లర్ సినిమా 'పోలీస్ కంప్లైంట్'. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో బాలకృష్ణ మహారాణా నిర్మించారు. ఈ సినిమా టీజర్ లాంచ్ (తెలుగు, కన్నడ భాషల్లో..) ఈవెంట్‌లో వరలక్ష్మీ శరత్‌కుమార్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో యాక్షన్‌తో పాటు ఫుల్ కామెడీ కూడా చేశాను. సినిమా బాగా వచ్చింది'' అని చెప్పారు. సంజీవ్ మేగోటి మాట్లాడుతూ– ''ఈ సినిమా షూటింగ్‌ను 45 రోజుల్లోనే పూర్తి చేశాం. ప్రేమ–పగ, తప్పు–ఒప్పు, మంచి–చెడుల మధ్య హైడ్ అండ్ సీక్ డ్రామాగా ఈ సినిమా సాగుతుంది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ సినిమాను రూపొందించాం. ఈ చిత్రంలో రాగిణి ద్వివేది చేసిన రోల్ థ్రిల్ చేస్తుంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న కుమార్, కృష్ణసాయి, అడివి సాయి కిరణ్, రావుల వెంకటేశ్వర రావు తదితరులు అతిథులుగా పాల్గొని, సినిమా యూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ఆదిత్య ఓం, రవిశంకర్, పృథ్వీ శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, శరత్ లోహితశ్వ, జెమినీ సురేష్, దిల్ రమేశ్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ఆరోహణ సుధీంద్ర – సంజీవ్ మేగోటి – సుధాకర్ మారియో సంగీతం అందించారు.

టైమ్ ట్రావెల్...



● రామ్ గణపతి, అంకిత్ సాహా

రామ్ గణపతి హీరోగా నటించిన చిత్రం 'కాలం'. అంకిత్ సాహా, షిజు, కల్పలత, డా. భద్రం కీలక పాత్రలు పోషించారు. వెంకట సురేష్ దర్శకత్వంలో మణి లక్ష్మణరావు నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు మ్యూజిక్ డైరెక్టర్ ఎమ్ఎమ్ శ్రీలేఖ, యువ నటుడు సాయి రోనక్ అతిథులుగా హాజరై, సినిమా విజయం సాధించాలన్నారు. రామ్ గణపతి మాట్లాడుతూ– ''టైమ్ ట్రావెల్ నేపథ్యంలో ఈ 'కాలం'ను రూపొందించాం. 14ఏళ్ల అబ్బాయి హమ్మీ మా సినిమాకు మ్యూజిక్ ఇచ్చాడు'' అని అన్నారు. ''ఈ 'కాలం' మూవీ కాన్సెప్ట్ అర్థం కావాలంటే అన్ని సన్నివేశాలను మిస్ కాకుండా చూడాలి'' అని చెప్పారు వెంకట సురేష్, మణి లక్ష్మణరావు.

స్టాక్ మార్కెట్లు
(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
534	167
84,680	25,860

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	23,059	△	2
డోజోన్స్	48,180	▽	236
ఎఫ్‌టీఎస్ఈ 100	9,680	▽	71
డాక్స్	24,171	▽	59
షాంఘై	3,825	▽	43
నికాయ్	49,383	▽	785

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	88.58	91.59
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	118.53	112.87
€	యూరో	థామస్‌కుక్	103.83	107.78
¥	జపాన్ యెన్ (100)	థామస్‌కుక్	47.00	60.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	57.87	61.74
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	67.68	71.39
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.22	24.72
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.73	24.99
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.94	13.76

లిస్టింగ్‌కు 7 కంపెనీలు రెడీ

- సెబీ తాజాగా గ్రీన్ సిగ్నల్
- ఉమ్మడిగా రూ. 6 వేల కోట్లపై కన్ను
- జాబితాలో ఆర్ఎస్ బ్రదర్స్

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ చేపట్టడం ద్వారా నిధులు సమీకరించేందుకు తాజాగా సెబీ 7 కంపెనీలకు ఓకే చెప్పింది. జాబితాలో యశోదా హెల్త్‌కేర్ సర్వీసెస్, ఫ్యూజన్ సీక్స్, ఓరియంట్ కేబుల్స్, టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్, ఆర్ఎస్‌బీ రిటైల్ ఇండియా, ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్, లోహియా కార్ప్ చేరాయి. లిస్టింగ్‌కు అనుమతించమంటూ ఈ కంపెనీలన్నీ ఈ ఏడాది మే నుంచి సెప్టెంబర్‌ మధ్య కాలంలో సెబీకి దరఖాస్తు చేశాయి. వెరసి ఉమ్మడిగా రూ. 6,000 కోట్లు సమీకరించేందుకు సమాయత్తంకానున్నాయి. కంపెనీలన్నీ బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టింగ్ కానున్నాయి.

యశోదా హెల్త్‌కేర్

గోప్యతా విధానంలో యశోదా హెల్త్‌కేర్ సర్వీసెస్ సెబీకి సెప్టెంబర్‌లో దరఖాస్తు చేసింది. సంబంధిత వర్గాల అంచనా ప్రకారం ఐపీవో ద్వారా రూ. 3,000–4,000 కోట్ల మధ్య సమీకరించే అవకాశముంది. రహస్య మార్గంలో దరఖాస్తు చేయడం ద్వారా కంపెనీలు ప్రాస్పెక్టస్ వివరాలను తొలిదశలో వెల్లడించకుండా నిలువరించవచ్చు.

ఆర్ఎస్‌బీ రిటైల్

రిటైల్ రంగ ఫ్యాషన్ టెక్స్‌టైల్స్ హైదరాబాద్ కంపెనీ ఆర్ఎస్‌బీ రిటైల్ ఇండియా ఐపీవోలో భాగంగా రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా 2.98 కోట్ల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులకూ.. ఆర్ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ తదితర కొత్త స్టోర్ల ఏర్పాటు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్

2015లో ఏర్పాటైన టర్టిల్‌మింట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్ గోప్యతా మార్గంలో సెప్టెంబర్‌లో సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. అమన్సా క్యాపిటల్, జంగిల్ వెంచర్ పార్ట్‌నర్స్ పెట్టుబడులున్న కంపెనీ బీమా పాలసీల కొనుగోలు, నిర్వహణను సరళతరం చేసింది. తద్వారా సొంత నెట్‌వర్క్ ద్వారా 1.6 కోట్ల పాలసీలను విక్రయించింది.

ఫ్యూజన్ సీక్స్

కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ సర్వీసుల సంస్థ ఫ్యూజన్ సీక్స్ ఐపీవో ద్వారా రూ. 1,000 కోట్లు సమకూర్చుకునే ప్రణాళికల్లో ఉంది. ఇందుకు అనుగుణంగా రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 400 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులుసహా.. అనుబంధ సంస్థల ఐటీ టూల్స్ అభివృద్ధి, ఇతర సంస్థల కొనుగోళ్లు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

ఓరియంట్ కేబుల్స్

పబ్లిక్ ఇష్యూ ద్వారా ఓరియంట్ కేబుల్స్(ఇండియా) లిమిటెడ్ రూ. 700 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. దీనిలో భాగంగా రూ. 320 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 380 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను మెషీనరీ, పరికరాల కొనుగోళ్లతోపాటు తయారీ ప్లాంటు సివిల్ పనులకు, రుణ చెల్లింపులకు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్

వేస్ట్‌వాటర్ ట్రీట్‌మెంట్ సొల్యూషన్లు సమకూర్చే ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్ ఐపీవోలో భాగంగా రూ. 150 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా 1.23 కోట్ల షేర్లను కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయించనున్నారు. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు కేటాయించనుంది.

లోహియా కార్ప్

ఐపీవోలో భాగంగా టెక్నికల్ టెక్స్‌టైల్స్ తయారీ సంబంధిత మెషీనరీ, పరికరాల తయారీ కంపెనీ లోహియా కార్ప్ 4.22 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ చేయనుంది. వీటిని కంపెనీ ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు.

వేదాంతా విడదీతకు ఓకే

ఎన్‌సీఎల్‌టీ గ్రీన్‌సిగ్నల్

ముంబై: ప్రైవేటు రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ బిజినెస్‌ల విడదీత ప్రణాళికకు తాజాగా జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) ఓకే చెప్పింది. దీంతో వివిధ బిజినెస్ విభాగాలను రంగాలవారీగా ఐదు స్వతంత్ర కంపెనీలుగా విడదీసేందుకు వేదాంతాకు వీలు చిక్కనుంది. కంపెనీ విడదీత పథకానికి ట్రిబ్యునల్ ముంబై బెంచ్ తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తద్వారా అల్యూమినియం, ఆయిల్ అండ్ గ్యాస్, ఐరన్ అండ్ స్టీల్, విద్యుత్ తదితర బిజినెస్‌లను విడిగా లిస్ట్ చేయనుంది. కాగా.. నవంబర్‌లో విచారణ తదుపరి బెంచ్ తీర్పును రిజర్వ్ చేసిన సంగతి తెలిసిందే. ఎన్‌సీఎల్‌టీ అనుమతి వేదాంతా ట్రాన్స్‌ఫార్మేషన్‌లో కీలక మైలురాయని కంపెనీ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. తాజా అనుమతితో విడదీత పథక అమలుకు అవసరమైన చర్యలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. 2023లోనే వేదాంతా బిజినెస్‌ల విడదీత ప్రణాళికను ప్రకటించింది. దీనిలో భాగంగా వేదాంతా పేరుతో అల్యూమినియం, ఆయిల్ అండ్ గ్యాస్, పవర్, ఐరన్ అండ్ స్టీల్‌తోపాటు.. పునర్వ్యవస్థీకరించిన వేదాంతా లిమిటెడ్‌గా ఐదు కంపెనీలకు తెరతీయనుంది. వేదాంతా లిమిటెడ్‌లో జింక్, సిల్వర్ బిజినెస్‌లు కొనసాగనున్నాయి.

తాజా అనుమతితో వేదాంతా షేరు ఎన్ఎస్ఈలో 4% జంప్‌చేసి రూ. 573 వద్ద ముగిసింది.

534 పాయింట్లు డౌన్

- 84,680 వద్దకు సెన్సెక్స్
- నిఫ్టీ నష్టం 167 పాయింట్లు
- విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాల ప్రభావం

ముంబై: విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు, అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్ రెండో రోజూ డీలాపడింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేమి, ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 91 స్థాయిని బ్రేక్ చేయడం ఇన్వెస్టర్లను కలవరపరిచింది. ఫలితంగా మంగళవారం సెన్సెక్స్ 534 పాయింట్లు నష్టపోయి 84,680 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 167 పాయింట్లు కోల్పోయి 25,860 వద్ద నిలిచింది. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు, అమ్మకాల ఒత్తిడి నెలకొనడంతో రోజంతా నష్టాల్లోనే ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 592 పాయింట్లు క్షీణించి 84,621 వద్ద, నిఫ్టీ 193 పాయింట్లు పతనమై 25,834 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి.

- బీఎస్ఈలో టెలికమ్యూనికేషన్, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు మాత్రమే రాణించాయి. రియల్టీ 1.36%, బ్యాంకెక్స్ 1.03%, కమొడిటీస్ 0.91%, ఐటీ 0.90%, ఐటీ 0.86%, ఫైనాన్షియల్ సర్వీసెస్ 0.83%, మెటల్ 0.82 శాతం నష్టపోయాయి. మిడ్‌క్యాప్ ఇండెక్సు 0.78%, స్మాల్‌క్యాప్ సూచీ 0.69% పతనమయ్యాయి.
- యాక్సిస్ బ్యాంకు షేరు 5% పతనమై రూ.1,220 వద్ద స్థిరపడింది. డిసెంబర్ క్వార్టర్ వరకూ నికర వడ్డీ మార్జిన్లపై ఒత్తిడి కొనసాగొచ్చని అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ సిటి ఆందోళన వ్యక్తం చేయడంతో ఈ షేరు పడింది.

91కి జారిన రూపాయి

ముంబై: వాణిజ్య లోటు పెరుగుతుండటం, భారత–అమెరికా వాణిజ్య ఒప్పందంపై సందిగ్ధత తదితర అంశాల కారణంగా రూపాయి మారకం విలువ రోజురోజుకీ పడిపోతోంది. తాజాగా ఇంట్రాడేలో 91 మార్కును దాటేసింది. చివరికి డాలరుతో పోలిస్తే మరో 15 పైసలు క్షీణించి 90.93 వద్ద క్లోజయ్యింది. ఒక దశలో క్రితం ముగింపుతో పోలిస్తే ఇంట్రాడేలో 36 పైసల క్షీణతతో 91.14 స్థాయిని కూడా తాకింది. కేవలం 10 ట్రేడింగ్ సెషన్లలోనే రూపాయి మారకం విలువ 90 నుంచి 91కి పడిపోయింది. గత అయిదు సెషన్లలో ఏకంగా 1 శాతం పతనమైంది. ఈ నెలలోనే 92 మార్కును కూడా దాటేయొచ్చని ఫిన్‌రెక్స్ ట్రెజరీ అడ్వైజర్స్ ఈడీ అనిల్ కుమార్ భన్సాలీ తెలిపారు.

ఈ ఏడాది 5.1 శాతం డౌన్..

రాజ్యసభలోనూ ఈ అంశం చర్చకు రాగా, డేటా ప్రకారం ఈ ఏడాది డిసెంబర్ 3 వరకు రూపాయి విలువ 5.1 శాతం క్షీణించిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. వాణిజ్య లోటు, అమెరికా–భారత్ ఒప్పందానికి సంబంధించిన పరిణామాలు రూపాయిపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయని చెప్పారు. అయితే, రూపాయి పతనంతో ఎగుమతులపరంగా పోటీతత్వం మెరుగుపడొచ్చని, ఇది ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం చూపవచ్చని పేర్కొన్నారు. డేటా ప్రకారం డాలరుతో పోలిస్తే రూపాయి 2015లో 4.5 శాతం, 2016లో 2.6 శాతం క్షీణించగా, 2017లో 6.4 శాతం పెరిగింది. ఆ తర్వాత నుంచి ప్రతి సంవత్సరం క్షీణత కొనసాగింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..	
నవంబర్‌లో 7 నెలల కనిష్టానికి నిరుద్యోగం	వచ్చే ఏడాదికి జీడీపీ వృద్ధి 7 శాతం

సానుకూలంగా బ్యాంకింగ్, ఐటీ: క్వాంటమ్ ఏఎంసీ

హైదరాబాద్‌లో రీజినల్ కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుతం కీలక సూచీలు అధిక స్థాయిల్లో ఉన్నట్లు కనిపిస్తున్నా, కాస్త లోతుగా చూస్తే పలు స్టాక్స్ అందుబాటు స్థాయిల్లోనే లభిస్తున్నాయని క్వాంటమ్ అడ్వైజర్స్ ఎండీ ఐవీ సుబ్రమణియం తెలిపారు. బ్యాంకింగ్, ఐటీ, కన్జూమర్ డిస్క్రెషనరీ తదితర రంగాల స్టాక్స్ ఆకర్షణీయంగా ఉన్నాయని పేర్కొన్నారు. శిక్షణ లేకుండా ఎఫ్అండ్ఓ ట్రేడింగ్ చేయడం శ్రేయస్కరం కాదని, ఫండ్స్ ద్వారా ఇన్వెస్ట్ చేయడం మేలని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో తమ రీజినల్ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. ప్రస్తుతం తమకు తొమ్మిది ఆఫీసులు ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరంలో వీటి సంఖ్యను 13కి పెంచుకోనున్నట్లు సంస్థ సీఈవో శీమంత్ శుక్లా చెప్పారు. దక్షిణాదిలో గణనీయంగా ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో ఇక్కడ కార్యకలాపాలను మరింత వేగంగా విస్తరిస్తున్నట్లు వివరించారు. రాశి కన్నా వాసికి ప్రాధాన్యమిచ్చే లక్ష్యంతో ప్రస్తుతం 14 ప్రొడక్టులను అందిస్తుండగా, నిర్వహణలోని ఆస్తుల పరిమాణం (ఏయూఎం) సుమారు రూ. 3,712 కోట్లుగా ఉందని చెప్పారు.

గుజరాత్ కిడ్నీ @ రూ. 108-114



22-24 మధ్య పబ్లిక్ ఇష్యూ

న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ కంపెనీ గుజరాత్ కిడ్నీ అండ్ సూపర్ స్పెషాలిటీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 22న ప్రారంభంకానుంది. 24న ముగియనున్న ఇష్యూకి తాజాగా రూ. 108–114 ధరల శ్రేణి ప్రకటించింది. దీనిలో భాగంగా 2.2 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. తద్వారా దాదాపు రూ. 251 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇన్వెస్టర్లు కనీసం 128 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఈక్విటీ జారీ నిధులను అహ్మదాబాద్‌లోని పరేఖ్స్ హాస్పిటల్ కొనుగోలుతోపాటు.. ఇప్పటికే సొంతం చేసుకున్న అశ్విని మెడికల్ సెంటర్ పాక్షిక చెల్లింపులకు వెచ్చించనుంది. అంతేకాకుండా వడోదరలో కొత్త ఆసుపత్రి ఏర్పాటు, రోబోటిక్స్ పరికరాల కొనుగోలు, రుణ చెల్లింపులకు సైతం నిధులు కేటాయించనుంది. కంపెనీ గుజరాత్‌లో మధ్యస్థాయి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రుల చైన్‌ను నిర్వహిస్తోంది.

సాక్షి స్పోర్ట్స్

ఐపీఎల్ వేలం ఇతర విశేషాలు

- గత సీజన్‌లో రూ.23.75 కోట్లకు కోల్‌కతాకు అమ్ముడుపోయిన వెంకటేశ్ అయ్యర్‌ను ఈసారి బెంగళూరు రూ.7 కోట్లకు తీసుకుంది.
- మధ్యప్రదేశ్‌కు చెందిన లెఫ్టార్మ్ పేసర్ మంగేశ్ యాదవ్ కేవలం 2 టి20లే ఆడి 3 వికెట్లు తీశాడు. అతని కోసం ఆర్‌సీబీ రూ.5.20 కోట్లు వెచ్చించింది.
- ప్రముఖ రాజకీయ నాయకుడు, పార్లమెంట్ సభ్యుడు పప్పూ యాదవ్ కుమారుడు, 29 ఏళ్ల సార్థక్ రంజన్‌కు తొలిసారి ఐపీఎల్ చాన్స్ లభించింది.

3 ఐపీఎల్ వేలం చరిత్రలో అత్యధిక మొత్తం పలికిన ఆటగాళ్ల జాబితాలో గ్రీన్ మూడో స్థానంలో నిలిచాడు. పంత్ (రూ.27 కోట్లు), శ్రేయస్ అయ్యర్ (రూ.26.75 కోట్లు) మొదటి రెండు స్థానాల్లో ఉన్నారు. విదేశీ ఆటగాళ్లలో కమిన్స్ (రూ.20.50 కోట్లు), స్టార్క్ (రూ.24.75 కోట్లు) రికార్డును గ్రీన్ దాటాడు.

- హైదరాబాద్ ప్లేయర్ పేరాల అమన్ రావును రాజస్తాన్ రాయల్స్...ఆంధ్ర బౌలర్ యర్రా పృథ్వీరాజ్‌ను గుజరాత్ టైటాన్స్ ఎంచుకున్నాయి. కేఎస్ భరత్ సహా ఇతరులకు అవకాశం దక్కలేదు.

పృథ్వీ

అమన్

కామెరాన్ గ్రీన్‌పై కోట్లాభిషేకం

ఐపీఎల్ వేలంలో రూ. 25.20 కోట్లకు సొంతం చేసుకున్న కోల్‌కతా

లీగ్ చరిత్రలో అత్యధిక మొత్తం అందుకోనున్న విదేశీ ఆటగాడిగా రికార్డు

పతిరణ కోసం కూడా రూ.18 కోట్లు వెచ్చించిన కేకేఆర్ ● వేలంలో 77 మందిని ఎంచుకున్న ఫ్రాంచైజీలు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మినీ వేలంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ పంట పండింది. ఊహించినట్లుగా అతను అత్యధిక విలువ పలికాడు. అయితే అంచనాలకు మించి రికార్డు స్థాయిలో రూ. 25.20 కోట్లకు కోల్‌కతా నైట్‌రైడర్స్ గ్రీన్‌ను సొంతం చేసుకోవడం విశేషం. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధరకు అమ్ముడుపోయిన విదేశీ ఆటగాడిగా గ్రీన్ నిలిచాడు. వేలానికి ముందు చేతిలో భారీ మొత్తం ఉన్న కేకేఆర్ అదే తరహాలో దానిని ఖర్చు కూడా చేసింది. లంక పేసర్ పతిరణ కోసం రూ. 18 కోట్లు చెల్లించడంతో పాటు ముస్తఫిజుర్ రహమాన్‌ను కూడా రూ. 9.20 కోట్లు ఇచ్చి తమ జట్టులోకి తీసుకుంది. భారత్‌కు ఒక్క మ్యాచ్ కూడా ఆడని 'అన్‌క్యాప్డ్' ప్లేయర్లు ప్రశాంత్ వీర్, కార్తీక్ శర్మ కోసం చెన్నై రూ. 14.20 కోట్ల చొప్పున, కశ్మీర్ పేసర్ ఆఖిబ్ నబీ కోసం ఢిల్లీ రూ.8.40 కోట్లు వెచ్చించడం మంగళవారం వేలంలో హైలైట్‌గా నిలిచిన అంశం. ఓవరాల్‌గా 10 ఫ్రాంచైజీలు కలిపి వేలంలో మొత్తం 77 మంది ఆటగాళ్లను ఎంపిక చేసుకున్నాయి. వీరిలో 29 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు.

అబుదాబి: ఐపీఎల్–2026 కోసం 10 జట్లలో ఉన్న ఖాళీలు పూరించేందుకు నిర్వహించిన మినీ వేలం ఆసక్తికరంగా సాగింది. ఎప్పటిలాగే కొందరు ఆటగాళ్లకు ఊహించని విధంగా అసాధారణ ధర దక్కగా... మరికొందరిని తక్కువ మొత్తానికి జట్లు ఎంచుకున్నాయి. ఇప్పటికే తమకంటూ గుర్తింపు ఉన్న పలువురు క్రికెటర్లు ఎవరూ పట్టించుకోకపోవడంతో 'అన్‌సోల్డ్'గా మిగిలిపోయారు. మెగా వేలంతో పోలిస్తే సాధారణంగా ఆయా జట్ల వద్ద ఎక్కువ మొత్తం అందుబాటులో లేకపోవడంతో పాటు తక్కువ మంది ఆటగాళ్లను తీసుకోవాల్సి ఉండటంతో 'సప్లయ్–డిమాండ్' సూత్రం ప్రకారం సహజంగానే కొందరికి భారీ మొత్తాలు దక్కాయి. ఓవరాల్‌గా 359 మంది ఆటగాళ్లు వేలానికి రాగా, అన్ని జట్లూ కలిపి ఇందు కోసం మొత్తం రూ. 215.45 కోట్లు ఖర్చు చేశాయి.

గ్రీన్ వేలం సాగిందిలా...

వేలంలో నాలుగో ఆటగాడిగా గ్రీన్ పేరు వచ్చింది. ముంబై ముందుగా మొదలు పెట్టగా, ఆ తర్వాత రాజస్తాన్, కోల్‌కతా జత కలిశాయి. రాజస్తాన్, కేకేఆర్ కలిసి దీనిని రూ.13.60 కోట్ల వరకు తీసుకెళ్లాయి. అయితే చెన్నై రూ.13.80 కోట్లు చెప్పడంతో మళ్లీ పోటీ మొదలైంది. రాజస్తాన్ రేసు నుంచి తప్పుకోగా... రెండు జట్ల మధ్య పోటీ సాగింది. చివరకు రూ.25.20 కోట్ల వద్ద కేకేఆర్ ఖాయం చేసుకుంది. పతిరణ కోసం ముందుగా ఢిల్లీ ఆసక్తి చూపించినా, లక్నో, కేకేఆర్ కలిసి పెద్ద మొత్తానికి తీసుకెళ్లాయి. ఆఖరికి పతిరణ కూడా నైట్ రైడర్స్‌తోనే చేరాడు. ముందుగా పేరు వచ్చినప్పుడు ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లివింగ్‌స్టోన్‌ను ఎవరూ తీసుకోలేదు. అయితే మళ్లీ చివర్లో వచ్చినప్పుడు అతని కోసం మూడు జట్లు కేకేఆర్, లక్నో, సన్‌రైజర్స్ పోటీ పడగా రూ.13 కోట్లతో రైజర్స్ గెలుచుకుంది.

అన్‌క్యాప్డ్ ఆటగాళ్ల జోరు...

భారీ సిక్సర్లతో ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆకట్టుకున్న రాజస్తాన్‌కు చెందిన వికెట్ కీపర్ బ్యాటర్ కార్తీక్ శర్మ కోసం రూ. 30 లక్షలతో ముంబై బిడ్డింగ్ మొదలు పెట్టింది. అయితే ముంబై, లక్నో తప్పుకున్న తర్వాత కేకేఆర్, చెన్నై వేలాన్ని ముందుకు తీసుకెళ్లాయి. గత ఏడాది చెన్నై టీమ్‌తో కలిసి అతను ప్రాక్టీస్ చేశాడు. రూ.13 కోట్ల వద్ద ముగుస్తున్న దశలో సన్‌రైజర్స్ అడుగు పెట్టింది కానీ చివరకు కార్తీక్ చెన్నై చెంతకే చేరాడు. జడేజా తరహాలో లెఫ్టార్మ్ స్పిన్, దూకుడుగా బ్యాటింగ్ చేయగల ఉత్తరప్రదేశ్ ఆల్‌రౌండర్ ప్రశాంత్ వీర్ కోసం కూడా పోటీ బాగా నడిచింది. మొత్తం ఆరు జట్లు అతడిని తీసుకునే ప్రయత్నంలో విలువను పెంచుతూ వెళ్లడం విశేషం. ఆఖరికి ప్రశాంత్‌ను సీఎస్‌కే తమ జట్టులోకి తీసుకుంది. గత కొంత కాలంగా దేశవాళీ క్రికెట్‌లో సంచలన బౌలింగ్ ప్రదర్శన కనబరుస్తున్న కశ్మీర్ పేస్ బౌలర్ ఆఖిబ్ నబీ కోసం కూడా జట్లు పోటీ పడ్డాయి. మొదటి నుంచి ఎక్కువ ఆసక్తి కనబరిచిన ఢిల్లీ చివరి వరకు హైదరాబాద్‌తో పోటీ పడి నబీని సొంతం చేసుకుంది.

పతిరణ

కార్తీక్ శర్మ

ప్రశాంత్ వీర్

లివింగ్‌స్టోన్

వేలంలో అత్యధిక విలువ పలికిన టాప్ ఆటగాళ్లు

ఆటగాడు	విలువ
1. కామెరాన్ గ్రీన్ (కోల్‌కతా)	రూ. 25.20 కోట్లు
2. పతిరణ (కోల్‌కతా)	రూ. 18 కోట్లు
3. కార్తీక్ శర్మ (చెన్నై)	రూ.14.20 కోట్లు
4. ప్రశాంత్ వీర్ (చెన్నై)	రూ. 14.20 కోట్లు
5. లివింగ్‌స్టోన్ (హైదరాబాద్)	రూ. 13 కోట్లు
6. ముస్తఫిజుర్ (కోల్‌కతా)	రూ. 9.40 కోట్లు
7. జోష్ ఇన్‌గ్లిస్ (లక్నో)	రూ. 8.60 కోట్లు
8. ఆఖిబ్ నబీ (ఢిల్లీ)	రూ. 8.40 కోట్లు
9. రవి బిష్ణోయ్ (రాజస్తాన్)	రూ. 7.20 కోట్లు
10. జేసన్ హోల్డర్ (గుజరాత్)	రూ. 7 కోట్లు
11. వెంకటేశ్ అయ్యర్ (బెంగళూరు)	రూ. 7 కోట్లు

గ్రీన్‌కు దక్కేది రూ. 18 కోట్లే!

వేలంలో రూ.25.20 కోట్లకు పలికినా కామెరాన్ గ్రీన్‌కు గరిష్ఠంగా రూ.18 కోట్లు మాత్రమే లభిస్తాయి. ఐపీఎల్ నిబంధనల ప్రకారం మినీ వేలంలో విదేశీ ఆటగాడికి ఎంత విలువ పలికినా... ఆటగాళ్ల గరిష్ఠ రీటెయినింగ్ ఫీజు (రూ.18 కోట్లు) లేదా మెగా వేలంలో ఆటగాడికి దక్కిన మొత్తం (రూ.27 కోట్లు; రిషభ్ పంత్)కు ఇది మించరాదు. రెండింటిలో ఏది తక్కువైతే అంతే మొత్తం లభిస్తుంది. మిగిలిన రూ.7.20 కోట్లు బీసీసీఐ ఆటగాళ్ల సంక్షేమ నిధికి చేరతాయి.

అమ్ముడుపోయిన ఆటగాళ్లు వీరే

చెన్నై: కార్తీక్ శర్మ (రూ.14.20 కోట్లు), ప్రశాంత్ వీర్ (రూ.14.20 కోట్లు), రాహుల్ చహర్ (రూ.5.20 కోట్లు), మాట్ హెన్రీ (రూ.2 కోట్లు), అకీల్ హొసీన్ (రూ.2 కోట్లు), మాథ్యూ షార్ట్ (రూ.1.50 కోట్లు), జాక్ ఫూల్క్స్ (రూ.75 లక్షలు), సర్ఫరాజ్ ఖాన్ (రూ.75 లక్షలు), అమన్ ఖాన్ (రూ.40 లక్షలు).

ఢిల్లీ: ఆఖిబ్ నబీ (రూ.8.40 కోట్లు), నిసాంక (రూ.4 కోట్లు), జేమీసన్ (రూ.2 కోట్లు), ఎన్‌గిడి (రూ.2 కోట్లు), డకెట్ (రూ. 2 కోట్లు), మిల్లర్ (రూ. 2 కోట్లు), పృథ్వీ షా (రూ. 75 లక్షలు), సాహిల్ పరాఖ్ (రూ.30 లక్షలు).

గుజరాత్: హోల్డర్ (రూ.7 కోట్లు), బాంటన్ (రూ. 2 కోట్లు), అశోక్ శర్మ (రూ.90 లక్షలు), ల్యూక్‌వుడ్ (రూ.75 లక్షలు), పృథ్వీరాజ్ (రూ. 30 లక్షలు).

కోల్‌కతా: గ్రీన్ (రూ. 25.20 కోట్లు), పతిరణ (రూ.18 కోట్లు), ముస్తఫిజుర్ (రూ.9.20 కోట్లు), తేజస్వి సింగ్ (రూ.3 కోట్లు), రచిన్ రవీంద్ర (రూ.2 కోట్లు), ఫిన్ అలెన్ (రూ.2 కోట్లు), సీఫెర్ట్ (రూ.1.50 కోట్లు), ఆకాశ్‌దీప్ (రూ.1 కోటి), రాహుల్ త్రిపాఠి (రూ. 75 లక్షలు), దక్ష్ కామ్రా (రూ.30 లక్షలు), సార్థక్ రంజన్ (రూ.30 లక్షలు), ప్రశాంత్ సోలంకి (రూ.30 లక్షలు), కార్తీక్ త్యాగి (రూ.30 లక్షలు).

లక్నో: ఇన్‌గ్లిస్ (రూ.8.60 కోట్లు), ముకుల్ చౌధరీ (రూ.2.60 కోట్లు), అక్షత్ రఘువంశీ (రూ.2.20 కోట్లు), నోర్జే (రూ. 2 కోట్లు), హసరంగ (రూ. 2 కోట్లు), నమన్ తివారి (రూ.1 కోటి).

ముంబై: డి కాక్ (రూ.1 కోటి), మయాంక్ రావత్ (రూ. 30 లక్షలు), అథర్వ అంకోలేకర్ (రూ. 30 లక్షలు), మొహమ్మద్ ఇజ్‌హార్ (రూ. 30 లక్షలు), డానిశ్ మాలేవర్ (రూ. 30 లక్షలు).

పంజాబ్: డ్వార్‌షుయిస్ (రూ.4.40 కోట్లు), కనోలీ (రూ.3 కోట్లు), నిషాద్ (రూ. 30 లక్షలు), ప్రవీణ్ దూబే (రూ. 30 లక్షలు).

రాజస్తాన్: రవి బిష్ణోయ్ (రూ.7.20 కోట్లు), మిల్నే (రూ.2.40 కోట్లు), రవి సింగ్ (రూ.95 లక్షలు), సుశాంత్ మిశ్రా (రూ.90 లక్షలు), కుల్దీప్ సేన్ (రూ.75 లక్షలు), బ్రిజేశ్ శర్మ (రూ. 30 లక్షలు), పేరాల అమన్‌రావు (రూ. 30 లక్షలు), విఘ్నేశ్ (రూ. 30 లక్షలు), యశ్‌రాజ్ (రూ. 30 లక్షలు).

బెంగళూరు: వెంకటేశ్ అయ్యర్ (రూ. 7 కోట్లు), మంగేశ్ యాదవ్ (రూ.5.20 కోట్లు), డఫీ (రూ.2 కోట్లు), కాక్స్ (రూ.75 లక్షలు), కనిష్క్ (రూ. 30 లక్షలు), విహాన్ (రూ. 30 లక్షలు), విక్కీ (రూ. 30 లక్షలు), సాత్విక్ (రూ. 30 లక్షలు).

హైదరాబాద్: లివింగ్‌స్టోన్ (రూ.13 కోట్లు), జేక్ ఎడ్వర్డ్స్ (రూ.3 కోట్లు), సలీల్ అరోరా (రూ.1.50 కోట్లు), శివమ్ మావి (రూ.75 లక్షలు), ఫులెత్రా (రూ. 30 లక్షలు), ప్రఫుల్ (రూ. 30 లక్షలు), అమిత్ కుమార్ (రూ. 30 లక్షలు), ఓంకార్ (రూ. 30 లక్షలు), సాకిబ్ హుస్సేన్ (రూ. 30 లక్షలు), శివాంగ్ కుమార్ (రూ. 30 లక్షలు).

సిరీస్ సొంతం చేసుకోవాలని...	లక్నోలో నేడు దక్షిణాఫ్రికాతో భారత్ నాలుగో టి20	రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో లైవ్
అభిజ్ఞాన్ అదరహో	125 బంతుల్లో 17 ఫోర్లు, 9 సిక్స్‌లతో 209 నాటౌట్	మలేసియాపై 315 పరుగులతో యువభారత్ గెలుపు
పంజాబ్‌పై ఆంధ్ర గెలిచినా...	హైదరాబాద్ చేజేతులా...	ముస్తాక్ అలీ ట్రోఫీలో తొలిసారి ఫైనల్ చేరిన హరియాణా, జార్ఖండ్
సర్ఫరాజ్ ఖాన్ ఎట్టకేలకు...	ఐపీఎల్ వేలంలో అన్‌సోల్డ్ ఆటగాళ్ల జాబితా	మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

వీఆర్‌ఏల సమస్యలను తక్షణమే పరిష్కరించండి

సీసీఎల్‌ఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

- ఏపీ వీఆర్‌ఏ సంఘాల జేఏసీ డిమాండ్
- మంగళగిరిలోని సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద ధర్నా

మంగళగిరి టౌన్: గ్రామ రెవెన్యూ సహాయకుల ప్రధాన సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీ వీఆర్‌ఏ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద మంగళవారం మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 700 మందికి పైగా వీఆర్‌ఏలు పాల్గొన్నారు. గంటల తరబడి ఎండలో కూర్చున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. జేఏసీ నేతలు మాట్లాడుతూ..తెలంగాణ తరహాలో ఏపీలో కూడా వీఆర్‌ఏలందరికీ పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 20 వేల మంది వీఆర్‌ఏలకు గౌరవ వేతనం ఇచ్చి ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటోందని విమర్శించారు. సమస్యలను పరిష్కరించక పోగా నైట్ డ్యూటీలు, రీ సర్వేలు వంటి అదనపు పనులు చేయించుకుంటూ వేధింపులకు గురిచేస్తోందని మండిపడ్డారు. అర్హత ఉన్న వీఆర్‌ఏలకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. చనిపోయిన వీఆర్‌ఏల కుటుంబాల్లో అర్హులకు కారుణ్య నియామకాలు కూడా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 30లోపు ఈ సమస్యలను పరిష్కరించని పక్షంలో మరుసటి రోజు నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం సీసీఎల్‌ఏ అధికారికి వినతిపత్రమిచ్చారు.

నకిలీ విత్తనాలతో ముంచేశారు

సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

- అప్పుల ఊబిలో కూరుకుపోయాం
- ఆదుకోవాలంటూ సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం వద్ద రైతుల ధర్నా

సూళ్లూరుపేట రూరల్: 'నకిలీ విత్తనాలు అంటగట్టి మమ్మల్ని నిలువునా ముంచేశారు. అప్పుల ఊబిలో కూరుకుపోయాం. ఎకరాకు రూ.62 వేల మేర నష్టపోయాం. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి. మమ్మల్ని మానవత్వంతో ఆదుకోవాలి' అని డిమాండ్ చేస్తూ రైతులు మంగళవారం తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. బాధితులంతా ఇటీవల తిరుపతి కలెక్టర్‌ను కలిసి తమకు జరిగిన నష్టంపై ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఓ కమిటీని నియమించారు. మంగళవారం సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయంలో కమిటీ సమావేశమవ్వగా.. బాధిత రైతులు అక్కడకు చేరుకుని తమ ఆందోళనను తెలియజేశారు. బీపీటీ 2782 రకం విత్తనాలు కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోయారు. సూళ్లూరుపేట, దొరవారిసత్రం, వరదయ్యపాళెం మండలాల్లో సుమారు 2 వేల ఎకరాల పంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు. నకిలీ విత్తనాలు అంటగట్టిన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తమకు నష్టపరిహారం ఇచ్చి.. ఆదుకోవాలని కోరారు. కమిటీలోని అధికారి ప్రసాదరావు మాట్లాడుతూ.. విత్తనాలు విక్రయించిన వారే నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎకరాకు రూ.50 వేలు అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

భీమవరంలో ధర్నా చేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

భీమవరం, ఏలూరులోని కలెక్టరేట్ వద్ద సహకార సంఘాల ఉద్యోగుల ధర్నా

భీమవరం/ఏలూరు (టూటౌన్): ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ సహకార సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని కలెక్టరేట్ వద్ద ఏపీ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణశాస్త్రి, కోశాధికారి ఇ.పెద్దిరాజు, కన్వీనర్ పి.నర్సింహరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల ఉద్యోగుల పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సహకార సంఘాల ఉద్యోగుల జేఏసీ నాయకుడు నందమూరి వెంకట సుబ్బారావు, యూనియన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి టి.గంగరాజు, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏలూరు కలెక్టరేట్ వద్ద కూడా ధర్నా చేశారు. ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి మద్దతు తెలిపారు. సహకార సంఘాల ఉద్యోగుల జేఏసీ నాయకులు కేవీవీ సత్యనారాయణ, నీలం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మరో క్రెడిట్ చోరీ

కానిస్టేబుల్ పోస్టుల భర్తీ తన ఖాతాలో వేసుకునేందుకు తాపత్రయం

- నోటిఫికేషన్, ప్రిలిమినరీ పరీక్ష జరిగింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే
- నాడు కోర్టు కేసులతో నియామక ప్రక్రియను అడ్డుకుంది టీడీపీయే
- నేడు తానే పోస్టింగులు ఇస్తున్నట్లు చంద్రబాబు బిల్డప్

సాక్షి, అమరావతి: క్రెడిట్ చోరీలో ఆరితేరిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన రికార్డులు తానే తిరగరాస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులను తమ ప్రభుత్వం చేసినవిగా చెప్పుకునేందుకు నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విశాఖపట్నంలో అదానీ డేటా సెంటర్ ఏర్పాటును 'గూగుల్' ముసుగులో తన ఘనతగా చెప్పుకునేందుకు ఆపసోపాలుపడిన చంద్రబాబు అభాసుపాలయ్యారు. ఇప్పుడు తాజాగా రాష్ట్రంలో 6,100 మంది పోలీస్ కానిస్టేబుళ్ల నియామకం కూడా తన ఖాతాలో వేసుకునేందుకు ఆయన హైడ్రామాకు తెరతీశారు. ఎంపికైన పోలీస్ కానిస్టేబుళ్లకు నియామక పత్రాల ప్రదానం పేరిట మంగళవారం ప్రచారార్భాటంతో కనికట్టు చేయడం పోలీసు వర్గాలనే విస్మయపరుస్తోంది. ఈ ప్రక్రియలో అసలు వాస్తవాలివీ..

2022లోనే నోటిఫికేషన్..

రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా తొలుత 2022లో ఎస్సై పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి రాత పరీక్షలూ నిర్వహించి 411 ఉద్యోగాలను భర్తీ చేసింది. అలాగే 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టింది. సివిల్ కానిస్టేబుల్ పోస్టులు 3,580, ఏపీఎస్పీ కానిస్టేబుల్ పోస్టులు 2,520 మొత్తం 6,100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి 2022, నవంబరులో నోటిఫికేషన్ జారీచేసింది. ఆ పోస్టులకు మొత్తం 5,03,486 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే 2023, జనవరి 22న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించారు. మొత్తం 4,59,182 మంది అభ్యర్థులు హాజరైన ఈ పరీక్ష ఫలితాలను కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రకటించారు.



STATE LEVEL POLICE RECRUITMENT BOARD
ANDHRA PRADESH, MANGALAGIRI, GUNTUR DISTRICT.

Rc.No.161/SLPRB/Rect.2/2022 Date: 28-11-2022

1. In pursuance of G.O.Ms. No. 153 of Home (Services.IV) Department dated: 20.10.2022, State Level Police Recruitment Board, Andhra Pradesh (hereinafter referred to as SLPRB, AP) invites applications for the following posts, through ONLINE mode only, in the prescribed proforma to be made available on WEBSITE (https://slprb.ap.gov.in) from 30.11.2022 at 03.00 PM to 05.00 PM on 28.12.2022.

Sl. No.	Post Code No.	Name of the post	No. of vacancies
01	21	Stipendiary Cadet Trainee (SCT) Police Constables (Civil) (Men & Women) in Police Department	3580
02	23	Stipendiary Cadet Trainee (SCT) Police Constables (APSP) (Men) in Police Department	2520
		Total	6100

6,100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2022, నవంబర్ 28న ఇచ్చిన నోటిఫికేషన్

కోర్టు కేసులతో కానిస్టేబుల్ నోటిఫికేషన్‌ను అడ్డుకున్న టీడీపీ..

అయితే, ఈ కానిస్టేబుల్ పోస్టుల భర్తీని అప్పట్లో ప్రతిపక్ష టీడీపీ దురుద్దేశంతో అడ్డుకుంది. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు రాష్ట్రంలోని నాలుగు కేంద్రాల్లో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సిద్ధపడింది. కానీ, టీడీపీ నేతలు తమ వర్గీయుల ద్వారా న్యాయస్థానాల్లో 36 పిటిషన్లు వేయించారు. దాదాపు ఏడాది పాటు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించకుండా అడ్డుకున్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఏడాదిన్నరలోనే తమ వర్గీయుల చేత ఆ కేసులన్నీ ఉపసంహరింపజేయడం గమనార్హం. దీంతో రాష్ట్ర పోలీసు నియామక మండలి దేహదారుఢ్య పరీక్షలు, అనంతరం మెయిన్స్ పరీక్షలు నిర్వహించి 5,757 మంది అభ్యర్థులను ఎంపిక చేసింది.

చంద్రబాబు హైడ్రామా..

ఇదిలా ఉంటే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన కానిస్టేబుల్ పోస్టుల నియామక ప్రక్రియను ఇప్పుడు తన ఘనతగా ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు చంద్రబాబు హైడ్రామాకు తెరతీశారు. ఎంపికైన కానిస్టేబుళ్లకు నియామక పత్రాల ప్రదానం పేరిట తెగ హడావుడి చేశారు. వాస్తవానికి.. కానిస్టేబుళ్లకు రాష్ట్రంలోని వివిధ ఏపీఎస్పీ బెటాలియన్లలో నియామక పత్రాలు అందించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. కానీ, ఈ పోస్టుల భర్తీ తన ఘనతగా చెప్పుకునేందుకు.. అలాగే, ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు చంద్రబాబు ఓ ఎత్తుగడ వేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన మొత్తం 5757 మంది కానిస్టేబుళ్లకు నియామక పత్రాల ప్రదానం కార్యాక్రమాన్ని మంగళగిరిలోని పోలీస్ బెటాలియన్‌లో మంగళవారం నిర్వహించారు. అంతేకాదు.. ఎంపికైన ఒక్కో కానిస్టేబుల్ అభ్యర్థి తనతో కనీసం ముగ్గురు కుటుంబ సభ్యులను తీసుకురావాలని మెలిక పెట్టారు. వీరిని ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం తరలించింది. అంతమందితో సమావేశం నిర్వహించి తన సొంత డబ్బా కొట్టుకోవాలన్నది చంద్రబాబు పన్నాగం. అంటే.. శ్రీకాకుళం, అనంతపురం తదితర సుదూర ప్రాంతాల నుంచి ఎంపికైన అభ్యర్థులే కాకుండా వారి కుటుంబ సభ్యులు వ్యయప్రయాసలు భరించి మంగళగిరి రావాలని హుకుం జారీచేశారు.

నిబంధనలకు విరుద్ధంగా..

అయితే, వీరు ఇంకా విధుల్లో చేరకుండానే నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం వీరికి వారెంట్ జారీచేసి ఆర్టీసీ బస్సుల్లో తీసుకొచ్చింది. ఈ బాధ్యతలను జిల్లాల ఎస్పీలు పర్యవేక్షించారు. నిజానికి.. పోలీసు, రెవెన్యూ తదితర కీలక శాఖలు రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి. కానీ, చంద్రబాబు సర్కారు ఈ కార్యక్రమాన్ని పక్కా పార్టీ కార్యక్రమంగా మార్చేసింది. పైగా.. ఎంపికైన అభ్యర్థులతో జిల్లాల వారీగా సమావేశాలు కూడా నిర్వహించాలని ఆదేశించింది. దీంతో.. చంద్రబాబు ప్రభుత్వ తీరుపై అటు పోలీసు వర్గాలతోపాటు ఇటు ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థుల కుటుంబాలు తీవ్ర అసహనం వ్యక్తంచేస్తున్నాయి. ఈ నియామక పత్రాల ప్రదానం కార్యక్రమాన్ని కూడా పార్టీ కార్యక్రమంలా చేయడమేంటని వారు దుమ్మెత్తిపోస్తున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., **EDITOR: Dhananjaya Reddy Rakkasi,** (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

అయ్యగారికి దండం పెట్టు

కోడి రెఢీ'


బిక్కవోలు మండలం పందలపాకలో
కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి

పల్లెంత తుళ్లింత కావాలిలె!

ధనుర్మాసం ఉత్సవాలు ఆరంభం

- గ్రామాల్లో ఇక సంక్రాంతి సందడి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఆకట్టుకోనున్న రంగవల్లులు
- కోనసీమ ప్రత్యేకతగా ప్రభల ఉత్సవం
- దేశ విదేశాల నుంచి స్వగ్రామాలకు రానున్న తెలుగువారు

ఆలమూరు/బిక్కవోలు: తెలుగు సంస్కృతికి, సనాతన సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు, గ్రామ ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలిచే మకర సంక్రాంతి పండగకు పల్లె సీమలు ముస్తాబవుతున్నాయి. మార్గశిర కృష్ణ పక్ష ద్వాదశి, మూల కార్తీ రోజైన మంగళవారం మధ్యాహ్నం 1.23 గంటలకు సూర్యుడు ధనురాశిలో ప్రవేశించడంతో శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన ధనుర్మాసం ప్రారంభమయ్యింది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ధనుర్మాసాన్ని నెల పట్టుట లేదా నెలగంట అంటారు. జనవరి 14న జరిగే భోగి పండగ వరకూ నెల రోజుల పాటు ఈ ధనుర్మాసం ఉంటుంది. విష్ణాలయాల్లో ధనుర్మాస పూజలు చేసేందుకు దేవదాయశాఖ ఏర్పాట్లను పూర్తి చేసింది. కోనసీమ జిల్లాలోని వివిధ గ్రామాల్లో ఉన్న విష్ణాలయాల్లోని దేవతామూర్తులు ప్రతి రోజూ పల్లకిలో ఊరేగింపుగా వెళ్లి భక్తులకు దర్శనివ్వనున్నారు.

సంప్రదాయ కళల కోలాహలం సంక్రాంతి

ధనుర్మాసం ప్రారంభం కావడంతో సంప్రదాయ కళల కోలాహలం గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభం కానుంది. తెల్లవారుజామున ఇంటి ముంగిట ఆడపడుచుల రంగు రంగుల హరివిల్లులు, హరిదాసు కీర్తనలతో మేలుకొలుపు, సంప్రదాయ పిండివంటలతో లోగిళ్లు కళకళలాడనున్నాయి. సంక్రాంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీలు, కోడి, ఎడ్ల పందేలను నిర్వహించేందుకు పల్లెలు సమాయత్తం అవుతున్నాయి. భోగి పండగను పురస్కరించుకుని చిన్నారులు ఆవు పేడను సేకరించి భోగి పిడకలను తయారు చేసే పనిలో నిమగ్నమవుతున్నారు. ఏడాదికోసారి వచ్చే కొమ్మదాసులు, గంగిరెద్దుల వారు, కోయదాసులు వంటి కళాకారులు గ్రామాల్లో సందడి చేయనున్నారు. సంప్రదాయ కళలుగా భావిస్తున్న కోడిపందేలను పోలీసుల కళ్లు గప్పి ఏవిధంగా నిర్వహించాలనే ఆలోచనలో పందెం రాయుళ్లు ఉన్నారు. ఇప్పటికే పందెం కోళ్లను జీడిపప్పు, బాదం పప్పు వంటి పౌష్టికాహారంతో ఇంటి ఆవరణలో పెంచుతున్నారు.

పాకశాలలుగా పల్లె లోగిళ్లు

సంక్రాంతి నెల ప్రారంభం కావడంతో గ్రామాల్లోని లోగిళ్లు పిండివంటల తయారు చేస్తూ పాకశాలలుగా మారనున్నాయి. ఇంటికి వచ్చే కొత్త అల్లుళ్లు, దేశ విదేశాల నుంచి వచ్చే కుటుంబ సభ్యులు, బంధువులకు తెలుగు సంప్రదాయ వంటకాలైన సున్నుండలు, గజ్జికాయలు, జంతికలు, గవ్వలు, పోకుండలు తయారు చేసేందుకు మహిళలు సమాయత్తమవుతున్నారు. రైతులకు పంట చేతికందడంతో సంక్రాంతిని మరింత ఉత్సాహంగా జరుపుకునేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. సంక్రాంతికి నూతన వస్త్రాలు కొనుగోలు చేయడంతో పాటు తమ లోగిళ్లను సుందరంగా అలంకరించే పనిలో నిమగ్నమవ్వనున్నారు. ఇతర దేశాల్లో కాని, రాష్ట్రాల్లో కాని నివసించే తెలుగు ప్రజలు స్వగ్రామానికి రావడం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పటికే విమానం, రైలు, బస్ టికెట్లు బుక్ అయిపోయాయి.

పోటాపోటీగా ప్రభల ఉత్సవాలు

సంక్రాంతి పండగను పురస్కరించుకుని రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా కోనసీమలోని సుమారు 15 మండలాల్లో ప్రభల తీర్థ మహోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఏకాదశ రుద్రులుగా భావించే ప్రభల ఉత్సవాలు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి. తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే ఈ ప్రభల ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. ఈ ప్రభలను పండగ మూడురోజుల పాటు ఊరేగించి పొలిమేరలు దాటిస్తే ఆ గ్రామానికి శుభం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే గ్రామాలు, పట్టణాల్లో పోటీ పడి ప్రభల ఉత్సవాలను జరుపుతున్నారు. బాణసంచా పేలుళ్లు, కోలాటాలు, బ్యాండుమేళాలు వంటివి ఏర్పాటు చేసి ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు.

గొబ్బెమ్మకు పూజలు

పండగ నెల ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి ఇంటి ముందు ఉదయాన్నే కళ్లాపు చల్లి అందమైన ముగ్గులు వేసి వాటి మధ్యన గొబ్బెమ్మను పెట్టి పూజిస్తారు. తెలుగు సంప్రదాయం ప్రకారం గొబ్బెమ్మలను గోదాదేవి, లక్ష్మీ దేవి, గౌరీ మాతగా భావిస్తారు. గోవు పేడతో చేసిన గొబ్బెమ్మలను ముగ్గుల మధ్యలో ఉంచి గుమ్మడి, తంగేడు, గురుగు పూలు, పసుపు కుంకుమ సమర్పించి పూజిస్తారు. ధనుర్మాసం పొడవునా గొబ్బెమ్మను పూజించడం ఆనవాయితీ.

గొబ్బెమ్మలకు నృత్య నీరాజనం

కొమరిపాలెంలో చిన్నారుల భోగి పండ్లు వేస్తున్నా దృశ్యం

ఖరీఫ్‌లో 25లక్షల టన్నుల ధాన్యం సేకరణ

సాక్షి, అమరావతి: ఖరీఫ్‌లో 3.96లక్షల మంది రైతుల నుంచి రూ.5,938 కోట్లు విలువైన 25లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు పౌరసరఫరాల సంస్థ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇందులో రూ.5,682 కోట్లు రైతులకు చెల్లించినట్టు పేర్కొంది. రైతులకు ధాన్యం విక్రయాల్లో సమస్యలు ఉంటే 1967 టోల్‌ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని సూచించింది.

ధవళేశ్వరం బ్యారేజీ కొత్త గేట్ల ఏర్పాటు పనులకు టెండర్

కాంట్రాక్టు విలువ రూ.146.87 కోట్లు

సాక్షి, అమరావతి: నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఆదేశాల మేరకు ధవళేశ్వరం బ్యారేజీ 175 గేట్లను మార్చి కొత్త గేట్ల ఏర్పాటు, బ్యారేజీ అనుబంధ గట్లు, కరకట్టల పటిష్టీకరణ పనులకు జలవనరుల శాఖ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. కాంట్రాక్టు విలువను రూ.146.87 కోట్లుగా నిర్ణయించింది. టెండర్‌లో బిడ్‌ల దాఖలుకు ఈనెల 29 తేదీ గడువుగా విధించింది. అదే రోజున ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ సాంకేతిక బిడ్‌ను తెరవనున్నారు. సాంకేతికంగా బిడ్ అర్హత సాధించిన కాంట్రాక్టు సంస్థల ఆర్థిక బిడ్‌లను ఈనెల 31న తెరిచి.. టెండర్‌ను ఆమోదించాలని ఎస్‌ఎల్‌టీసీ (రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీ)కి ప్రతిపాదనలు పంపనున్నారు.

నేటి నుంచి రబీ పంటల నమోదు

- జిల్లా, డివిజన్, మండల స్థాయిలో యూరియా బులిటెన్లు
- వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్

సాక్షి, అమరావతి: డిజిటల్ క్రాప్ సర్వేలో రబీ పంటల నమోదు ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. జిల్లాల వ్యవసాయాధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో అన్ని రకాల పంటలతో పాటు అన్ని రకాల భూ కమతాల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఈ పంటల నమోదుకు గరిష్ట స్థాయి 20 మీటర్ల దూరం మాత్రమేనని స్పష్టం చేశారు. రైతు విశిష్ట సంఖ్య నమోదులో ఇంకా నమోదు కాని మిగిలిన రైతుల వివరాలను కూడా ఇదే సమయంలో నమోదు చేయించాలని ఆదేశించారు.

ఐఏఎస్ శ్యామలరావుకు మరో 8 రోజులు సెలవు

ఇప్పటికి మూడు నెలల నుంచి సెలవులోనే...

సాక్షి, అమరావతి: ఐఏఎస్ అధికారి జె.శ్యామలరావు సెలవును మరో 8 రోజులు సెలవు పొడిగించారు. గతంలోనే మూడు నెలలు సెలవు పెట్టారు. వైద్య కారణాల దృష్ట్యా ఈనెల 23 వరకు అర్జిత సెలవును ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పుడు ఈనెల 23 నుంచి 31 వరకు 8 రోజుల పాటు అర్జిత సెలవును మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సెలవు ముగిసాక సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్యకార్యదర్శిగా నియమించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టీచర్లపై ఆంక్షల విధింపు అశాస్త్రీయం

చంద్రబాబు ప్రభుత్వంపై ఉపాధ్యాయ సంఘాల మండిపాటు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత పెంపు కోసం 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తూ ఉపాధ్యాయులకు ఆదివారాలు కూడా విశ్రాంతి తీసుకునే అవకాశం ఇవ్వడం లేదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు విశ్రాంతి లేకుండా తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేస్తూ 100% ఉత్తీర్ణత సాధించాలని ఆంక్షలు విధించడం అశాస్త్రీయమని ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి పేర్కొన్నారు. ఇంత ఒత్తిడిలోనూ ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తుంటే ఇతర శాఖల అధికారులను తనిఖీల పేరుతో ప్రయోగించడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికే ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడితో పనిచేస్తుంటే దానికి తోడు ఇతర శాఖల అధికారులతో విద్యాశాఖలో ఈ విధమైన అజమాయిషీ చేయించడం ఉపాధ్యాయులను, విద్యాశాఖ తనిఖీ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం అవమానిస్తోందన్నారు. పాఠశాలల్లో పనిచేస్తున్న గజిటెడ్ ప్రధానోపాధ్యాయులను ఇతర శాఖలలో తనిఖీలకు పంపించగలరా, హెడ్మాస్టర్ల తనిఖీని ఆయా శాఖలు అనుమతిస్తాయా? అని వారు ప్రశ్నించారు.

అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి

మంత్రి బాల వీరాంజనేయస్వామి

సాక్షి, అమరావతి: ఐఏఎస్ కావాలన్న పేద విద్యార్థుల కలను సాకారం చేసేందుకే అంబేడ్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా సివిల్స్‌కు ఉచిత శిక్షణ ఇస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. విజయవాడ అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సివిల్స్ ఉచిత శిక్షణను మంత్రి స్వామి మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రంలో విజయవాడ, విశాఖ, తిరుపతి అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లలో 340 మందికి సివిల్స్ ఉచిత శిక్షణనిస్తున్నామన్నారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌తోపాటు భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తున్నామన్నారు. ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదని, సివిల్స్ కోచింగ్ అభ్యర్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని మంత్రి సూచించారు.

ఆక్వా చెరువులు రిజిస్ట్రేషన్ చేస్తేనే విద్యుత్ సబ్సిడీ

మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: ఆక్వా చెరువులను రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే యూనిట్ రూ.1.50కి విద్యుత్ సబ్సిడీ వర్తిస్తుందని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టంచేశారు. కృష్ణాజిల్లా పెనమలూరులోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ అభివృద్ధి అథారిటీ (అప్సడా) పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ చేపలు, రొయ్యల చెరువులకు సర్వే నంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేశామని తెలిపారు. ఇప్పటివరకు 48 శాతానికి మించి రిజిస్ట్రేషన్ కాలేదన్నారు. చెరువులకు జియో ట్యాగింగ్ చేస్తున్నామన్నారు. జోన్‌లతో సంబంధం లేకుండా ఆక్వా రైతులందరికీ విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలంటే ఏడాదికి కనీసం రూ.1,200 కోట్లు ఖర్చవుతుందన్నారు. అదేవిధంగా విజయవాడలో జరిగిన ఏపీ రాష్ట్ర కళింగ వైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం ప్రతి కార్పొరేషన్‌కు నిధులు కేటాయిస్తున్నామన్నారు. వైశ్యులను ఓబీసీ జాబితాలో చేర్చే అంశంపై కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు.

ఏజీఐసీఎల్ ఎండీగా రిటైర్డు ఐఏఎస్

రాజధానిలో స్పెషల్ ప్రాజెక్టుల కోసం ఎస్పీవీని ఏర్పాటుచేసిన సర్కార్

సాక్షి, అమరావతి: అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏజీఐసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్‌గా రిటైర్డు ఐఏఎస్ సొంటి వెంకటరత్న శ్రీనివాస్‌ను ప్రభుత్వం నియమించింది. మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఆయన ఆ రాష్ట్రంలో పలు కీలక శాఖల కార్యదర్శిగా, మహా ముంబై మెట్రో డైరెక్టర్‌గా పనిచేశారు. కృష్ణా నదిపై మరో వారధి, నీరుకొండపై ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు వంటి స్పెషల్ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం ఏజీఐసీఎల్‌ను ఏర్పాటుచేసింది. ఈనెల 2న ఏజీఐసీఎల్ బోర్డు మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏయూ దూరవిద్యలో అవినీతిని అరికట్టాలి

ది పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ) దూరవిద్యలో నెలకొన్న నిర్లక్ష్యం, అవినీతిని అరికట్టాలని 'ది పేరెంట్స్ అసోసియేషన్' ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం సీఎం చంద్రబాబుకు లేఖ రాసింది. దూరవిద్య అధికారుల అలసత్వం కారణంగా విద్యార్థులు ఒక విద్యా సంవత్సరాన్ని కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. పరీక్షల నిర్వహణలో జాప్యం, ఆలస్యంగా ఫలితాలు ఇవ్వడం, లోపభూయిష్టంగా పరీక్షలు చేపట్టడంతో దూరవిద్య ప్రశ్నార్థకంగా మారుతోందని పేర్కొంది. తక్షణమే ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరింది.

అవి కోటి సంతకాలు కాదు.. కోడి గీతలు

పీపీపీపై ప్రతిపక్షం రాద్ధాంతం చేస్తోంది
మీడియాతో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

సాక్షి, అమరావతి: ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకే ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యాన్ని (పీపీపీ) ప్రోత్సహిస్తున్నట్టు వైద్యారోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ చెప్పారు. మంగళవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 10 వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో నిర్వహించేందుకు టెండర్లు పిలిచామన్నారు. దీనిపై ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల పేరుతో రాద్ధాంతం చేస్తోందని, అది అది కోటి సంతకాలు కాదు.. కోడి గీతల కార్యక్రమమంటూ చులకనగా వ్యాఖ్యానించారు. 'ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ కోర్టుకు వెళ్లి పీపీపీ విధానాన్ని అడ్డుకుంటామని చెబుతున్నారు. నేను సవాల్ చేస్తున్నా. జగన్ కోర్టుకు వెళ్లాలి. వెళితే ఏమవుతుందో చూద్దాం. ఆరోగ్యశ్రీనే పీపీపీలో నడిపిస్తున్నప్పుడు వైద్య కళాశాలలను ఎందుకు పెట్టకూడదు' అని చెప్పుకొచ్చారు. పీపీపీ అంటేనే ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు భూములు ఇవ్వడమేనని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పెట్టుబడిదారుల విజ్ఞప్తి మేరకు వైద్య కళాశాలలకు టెండర్ గడువును 22 వరకు పొడిగించామన్నారు.

గాంధీ ఆత్మ శాంతిస్తుందిలే!

ఉపాధి హామీ పథకంలో మహాత్మగాంధీ పేరును తొలగించడంపై ప్రశ్నించగా.. 'దీనివల్ల రాముడి గౌరవం కూడా పెరగదు. మహాత్మాగాంధీ కూడా చనిపోతూ హే రామ్ అన్నారు. ఆయన ఆత్మ కూడా శాంతిస్తుందిలే' అని చెప్పుకొచ్చారు.

22న విజయవాడలో క్రిస్మస్ హై టీ

మంత్రి ఫరూక్ వెల్లడి

సాక్షి, అమరావతి: విజయవాడలో ఈ నెల 22న క్రిస్మస్ హై టీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో హైటీ ఏర్పాట్లపై మంత్రి ఫరూక్ మంగళవారం సమీక్షించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని ముందస్తు వేడుకల్లో భాగంగా హై టీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ ఎ.శేఖర్, మైనార్టీ కార్పొరేషన్ ఎండీ యాకుబ్ బాషా, వక్ఫ్ బోర్డు సీఈవో మహమ్మద్ అలీ, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ గౌస్ పీర్, మైనారిటీ కమిషన్ కార్యదర్శి నిజాముద్దీన్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' పేరు మార్పుపై 22న సీపీఐ నిరసనలు

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి,అమరావతి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) పేరు మార్పుపై దేశవ్యాప్తంగా 22న నిరసనలు తెలపనున్నట్లు సీపీఐ ప్రకటించింది. వీబీ–జీ రామ్ జీ బిల్లును తిరస్కరించడమే లక్ష్యంగా ఈ నిరసనలు ఉంటాయని పార్టీ జాతీయ కార్యవర్గం పేర్కొంది. మంగళవారం ఢిల్లీలో జరిగిన సీపీఐ జాతీయ కార్యవర్గంలో ఈ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ కార్యాలయం జాతీయ కార్యదర్శి రాయ్ కుట్టీ తెలిపారు. కేంద్రం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని భర్తీ చేయడానికి కొత్త గ్రామీణ ఉపాధి బిల్లును తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. కాగా, ఉపాధి హామీ పథకానికి పేరు మార్పు అంటే మహాత్మ గాంధీజీని అవమానించడమేనని, పేర్ల మార్పుపై కంటే పథకాల అమలుపై శ్రద్ధ పెట్టాలని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణే లక్ష్యం

ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజీజ్ వెల్లడి

సాక్షి, అమరావతి: వక్ఫ్ ఆస్తుల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నామని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ చెప్పారు. విజయవాడలోని ఏపీ వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది కాలంలో రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ భూముల ఆక్రమణలకు సంబంధించి 953 నోటీసులు జారీ చేశామని చెప్పారు. దాదాపు 820 ఎకరాల వక్ఫ్ భూమిని రక్షించేందుకు చర్యలు చేపట్టామన్నారు. వక్ఫ్ భూమి విస్తీర్ణం 65,784 ఎకరాల నుంచి 81,402 ఎకరాలకు పెరిగిందని, డిజిటలైజేషన్ వల్ల అదనంగా 15,618 ఎకరాల వక్ఫ్ భూమిని గుర్తించగలిగామని పేర్కొన్నారు.

నాన్ ఎస్‌సీఎస్ అధికారుల ఐఏఎస్ ఎంపికకు 29, 30న ఢిల్లీలో సెలక్షన్ కమిటీ సమావేశం

- రాష్ట్రం నుంచి ఇంటర్వ్యూలకు 29 మంది అధికారులు
- సీఎస్‌కు లేఖ రాసిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రం నుంచి 2024కు సంబంధించి నాన్ ఎస్‌సీఎస్ (నాన్ స్టేట్ సివిల్ సర్వీస్) అధికారులను ఐఏఎస్‌లుగా ఎంపిక చేసేందుకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఢిల్లీ కార్యాలయంలో ఈనెల 29, 30 తేదీల్లో సెలక్షన్ కమిటీ సమావేశం నిర్వహిస్తోంది. రాష్ట్రం నుంచి 29 నాన్ ఎస్‌సీఎస్ అధికారులు ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంది. 29న 15మందికి, 30న 14మందికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. సెలక్షన్ కమిటీలో రాష్ట్రం నుంచి సభ్యులుగా ఉన్న వారికి, అలాగే ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సిన అధికారులకు తేదీలు, సమయం తెలియజేయాల్సిందిగా సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ)ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది.

ఖేలో ఇండియా పోటీలకు 19న ఎంపికలు

సాక్షి, అమరావతి : ఖేలో ఇండియా 2వ ఎడిషన్ మహిళలు, పురుషుల విభాగాల్లో బీచ్ సెపక్ తక్రా, బీచ్ కబడ్డీ, బీచ్ వాలీబాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టును ఈ నెల 19న ఎంపిక చేస్తున్నట్టు శాప్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. జనవరి 5 నుంచి 10 వరకు దాద్రానగర్ హవేలీ, డామన్ డయ్యూలో పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపింది. ఇందులో ఏపీకి ప్రాతినిధ్యం వహించే జట్ల కోసం ఈ నెల 19న మణిపాల్ హాస్పిటల్ సమీపంలో ఎంపికలు నిర్వహిస్తామని, సంబంధిత ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించింది. వివరాలకు ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో 9866134016, కబడ్డీ కోచ్ 9052464770ను సంప్రదించాలని సూచించింది.

విజయవాడ నుంచి వెళ్లే హజ్ యాత్రికులకే రూ.లక్ష

సాక్షి, అమరావతి: విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి వెళ్లే హజ్ యాత్రికులకు మాత్రమే రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి సీహెచ్ శ్రీధర్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. అన్ని విషయాలను పరిశీలించిన తర్వాతే విజయవాడ నుంచి వెళ్లే హజ్ యాత్రికులకు రూ.లక్ష సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

సాక్షి, అమరావతి: దూర విద్య ద్వారా వ్యవసాయ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశించదల్చిన వారు ఈనెల 31లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రమణ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. జనవరి 2026 నుంచి ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభమవుతాయని తెలిపారు. తేనెటీగల పెంపకం (బీ కీపింగ్), చిరుధాన్యాలు–ఉత్పత్తి, విలువ ఆధారిత ఉత్పత్తులు, వర్మీ కంపోస్టు–ఉత్పత్తి, సేంద్రియ సూత్రీకరణలలో 8 వారాల పాటు నిర్వహించే ఈ సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ పొందగోరేవారు రూ.1,500 చొప్పున ఫీజు చెల్లించి డిసెంబర్ 31లోగా వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ అభ్యర్థులు కంప్యూటర్/ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్/ఐపాడ్‌వంటివి కలిగి ఉండాలన్నారు. పూర్తి వివరాలు వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్ సైట్ (www.angrau.ac.in)లో సందర్శించి తెలుసుకోవచ్చన్నారు.



పట్టుమని పాతికేళ్ళున్న ఓ యువ నిర్మాత, మూడున్నర పదులు దాటి సినీ రంగంలో సుస్థిర స్థానం కోసం ప్రయత్నిస్తున్న ఓ నవ దర్శకుడు కలిసి చేసిన వెండితెర మ్యాజిక్ అది. గత చిత్రాల్లోని ఎన్టీఆర్‌ను పూర్తిగా మార్చేసి, విగ్, కాస్ట్యూమ్స్, పాటలు సహా అంతా కొత్త రకం స్టైల్‌లో చూపించి, అభిమానులతో కేరింతలు కొట్టించిన శత దినోత్సవ చిత్రమది. ఇవాళ అగ్రనిర్మాతగా నిలిచిన సి.అశ్వినీదత్ సారథ్యంలోని 'వైజయంతీ మూవీస్' వేసిన ఆ తొలి అడుగే... కె. బాపయ్య దర్శకత్వంలో 1975 డిసెంబర్ 12న విడుదలైన 'ఎదురులేని మనిషి'. ఇక అక్కడ నుంచి మాస్ హీరోగా ఎన్టీఆర్, నిర్మాణ సంస్థగా వైజయంతీ మూవీస్, దర్శకుడిగా బాపయ్య... అందరిదీ ఎదురులేని ప్రస్థానమే. ఎన్టీఆర్ ఇమేజ్‌ను మార్చేసిన కెరీర్‌లోని ఆ కీలక ఘట్టానికీ, దానికి వేదికైన 'వైజయంతీ మూవీస్'కూ ఇది 50 వసంతాలు నిండిన స్వర్ణోత్సవ సందర్భం.

● కుమార్తెలు స్వప్న, ప్రియాంకలతో అశ్వినీదత్

● లొకేషన్‌లో అశ్వినీదత్, ఎన్టీఆర్, వాణిశ్రీ

ఎదురులేని ప్రస్థానం

అది 1970ల ప్రథమార్ధం. బ్లాక్ అండ్ వైట్ సినిమాల కాంతి తగ్గి, రంగుల చిత్రాల ప్రవాహం పెరుగుతున్న సమయం. సమాజంలోనూ, జీవితంలోనూ పెనుమార్పులు చోటుచేసుకుంటున్న కాలం. మారుతున్న జనం అభిరుచులు, ఆకాంక్షలకు తగ్గట్టు హీరోలు తమను తాము పునర్నిర్వచించుకోవాల్సి వచ్చిన సందర్భం. కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు లాంటి కొత్త తరం హీరోలు తెరపై మెరుస్తున్న తరుణం. అప్పటికే అగ్రనటులుగా ఉన్న ఎన్టీఆర్, ఏయన్నార్‌లు సైతం కాలానుగుణంగా తమ సినిమాలను మలుచుకుంటున్న వాతావరణం. 'బడిపంతులు', 'తాతమ్మకల' లాంటి చిత్రాల్లో పెద్ద వయసు పాత్రలతో కళాకారుడిగా ఎన్టీఆర్‌కు ఆత్మతృప్తి కలుగుతున్నా, కొత్త తరం అభిమానులకు తెలియని ఓ అసంతృప్తి. 'నిప్పులాంటి మనిషి', 'అన్నదమ్ముల అనుబంధం' లాంటి చిత్రాలు ఆ సమయంలో వచ్చినా... ఒక్కసారిగా 'కసిగా ఉంది... కసి కసిగా ఉంది' లాంటి పాటలతో ఎన్టీఆర్ ఏజ్‌ను మరిపించి, ఇమేజ్‌ను మార్చేసిన మాస్ మసాలా సినిమాలకు పునాది – 'ఎదురులేని మనిషి'.

నిర్మాత మారారు... ప్రాజెక్టూ మారింది...

''ఎన్టీఆర్‌ను వెండితెరపై యంగ్‌గా చూపించి, సక్సెస్ చేయాలని నా మనసులో ఉండేది. దాని ఫలితమే ఈ చిత్రం'' అని చెప్పారు దర్శకుడు బాపయ్య. నిజానికి, ఈ ప్రాజెక్ట్‌కు మొదట నిర్మాత అశ్వినీదత్ కాదట. ''పేరు ఇప్పుడు జ్ఞాపకం లేదు కానీ, జయదేవ్, జగదీశ్ లాంటి పేరున్న ఒకరు నా దగ్గరకు వచ్చి, ఎన్టీఆర్ గారితో సినిమా చేయాలంటే, వెళ్ళి కలిశాం. ఎన్టీఆర్ చిత్రాలకు రెగ్యులర్ డిస్ట్రిబ్యూటర్లయిన 'విజయా పిక్చర్స్' కాకుండా, ఫలానా శివరామకృష్ణ వ్యవహారాలు మేనేజ్ చేస్తున్న 'లక్ష్మీ ఫిలిమ్స్' ఈ ప్రాజెక్టుకు ఫైనాన్స్ చేసే డిస్ట్రిబ్యూటర్లంటే, ఎన్టీఆర్ మొదట తటపటాయించారు. చివరకు సరే అన్నారు. ఈ సంగతి తెలిసి అశ్వినీదత్ నన్ను కలసి, తాను ఆ ప్రాజెక్ట్ చేస్తానంటూ ముందుకొచ్చారు. ముందుగా ప్రాజెక్ట్ అనుకున్న నిర్మాతతో కలసి మాట్లాడమన్నాను. చివరకు వారిద్దరి మధ్య రాజీ కుదిరింది. పరస్పర అంగీకారంతో, కొత్త కంపెనీ పెట్టి దత్ తానే స్వయంగా పూర్తి నిర్మాణ బాధ్యతలు చేపట్టారు'' అని బాపయ్య 'సాక్షి'తో గుర్తు చేసుకున్నారు. అలా 'ఎదురులేని మనిషి'తో ఎన్టీఆర్‌తో 'లక్ష్మీ ఫిలిమ్స్' అనుబంధం కూడా ప్రారంభమైంది. 1968లో మొదలైన ఆ పంపిణీ సంస్థ ఏడేళ్ల తర్వాత అలా తొలిసారిగా ఎన్టీఆర్ సినిమా చేసింది. ఆ తర్వాత 'అడవి రాముడు' నుంచి ఆ బంధం మరింత బలపడి, పలు చిత్రాలతో బాక్సాఫీస్ చరిత్ర తిరగరాయడం వేరే కథ.

అలాగే, ఈ ప్రాజెక్ట్ ముందనుకున్న కథ కూడా ఇది కాదట. ''అప్పట్లో శివాజీ గణేశన్ 'తంగపతక్కం' (1974) రిలీజై బాగా ఆడుతోంది. ఆ సినిమా తెలుగులో చేద్దామని సినిమా కూడా చూశాం. అయితే, రీమేక్ రైట్ల రేటు ఎక్కువ చెప్పారు. ఆ సంగతి ఎంతకూ తెగలేదు. అదే సమయంలో అల్లు అరవింద్ దాన్ని డబ్బింగ్ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నట్టు శివాజీ గణేశన్ సోదరుడు షణ్ముగం నాకు చెప్పారు. దాంతో, ఈ కొత్త కథతో 'ఎదురులేని మనిషి' ప్రాజెక్ట్ సిద్ధమైంది'' అని బాపయ్య చెప్పారు.

ఎన్టీఆర్ పెట్టిన పేరు... గీసిన బొమ్మ...

చిత్ర నిర్మాణ సంస్థకు పేరు పెట్టమని దత్ కోరడంతో విజయానికి చిహ్నమైన శ్రీకృష్ణుడి మెడలోని వైజయంతి మాల పేరిట 'వైజయంతీ మూవీస్' అని నామకరణం చేశారు ఎన్టీఆర్. కృష్ణుడి మెడలో వైజయంతి మాల వేస్తున్న రాధ బొమ్మతో ఎంబ్లమ్ లోగో ఎలా ఉండాలో స్వయంగా గీసి కూడా చూపించారు. చిత్రమేమంటే, అంతకు ముందు సురేశ్ ప్రొడక్షన్స్ వారి ఎన్టీఆర్ 'శ్రీకృష్ణ తులాభారం'కి అసిస్టెంట్‌గా చేశారు బాపయ్య. ఇక, ఎన్టీఆర్‌పై కృతజ్ఞతతో ఆయన మరణానంతరం తమ బ్యానర్‌పై తీస్తున్న తొలి చిత్రం చిరంజీవి 'చూడాలని ఉంది' (1998) నుంచి దత్ తమ బ్యానర్ ఎంబ్లమ్‌లోనే ఎన్టీఆర్‌ను పెట్టారు. 'శ్రీకృష్ణావతారం' (1967)లో వైజయంతి మాల ధరించి, పాంచ జన్య శంఖం పూరిస్తూ, విజయధ్వానం చేస్తున్నట్టున్న శ్రీకృష్ణ పాత్రధారి ఎన్టీఆర్ స్టిల్‌నే ఆ ఎంబ్లమ్‌గా ఎంచుకోవడం విశేషం.

హిందీ హిట్ పాయింట్... తెలుగు వంటకం...

నిజానికి, 'ఎదురులేని మనిషి' చిత్రం దేవానంద్ – హేమమాలిని నటించిన 'జానీ మేరా నామ్' (1970)కి యథాతథమైన రీమేక్ కాదు. ఆ హిందీ హిట్ అప్పటికే తమిళంలో శివాజీ గణేశన్‌తో 'రాజా' (1972)గా వచ్చింది. ఆ తర్వాత చాలాకాలానికి కన్నడంలో రాజ్‌కుమార్‌తో 'అపూర్వ సంగమ' (1984)గా రీమేకైంది. కాకపోతే, ''ఎన్టీఆర్ 'ఎదురులేని మనిషి' లో మాత్రం చిన్నప్పుడే తమ తండ్రిని ఒక స్మగ్లర్ చంపినప్పుడు అనుకోకుండా విడిపోయిన అన్నదమ్ములు ఇద్దరు చివరకు ఎలా కలుసుకున్నారనే ప్రధానమైన ఇతివృత్తం వరకే రచయిత భమిడిపాటి రాధాకృష్ణ హిందీ నుంచి అనుసరించారు. మిగతా కథనంతా మన వాతావరణానికి తగ్గట్టు కొత్తగా అల్లుకొని, తెలుగులో ఒక సరికొత్త వంట సిద్ధం చేశారు. ''అప్పట్లో 'ఊర్వశి' చిత్రం షూటింగ్‌కై మైసూర్‌లో ఉన్నా. అక్కడ 'లైఫ్' మ్యాగజైన్‌లో ఓ జరిగిన కథ చదివా. దాన్ని ఇండియనైజ్ చేసి, డెవలప్ చేశాం. ఎన్టీఆర్ ప్రొసీడన్నారు. మెయిన్ పాయింట్, కీలక ఘట్టాలు, సాంగ్ సిచ్యుయేషన్స్ హిందీ నుంచి తీసుకున్నాం'' అని వివరించారు బాపయ్య.

క్లాష్ వస్తే... కాపాడిన 'డాడీ'

అప్పట్లో హీరోయిన్‌గా మంచి ఫామ్‌లో ఉన్న కళాభినేత్రి వాణిశ్రీ కథానాయికగా చలాకీతనం చూపారు. చిన్నప్పుడు అన్న (ఎన్టీఆర్) నుంచి విడిపోయిన తమ్ముడి పాత్రలో జగ్గయ్య పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా కనిపించారు. స్మగ్లర్లుగా దుష్టపాత్రల్లో ప్రభాకరరెడ్డి, కాంతారావు, సినిమాలో వినోదం కోసం ఎన్టీఆర్ పక్కన రాజబాబు నటించారు. అప్పటి పాపులర్ రేడియో కళాకారులు నండూరి సుబ్బారావు, ఎ.బి. ఆనంద్‌లు చిరుపాత్రల్లో తెరపై తళుక్కున మెరవడం విశేషం. ఈ చిత్రం షూటింగ్ సమయంలోనే బాపయ్య మరోపక్క శోభన్‌బాబుతో సురేశ్ ప్రొడక్షన్స్ వారి 'సోగ్గాడు'కూ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సమయంలో ఒకసారి రెండు సినిమాల షూటింగ్ డేట్స్‌కూ క్లాష్ వచ్చింది. ''అప్పుడు నన్ను పెంచిన మా 'డాడీ' – ప్రముఖ దర్శకుడు కె.ఎస్. ప్రకాశరావు గారు వచ్చి, 'ఎదురులేని మనిషి'లో కొన్ని సీన్లు తీశారు. ఆ తర్వాత కొన్నేళ్ళకు ఏయన్నార్ – కృష్ణలతో అశ్వినీదత్ నిర్మిస్తున్న 'గురుశిష్యులు' (1981) చేస్తున్నప్పుడూ అలాగే జరిగింది. నా హిందీ చిత్రాలతో క్లాష్ వస్తే, అప్పుడూ ప్రకాశరావు గారే వచ్చి నా బదులు షూటింగ్ చేశారు'' అని బాపయ్య స్మరించుకున్నారు.

భారతీయ సినిమా ఊహించని రీతిలో ఊపందుకొన్న సరికొత్త 1970వ దశకం అది. అన్ని తరగతుల ప్రేక్షకులనూ ఆకట్టుకోవాలనే ఆలోచన పెరిగి, వివిధ రకాల సినిమాలు ఏకకాలంలో రావడం మొదలైన కాలమది. ఒక పక్కన ప్రేమకథల ప్రాధాన్యం తగ్గకపోయినా, క్రైమ్ థ్రిల్లర్లు, ఆఫ్‌బీట్ కథలు హిందీ సినీ ప్రపంచాన్ని ఏలడం మొదలుపెట్టాయి. అలా అప్పుడు వచ్చినవే... దేవానంద్ 'జానీ మేరా నామ్' (1970), అమితాబ్ 'జంజీర్' (1973 - తెలుగులో 'నిప్పులాంటి మనిషి'), ధర్మేంద్ర 'యాదోంకీ బారాత్' (1973 - తెలుగులో 'అన్నదమ్ముల అనుబంధం'), రాజేశ్ ఖన్నా 'రోటీ' (1974 - తెలుగులో 'నేరం నాది కాదు ఆకలిది'), అమితాబ్ బచ్చన్ 'దీవార్' (1975 - తెలుగులో 'మగాడు'). మారిన కాలం, మారుతున్న ప్రేక్షకాభిరుచికి తగ్గట్టుగా ఆ తర్వాత కాలంలో అవన్నీ తెలుగులోకి ఎన్టీఆర్ హీరోగా వచ్చాయి.



కత్తెర తప్పించుకున్న కసిపాటలు!

మ్యూజికల్‌గా పాపులరైన 'ఎదురులేని మనిషి' పాటల గురించి ఒక సంగతి ప్రచారంలో ఉంది. ఆ చిత్రంలో ''అబ్బా... దెబ్బ తగిలిందా...'' అనే పాటలో 'తగలరాని తావులో తగిలింది' అని ఓ లైను ఉంది. ఆ లైనుకు సెన్సార్ అభ్యంతరం చెప్పింది. 'మీరంత బాహాటంగా, ఉద్దేశపూర్వకంగా శృంగారం గురించి రాస్తే ఎట్లా? దీన్ని మీరెలా సమర్థిస్తారు?' అని సెన్సార్‌వారు అడిగారట. దర్శక – నిర్మాతలకు ఏం చేయాలో తోచక, పాట రాసిన ఆత్రేయనే సెన్సార్ బోర్డ్‌లో తమ పక్షాన వాదన వినిపించేందుకు పంపారు. ఆత్రేయ చాలా తాపీగా, 'సెన్సార్ అభ్యంతరం విని, 'తగలరాని చోటులో తగిలిందని రాసినందుకు మీరు అభ్యంతరం చెప్పారు. సరే... అసలు తగలవలసిన చోటులెక్కడో మీరు చెబితే, అసలు నేను రాసిన తగలరాని చోటేదో చెబుతాను' అన్నారట. ఆ మాటలతో తెల్లబోవడం సెన్సార్ వంతు అయింది. అయితే, చివరకు సినిమాలో మాత్రం ఆ లైనును 'తగలరాని హృదయంలో తగిలింది' అని హీరోయిన్ పాడినట్టు మార్చేశారు.

అలాగే, 'కసిగా ఉంది కసి కసిగా ఉంది...', 'హే కృష్ణా ముకుందా మురారీ...' లాంటి పాటలు సైతం పామర జనానికి బాగా పట్టేశాయి. అలాగే పి. సుశీల పాడగా జ్యోతిలక్ష్మిపై చిత్రీకరించిన 'కంగారూ ఒకటే కంగారూ... కళ్ళు కలిస్తే కంగారు... ఒళ్ళు తగిలితే కంగారు... కొరికేస్తారు దొర గారూ...' పాట అప్పట్లో తరచూ రేడియోలో మోగే పాపులర్ శృంగార గీతమైంది. మొత్తం మీద కె.వి. మహదేవన్ సంగీతం, ఆత్రేయ సాహిత్యం, హీరాలాల్ మాస్టర్ బావమరిది అయిన శీను మాస్టర్ నాయికా నాయకులకు కంపోజ్ చేసిన స్టెప్పులు... అన్నీ కలసి ప్రేక్షకులను హుషారెత్తించాయి.


● దర్శకుడు కె. బాపయ్య

తిరుగులేని ఓపెనింగ్స్...

ఎన్టీఆర్‌తో చిత్రాలన్నీ బ్లాక్ అండ్ వైట్‌లో ఆరేడు లక్షలు, కలర్‌లో దాదాపు పది లక్షల్లో తయారవుతున్న రోజులవి. నిర్మాత అశ్వినీదత్ సుమారు రూ. 11 లక్షల బడ్జెట్‌తో ఈ ఈస్ట్‌మన్ కలర్ చిత్రాన్ని నిర్మించారు. చిత్రమేమిటంటే, రిలీజవుతూనే 'ఎదురులేని మనిషి' బాక్సాఫీస్ వద్ద తిరుగులేని ఓపెనింగ్స్ సాధించి, అంతకు అంత సంపాదించింది. కొత్త తరహా స్టైల్‌లో, కిర్రెక్కించే పాటలతో, యువతరం గెటప్‌లో ఎన్టీఆర్‌ను చూసేందుకు అభిమానులు పోటెత్తారు. వెరసి, ''మొదటివారంలోనే రూ.17 లక్షలకు పైగా వసూలు చేసిన''ట్టు నిర్మాతలు, పంపిణీదారులే స్వయంగా పత్రికా ప్రకటనల్లో ప్రముఖంగా ప్రస్తావించారు. రెండు వారాల్లో దాదాపు పాతిక లక్షల పైగా వచ్చినట్టు ప్రకటించారు.

అలాగే, అప్పట్లో నెల్లూరులో అనిత థియేటర్ ఈ సినిమాతోనే డిసెంబర్ 13న ప్రారంభమైంది. ఆ థియేటర్‌లో తొలి వారం రోజులకే ఈ చిత్రం రూ. 39,102 వసూలు చేసి, నెల్లూరు సినిమా కలెక్షన్లలో సరికొత్త రికార్డు సృష్టించింది. మంచి రెవెన్యూ తెచ్చి, హిట్ చిత్రంగా నిలిచి, 5 కేంద్రాల్లో (డైరెక్ట్‌గా నెల్లూరులో, సింగిల్ షిఫ్టులతో విజయవాడ, గుంటూరు, కాకినాడ, హైదరాబాదుల్లో) శతదినోత్సవం జరుపుకొంది. 1976 మార్చి 25న మద్రాస్‌లోని చోళా హోటల్‌లో వందరోజుల వేడుక జరిగింది. ప్రముఖ గేయ రచయిత దాశరథి సభా కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా ఎన్టీఆర్ ప్రసంగిస్తూ, చిత్ర యూనిట్ సభ్యులను అభినందించారు. ఆయన సోదరుడు – ఎన్.ఏ.టి. సంస్థ అధినేత త్రివిక్రమరావు అందరికీ జ్ఞాపికలు అందజేశారు.

బాపయ్యకు బాక్సాఫీస్ పునాది

'ఎదురులేని మనిషి' హిట్, ఆ తర్వాత సరిగ్గా వారం రోజులకే (1975 డిసెంబర్ 19న) వచ్చిన శోభన్‌బాబు 'సోగ్గాడు' బ్లాక్‌బస్టర్ కావడంతో దర్శకుడిగా బాపయ్య కెరీర్‌కు ఇక తిరుగులేకుండా పోయింది. వరుసగా కమర్షియల్ చిత్రాలు, 'సోగ్గాడు' హిందీ వెర్షన్ మొదలు అక్కడి అవకాశాలు... ఆయనను రెండు దశాబ్దాల పాటు ఊపిరి సలపని బిజీ డైరెక్టర్‌ను చేశాయి. ఆ తరువాత ఎన్టీఆర్‌తోనే వైజయంతీ మూవీస్ 'యుగపురుషుడు' (1978) సహా మరో 5 చిత్రాలు డైరెక్ట్ చేశారు. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వెళ్ళే ముందు చివరగా చేసిన 'నా దేశం' (1982) చిత్రం కూడా బాపయ్య దర్శకత్వంలో వచ్చినదే!

ఆ 'స్వర్ణోత్సవ' సంస్థల తొలి హీరో ఆయనే!

సంకల్పం మంచిదైతే, సాధించాలనే పట్టుదల తోడైతే, సాధన చేయడం మానకపోతే... సక్సెస్ రావడం తథ్యం. యాభై ఏళ్ళ క్రితం 'ఎదురులేని మనిషి'తో సొంతంగా సినీ రంగంలో తొలి అడుగులు వేసి, ఇప్పటికీ 'మహానటి', ప్రభాస్ 'కల్కి' లాంటి చిత్రాలతో విజయవంతంగా ముందుకు సాగుతున్న ప్రసిద్ధ చిత్ర నిర్మాణసంస్థ 'వైజయంతీ మూవీస్', దాని అధినేత అశ్వినీదత్ ప్రయాణం అక్షరాలా అలాంటిదే! సినీచరిత్రలో ఇలా 50 వసంతాలు ఆగకుండా ఒక చిత్రనిర్మాణ సంస్థ తెలుగు సినిమాలు తీయడం, దానికి ఒకే కుటుంబ సభ్యులు నిర్మాతలుగా, సారథ్యం వహించడం అతి కొద్ది సందర్భాల్లోనే జరిగింది. 'రాముడు – భీముడు' (1964)తో అగ్ర నిర్మాత డి. రామానాయుడు ఆరంభించిన 'సురేశ్ ప్రొడక్షన్స్' గతంలో ఆ ఘనత సాధించింది. 'ఎదురులేని మనిషి' (1975)తో అశ్వినీదత్ స్థాపించిన 'వైజయంతీ మూవీస్' ఇప్పుడు ఆ అరుదైన జాబితాకెక్కింది. విశేషమేమిటంటే, ఆ రెండు బ్యానర్ల తొలి సినిమాలకూ మెడలో విజయానికి చిహ్నమైన వైజయంతి మాలతో వెండితెరపై అపర శ్రీకృష్ణావతారమైన అలనాటి అగ్రనటుడు ఎన్టీఆరే తొలి హీరో!

చరిత్రలో చెరగని 'వైజయంతి'

అరుదైన కాంబినేషన్లతో తెలుగు నుంచి హిందీ దాకా వివిధ భాషల్లో భారీ చిత్రాలకూ, బాక్సాఫీస్ హిట్లకూ వైజయంతి సంస్థ, అశ్వినీదత్ చిరునామాగా నిలిచారు. ఎన్టీఆర్ మొదలు ఏయన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు... చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున మీదుగా ఇవాళ్టి మహేశ్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్, నాని దాకా అగ్ర హీరోలందరితో తెలుగులో సినిమాలు తీసిన అరుదైన సంస్థ కావడం చరిత్రలో చెరిగిపోని విషయం. అక్కడి అమితాబ్ నుంచి ఇక్కడి రజనీకాంత్, కమలహాసన్‌ల దాకా అందరూ గౌరవించే నిర్మాతగా నిలవడం అశ్వినీదత్ సమర్థతకూ, సినీ నిర్మాణ చాకచక్యానికీ నిదర్శనం. ఇక, తరాలు మారినా తరగని వన్నెతో... ఆయన కుమార్తెలు స్వప్నా దత్, ప్రియాంకా దత్, అల్లుడు నాగ్ అశ్విన్‌లతో కలసి కొత్త అభిరుచులకు తగ్గట్టు వైజయంతీ మూవీస్ విజయవంతంగా సాగడం చెప్పుకొని తీరాల్సిన అంశం. తల్లితండ్రుల సినీ వారసత్వాన్ని ఇంత సక్సెస్‌ఫుల్‌గా ముందుకు తీసుకువెళుతూ, ఓ సినీ నిర్మాణ సంస్థను ఇంత సమర్థంగా కుమార్తెలు నడిపిన ఉదంతాలు సినీ చరిత్రలో అత్యంత అరుదు. అందుకే, అక్షరాలా ఇది ఎదురులేని ప్రస్థానం!

- రెంటాల జయదేవ

'అడవి రాముడు'కు అనుకోని బీజం

1970ల మధ్యభాగంలో ఎన్టీఆర్ కెరీర్ మరో కొత్త మలుపు తిరగడానికి కారణమైన సినిమా... 'ఎదురులేని మనిషి'. ఆయన విగ్గు, కాస్ట్యూమ్‌ల దగ్గర నుంచి తెరపై ఆయన చూపు, పాటల్లో కిర్రెక్కించే ఆయన ఊపు అన్నీ మారాయి. కమర్షియల్ చిత్రం చేయడం అదే తొలిసారి అయినా దర్శకుడు బాపయ్య తెగ విజృంభించారు. పూర్తి సొంతంగా సినిమా తీయడం అదే ప్రథమం అయినా, 'పెద్ద వయసు ఎన్టీఆర్‌తో ఈ కుర్ర చేష్టలేమిటి' అంటూ చిత్రనిర్మాణ సమయంలోనే పరిశ్రమలో నెగటివ్ ప్రచారం సాగినా, విమర్శల్ని లెక్క చేయకుండా నిర్మాత దత్ నిబ్బరంగా నిలిచారు. మంచి ఫామ్‌లో ఉన్న అందాల నటి వాణిశ్రీ, మాస్ మెచ్చే పాటలు, స్టెప్పులు, సంగీతం, యాక్షన్... అన్నీ కలసి 'ఎదురులేని మనిషి'ని తిరుగులేని సక్సెస్ చేశాయి. ఈలలు, చప్పట్లతో అభిమానులను కేరింతలు కొట్టేలా చేశాయి. యాభై రెండేళ్ళ వయసులో ఎన్టీఆర్‌ను కుర్రకారుకు చేరువ చేశాయి. అంతే... ఆ తర్వాత నుంచి ఎన్టీఆర్ 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను...' అంటూ హీరోయిన్లతో చిందులేశారు. మళ్ళీ కుర్రపాత్రలు, వాటికి తగ్గట్టు బెల్ బాటమ్ ప్యాంట్‌లు, పై గుండీలు తీసేసి ఛాతీ చూపించే షర్టులతో మాస్ హీరోగా వెండితెరపై చెలరేగిపోయారు. ఆయన దుస్తులూ అప్పట్లో ఓ ట్రెండ్. ఒక రకంగా ఈ 'ఎదురులేని...' చిత్రమే బాపయ్య పెదనాన్న గారి కుమారుడైన కె. రాఘవేంద్రరావు ఆ తర్వాత కాలంలో 'అడవి రాముడు' (1977) తీయడానికి ప్రేరణైంది. అక్కడ నుంచి మహావృక్షం స్థాయికి విజృంభించిన ఎన్టీఆర్ మాస్ ఇమేజ్‌కు అలా ఈ చిత్రమే కనిపించని విత్తనమైంది.


● వాణిశ్రీ, ఎన్టీఆర్

కుర్రాళ్ళ మాటకే ఎన్టీఆర్ ఓటు!

ఎన్టీఆర్‌కు సైతం అయిదు పదులు నిండిన ఆ వయసులో ఇలాంటి గెటప్‌లు, పాటలు, డ్యాన్సులు చేయడం కొత్తే. కాకపోతే, యువ ప్రేక్షకుల కోసమంటూ దర్శక, నిర్మాతలు పట్టుబట్టడంతో ఒకే అనేశారు. 'ఎదురులేని మనిషి' కోసం బొంబాయి నుంచి ప్రత్యేకంగా డ్రెస్‌లు, మేకప్, విగ్ అన్నీ తెప్పించారు. పాటల చిత్రీకరణతోనే పబ్లిసిటీ మొదలుపెట్టారు. పరిశ్రమలో ఎవరెంత నెగటివ్ ప్రచారం చేసినా, నిర్మాత దత్ ధైర్యంగా ముందుకు సాగారు. చివరకు ఒకసారి ఎన్టీఆర్ షూటింగయ్యాక ఆ గెటప్‌లో ఇంటికి వెళితే, వారి ఇంట్లో శ్రీమతి సహా అందరూ నివ్వెరపోయి, ఇదేమిటన్నారట! 'యువ దర్శక, నిర్మాతలు సినిమా చేస్తున్నారు. వారి మాట విందాం. చేయనిద్దాం' అన్నారట ఎన్టీఆర్.

అప్పట్లో ఈ సినిమాపై వివాదాలకూ తక్కువ లేదు. అప్పటికే తెలుగు సినీసీమలో 'బూత్రేయ' అంటూ ఒకింత చెడ్డపేరు తెచ్చుకున్న ఆత్రేయ మాత్రం అవేవీ పట్టించుకోకుండా, దర్శక, నిర్మాతలు తనను కోరిన విధంగా మాస్ పాటలు రాసేశారు. సాహిత్యంలోనూ, పాటల చిత్రీకరణలోనూ సరసం పాలు హెచ్చి శృంగారపుటంచులు తాకిందనే విమర్శలు వెల్లువెత్తాయి. సెన్సార్ సమయంలోనూ చిక్కులు తప్పలేదు. ''అప్పట్లో ఆ పాటలు సెన్సార్ బారిన పడకుండా ఉండేందుకు చాలా జాగ్రత్తలు తీసుకొని, నానాపాట్లు పడ్డాం'' అని బాపయ్య నవ్వేశారు.

నేను పెళ్లి చేసుకోలేదు

- మెహరీన్

''నేను ఇప్పటి వరకు ఎవర్నీ పెళ్లి చేసుకోలేదు. నాకు ఎవరితోనూ వివాహం కాలేదు'' అంటూ హీరోయిన్ మెహరీన్ స్పష్టం చేశారు. నాని హీరోగా హను రాఘవపూడి దర్శకత్వం వహించిన 'కృష్ణగాడి వీరప్రేమగాథ'(2016) సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చారు మెహరీన్. ఆ తర్వాత 'మహానుభావుడు, రాజా ది గ్రేట్, ఎఫ్ 2, ఎఫ్ 3' వంటి పలు హిట్ సినిమాల్లో నటించి, తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేకమైన అభిమానం సొంతం చేసుకున్నారు మెహరీన్. నటిగా బిజీగా ఉన్న సమయంలోనే బీజేపీ నాయకుడు భవ్య బిష్ణోయ్‌తో నిశ్చితార్థం చేసుకున్న ఈ బ్యూటీ త్వరలో పెళ్లి పీటలెక్కనున్నారనుకున్నారంతా. ఆ తర్వాత ఆ నిశ్చితార్థం రద్దు అయిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే... మెహరీన్ రహస్యంగా పెళ్లి చేసుకున్నారనే వార్తలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ న్యూస్‌పై మెహరీన్ స్పందించి, సోషల్ మీడియా వేదికగా ఓ ప్రకటన విడుదల చేశారు. ''నేను సీక్రెట్‌గా పెళ్లి చేసుకున్నానంటూ కొన్ని ఆంగ్ల వెబ్‌సైట్స్‌లో ఆర్టికల్స్ వచ్చాయి. అందులోనూ నాకు తెలియని, ఎప్పుడూ కలవని వ్యక్తిని పెళ్లి చేసుకున్నానని రాశారు. నా వికీపీడియా పేజీని ఎవరో హ్యాక్ చేసి, 'రెండు నిమిషాల పాపులారిటీ' కోసం ప్రయత్నించిన ఒక నీచుడి పని ఇది. నా వివాహం విషయంలో రెండేళ్లుగా మౌనంగా ఉన్నప్పటికీ, ఈసారి వేధింపులు హద్దులు దాటడంతో నిజం చెప్పక తప్పలేదనిపించింది. నేను ఇప్పటి వరకు ఎవర్నీ పెళ్లి చేసుకోలేదు. నాకు ఎవరితోనూ వివాహం కాలేదు.. నన్ను నమ్మండి. భవిష్యత్తులో పెళ్లి చేసుకునే నిర్ణయం తీసుకుంటే మాత్రం ఆ విషయం ప్రపంచం మొత్తానికి తెలిసేలా చెబుతాను.. ప్రామిస్'' అంటూ పేర్కొన్నారు మెహరీన్. ప్రస్తుతం ఆమె పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.

మిస్టీరియస్ థ్రిల్ చేస్తుంది

- మహి కోమటిరెడ్డి

''మిస్టీరియస్'ని రెగ్యులర్ మూవీ ఫార్మాట్‌లో కాకుండా విభిన్నమైన పాయింట్‌తో తెరకెక్కించాం. ఈ మూవీలో క్రైమ్‌తో పాటు లవ్, క్రష్ ఉంటాయి. అదే విధంగా సినిమాలోని థ్రిల్లింగ్ అంశాలకు ప్రేక్షకులు తప్పకుండా ఎంటర్‌టైన్ అవుతారు'' అని డైరెక్టర్ మహి కోమటిరెడ్డి చెప్పారు. 'రక్త కన్నీరు' సినిమా ఫేమ్, దివంగత నటుడు నాగభూషణం మనవడు అబిద్ భూషణ్‌తో పాటు రోహిత్ సహాని, రియా కపూర్, మేఘనా రాజ్‌పుత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మిస్టీరియస్'. జై వల్లందాస్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ– ''మా సినిమాలో కిల్లర్ ఎవరు? అనే సస్పెన్స్ చివరి వరకు కొనసాగుతుంది. ఇక క్లైమాక్స్ ఎపిసోడ్ ఎవరూ ఊహించని విధమైన ఓ ట్విస్ట్‌తో సస్పెన్స్, థ్రిల్లింగ్‌గా ఉంటుంది. సినిమా అయిపోయాక అందరూ క్లైమాక్స్ ఎపిసోడ్ గురించి మాట్లాడుకునేలా ఉంటుంది. థ్రిల్లర్ మూవీస్ అంటే పాటలు పెద్దగా ఎక్స్‌పెక్ట్ చేయకపోవచ్చు. కానీ, మా సినిమాలో మూడు పాటలు పెట్టాం. ఎంఎల్ రాజా సంగీతం అందించిన ఈ చిత్రంలోని పాటలు మంచి కిక్ ఇచ్చేలా ఉంటాయి. ఇప్పటివరకు మా మూవీ ప్రమోషనల్ కంటెంట్‌కు మంచి ఫీడ్ బ్యాక్ వచ్చింది. మా మిత్రుడు జై వల్లందాస్ సాయంతో అద్భుతంగా నిర్మించాం. 150కి పైగా థియేటర్స్‌లో గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం'' అని పేర్కొన్నారు.

బిజినెస్ రీల్

బెంచ్‌మార్క్ ఆధారంగా ఎంఎస్‌ఎంఈ రుణాలు

బ్యాంక్‌లకు ఆర్‌బీఐ సూచన

న్యూఢిల్లీ: ద్రవ్య పరపతి విధాన చర్యలను వేగంగా రుణ గ్రహీతలకు బదిలీ చేసేందుకు వీలుగా బ్యాంక్‌లకు ఆర్‌బీఐ కీలక సూచన చేసింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్‌ఎంఈ) రుణాలను ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ (రెపో తదితర)తో అనుసంధానించాలని సూచించింది. ఈ విషయాన్ని కేంద్ర ఎంఎస్‌ఎంఈ శాఖ సహాయ మంత్రి శోభ కరంద్లాజె లోక్‌సభకు లిఖిత పూర్వకంగా తెలియజేశారు. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ విధానంలో అయితే రుణ రేట్ల సవరణ మూడు నెలలకు తగ్గుతుందన్నారు. ఇప్పటికే రుణాలు తీసుకున్న వారికి ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ ఆధారిత లెండింగ్ రేటుకు మారే ఆప్షన్‌ను అందించాలని కూడా బ్యాంక్‌లకు సూచించినట్టు మంత్రి తెలిపారు. ఇక నాణ్యత నియంత్రణ ఆదేశాల (క్యూసీవోలు) అమలు పరంగా ఎంఎస్‌ఎంఈలకు మినహాయింపులు, వెసులుబాటు కల్పించినట్టు మంత్రి చెప్పారు. దేశీ తయారీకి విఘాతం కలిగించకుండా ఈ చర్య తీసుకున్నట్టు తెలిపారు. సూక్ష్మ సంస్థలకు ఆరు నెలలు, చిన్న సంస్థలకు మూడు నెలల అదనపు గడువు ఇచ్చినట్టు చెప్పారు.

జోయాలుక్కాస్ 'సీజన్ ఆఫ్ గిఫ్టింగ్' ఆఫర్లు

హైదరాబాద్: జోయాలుక్కాస్ 'సీజన్ ఆఫ్ గిఫ్టింగ్' పేరుతో పండుగ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. దేశవ్యాప్తంగా జనవరి 4 వరకు అన్ని జోయాలుక్కాస్ షోరూంల్లో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ సందర్భంగా రెండు ఆఫర్లు ప్రకటించింది. పాత బంగారం మార్పిడిపై ప్రతి గ్రాముకు రూ.250 అదనంగా పొందవచ్చు. డైమండ్, అన్‌కట్ డైమండ్స్ విలువపై ఫ్లాట్ 25% తగ్గింపు అందిస్తుంది. ''దేశవ్యాప్తంగా పరిమిత కాలపు పండుగ ప్రచారం ద్వారా డైమండ్స్, గోల్డ్ ఎక్స్ఛేంజ్ మీద అసాధారణ విలువ అందిస్తున్నాము. ఆఫర్ ప్రయోజనాలను కస్టమర్లు వినియోగించుకోవాలి'' అని జోయాలుక్కాస్ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-12-2025

విశాఖ	675-00
చిత్తూరు	688-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	675-00
విజయవాడ	700-00
రిటైల్ ధర (డజను)	96.00
హైదరాబాద్	671-00
వరంగల్	673-00
రిటైల్ ధర	7.31

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BHARTIARTL	2,104.90	1.7
TITAN	3,930.00	1.65
TATACONSUM	1,172.00	1.26
M&M	3,628.90	0.58
BAJAJ-AUTO	8,989.00	0.55

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
AXISBANK	1,219.00	-5.12
ETERNAL	284.5	-4.67
JSWSTEEL	1,085.10	-2.66
HCLTECH	1,651.80	-1.91
TATASTEEL	169.8	-1.78

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	5,685
ఎన్‌ఎస్‌ఈ	83,985
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,52,052
ఎఫ్‌ఐఐ	- 2,382
డీఐఐ	+ 1,077

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	55.42	$	56.67
బ్రెంట్	59.32	$	60.67

ఫండ్ పరిశ్రమకు సిప్ దన్ను

- అధిక రాబడులిచ్చినంత వరకు యాక్టివ్ ఫండ్స్‌కి ఆదరణ
- దీర్ఘకాలికంగా పెట్టుబడులు కొనసాగిస్తే ప్రయోజనకరం
- ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ సీఈవో నిమేష్ షా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అర్థవంతమైన, దీర్ఘకాలిక సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్లు (సిప్), మార్కెట్ వృద్ధితో అసెట్ విలువలు పెరుగుతుండటంలాంటి అంశాలు మ్యుచువల్ ఫండ్ పరిశ్రమ వృద్ధికి దోహదపడుతున్నాయని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ సీఈవో నిమేష్ షా తెలిపారు. రిటైర్మెంట్ లేదా పిల్లల చదువులాంటి నిర్దిష్ట లక్ష్యాల కోసం సిప్ విధానంలో పెట్టుబడులు పెడుతున్నప్పుడు మదుపరులు, చివరివరకు పెట్టుబడులను కొనసాగిస్తున్నారని ఆయన చెప్పారు. యాక్టివ్ వ్యూహాలు అత్యధిక రాబడులను అందించినంత వరకు వాటిపై ఇన్వెస్టర్ల ఆసక్తి కొనసాగుతుందని షవివరించారు. దేశీయంగా యాక్టివ్ ఫండ్లు సహేతుకమైన పనితీరును కనపరుస్తున్నందున వాటిల్లోకి గణనీయంగా పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఏదైనా ఫండ్ సంస్థకు ఇతర సంస్థల నుంచి పోటీ, లేదా నియంత్రణ నిబంధనలపరమైన రిస్కుల కన్నా పనితీరు ఆశించినంత స్థాయిలో లేకపోవడమే పెద్ద రిస్కుగా ఉంటుందని షా వివరించారు. ''డిజిటైజేషన్, డెమోగ్రాఫిక్స్, ఆర్థిక అసెట్లలోకి కుటుంబాల పొదుపు మొత్తాలు భారీగా వస్తుండటంలాంటి అంశాల దన్నుతో భారత జీడీపీ గణనీయంగా వృద్ధి నమోదు చేస్తోంది. ప్రభుత్వం చేపట్టిన పలు సంస్కరణల ఊతంతో దేశ స్థూల ఆర్థిక పరిస్థితులు పటిష్టంగా ఉన్నాయి. రాబోయే రోజుల్లో ఆర్థిక కార్యకలాపాలు క్రమంగా మరింత పుంజుకునే అవకాశాలు ఉన్నాయి. కంపెనీల ఆదాయ వృద్ధి రూపంలో ఈక్విటీ మార్కెట్లలో కూడా ఇది ప్రతిఫలిస్తోంది. దీర్ఘకాలికంగా పెట్టుబడులను కొనసాగించే వారికి సముచితమైన ప్రతిఫలం దక్కుతుందని ఇవి నమ్మకం కలిగిస్తున్నాయి'' అని షా తెలిపారు.

లిస్టయినా జవాబుదారీతనం యథాతథం..

''స్టాక్ మార్కెట్లలో కంపెనీ లిస్టయినప్పటికీ మా జవాబుదారీతనం, బాధ్యతలేమీ మారవు. ఇన్వెస్టర్లు పెట్టుబడులను కొనసాగించి, వారి సంపద వృద్ధి చెందితేనే మా ఆదాయాలు పెరుగుతాయి కాబట్టి యూనిట్‌హోల్డర్లకు ఒనగూరే ప్రయోజనాలతో షేర్‌హోల్డర్ల ప్రయోజనాలు ముడిపడి ఉంటాయి. అన్నింటికన్నా ప్రధానంగా డబ్బును నిర్వహించే రిస్క్ మేనేజ్‌మెంట్ కంపెనీగానే మమ్మల్ని మేము భావిస్తాం. లిస్టింగ్ తర్వాత కూడా అదే కొనసాగుతుంది. ఫండ్ పరిశ్రమ చాలా విస్తృత స్థాయి వ్యాపారం. ఇన్వెస్టర్లకు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నియంత్రణ సంస్థ వ్యయాలను క్రమబద్ధీకరించింది. దీనితో ఇన్వెస్టర్లకు ఫండ్స్ మరింత అందుబాటులోకి వస్తాయి. అలాగే మార్జిన్లు తగ్గినా పరిమాణం పెరగడం వల్ల సంస్థకు ఆ మేరకు భర్తీ అవుతుంది. కాలక్రమేణా అధిక లాభాలకు దోహదపడుతుంది'' అని షా చెప్పారు. ఇక ఐపీవో వల్ల కంపెనీ నిర్వహణ స్వరూపం ఏమీ మారదన్నారు. గత మూడు దశాబ్దాలుగా పెట్టుబడులు కొనసాగిస్తున్న ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్ పాక్షికంగానే వాటాలను విక్రయిస్తోందని, ఐసీఐసీఐ బ్యాంకు మెజారిటీ వాటాదారుగా కొనసాగుతుందని తెలిపారు. కాబట్టి అదే మేనేజ్‌మెంట్, అవే పెట్టుబడి సూత్రాలు, గవర్నెన్స్‌తో వ్యాపారం కొనసాగుతుందన్నారు. పబ్లిక్ ఇష్యూతో లిక్విడిటీ, యాజమాన్యం పెరుగుతుందే తప్ప కంపెనీ వ్యూహంలో మార్పు ఉండదని షా తెలిపారు. అంతర్జాతీయంగా, దేశీయంగా ఎంతో పేరున్న పలు దిగ్గజ సంస్థలు యాంకర్ ఇన్వెస్టర్లుగా ఈ ఇష్యూలో పాలుపంచుకుంటున్నాయని వివరించారు. తమ బిజినెస్ మోడల్, నిర్వహణ క్రమశిక్షణ, దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలు, భారత అసెట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమపై వాటికున్న నమ్మకానికి ఇది నిదర్శనంగా ఉంటుందని వివరించారు.

పెట్టుబడుల ఆధారిత వృద్ధికి బాటలు వేయాలి

- మూలధన వ్యయాలను పెంచాలి
- ఎన్ఆర్ఐ పెట్టుబడుల ప్రోత్సాహక నిధి అవసరం
- 2026–27 బడ్జెట్‌పై సీఐఐ సూచనలు

న్యూఢిల్లీ: ప్రభుత్వ, ప్రైవేటు, విదేశీ పెట్టుబడులతో కూడిన స్థిరమైన పెట్టుబడుల వృద్ధికి సమగ్రమైన సంస్కరణలను చేపట్టాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. తద్వారా ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఇకముందూ భారత్ తన జైత్రయాత్రను కొనసాగించొచ్చని పేర్కొంది. 2026–27 బడ్జెట్‌లో చేపట్టాల్సిన చర్యలపై తన కీలక సూచనలను కేంద్ర ఆర్థిక శాఖకు సీఐఐ సమర్పించింది. 2026–27లో కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయాలను 12 శాతం మేర పెంచాలని, రాష్ట్రాలకు మూలధన నిధుల మద్దతును 10 శాతం పెంచాలని సూచించింది. 2026–32 కోసం రూ.150 లక్షల కోట్లతో జాతీయ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్ (ఎన్ఐపీ)ను ప్రకటించాలని.. కొత్త పెట్టుబడులు, ఉత్పత్తి లక్ష్యాలను సాధించిన కంపెనీలకు అదనపు పన్ను ప్రయోజనాలు లేదా నిబంధనల అమలు పరంగా వెసులుబాటు కల్పించాలని కోరింది. ఎన్ఆర్ఐ పెట్టుబడుల ప్రోత్సాహక నిధిని ప్రవేశపెట్టాలని సూచించింది. ఎంఎస్‌ఎంఈలు, తయారీ పరిశ్రమలకు టెక్నాలజీ అప్‌గ్రేడ్ (ఉన్నతీకరణ), తాజా మూలధన వ్యయాలకు ప్రోత్సాహకాలు ప్రకటించాలని కోరింది. జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా పెట్టుబడులు కొనసాగేందుకు సావరీన్ ఇన్వెస్ట్‌మెట్ స్ట్రాటజీ కౌన్సిల్ (ఎస్ఐఎస్‌సీ)ని ఏర్పాటు చేయడం ద్వారా నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఎన్ఐఐఎఫ్)ను మరింత బలోపేతం చేయాలని కూడా సీఐఐ కేంద్రానికి సూచించింది. ''2026–27 కేంద్ర బడ్జెట్ వృద్ధికి చోదకంగా, స్థిరత్వానికి మద్దతుగా ఉండాలి. ఇందుకు పెట్టుబడులను ప్రోత్సహించడం అత్యంత కీలకమైన అంశాలలో ఒకటిగా ఉండాలి''అని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ తెలిపారు. ఇందుకుగాను సమగ్రమైన పెట్టుబడుల వ్యూహంతో పాటు నిధుల సమర్థత, పెట్టుబడుల విశ్వాసం కీలకమని సీఐఐ సూచించినట్టు చెప్పారు.

7 నెలల కనిష్టానికి నిరుద్యోగం

- నవంబర్‌లో 4.7 శాతానికి పరిమితం
- అక్టోబర్‌లో ఇది 5.1 శాతం
- గ్రామాల్లో మరింత తక్కువ

న్యూఢిల్లీ: నిరుద్యోగిత మరింత దిగొచ్చింది. నవంబర్‌లో 4.7 శాతానికి పరిమితమైంది. ఈ ఏడాది ఏప్రిల్ (5.1 శాతం) తర్వాత ఇదే కనిష్ట స్థాయి అని కేంద్ర గణాంకాలు, ప్రణాళికల అమలు శాఖ ప్రకటించింది. స్త్రీ, పురుషుల్లో నిరుద్యోగం రేటు ఏప్రిల్ నుంచి స్థిరంగా తగ్గుతూ వచ్చినట్టు పేర్కొంది. 15 ఏళ్ల వయసుకు మించి పనిచేసే వారిలో నిరుద్యోగం రేటు అక్టోబర్‌లో 5.2 శాతంగా ఉండడం గమనార్హం.

- నవంబర్‌లో గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత 3.9 శాతంగా నమోదైంది. పట్టణాల్లో ఇది 6.5 శాతంగా ఉంది.
- మహిళల్లో నిరుద్యోగం 4.8%గా ఉంది. అక్టోబర్‌లో నమోదైన 5.4% నుంచి దిగొచ్చింది.
- పురుషుల్లో నిరుద్యోగ రేటు సైతం అక్టోబర్‌లో ఉన్న 5.1 శాతం నుంచి నవంబర్‌లో 4.6 శాతానికి తగ్గింది.
- గ్రామీణ ప్రాంతాల్లో పురుషులకు సంబంధించి నిరుద్యోగ రేటు 4.1 శాతం కాగా, పట్టణ ప్రాంతాల్లో 5.6 శాతంగా నమోదైంది. అక్టోబర్‌లో ఇది వరుసగా 4.6 శాతం, 6.1 శాతంగా ఉంది.
- గ్రామీణ ప్రాంతాల్లో మహిళా నిరుద్యోగం అక్టోబర్‌లో ఉన్న 4 శాతం నుంచి నవంబర్‌లో 3.4 శాతానికి దిగొచ్చింది. పట్టణాల్లో మహిళలకు సంబంధించి నిరుద్యోగం అక్టోబర్‌లో ఉన్న 9.7 శాతం నుంచి నవంబర్‌లో 9.3 శాతానికి తగ్గింది.
- 15 ఏళ్లకు మించిన జనాభాలో పనిచేసే వారి శాతం ఈ ఏడాది ఏప్రిల్‌లో 52.8గా ఉంటే, నవంబర్‌లో 53.2 శాతానికి మెరుగుపడింది.
- కార్మిక శక్తి భాగస్వామ్య రేటు 55.8 శాతంగా నమోదైంది.

భారత్‌లోనే ఈవీ విడిభాగాల తయారీ

- బ్యాటరీలు సైతం
- తద్వారా కొనుగోలుదారుల్లో విశ్వాసం
- మారుతి సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ బెనర్జీ



న్యూఢిల్లీ: మారుతి సుజుకీ ఎలక్ట్రిక్ కార్ల దిశగా బలమైన ప్రణాళికలతో ఉంది. ఎలక్ట్రిక్ కార్ల కోసం కీలకమైన విడిభాగాలను రానున్న సంవత్సరాల్లో ఇక్కడే తయారు చేసే ప్రణాళికతో ఉన్నట్టు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, విక్రయాలు) పార్థో బెనర్జీ తెలిపారు. భారత్‌లో ఈవీ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేసుకోవడమే తమ లక్ష్యమన్నారు. ప్రస్తుతం బ్యాటరీలను దిగుమతి చేసుకుంటుండగా, వీటిని సైతం ఇక్కడే తయారు చేయాలన్న ప్రణాళికతో ఉన్నట్టు తెలిపారు. వచ్చే ఏడాది భారత్ మార్కెట్లో తొలి ఎలక్ట్రిక్ వాహనం ఇ-విటారాను విడుదల చేయనున్న మారుతి సుజుకీ.. కొనుగోలుదారుల్లో విశ్వాసాన్ని పెంచే దిశగా స్థానికంగానే ఈవీ తయారీ ఎకోసిస్టమ్‌పై దృష్టి సారించినట్టు చెప్పారు. ఇంటి కోసం ప్రాథమిక వాహనంగా ఎలక్ట్రిక్ కారును వినియోగదారులు నమ్మకంగా కొనుగోలు చేసినప్పుడే దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల విస్తరణ వేగాన్ని అందుకుంటుందన్న అభిప్రాయాన్ని బెనర్జీ వ్యక్తం చేశారు. ''ఈవీల విషయంలో కస్టమర్లు నమ్మకంగా లేరు. ఆరంభంలో వచ్చిన ఉత్పత్తులకు సంబంధించిన అనుభవంతో, ప్రయాణ దూరం పరంగా వారి మనసుల్లో ప్రతికూల ధోరణి ఏర్పడింది. తగిన ప్రజా మౌలిక సదుపాయాలు లేవు. విక్రయానంతర సేవలు, రీసేల్ (తిరిగి విక్రయించే) విలువ ఈవీల వినియోగానికి ఉన్న పెద్ద సవాళ్లు. ఇప్పటి వరకు ఎలక్ట్రిక్ కార్లను కొనుగోలు చేసిన వారు, వాటిని సెకండరీ వాహనంగానే వినియోగిస్తున్నారు''అని వివరించారు. కనుక వినియోగదారుల్లో ఎలక్ట్రిక్ వాహనాలపై నమ్మకం కల్పించకపోతే వారు కొనుగోళ్లకు ముందుకురారని అభిప్రాయపడ్డారు.

ఐదు మోడళ్లు: 2030 మార్చి నాటికి ఐదు ఈవీ మోడళ్లను కలిగి ఉండాలన్నది మారుతి సుజుకీ ప్రణాళికగా బెనర్జీ పేర్కొన్నారు. అప్పటికి ఎలక్ట్రిక్ కార్ల పరిమాణం 55–60 లక్షలుగా ఉండొచ్చని, ఈవీ విస్తరణ 13–15 శాతానికి చేరుకోవచ్చని చెప్పారు. మారుతి సుజుకీకి దేశవ్యాప్తంగా 1,100 పట్టణాల్లోని 1,500 వర్క్‌షాపులు ఎలక్ట్రిక్ వాహన సర్వీసులకు అనుకూలంగా ఉన్నట్టు, ఇప్పటికే 2,000 చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

నెట్‌వర్కింగ్ మార్గదర్శకాలకు ఐసీఏఐ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అడ్వర్టైజింగ్, అంతర్జాతీయ నెట్‌వర్కింగ్ మార్గదర్శకాలకు చార్టర్డ్ అకౌంటెంట్ల సంఘం ఐసీఏఐ ఆమోదముద్ర వేసింది. దేశీ చార్టర్డ్ అకౌంటెంట్ సంస్థలు భారీ స్థాయిలో ఎదిగేందుకు, అంతర్జాతీయంగా పోటీపడేందుకు ఇవి తోడ్పడనున్నాయి. మన సీఏ సంస్థలకు గ్లోబల్ నెట్‌వర్కింగ్ అవకాశాలను అందుబాటులోకి తేవడం ఈ మార్గదర్శకాల ప్రధాన ఉద్దేశం.

యోనో యూజర్లు @ 20 కోట్లు

- రెండేళ్లలో చేరుకుంటాం
- కొత్త వెర్షన్ విడుదల
- ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి

న్యూఢిల్లీ: ఎస్‌బీఐ డిజిటల్ బ్యాంకింగ్ ప్లాట్‌ఫామ్ అయిన 'యోనో' వచ్చే రెండేళ్లలో కస్టమర్ల సంఖ్యను 20 కోట్లకు పెంచుకోవాలన్న ప్రణాళికతో ఉంది. యోనో 2.0 (కొత్త వెర్షన్)ను సోమవారం విడుదల చేసిన సందర్భంగా ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి ఈ విషయాన్ని ప్రకటించారు. ఎస్‌బీఐ 2.0 మెరుగైన వెర్షన్ అని, కస్టమర్లకు మెరుగైన సేవల అనుభవాన్ని అందిస్తుందన్నారు. ఎస్‌బీఐకి వెన్నెముకగా నిలుస్తుందన్నారు. ఈ ప్లాట్‌ఫామ్‌పై పూర్తి స్థాయి సదుపాయాలను వచ్చే 6–8 నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ''డిజిటలైజేషన్‌కు యోనో 2.0 మూలస్తంభంగా ఉంటుంది. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్‌కు ఉమ్మడి కోడ్ ఉంటుంది. దీంతో వివిధ ఛానళ్ల మధ్య అనుసంధానత సాఫీగా సాగుతుంది. దీని కారణంగా కొత్త ఉత్పత్తులను, సేవలను ఎస్‌బీఐ వేగంగా కస్టమర్లకు అందించగలదు. యోనోకి ప్రస్తుతం 10 కోట్ల కస్టమర్లు ఉన్నారు. యోనో మొబైల్ బ్యాంకింగ్ లేదా ఇంటర్నెట్ బ్యాంకింగ్‌పై కస్టమర్ల సంఖ్య 20 కోట్లకు చేర్చాలన్నది మా ఉద్దేశ్యం. వచ్చే రెండేళ్లలో దీన్ని చేరుకుంటాం''అని శెట్టి చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నికర వడ్డీ మార్జిన్ (నిమ్)ను 3 శాతం సాధిస్తామని మరోసారి ప్రకటించారు. ర్యామ్ విభాగంలో (రిటైల్, వ్యవసాయం, ఎంఎస్‌ఎంఈ) రుణాల పరంగా 14 శాతం వృద్ధి సాధిస్తామని, అలాగే రూ.25 లక్షల కోట్ల పోర్ట్‌ఫోలియో మైలురాయిని అధిగమిస్తామని చెప్పారు. బంగారం రుణాలు, ఎక్స్‌ప్రెస్ క్రెడిట్ (అన్‌సెక్యూర్డ్ వ్యక్తిగత రుణాలు)లో మంచి వృద్ధి సాధిస్తామన్నారు.

జీడీపీ వృద్ధి 7 శాతం

వచ్చే ఏడాదికి బ్రిక్‌వర్క్ రేటింగ్స్ అంచనా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 2026–27లో 6.5–7 శాతం ఉండొచ్చని బ్రిక్‌వర్క్ రేటింగ్స్ అంచనా వేస్తోంది. ఈసారి సుమారు 7.2–7.3 శాతం ఉండొచ్చని భావిస్తోంది. ద్రవ్యోల్బణం నెమ్మదించడం, వడ్డీ రేట్ల తగ్గుదల, జీఎస్‌టీ సంస్కరణలు, లిక్విడిటీని మెరుగుపర్చే చర్యలు మొదలైనవి ఇందుకు తోడ్పడనున్నాయి. తెలంగాణ ఆర్థిక వృద్ధి అంచనాలకు సంబంధించిన నివేదికను విడుదల చేసిన సందర్భంగా సంస్థ సీఈవో మను సెహ్‌గల్, చీఫ్ రేటింగ్ ఆఫీసర్ కేహెచ్ పట్నాయక్ ఈ విషయాలు తెలిపారు. 2025 నుంచి 2034 మధ్య కాలంలో రాష్ట్రం వార్షికంగా 12–13 శాతం వృద్ధి రేటు సాధిస్తుందని, 1 ట్రిలియన్ (లక్ష కోట్లు) డాలర్ల ఎకానమీగా ఎదుగుతుందని సెహ్‌గల్ తెలిపారు. ఇన్‌ఫ్రా, ఐటీ, ఫార్మా తదితర రంగాలవ్యాప్తంగా భారీ గా పెట్టుబడులు వస్తున్నాయని, రాష్ట్ర ఎకానమీకి సేవల రంగం వెన్నెముకగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ ఎండీగా శుక్లా

న్యూఢిల్లీ: పీఎన్‌బీఐ హౌసింగ్ ఫైనాన్స్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్(సీఈఓ)ఆఫీసర్‌గా అజయ్ కుమార్ శుక్లా నియమితులయ్యారు. ఈ డిసెంబర్ 18 నుంచి తదుపరి అయిదేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. అయితే ఈ నియామకం షేర్‌హోల్డర్ల ఆమోదానికి లోబడి ఉంటుందని కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. శుక్లా ప్రస్తుతం టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్‌లో చీఫ్ బిజినెస్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వరిస్తున్నారు. అంతకుముందు, ఐసీఐసీఐ బ్యాంకు గృహ రుణాల వ్యాపారంలో ఏడేళ్ల పాటు పనిచేసిన అనుభవం ఉంది.

శీతాకాలం విహారయాత్రలకు డిమాండ్..

- ప్లానింగ్‌లో 55 శాతం మంది ట్రావెలర్లు
- టాప్ చాయిస్‌లుగా గోవా, కేరళ
- ఎయిర్‌బీఎన్‌బీ నివేదిక



ముంబై: దేశీయంగా పర్యాటకుల్లో దాదాపు 55 శాతం మంది ఏటా శీతాకాలంలో విహార యాత్రలకు ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ ట్రావెల్ సీజన్‌లో గోవా, కేరళ ప్రధాన గమ్యస్థానాలుగా ఉంటున్నాయి. సెలవ రోజులు గడిపేందుకే కాకుండా కాస్త రిలాక్స్ అయ్యేందుకు కూడా శీతాకాలం ట్రిప్‌లను భారతీయులు ఎంచుకుంటున్నారు. టెక్ హాస్పిటాలిటీ కంపెనీ ఎయిర్‌బీఎన్‌బీ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 'ఎయిర్‌బీఎన్‌బీ అంతర్గత డేటా ప్రకారం ఈ శీతాకాలం సీజన్‌లో గోవా, కేరళ, రాజస్థాన్, హిమాలయ ప్రాంత రాష్ట్రాలపై ట్రావెలర్లు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. బీచ్‌లు, బ్యాక్‌వాటర్లు, సంస్కృతి, శీతాకాలపు వాతావరణం, ఔట్‌డోర్ అనుభూతులు మొదలైన అంశాలు ఇందుకు సానుకూలంగా ఉంటున్నాయి' అని ఎయిర్‌బీఎన్‌బీ కంట్రీ హెడ్ అమన్‌ప్రీత్ బజాజ్ తెలిపారు. సానుకూల చల్లని వాతావరణం, ఆకర్షణీయమైన ప్రాంతాల దన్నుతో ప్రస్తుతం ఫేవరెట్ ట్రావెల్ సీజన్లలో శీతాకాలం కూడా చేరిందని పేర్కొన్నారు. ఈ ఏడాది అక్టోబర్లో నిర్వహించిన సర్వే ఆధారంగా ఈ నివేదికను ఎయిర్‌బీఎన్‌బీ రూపొందించింది. 2,155 మంది పర్యాటకులు ఇందులో పాల్గొన్నారు.

నివేదికలో మరిన్ని విశేషాలు..

- లక్షద్వీప్‌లోని అగట్టి, గౌహతితో పాటు పంజాబ్‌లోని చిన్న నగరాలు, కేరళలో పెద్దగా తెలియని తీర ప్రాంత, బ్యాక్‌వాటర్స్ పట్టణాలపై ఆసక్తి వ్యక్తమవుతోంది.
- యువ ట్రావెలర్లు .. వారణాసి, బృందావన్ లాంటి ఆధ్యాత్మిక కేంద్రాల్లో పర్యటిస్తున్నారు.
- శీతాకాలంలో పర్యటించే వారిలో దాదాపు సగం మంది జెనరేషన్ జెడ్, మిలీనియల్స్ వారే ఉంటున్నారు. చల్లని వాతావరణం, ఆహ్లాదకరమైన, అందమైన లొకేషన్స్‌ను ఆస్వాదించేందుకు శీతాకాలంలో ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.
- సీజనల్ సెలవలను గడిపేందుకు శీతాకాలంలో ప్రయాణిస్తున్నట్లు సర్వేలో పాల్గొన్న వారిలో సుమారు 30 శాతం మంది తెలిపారు. సేద తీరేందుకు ట్రావెల్ చేస్తున్నట్లు 30 శాతం మంది, సరికొత్త సంస్కృతుల గురించి తెలుసుకునేందుకు ఈ సీజన్‌ను ఎంచుకుంటున్నట్లు 20 శాతం మంది వివరించారు.
- పర్యటనల విషయంలో ఎక్కువ శాతం మంది తమకు అత్యంత సన్నిహితులతోనే కలిసి వెళ్లడానికి ప్రాధాన్యమిస్తున్నారు. 50 శాతం మంది తమ జీవిత భాగస్వామితో కలిసి వెళ్తుండగా, మూడో వంతు మంది.. స్నేహితులతో కలిసి వెళ్తున్నారు. రెండు మూడు తరాల కుటుంబ సభ్యులతో కలిసి తాము ట్రిప్‌లను ప్లాన్ చేస్తామని 30 శాతం మంది వివరించారు. గోవా బీచ్‌లు, కేరళ బ్యాక్‌వాటర్స్ నుంచి మనాలీ, ముస్సోరీలో పర్వత ప్రాంతాలు, సాంస్కృతిక వారసత్వ సంపద కేంద్రాలుగా ఉండే ఉదయ్‌పూర్, జైపూర్‌లాంటి నగరాల వరకు దేశీయంగా కొత్త ప్రాంతాల్లో పర్యటించడంపై, వాటి గురించి తెలుసుకోవడంపై ఆసక్తి పెరుగుతోంది.

సిరీస్ సొంతం చేసుకోవాలని...

నేడు దక్షిణాఫ్రికాతో భారత్ నాలుగో టి20

- గెలిస్తే టీమిండియా ఖాతాలోకి సిరీస్
- నెగ్గి నిలవాలని దక్షిణాఫ్రికా తహతహ
- రాత్రి 7 గంటల నుంచి స్టార్‌స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లలో ప్రసారం


సూర్యకుమార్ యాదవ్

స్టార్ బ్యాటర్ల వరుస వైఫల్యాలు... కీలక బౌలర్లకు గాయాలు... గైర్హాజరీలు... అయితేనేం జోరు కొనసాగించాలని.. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను సొంతం చేసుకోవాలని... సూర్యకుమార్ బృందం భావిస్తోంది. ఈ నేపథ్యంలో నేడు దక్షిణాఫ్రికాతో భారత జట్టు నాలుగో టి20 మ్యాచ్ ఆడనుంది. ఆతిథ్య జట్టులోని ప్రతికూలతల్ని సొమ్ము చేసుకొని లక్నో వేదికను లక్కీగా మలచుకోవాలని పర్యాటక దక్షిణాఫ్రికా ఆశిస్తోంది. ఫలితంగా ఈ మ్యాచ్ ఆసక్తికరంగా జరిగే అవకాశముంది.

లక్నో: భారత్ ఇక్కడ కాకపోతే... అహ్మదాబాద్ (ఆఖరి మ్యాచ్ వేదిక)లోనైనా సిరీస్‌ను గెలిచే ధీమాతో బరిలోకి దిగుతుండగా... దక్షిణాఫ్రికా ఇక్కడ ఓడితే ఇక్కడే సిరీస్‌ను ఆతిథ్య జట్టు చేతిలో పెట్టేసే భయంతో మ్యాచ్ ఆడనుంది. ఈ కారణంతోనే సిరీస్‌లో పైచేయి సాధించిన టీమిండియా రెట్టింపు హుషారుతో సమరానికి సై అంటోంది. గత మ్యాచ్‌లో స్పిన్, పేస్, బ్యాటింగ్ అన్నీ కలిసి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ప్రత్యర్థిని చిత్తు చేసిన సూర్యకుమార్ బృందం గత 'షో'ను పునరావృతం చేస్తే ఈ మ్యాచ్ గెలుపు, సిరీస్ కైవసం ఏమాత్రం కష్టం కానేకాదు. ఇక సఫారీ పరిస్థితి పూర్తి భిన్నం! మ్యాచ్‌లో గెలిచేందుకు లక్నోలో సిరీస్‌ను సమం చేసేందుకు సర్వశక్తులు ఒడ్డేందుకు ప్రయత్నిస్తుంది. కెప్టెన్ మార్క్‌రమ్ ఫామ్‌కు, డికాక్ మెరుపులు తోడైతే పరుగుల వరద పారే అవకాశముంది.

ఆ ఇద్దరిపై ఒత్తిడి

భారత జట్టు ఫలితాల పరంగా పైచేయిగా కనిపిస్తోంది. అలాగని జట్టులోని అందరి ప్రదర్శన బాగుందనుకుంటే తప్పులో కాలేసినట్లే! నాయకుడు సూర్యకుమార్ మెరిపించి చాలా రోజులైంది. గత 21 ఇన్నింగ్స్‌లుగా అతను చెప్పుకోదగ్గ ప్రదర్శనేది లేదు. ఫిఫ్టీ చేసి ఏడాది దాటింది. పోయిన ఏడాది అక్టోబర్లో అర్ధశతకం సాధించాక మళ్లీ అలాంటి మెరుపు ఇన్నింగ్స్ ఒక్కటీ ఆడలేదు. ఇక ఓపెనింగ్‌లో శుబ్‌మన్ గిల్ వరుస వైఫల్యాలు బ్యాటింగ్ ఆర్డర్‌పై పెనుభారమే మోపుతోంది. గత మ్యాచ్‌లో 28 పరుగులు చేశాడు. కానీ 28 బంతులాడాడు. ఓ టాపార్డర్ బ్యాటర్‌కు... పైగా టి20ల్లో ఇది అత్తెసరు స్కోరే అవుతుంది. అభిషేక్ శర్మ, హైదరాబాదీ స్టార్ తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, జితేశ్ శర్మలతో భారత్ బ్యాటింగ్‌లో గట్టెక్కుతుంది. బౌలింగ్ విభాగానికి వస్తే... భారత పేస్ ఎక్స్‌ప్రెస్ బుమ్రా ఈ మ్యాచ్‌కూ అందుబాటులో లేడు. తన సన్నిహితుడొకరు ఆస్పత్రి పాలవడంతో గత మ్యాచ్‌కు ముందే జట్టును వీడాడు. ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ అనారోగ్యం కారణంగా ఆఖరి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. వీళ్లిద్దరు గత మ్యాచ్ కూడా ఆడనప్పటికీ... ఇది భారత బౌలింగ్ దళంపై ఒత్తిడిని పెంచే అంశం. ఏదో ఒక మ్యాచ్‌లో నెట్టుకురావొచ్చు. కానీ ప్రతీ మ్యాచ్‌లోనూ కీలక ఆటగాళ్లు బరిలోకి దిగకపోతే ఏ జట్టుకైన అది ప్రతికూలాంశమే!

హెండ్రిక్స్ ఘోర వైఫల్యం

ప్రత్యర్థి దక్షిణాఫ్రికా సైతం టాపార్డర్ వైఫల్యంతో తడబడుతూనే ఉంది. ఓపెనర్లలో హెండ్రిక్స్ పేలవమైన ఆటతీరుతో టాపార్డర్‌కే కాదు మొత్తం జట్టుకే భారంగా పరిణమించాడు. ఒక మ్యాచ్‌లో 8, ఒకో మ్యాచ్‌లో డకౌట్. ఇక డికాక్ ఒక్క రెండో టి20 మినహా మిగతా రెండు మ్యాచ్‌ల్లోనూ 0, 1 సింగిల్ డిజిట్లే! ఇద్దరు ఓపెనర్లు ఘోరంగా ఆడుతుండటంతో దక్షిణాఫ్రికాకు శుభారంభం కాదు కదా కనీసం ఓ మోస్తరు భాగస్వామ్యమైనా దక్కడం లేదు. ఇది మొత్తం ఇన్నింగ్స్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. కెప్టెన్ మార్క్‌రమ్ సహా మిడిలార్డర్ బ్యాటర్లలో బ్రెవిస్, ఫెరీరా, మిల్లర్‌లతో జట్టు నెట్టుకొస్తుంది. కానీ నెగ్గాలంటే మాత్రం టాపార్డర్ కీలకం కదా! బౌలింగ్‌లో అనుభవజ్ఞులైన ఎన్‌గిడి, యాన్సెన్‌లతో పాటు ఒటెనిల్ బార్ట్‌మన్ నిలకడగా బౌలింగ్ చేస్తున్నారు. అయితే సిరీస్‌ను సమం చేయాల్సిన ఈ మ్యాచ్‌లో మాత్రం ఏ ఒకరిద్దరు బౌలర్లో, బ్యాటర్లో కాదు సమష్టిగా రాణిస్తేనే పటిష్టమైన భారత్‌ను నిలువరిస్తుంది. లేదంటే గత ఫలితాలే పునరావృతం కాకతప్పదు.

పిచ్, వాతావరణం

లక్నో స్పిన్ ఫ్రెండ్లీ వికెట్. తప్పకుండా బ్యాటింగ్ దిగిన జట్టుకు స్పిన్నర్ల నుంచి సవాళ్లు తప్పవు. అయితే మంచు ప్రభావం వల్ల రెండో ఇన్నింగ్స్ అంటే ఛేదించే జట్టుకే అనుకూలిస్తుంది. టాస్ గెలిచిన జట్టు ఛేజింగ్‌కే మొగ్గుచూపుతుంది.. చలి తప్ప వాన ముప్పు లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్, శుబ్‌మన్, తిలక్ వర్మ, జితేశ్ శర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్, కుల్దీప్, వరుణ్ చక్రవర్తి.
దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), డికాక్, రిజా హెండ్రిక్స్, బ్రెవిస్, మిల్లర్, ఫెరీరా, యాన్సెన్, బాష్, జార్జ్ లిండే/కేశవ్, ఎన్‌గిడి, బార్ట్‌మన్.

సర్ఫరాజ్ ఖాన్ ఎట్టకేలకు...

సర్ఫరాజ్ పృథ్వీ షా

ముంబై: దేశవాళీ క్రికెట్‌లో రన్ మెషీన్‌గా గుర్తింపు పొందినా కూడా భారత టెస్టు జట్టుకు కూడా దూరమైన సర్ఫరాజ్ ఖాన్ ఎట్టకేలకు మూడేళ్ల తర్వాత ఐపీఎల్‌లోకి వచ్చాడు. 2023 తర్వాత అతనికి లీగ్‌లో అవకాశం రాలేదు. ప్రస్తుతం జరుగుతున్న ముస్తాక్ అలీ ట్రోఫీలో సర్ఫరాజ్ 7 ఇన్నింగ్స్‌లలో కలిపి ఏకంగా 203.08 స్ట్రయిక్‌రేట్‌తో 329 పరుగులు చేశాడు. ఇందులో 1 సెంచరీ, 3 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ముందుగా రూ.75 లక్షల కనీస ధరకు అతడిని ఎవరూ తీసుకోకపోయినా... మళ్లీ పేరు వచ్చినప్పుడు ఇదే మొత్తానికి చెన్నై ఎంచుకుంది. సర్ఫరాజ్ మిత్రుడు పృథ్వీ షాను కూడా ఢిల్లీ తీసుకోవడం విశేషం.

'అన్‌సోల్డ్' ఆటగాళ్ల జాబితా...

ఐపీఎల్‌లో గతంలో ఆడిన లేదా అంతర్జాతీయ క్రికెట్‌లో గుర్తింపు ఉన్న పలువురు ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీలు ఆసక్తి చూపించలేదు. ఈ జాబితాలో ఉన్న ప్రముఖ విదేశీ క్రికెటర్లలో కాన్వే, జేక్ ఫ్రేజర్, అట్కిన్సన్, జేమీ స్మిత్, కొయెట్జీ, ముజీబుర్ రహమాన్, తీక్షణ, స్టీవ్ స్మిత్, డరైల్ మిచెల్, షై హోప్, టామ్ కరన్, అల్జారీ జోసెఫ్, నవీన్ ఉల్ హక్, గుర్బాజ్, ముల్డర్, బెయిర్‌స్టో, ఫజల్‌హఖ్ తదితరులు ఉన్నారు. భారత క్రికెటర్లలో ఉమేశ్ యాదవ్, దీపక్ హుడా, మయాంక్ అగర్వాల్, కరణ్ శర్మ, మనన్ వోహ్రాను ఎవరూ పట్టించుకోలేదు.

కుర్రాళ్లకు కోట్లాభిషేకం

- కార్తీక్ శర్మకు కళ్లు చెదిరే ధర
- ప్రశాంత్ వీర్‌పై కాసుల వర్షం
- ఇద్దరికీ చెరో రూ. 14.20 కోట్లు
- భారీ ధర పెట్టిన చెన్నై సూపర్ కింగ్స్



అబుదాబి: ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్టుగా గుర్తింపు పొందిన చెన్నై సూపర్ కింగ్స్... మినీ వేలంలో ప్రకంపనలు సృష్టించింది. సాధారణంగా అనుభవానికి పెద్దపీట వేసే సూపర్ కింగ్స్... ఈసారి మాత్రం భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టింది. అది కూడా మామూలుగా కాదు. ఐపీఎల్ చరిత్రలోనే ఎప్పుడూ లేనంతగా... అన్‌క్యాప్డ్ ఆటగాళ్ల కోసం చెన్నై ఫ్రాంచైజీ కోట్లు ఖర్చు పెట్టింది. ఒకప్పుడు 'డాడీస్ ఆర్మీ'గా ముద్రపడ్డ చెన్నై సూపర్ కింగ్స్... ఐపీఎల్ వేలంలో ప్రశాంత్ వీర్, కార్తీక్ శర్మను రూ. 14.20 కోట్ల చొప్పున వెచ్చించి కొనుగోలు చేసుకుంది. రంజీ ట్రోఫీ, ముస్తాక్ అలీ టోర్నీ, భారత్ 'ఎ', అండర్–19, అండర్–23 ఇలా ఏ స్థాయిలోనూ పెద్దగా ఆకట్టుకోకపోయినా... కేవలం నైపుణ్యాన్ని నమ్మి యువ ఆటగాళ్ల కోసం భారీగా వెచ్చించింది. ప్రతిభకు పెద్ద పీట వేసే చెన్నై జట్టు ఇంత భారీ ఖర్చు పెట్టడంతో... కార్తీక్ శర్మ, ప్రశాంత్ వీర్‌ల గురించి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా వీరిద్దరి నేపథ్యాలను పరిశీలిస్తే...

ధోనీకి ప్రత్యామ్నాయమా!
ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఆరంభం నుంచి... ఏవో కొన్ని మ్యాచ్‌లు తప్ప... దాదాపు అన్నీ సమయాల్లో మహేంద్ర సింగ్ ధోనినే చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) వికెట్ కీపర్‌గా దర్శనమిచ్చాడు. అయితే గత కొన్నాళ్లుగా బ్యాటింగ్ ఆర్డర్‌లో ఆఖర్లో వస్తున్న ధోని... ఇంకెంతో కాలం ఐపీఎల్‌లో కొనసాగే అవకాశాలు కనిపించడం లేదు. దీంతో వికెట్ల వెనక సమర్థవంతంగా విధులు నిర్వర్తించడంతో పాటు... లోయర్ ఆర్డర్‌లో ధాటిగా షాట్‌లు ఆడగల ప్లేయర్‌ను ఎంపిక చేసుకోవాలనే ఉద్దేశంతో చెన్నై ఫ్రాంచైజీ వేలంలో అడుగు పెట్టింది. అంతకుముందే టీమిండియా ప్లేయర్ సంజూ సామ్సన్‌ను ట్రేడింగ్‌లో తీసుకున్నా... భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని యువకులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో రాజస్తాన్‌కు చెందిన 19 ఏళ్ల కార్తీక్ శర్మ కోసం కోట్లు కుమ్మరించింది.

జడేజా స్థానాన్ని భర్తీ చేసేందుకు...
ఐపీఎల్ వేలానికి ముందే ట్రేడింగ్‌లో రవీంద్ర జడేజాను వదిలేసుకున్న చెన్నై జట్టు అతడి స్థానాన్ని భర్తీ చేసేందుకు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన 20 ఏళ్ల ప్రశాంత్ వీర్‌ను ఎంపిక చేసుకుంది. ఎడంచేతి వాటం స్పిన్నర్ అయిన ప్రశాంత్... లోయర్ ఆర్డర్‌లో ధాటిగా ఆడగల సమర్థుడు. ఉత్తర ప్రదేశ్ లీగ్‌లో మంచి ప్రదర్శనలు కనబర్చిన ప్రశాంత్... ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 2 మ్యాచ్‌లాడి 2 వికెట్లు తీశాడు. ఇక టి20ల్లో 9 మ్యాచ్‌లాడి 160కి పైగా స్ట్రయిక్ రేట్‌తో 112 పరుగులు చేయడంతో పాటు 12 వికెట్లు పడగొట్టాడు. ప్రాథమిక ధర రూ. 30 లక్షలతో వేలంలో అడుగుపెట్టిన ప్రశాంత్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ రూ. 14.20 కోట్లు ఖర్చు చేసింది.

అభిజ్ఞాన్ అదరహో

- 125 బంతుల్లో 17 ఫోర్లు, 9 సిక్స్‌లతో 209 నాటౌట్
- యువ భారత్ ఘనవిజయం
- 315 పరుగులతో మలేసియా ఓటమి

దుబాయ్: అభిజ్ఞాన్ కుందు (125 బంతుల్లో 209 నాటౌట్; 17 ఫోర్లు, 9 సిక్స్‌లు) అజేయ డబుల్ సెంచరీతో చెలరేగాడు. దాంతో అండర్–19 ఆసియా కప్ వన్డే టోర్నీలో భారత జట్టు 'హ్యాట్రిక్' విజయం నమోదు చేసుకుంది. గ్రూప్ 'ఎ'లో భాగంగా మంగళవారం జరిగిన తమ ఆఖరి పోరులో భారత జట్టు 315 పరుగుల తేడాతో మలేసియాను చిత్తు చేసింది. పరుగుల తేడా పరంగా యువ భారత్‌కు ఇది రెండో అతిపెద్ద విజయం. 2022లో ఉగాండాపై యువ భారత జట్టు 326 పరుగుల తేడాతో నెగ్గింది. మొదట బ్యాటింగ్ చేసిన యువ భారత్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అభిజ్ఞాన్ యూత్ వన్డేల్లో భారత్ తరఫున తొలి డబుల్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా నిలిచాడు. అయితే మలేసియా జట్టుకు ఐసీసీ యూత్ వన్డే హోదా లేకపోవడంతో అభిజ్ఞాన్ మెరుపులు రికార్డుల్లోకి ఎక్కలేదు. 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ (26 బంతుల్లో 50; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) మరో హాఫ్‌సెంచరీతో చెలరేగగా... వేదాంత్ త్రివేది (90; 7 ఫోర్లు) రాణించాడు. మలేసియా బౌలర్లలో మొహమ్మద్ అక్రమ్ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఛేదనలో మలేసియా అండర్–19 జట్టు 32.1 ఓవర్లలో 93 పరుగులకు ఆలౌటైంది. హమ్జా పంగి (35; 4 ఫోర్లు) టాప్ స్కోరర్. యువ భారత బౌలర్లలో దీపేశ్ దేవేంద్రన్ 5 వికెట్లతో ఆకట్టుకున్నాడు. గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత జట్టు శుక్రవారం తొలి సెమీఫైనల్ ఆడనుంది.

ఆంధ్ర గెలిచినా...

ఫైనల్ చాన్స్ మిస్ • ముస్తాక్ అలీ టి20 టోర్నీ

పుణే: దేశవాళీ టి20 టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని ఆంధ్ర జట్టు 'సూపర్ లీగ్' దశతోనే ముగించింది. గ్రూప్ 'బి'లో భాగంగా... మంగళవారం జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు విజయం సాధించినా... రన్‌రేట్‌లో వెనుకబడ్డ కారణంగా ఫైనల్ చేరే అవకాశం కోల్పోయింది. 'సూపర్ లీగ్'లో మూడు మ్యాచ్‌లు ఆడిన ఆంధ్ర జట్టు 2 విజయాలు, ఒక పరాజయంతో 8 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. జార్ఖండ్ కూడా ఎనిమిది పాయింట్లతోనే ఉన్నా... రన్‌రేట్‌లో మెరుగ్గా ఉన్న జార్ఖండ్ ముందంజ వేయగా... ఆంధ్ర జట్టు ఇంటిబాట పట్టింది. టీమిండియా ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (22 బంతుల్లో 45; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు; 2/32) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకోవడంతో చివరి లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 9 పరుగుల తేడాతో జార్ఖండ్‌పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నితీశ్ రెడ్డి టాప్ స్కోరర్ కాగా... శ్రీకర్ భరత్ (35; 4 ఫోర్లు, 1 సిక్స్), అశ్విన్ హెబ్బర్ (30; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం జార్ఖండ్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. విరాట్ సింగ్ (40 బంతుల్లో 77; 4 ఫోర్లు, 7 సిక్స్‌లు) హాఫ్‌సెంచరీ సాధించగా... కెప్టెన్ ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 35; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడాడు. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లు నెగ్గిన జార్ఖండ్ (+0.221)... ఆంధ్ర (–0.113) చేతిలో కేవలం 9 పరుగుల తేడాతో మాత్రమే ఓడటంతో మెరుగైన రన్‌రేట్‌తో తుదిపోరుకు అర్హత సాధించింది.

హైదరాబాద్ చేజేతులా...

- హరియాణా చేతిలో 124 పరుగుల తేడాతో పరాజయం
- తుది పోరుకు చేరని వైనం

పుణే: ముస్తాక్ అలీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు ఫైనల్ చేరే చక్కటి అవకాశాన్ని కోల్పోయింది. గత రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన హైదరాబాద్... మంగళవారం గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగిన చివరి పోరులో 124 పరుగుల తేడాతో హరియాణా చేతిలో ఓడింది. దీంతో రన్‌రేట్‌లో వెనుకబడి 'సూపర్ లీగ్' దశతోనే సరిపెట్టుకుంది. రెగ్యులర్ కెప్టెన్ సీవీ మిలింద్ గాయం కారణంగా ఈ మ్యాచ్‌కు దూరంకాగా... తనయ్ త్యాగరాజన్ ఈ మ్యాచ్‌లో నాయకత్వం వహించాడు. టాస్ గెలిచిన తనయ్ ఫీల్డింగ్ ఎంచుకోవాలని నిర్ణయం తీసుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన హరియాణా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 246 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సమంత్ జాఖర్ (22 బంతుల్లో 60; 1 ఫోర్, 8 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగగా... కెప్టెన్ అంకిత్ కుమార్ (27 బంతుల్లో 57; 1 ఫోర్, 6 సిక్స్‌లు), పార్థ్ వత్స్ (19 బంతుల్లో 45; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) దంచికొట్టారు. హైదరాబాద్ బౌలర్లలో స్టార్ పేసర్ మొహమ్మద్ సిరాజ్ 37 పరుగులిచ్చి 1 వికెట్ పడగొట్టగా... మిగిలిన బౌలర్లంతా భారీగా పరుగులు సమర్పించుకున్నారు. అనంతరం లక్ష్యఛేదనలో హైదరాబాద్ 16.1 ఓవర్లలో 122 పరుగులకే ఆలౌటైంది. రాహుల్ బుద్ధి (37; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. తన్మయ్ అగర్వాల్ (3), అమన్ రావు (13), మికిల్ జైస్వాల్ (7), కెప్టెన్ తనయ్ త్యాగరాజన్ (16), అర్ఫాజ్ అహ్మద్ (6) ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు చేరారు. హరియాణా బౌలర్లలో అమిత్ రాణా 3 వికెట్లు పడగొట్టాడు. 'సూపర్ లీగ్' దశలో మూడు మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ 2 విజయాలు, ఒక ఓటమితో 8 పాయింట్లు సాధించి గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. హైదరాబాద్ రన్‌రేట్ (–0.413) కంటే మెరుగ్గా ఉన్న హరియాణా (+2.325) ఫైనల్‌కు అర్హత సాధించింది. ఇతర మ్యాచ్‌ల్లో పంజాబ్ 2 వికెట్ల తేడాతో మధ్యప్రదేశ్‌పై, ముంబై 3 వికెట్ల తేడాతో రాజస్తాన్‌పై గెలిచాయి. రెండు గ్రూప్‌ల్లో 'టాప్'లో నిలిచిన హరియాణా, జార్ఖండ్ మధ్య గురువారం ఫైనల్ జరగనుంది. ముస్తాక్ అలీ టోర్నీలో ఈ రెండు జట్లు తొలిసారి తుది పోరుకు చేరుకోవడంతో కొత్త చాంపియన్‌గా అవతరించడం ఖాయమైంది.

ఇటలీలోని సౌత్ టైరోల్‌కు చెందిన అల్టిమో వ్యాలీ నుండి తీసుకొచ్చిన 27 మీటర్ల ఎత్తున్న ఫిర్ చెట్టును సోమవారం వాటికన్‌లోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో క్రిస్మస్ చెట్టుగా విద్యుద్దీపాలతో అలంకరించారు.

రష్యాలోని మాస్కోలో 'ఎగ్జిబిషన్ ఆఫ్ అచీవ్‌మెంట్స్ ఆఫ్ నేషనల్ ఎకానమీ' వద్ద మంగళవారం నూతన సంవత్సరం, క్రిస్మస్ వేడుకల కోసం అలంకరించిన వీధిలో సందర్శకుల సందడి

జస్టిస్ వర్మ అప్పీలు విచారణకు సుప్రీంకోర్టు నిర్ణయం

న్యూఢిల్లీ: నివాసంలో నోట్ల కట్టలు దొరికిన ఉదంతానికి సంబంధించి అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ కేసు మరో మలుపు తిరిగింది. ఆయనను పదవి నుంచి తొలగించాలంటూ పలువురు ఎంపీలు నోటీసులివ్వడం, ఆయన పై అవినీతి ఆరోపణల విచారణకు కమిటీ ఏర్పాటు చేస్తూ లోక్ సభ స్పీకర్ నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. దాని న్యాయబద్ధతను సవాలు చేస్తూ జస్టిస్ వర్మ దాఖలు చేసిన పిటిషన్ ను విచారణకు స్వీకరించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. న్యాయమూర్తులు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీ ధర్మాసనం మంగళవారం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి లోక్ సభ స్పీకర్ తో పాటు పార్లమెంటు ఉభయ సభల సెక్రటరీ జనరళ్లకు నోటీసులిచ్చింది. జస్టిస్ వర్మ పిటిషన్ పై వారి స్పందన కోరింది. స్పీకర్ ఇచ్చిన నోటీసులను చెక్కుబాటు కానివిగా ప్రకటించాలని కోర్టును వర్మ కోరారు. జనవరి 7న దీనిపై తదుపరి విచారణ జరగనుంది. ఢిల్లీలోని జస్టిస్ వర్మ అధికారిక నివాసంలో గత మార్చి 14న అగ్నిప్రమాదం జరగడం, ఆ సందర్భంగా ఇంట్లో గుట్టలుగా నోట్ల కట్టలు బయట పడటం తెలిసిందే. అనంతర పరిణామాల్లో ఆయన్ను ఢిల్లీ నుంచి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది.

'బాండీ' ఉగ్రవాదులు ఐసిస్ సానుభూతిపరులు

ధృవీకరించిన ఆస్ట్రేలియా పోలీసులు

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలోని సిడ్నీ తీరంలోని బాండీ బీచ్‌లో వేడుకల్లో మునిగిపోయిన యూదులపై దాడికి తెగబడిన తండ్రీకొడుకులు ఇస్లామిక్‌స్టేట్(ఐసిస్) ఉగ్రసంస్థకు సానుభూతిపరులని ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీస్ విభాగం మంగళవారం ధృవీకరించింది. అత్యాధునిక రైఫిళ్లతో బుల్లెట్ల వర్షం కురిపించి 15 మందిని చంపేసిన దారుణోదంతంలో 50 ఏళ్ల సాజిద్ అక్రమ్ ఎదురుకాల్పుల్లో హతమవగా, అతని కుమారుడు నవీద్‌కు బుల్లెట్ తగలడంతో ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్సనందిస్తూ పోలీసులు ప్రశ్నిస్తున్న విషయం విదితమే. ఘటన జరిగిన రోజే ఉగ్రవాదులకు చెందిన వాహనంలో ఐసిస్ ఉగ్రసంస్థ తాలూకు జెండాలను పోలీసులు గుర్తించగా ఐసిస్‌తో సత్సంబంధాలను ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీస్ కమిషనర్ క్రిసీ బారెట్ మంగళవారం ధృవీకరించారు. ''నిందితులు గత నెలలో ఫిలిప్పీన్స్‌కు వెళ్లొచ్చారు. దవావో సిటీలో నవంబర్ ఒకటో తేదీ నుంచి 28వ తేదీ వరకు వీరు ఎవరిని కలిశారు? ఫిలిప్పీన్స్‌కు ఎందుకు వెళ్లారు? అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. ఎక్కువ మంది చంపాలనే లక్ష్యంతోనే దాడి చేశారని అర్థమవుతోందని క్రిసీ బారెట్ విశ్లేషించారు. దక్షిణ ఫిలిప్పీన్స్‌లోని అబూ సయాఫ్ ఉగ్రవాది సహా పలువురు ఉగ్రవాదుల సారథ్యంలోని ముస్లిం వేర్పాటువాద సంస్థలు గతంలో ఐసిస్‌కు తమ మద్దతు ప్రకటించారు. ఆసియా, పశ్చిమాసియా, యూరప్‌ల నుంచి వచ్చే ఉగ్రవాదులకు గతంలో ఆశ్రయం కల్పించారు. మరోవైపు బాండీ బీచ్‌లో ప్రాణభయంతో కొందరు ఈతరాకున్నా సముద్రంలోకి పరుగెత్తగా వారిని కాపాడిన లైఫ్‌గార్డులను పొగుడుతూ కొందరు నెటిజన్లు పోస్ట్‌లు పెట్టారు. దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలోని జాక్సన్ డోలన్ అనే లైఫ్‌గార్డ్ కాల్పుల శబ్దాలు విని వెంటనే ప్రాథమిక చికిత్స కిట్ పట్టుకుని చెప్పుల్లేకుండా ఏకబిగిన రోడ్డుపై పరుగెత్తుకొచ్చి క్షతగాత్రులకు సాయపడిన ఉదంతం సైతం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో తెగ పోస్ట్ అవుతోంది. గాయపడిన వారిలో ఇప్పటికీ 25 మంది పలు ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్నారు. వారిలో 10 మంది ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. ముగ్గురు చిన్నారులు సైతం పిల్లల ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. గాయపడిన వారిలో ముగ్గురు భారతీయ విద్యార్థులు సైతం ఉన్నారు. ముగ్గురిలో ఇద్దరు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు.

'లవ్' లీవ్ కావాలి!

నిజాయితీగా ఉద్యోగి ఈమెయిల్ | **'నో' చెప్పే ధైర్యం లేదన్న బాస్**

అది చలికాలం మధ్యాహ్నం.. ఢిల్లీలోని ఒక కార్పొరేట్ కార్యాలయం.. అందరూ మధ్యాహ్న భోజనం తర్వాత పనిలోకి జారుకుంటున్న వేళ.. ఓ కుర్ర ఉద్యోగికి మాత్రం మనసు మనసులో లేదు. ఎందుకంటే.. డిసెంబర్ 17న అతని గర్ల్‌ఫ్రెండ్ స్వరాష్ట్రం ఉత్తరాఖండ్‌కు వెళ్తోంది. మళ్లీ వచ్చేది జనవరి మొదటి వారం లోనే.. ఈ సుదీర్ఘ వియోగానికి ముందు ఆమెతో ఒక రోజు మొత్తం గడపాలి.. కానీ ఎలా?.. ఎలా?

మేనేజర్‌కి ఏం చెప్పాలబ్బా..!

సమస్య అల్లా మేనేజర్ వీరెన్ ఖుల్లర్.. సెలవు అడిగితే రొటీన్ సాకు చెప్పాలా? 'మామయ్యకి సుస్తీ', 'ట్రైన్‌లో టిక్కెట్ కన్ఫర్మ్ కాలేదు'.. లాంటి పాత ట్రిక్స్ వాడాలా? ఇవేవీ వద్దనుకున్నాడు మన లవర్‌బాయ్.. ఎందుకంటే, నిజాయితీనే అతిపెద్ద ఆయుధమని అతనికి తెలుసు.

ఈమెయిల్ బాంబు..

మొత్తానికి అబ్బాయి.. ధైర్యం చేశాడు. కీబోర్డుపై వేళ్లు ఆనించి ఒక పారదర్శకమైన ఈమెయిల్‌ను టైప్ చేసేశాడు. అందులో ఎలాంటి అతిశయోక్తులు.. అలంకారాలు లేనేలేవు. సూటిగా చెప్పేశాడు.. 'డిసెంబర్ 16న వ్యక్తిగత కారణాల వల్ల సెలవు కావాలి, ఎందుకంటే నా గర్ల్‌ఫ్రెండ్ తన సొంతూరు ఉత్తరాఖండ్‌కు డిసెంబర్ 17న వెళ్తోంది. జనవరి మొదటి వారం వరకు తిరిగి రాదు. అందుకే ఆమె వెళ్లే ముందు ఆ ఒక్కరోజు తనతో గడపాలని కోరుకుంటున్నాను..'ఇదీ సెలవు దరఖాస్తు సారాంశం. ఆ మెయిల్ 'సెండ్' బటన్ నొక్కిన క్షణం.. ఆఫీసులో కాదు, కుర్రాడి గుండెల్లో ప్రకంపనలు మొదలయ్యాయి.

వీడు మామూలోడు కాదు

మేనేజర్ వీరెన్ ఖుల్లర్ మధ్యాహ్న భోజనం తర్వాత ఈమెయిల్స్ పరిశీలిస్తుండగా, ఆ అసాధారణమైన 'లవ్ రిక్వెస్ట్' కంట పడింది. ఖుల్లర్ ముఖంలో చిరునవ్వు, ఆశ్చర్యం కలగలిసిన భావం. 'ఓహో! పాత రోజుల్లో అయితే వీడు ఉదయం 9.15 గంటలకే 'ఫీవర్' అని మెసేజ్ పెట్టేవాడు. కానీ ఇప్పుడు చూడండి, ఎంత ధైర్యం!' అనుకున్నారు. నిజానికి, గతంలో ఇలాంటి రిక్వెస్ట్‌లు రాత్రికి రాత్రి 'జబ్బు'గా మారి, మర్నాడు ఉదయం అపాయింట్‌మెంట్ అడిగేవి. కానీ కుర్రాడి నిజాయితీ, పారదర్శకత బాస్‌కి తెగ నచ్చేశాయి.

పండగ చేస్కోరా బుడ్డోడా..

అప్పుడే మేనేజర్ ఖుల్లర్ ఒక నిర్ణయానికి వచ్చేశాడు. ఈ క్షణికావేశంలో, తాను ఒక డైరెక్టర్ కాదు, కేవలం ఒక మనిషి మాత్రమే అని గుర్తు చేసుకున్నాడు. మనిషి జీవితంలో ప్రేమకు ఉన్న ప్రాధాన్యాన్ని ఆయన గౌరవించాడు. సెలవు మంజూరు చేస్తూ.. ఆ మహా ప్రేమ లేఖ స్క్రీన్‌షాట్‌ను లింక్డ్‌ఇన్‌లో పోస్ట్ చేశాడు. దానికి ఆయన జత చేసిన వ్యాఖ్యే ఈ కథకు 'పంచ్' పాయింట్.. 'ప్రేమకు 'నో' చెప్పే ధైర్యం మనకు ఎక్కడిది? సెలవును ఆమోదించాను! నువ్వు హ్యాపీగా వెళ్లు తమ్ముడూ!'..

ప్రేమకు జై..

ఈ పోస్ట్ తక్షణం వైరల్ అయింది. నెటిజన్లు కుర్రాడి ధైర్యాన్ని, ఖుల్లర్ ఔదార్యాన్ని చూసి మనసారా మెచ్చుకున్నారు. 'అసలైన వర్క్-లైఫ్ బ్యాలెన్స్ అంటే ఇదే!', 'ఆ మేనేజర్‌కి సలామ్', 'సెలవు దొరకడమే కష్టం అనుకుంటే, ప్రేమ పేరుతో దొరకడం అంటే లక్'.. అంటూ ప్రశంసించారు. ఆఫీసు అంటే కేవలం కట్టుబాట్లు, కఠిన నియమాలు కాకుండా, నమ్మకం, మానవత్వం కూడా ఉంటాయని ఈ చిన్న సంఘటన నిరూపించింది. ప్రేమోద్యోగి కథ సుఖాంతమైంది. అతను తన ప్రేయసితో హ్యాపీగా గడిపేందుకు టిక్కెట్ సంపాదించాడు. బేబీ ప్రేమ విషయంలో, బాసు కూడా ఓడిపోక తప్పలేదు!

- సాక్షి, నేషనల్ డెస్క్

ఆగిపోయిన కేబుల్ కారు.. శాన్‌ఫ్రాన్సిస్కోలో 15 మందికి గాయాలు

శాన్‌ఫ్రాన్సిస్కో: నగరంలో ప్రధాన పర్యాటక ఆకర్షణగా ఉన్న కేబుల్ కారు అకస్మాత్తుగా ఆగిపోవడంతో 15 మంది గాయపడ్డారు. తీవ్ర గాయాలపాలైన ప్రయాణికులను స్థానిక ఆస్పత్రులకు తరలించారు. నోబ్‌హిల్‌లోని లీవెన్‌వర్త్-హైడ్ వీధుల మధ్య కేబుల్ కారు సోమవారం అకస్మాత్తుగా ఆగిపోయింది. ఈ సమయంలో వాహనంలో 15 మంది ఉన్నారు. కారు ఆగిపోవడంతో కుదుపుల వల్ల ప్రయాణికులు గాయపడ్డారు. శాన్‌ఫ్రాన్సిస్కో మున్సిపల్ ట్రాన్స్‌పోర్టేషన్ ఏజెన్సీ (ఎస్‌ఎఫ్ఎమ్‌టీఏ) ఘటనపై దర్యాప్తు ప్రారంభించింది. కారు విండ్‌షీల్డ్ పగిలి ఉంది. ఎరవైనా బలమైన వస్తువును కారుపై విసిరేసి ఉండవచ్చని, దీంతో డ్రైవర్ హఠాత్తుగా కారును ఆపేసి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఈ కేబుల్ కార్లను 1870లో ప్రారంభించారు. ప్రస్తుతం నగరంలో మూడు కేబుల్ కారు లైన్లున్నాయి. ప్రయాణికుల భద్రత తమ ప్రాధాన్యతని, ప్రమాదానికి గల కారణాలను సమీక్షిస్తామని ఎస్‌ఎఫ్ఎమ్‌టీఏ ఒక ప్రకటనలో తెలిపింది.

మధ్యప్రదేశ్‌లో ఆరుగురు పిల్లలకు హెచ్ఐవి

ప్రభుత్వాసుపత్రిలో కలుషిత రక్తమార్పిడి కారణమని అనుమానం

సత్నా/భోపాల్: మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లా ప్రభుత్వాసుపత్రిలో దారుణం జరిగింది. తలసేమియాతో బాధపడుతున్న ఆరుగురు పిల్లలకు సత్నా జిల్లా కేంద్ర ఆసుపత్రిలో కలుషిత రక్త మార్పిడి కారణంగా హెచ్ఐవీ పాజిటివ్ వచ్చింది. నాలుగు నెలల కిందట జరిగిన దారుణం అధికారులు ప్రకటించడంతో మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధిత పిల్లల వయసు 12 నుంచి 15 సంవత్సరాలు ఉంటుంది. ఆరుగురు పిల్లలకు హెచ్ఐవీ అని తేలిన తరువాత వారి కుటుంబ సభ్యులను కూడా పరీక్షించారు. వారికి నెగెటివ్ వచ్చింది. 'రక్త మార్పిడి కేవలం ప్రభుత్వాసుపత్రిలోనే జరిగిందా?, ఇతర ఆస్పత్రుల్లోనూ చేశారా?'అనే విషయంపై నివేదిక కోరినట్లు రాష్ట్ర ఆరోగ్య మంత్రి రాజేంద్ర శుక్లా తెలిపారు. కలుషితమైన సూదులు లేదా కలుషిత రక్త మార్పిడి ఇందుకు కారణమై ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. దీనిపై దర్యాప్తు జరుపుతున్నామని వెల్లడించారు.

విమానాలకు పొగమంచు దెబ్బ

ఢిల్లీ విమానాశ్రయంలో 131 విమానాలు రద్దు

ముంబై: ఢిల్లీ విమానాశ్రయంలో మంగళవారం తక్కువ దృశ్యమానత కారణంగా విమానాల కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీని ఫలితంగా మొత్తం 131 విమానాలను రద్దు చేసినట్లు ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ అధికారి తెలిపారు. రద్దయిన 131 విమానాలలో 52 బయలుదేరే విమానాలు కాగా, 79 వచ్చే విమానాలు ఉన్నాయి. ఉత్తర భారతదేశంలో, ఎయిర్ ఇండియా ప్రధాన కేంద్రమైన ఢిల్లీలో, దట్టమైన పొగమంచు కారణంగా తక్కువ దృశ్యమానత నెలకొంది. దీని ప్రభావం మొత్తం నెట్‌వర్క్‌లోని విమాన షెడ్యూల్‌పై పడింది. ఈ సంవత్సరం శీతాకాలం కోసం, ఏవియేషన్ రెగ్యులేటర్ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) డిసెంబర్ 10 నుండి.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 10 వరకు అధికారిక పొగమంచు విండోగా ప్రకటించింది. ఈ అంతరాయాల కారణంగా, ఎయిర్‌లైన్ ఇండిగో తన నెట్‌వర్క్‌లో ఏకంగా 113 విమానాలను రద్దు చేసింది. అంతేకాకుండా, ఢిల్లీ వాతావరణం కారణంగా బుధవారం కూడా 42 విమానాలను నడపబోమని ఇండిగో ప్రకటించింది.

నేషనల్ వార్ మెమోరియల్ వద్ద నివాళులర్పిస్తున్న రాజ్‌నాథ్ సింగ్

నివాళులర్పిస్తున్న చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, త్రివిధ దళాల అధిపతులు

ఘనంగా విజయ్ దివస్

- సాయుధ శక్తికి వందనం: రాజ్‌నాథ్ సింగ్
- నివాళులర్పించిన రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ: 1971 యుద్ధంలో మన సాయుధ దళాలు అద్భుత పటిమ కనబరిచి పాకిస్తాన్ పీచం అణచాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తుతించారు. ఆ విజయానికి గుర్తుగా ఏటా డిసెంబర్ 16న విజయ్ దివస్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. నాటి అమర సైనిక వీరులకు దేశమంతా తలవంచి సగర్వంగా నమస్కరిస్తోందని మంత్రి అన్నారు. ఈ సందర్భం జాతీయ యుద్ధ స్మారకం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాధిపతులు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కీ స్మారకం వద్ద నివాళులు అర్పించారు. సైనిక వీరుల నాటి సాహసం, వారు చూపిన అసమాన దేశ భక్తి ప్రతి పౌరున్నీ ఉత్తేజపరుస్తూనే ఉంటాయని ఆమె కొనియాడారు. సందర్భంగా రాష్ట్రపతి భవన్ లో 'పరమ్ వీర్ దీర్ఘ'ను ఆమె ప్రారంభించారు. సైన్యంలో అత్యున్నత పురస్కారమైన పరమ్ వీర్ చక్రను ఇప్పటిదాకా అందుకున్న 21 మంది సైనిక వీరుల చిత్రాల అందులో ప్రదర్శనకు ఉంచారు.

గౌతమ్ నవ్‌లఖాను ఢిల్లీకి మార్చొచ్చు

ఎల్గార్ పరిషత్ కేసులో బాంబే హైకోర్టు తీర్పు

తదుపరి విచారణ నేటికి వాయిదా

ముంబై: మానవ హక్కుల కార్యకర్త, జర్నలిస్టు, ఎల్గార్ పరిషత్ కేసులో నిందితుడైన గౌతమ్ నవ్‌లఖాను ముంబై నుంచి ఢిల్లీకి మార్చవచ్చని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. నవ్‌లఖా ముంబై నుంచి తప్పించుకోవడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయలేదని, కేసు విచారణ ప్రారంభమయ్యే వరకు ఆయన ఢిల్లీలో ఉండటం వల్ల ఎలాంటి హానీ జరగదని తెలిపింది. ముంబైలోనే ఉంచడం వల్ల తన జీవితం, సోషల్ సర్కిల్‌కు పూర్తిగా దూరమయ్యానని ఆయన భావిస్తున్నారని పేర్కొంది. ఈ కేసులో 2023లోనే బెయిల్ మంజూరు చేసిన బాంబే హైకోర్టు.. ముందస్తు అనుమతి లేకుండా ముంబై వదిలి వెళ్లకూడదనే షరతును విధించింది. అయితే తన స్వస్థలమైన ఢిల్లీలో ఉండటానికి ఆయన చేసిన అభ్యర్థనను ఎన్ఐఏ కోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ భారతి డాంగ్రే, శ్యామ్ చందక్‌లతో కూడిన ధర్మాసనం కేసును విచారించింది. '73 ఏళ్ల నవ్‌లఖా ఢిల్లీకి చెందినవారు. ఆయనకు అక్కడ ఇల్లు ఉంది. ముంబైలో ఉండే స్తోమత అతనికి లేదు. ఇలాగే కొనసాగితే చివరకు దివాళా తీయాల్సి వస్తుంది' అని నవ్‌లఖా తరపు న్యాయవాది యుగ్ చౌదరి ధర్మాసనానికి తెలిపారు. ట్రయల్ కోర్టు లేదా ప్రాసిక్యూషన్ కోరినప్పుడల్లా ఆయన ఢిల్లీలోని ఎన్ఐఏ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవుతారని న్యాయవాది పేర్కొన్నారు. అయితే.. ఢిల్లీ నుంచి విచారణకు హాజరు కావడానికి అనుమతించబోమని, కానీ విచారణ ప్రారంభమయ్యే వరకు ఢిల్లీకి మార్చడానికి అనుమతిస్తున్నామని ధర్మాసనం తెలిపింది. నవ్‌లఖాపై షరతులను ప్రాసిక్యూషన్ ఏజెన్సీ ఎన్ఐఏ పేర్కొంటుందన్న ధర్మాసనం.. తదుపరి విచారణను ఈ రోజుకు వాయిదా వేసింది.

ఇరాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

బస్సు బోల్తా, 13 మంది మృతి

టెహ్రాన్: మధ్య ఇరాన్‌లో ఒక ప్రయాణికుల బస్సు బోల్తా పడిన ఘటనలో 13 మంది మరణించారు, పది మందికి పైగా గాయపడ్డారు. ఈ విషయాన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఐఆర్ఎన్ఏ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. సోమవారం ఆలస్యంగా ఇస్ఫాహాన్ నుండి ఈశాన్య నగరమైన మషాద్‌కు బస్సు ప్రయాణిస్తున్నప్పుడు ఈ ప్రమాదం జరిగింది. బస్సు హైవే మధ్యలో ఉన్న సెంట్రల్ గార్డ్ రైల్‌ను ఢీకొని, ఎదురు లేన్‌లోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత ఒక టాక్సీని ఢీకొని బోల్తా పడినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో బస్సులోని 11 మంది ప్రయాణికులు, టాక్సీలో ఉన్న ఇద్దరు వ్యక్తులు.. మొత్తం 13 మంది మరణించారు.

పాక్‌లో బస్సుపై సాయుధుల దాడి

బందీలుగా 18 మంది • 10 మందిని రక్షించిన భద్రతా బలగాలు

కరాచీ: పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో, క్వెట్టాకు వెళ్తున్న ఒక బస్సులోని 18 మంది ప్రయాణికులను గుర్తు తెలియని సాయుధులు అపహరించారు. సోమవారం రాత్రి గోట్కి ప్రాంతం సమీపంలో, సింధ్-పంజాబ్ సరిహద్దు వద్ద హైవే లింక్ రోడ్డుపై జరిగిన ఈ సంఘటన వివరాలివి. ముసుగులు ధరించిన దాదాపు 18 నుంచి 20 మంది దుండగులు బస్సుపై కాల్పులు జరిపి, 18 మంది పురుష ప్రయాణికులను బందీలుగా పట్టుకున్నారు. కాల్పుల్లో డ్రైవర్‌తో పాటు కొందరు ప్రయాణికులు గాయపడ్డారు. ఒక మహిళా ప్రయాణికురాలు తెలిపిన వివరాల ప్రకారం, దుండగులు 25 మంది ప్రయాణికులను బస్సు దిగాలని ఆదేశించారు, అయితే మహిళా ప్రయాణికులకు ఎలాంటి హాని చేయలేదు. బస్సులో డ్రైవర్, క్లీనర్‌తో పాటు మొత్తం 30 మంది ప్రయాణికులు ఉన్నారని సింధ్ హోం మంత్రి ప్రతినిధి తెలిపారు. కాగా, సుక్కుర్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు పోలీసులు, రేంజర్లు రాత్రిపూట ఆపరేషన్ నిర్వహించారు. సోమయాని ప్రాంతంలో బందిపోట్లతో జరిగిన ఎదురు కాల్పుల తర్వాత, అపహరణకు గురైన 10 మంది ప్రయాణికులను భద్రతా బలగాలు మంగళవారం రక్షించగలిగాయి. మిగిలిన ప్రయాణికులను రక్షించడానికి పోరాటం కొనసాగుతోందని సుక్కుర్ డీఐజీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

మెస్సీ మంటలు.. మంత్రి రాజీనామా

ఆమోదించిన సీఎం మమత

కోల్‌కతా: అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ ఈవెంట్ వైఫల్యం.. పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించింది. సాల్ట్ లేక్ స్టేడియం వద్ద జరిగిన విధ్వంసానికి నైతిక బాధ్యత వహిస్తూ క్రీడా మంత్రి అరూప్ బిస్వాస్ రాజీనామా చేయగా, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆ రాజీనామాను తక్షణమే ఆమోదించారు. దీంతోపాటు పాలనాపరమైన వైఫల్యాలకు కారణమంటూ డీజీపీ సహా పలువురు సీనియర్ అధికారులపై కఠిన చర్యలు తీసుకున్నారు.

డీజీపీకి, పోలీసు కమిషనర్‌కు నోటీసులు

మంత్రి నిర్ణయాన్ని ప్రశంసిస్తూనే, విచారణ పూర్తయ్యే వరకు క్రీడా శాఖను తానే పర్యవేక్షిస్తానని ప్రకటించారు. బిస్వాస్ క్రీడా శాఖ బాధ్యతల నుంచి వైదొలిగినా, విద్యుత్ శాఖ మంత్రిగా మాత్రం కేబినెట్‌లో కొనసాగుతారు. మంత్రి రాజీనామా ఆమోదం తర్వాతే, ప్రభుత్వం అత్యంత వేగంగా పాలనా చర్యలను ప్రారంభించింది. డీజీపీ రాజీవ్ కుమార్ సహా, బిధానగర్ పోలీస్ కమిషనర్‌కు 24 గంటల గడువుతో షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. బిధానగర్ డిప్యూటీ కమిషనర్ అనీష్ సర్కార్ సస్పెండయ్యారు. స్టేడియం సీఈవోను తొలగించారు.

'కౌరు'ణ్యం లేని అమెరికా..!

- అందరి అమ్మమ్మ బబ్లీ కౌర్ అరెస్టు
- 30 ఏళ్లుగా అమెరికాలో నివాసం
- గ్రీన్‌కార్డు అందేలోగా కల భగ్నం

బబ్లీ కౌర్

మూడు దశాబ్దాలుగా.. బబ్లీ కౌర్ (60) గుండెల్లో అమెరికన్ డ్రీమ్ పదిలంగా ఉంది. 1994లో భర్త, పిల్లలతో కలిసి అమెరికాకు వలస వచ్చింది. ఇన్నాళ్లూ లాంగ్ బీచ్‌లో ఇండియన్ రెస్టారెంట్ నడిపింది. ఆ ప్రాంత ప్రజలకు అత్యంత ఆత్మీయురాలైపోయింది. అమెరికన్ పౌరులైన ఆమె పిల్లలు, గ్రీన్ కార్డ్ ఉన్న భర్త ఇచ్చిన పిటిషన్‌లు ఆమోదం పొందాయి. ఇక మిగిలింది ఒక్క అడుగు.. గ్రీన్ కార్డ్ ఇంటర్వ్యూ. డిసెంబర్ 1వ తేదీ.. ఐసీఈ కార్యాలయం ముందు బబ్లీ కౌర్ నిల్చుంది. చివరి ఫార్మాలిటీ అయిన బయోమెట్రిక్ స్కానింగ్ కోసం సిద్ధమవుతోంది. ఆ క్షణం, తన 30 ఏళ్ల కష్టం ఫలించబోతోందని ఆమె ఆశించింది. కానీ విధి వేరేలా నిర్ణయించింది.

అమాంతం.. అరెస్ట్ నాటకం

ఇంటర్వ్యూ గదిలోకి పిలవగానే, లోపల సిద్ధంగా ఉన్న ఫెడరల్ ఏజెంట్లు బబ్లీ కౌర్‌ను అదుపులోకి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. దీంతో ఆమె కుమార్తె జోటి షాక్‌కు గురైంది. ముప్పయ్యేళ్లుగా అమెరికా సమాజంలో భాగమైన 60 ఏళ్ల మహిళను.. కన్నబిడ్డలు, భర్త ఉన్నచోట, చట్టపరమైన ప్రక్రియల చివరి దశలో.. ఒక్క ఫోన్ కాల్ మాత్రమే అనుమతించి మరీ అరెస్టు చేయడం అందరినీ కలచివేసింది.

న్యాయం ఎక్కడుంది?

గ్రీన్ కార్డ్ ఆమోదం పొంది, స్థానిక కమ్యూనిటీకి సేవ చేసి, వృద్ధాప్యంలో ఉన్న ఒక మహిళకు అమెరికన్ వ్యవస్థ ఇచ్చిన బహుమతి.. ఈ అన్యాయపూరిత నిర్బంధం. కటకటాల వెనుక ఉన్న ఈ 'బబ్లీ' అమ్మమ్మ.. స్వేచ్ఛగా బయటికొచ్చి, తన అమెరికన్ కలను సాకారం చేసుకుంటుందా? లేదా పీడకలగా ముగిస్తుందా? దీనికి న్యాయస్థానమే సమాధానం చెప్పాలి.

చీకటి చెరకు తరలింపు

ఆ క్షణం, కుటుంబానికి బబ్లీ కౌర్ ఎక్కడికి వెళ్లిందో తెలియదు. చాలా గంటల తర్వాత తెలిసింది.. ఆమెను రాత్రికి రాత్రే అడెలాంటోకు తరలించారని. అది ఒకప్పుడు జైలు.. ఇప్పుడు ఐసీఈ నిర్బంధ కేంద్రం. ఆమెను విడుదల చేయాలని కాంగ్రెస్ సభ్యుడు రాబర్ట్ గార్సియా బహిరంగంగా పిలుపునిచ్చినా, బబ్లీ కౌర్ నిర్బంధంలోనే ఉన్నారు. అక్కడి పరిస్థితులు అత్యంత హృదయ విదారకంగా ఉన్నాయి. డజన్ల కొద్దీ ఖైదీలతో ఒకే గదిలో, రాత్రిళ్లు ఆర్పని దీపాలు, నిరంతర శబ్దాల మధ్య ఆమె నిద్రకు దూరం అవుతున్నారు. కుటుంబ సభ్యులు రోజు మొత్తం వేచి చూస్తే తప్ప ఆమెను కలవడానికి నిమిషం దొరకడం లేదు. 'ఇదంతా ఒక పీడకల. ఆమె అక్కడ ఉండాల్సిన వ్యక్తి కాదు. ఇది చాలా అమానవీయం'.. అని కుమార్తె జోటి కన్నీళ్లు పెట్టుకుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

బీబీసీపై ట్రంప్ పరువు నష్టం దావా

వాషింగ్టన్: అంతర్జాతీయ మీడియా సంస్థ బీబీసీపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పరువు నష్టం దావా వేశారు. 2021లో కేపిటల్ హిల్ దాడి సమయంలో తన ప్రసంగాన్ని దురుద్దేశంతో తప్పుగా, రెచ్చగొట్టేవిధంగా బీబీసీ ప్రసారం చేసిందని ఆయన ఆరోపించారు. అందుకుగాను సంస్థ 10 బిలియన్ డాలర్లు (రూ.90వేల కోట్లు) నష్టపరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతేకాదు.. 2024 అధ్యక్ష ఎన్నికల్లోనూ జోక్యం చేసుకోవడానికి, ప్రభావితం చేయడానికి ప్రయత్నించిందన్నారు. ఈ మేరకు 33 పేజీలతో మయామి ఫెడరల్ కోర్టులో దావాను వేశారు. 2021 జనవరి 6న తేదీన అధ్యక్ష ఎన్నికల ఫలితాల సమయంలో కేపిటల్ హిల్‌పై దాడికి ముందు తన మద్దతుదారులను ఉద్దేశించి ట్రంప్ గంటపాటు మాట్లాడారు. ఈ సందర్భంగా 'కేపిటల్ హిల్‌కు వెళ్తున్నాం. నేనూ మీతోపాటు వస్తున్నాం. మనం పోరాడదాం'అన్నట్టుగా ఉన్న ప్రసంగాన్ని బీబీసీ 'పనోరమ'డాక్యుమెంటరీగా ప్రసారం చేసింది. అయితే రెండు వేర్వేరు భాగాలను ఎడిట్ చేసి, కలిపి ప్రసారం చేశారని ట్రంప్ ఆరోపించారు. తాను మాట్లాడని విషయాలను మాట్లాడినట్లుగా ప్రసారం చేసినందుకు బీబీసీపై దావా వేస్తున్నట్లు చెప్పారు.

భారత్, ఇథియోపియా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

ఇథియోపియా ప్రధాని అహ్మద్ అలీతో మోదీ భేటీ

అడిస్ అబాబా: భారత్, ఇథియోపియా సంబంధాలల్లో కీలక మలుపు చోటుచేసుకుంది. ఇరుదేశాలు తమ బంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకున్నాయి. మంగళవారం ఇథియోపియాకు చేరుకున్న భారత ప్రధాని మోదీ మంగళవారం ఇథియోపియా ప్రధానమంత్రి అబీ అహ్మద్ అలీతో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక, పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. అంతకు ముందు మోదీకి నేషనల్ ప్యాలెస్‌లో ఘన స్వాగతం లభించింది. మోదీ ప్రతినిధుల స్థాయి చర్చల్లో పాల్గొన్నారు. భారత్-ఇథియోపియా సంబంధాలను వ్యూహాత్మకం భాగస్వామ్యంగా మార్చుకున్నట్లు ఆయన తెలియజేశారు. దీనివల్ల ఇరుదేశాల సంబంధాలకు నూతన వేగం, శక్తి సమకూరుతాయని ఉద్ఘాటించారు. ఉగ్రవాదంపై భారత్ సాగిస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తున్నందుకు ఇథియోపియా ప్రధానికి కృతజ్ఞతలు తెలియజేశారు. మరోవైపు మోదీ ఇథియోపియా రాజధాని అడిస్ అబాబాలోని ఫ్రెండ్‌షిప్ పార్కు, ఫ్రెండ్‌షిప్ స్క్వేర్‌ను సందర్శించారు. బుధవారం ఇథియోపియా పార్లమెంట్ సంయుక్త సమావేశంలో ఆయన ప్రసంగిస్తారు.

సర్కారియా కమిషన్‌ను ఎప్పుడు నియమించారు?

సర్కారియా కమిషన్‌ను కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై నియమించిన మొదటి కమిషన్‌గా పేర్కొంటారు. ఇందిరాగాంధీ హయాంలో కేంద్ర ప్రభుత్వం రంజిత్‌సింగ్ సర్కారియా అధ్యక్షతన ఈ కమిషన్‌ను నియమించింది. ఇది కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై విస్తృత అధ్యయనం చేసి సమగ్ర నివేదిక సమర్పించింది. అనేక అంశాలపై లోతైన విశ్లేషణ, వివరణాత్మక పరిశీలన చేసింది. స్ఫూర్తివంతమైన సంబంధాలను నెలకొల్పడానికి, సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి దోహదపడే సూచనలిచ్చింది. దేశ సమగ్రత, ఐక్యతకు తోడ్పడే సిఫార్సులు చేసింది.

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

రాజమన్నార్ కమిటీ (1969)

కేంద్ర - రాష్ట్ర సంబంధాలను సమగ్రంగా అధ్యయనం చేయడానికి తమిళనాడు ప్రభుత్వం జస్టిస్ రాజమన్నార్ కమిటీని 1969లో నియమించింది. ఇందులో పి.సి. చంద్రారెడ్డి, డాక్టర్ లక్ష్మణ్ స్వామి మొదలియార్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ 1971 మే 27న తన అధ్యయన నివేదికను సమర్పించింది.

రాజమన్నార్ కమిటీ భారత్‌లోని ఏకకేంద్ర ధోరణులకు 4 కారణాలు తెలిపింది. అవి:

1. భారత రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక అధికారాలు ఇవ్వడం.
2. కేంద్రం, రాష్ట్రంలో ఒకే రాజకీయ పార్టీ పాలన.
3. తగినన్ని ఆర్థిక వనరులు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఆధారపడటం.
4. కేంద్ర ప్రణాళిక రూపకల్పన, ప్రణాళిక సంఘం అధీకృత పాలన.

సూచనలు

- కేంద్ర-రాష్ట్ర సంబంధాల విషయంలో తలెత్తే వివాదాలను పరిశీలించడానికి ఒక అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి.
- రాష్ట్రాల అవసరాలకు సంబంధించిన బిల్లులను అంతర్రాష్ట్ర మండలి అనుమతితోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి.
- కేంద్ర, ఉమ్మడి జాబితాల్లోని పాలనా పరమైన అంశాలను పునఃపరిశీలించడానికి ఒక ఉన్నత స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేయాలి.
- రాజ్యసభలో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలి.
- రాజ్యసభకు 12 మందిని నియమించే రాష్ట్రపతి అధికారాన్ని రద్దు చేయాలి.
- కేంద్ర మంత్రి మండలిలో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి.
- పార్లమెంట్ చేసే అన్ని రాజ్యాంగ సవరణలను 2/3వ వంతు మెజార్టీతో రాష్ట్ర శాసనసభ ఆమోదించాలి.
- పన్నుల విధింపునకు సంబంధించిన అవశేష అధికారాలను రాష్ట్రాలకు ఇవ్వాలి.
- ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయం కింద రాష్ట్రాలకు అందించే ఆర్థిక సహాయం ఆర్థిక సంఘం సూచనలకు అనుగుణంగా ఉండాలి.
- రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించడానికి అవకాశమిచ్చే రాజ్యాంగ అధికరణలు 356, 357, 365లను రద్దు చేయాలి.
- రాష్ట్రాల్లో ఉన్నత స్థాయి (హైకోర్టు) న్యాయమూర్తుల తొలగింపు ప్రక్రియలో శాసనసభ అభిప్రాయాన్ని కూడా తీసుకోవాలి.
- అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లను రద్దు చేయాలి.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు. ఈ కమిటీ సిఫార్సులపై దేశవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. దేశంలో వేర్పాటువాద శక్తులు బలపడుతుంటే జాతి నిర్మాణం, జాతీయ సమైక్యత కోసం కృషి చేయడానికి; విద్య, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, ఉత్పత్తి రంగాలను బలోపేతం చేసి సామాన్య మానవుడి సమస్యలను తీర్చడానికి ప్రయత్నాలు చేయాల్సి ఉండగా.. కేవలం రాష్ట్రాలకు అనుకూలంగా, ప్రాంతీయతత్వాన్ని ప్రోత్సహించే విధంగా సిఫార్సులు చేయడం సరికాదని పేర్కొన్నారు.

ఆనందపూర్ సాహెబ్ తీర్మానం (1973)

1973లో పంజాబ్‌లోని ఆనందపూర్ సాహెబ్ ప్రాంతంలో అకాలీదళ్ పార్టీ సమావేశమై కేంద్ర-రాష్ట్ర సంబంధాల విషయంలో ఒక తీర్మానం చేసింది. దీన్నే 'ఆనందపూర్ సాహెబ్ తీర్మానం' అంటారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ పరిధి ప్రధానంగా రక్షణ, అంతర్జాతీయ సంబంధాలు, కమ్యూనికేషన్లు, కరెన్సీ తదితర అంశాల వరకే పరిమితం కావాలని, భారత్‌లో నిజమైన సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తి తేవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

సూచనలు

- పంజాబ్ నుంచి తీసుకున్న ప్రాంతాలను ఇతర రాష్ట్రాల్లో చేర్చినా, వాటిని తిరిగి పంజాబ్‌కు అప్పగించాలి.
- బహిరంగ ప్రదేశాల్లో మత్తు పానీయాలు సేవించడం, ధూమపానాన్ని నిషేధించాలి.
- పంజాబ్ వెలుపల నివసించే అల్ప సంఖ్యాక వర్గాలకు (సిక్కులు) అన్ని రకాల రక్షణలు కల్పించాలి. వారి పట్ల ఎలాంటి వివక్ష చూపకూడదు.
- రక్షణ, విదేశీ వ్యవహారాలు, తంతి-తపాలా, కరెన్సీ, నాణేలు, రైల్వేలు మినహా మిగతా పాలనాపరమైన అంశాలన్నింటినీ కేంద్ర ప్రభుత్వ పరిధి నుంచి తప్పించి రాష్ట్రాలకు బదిలీ చేయాలి.
- మాజీ సైనికులకు పునరావాస సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలి.

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ తీర్మానం (1977)

కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 1977లో ఒక విజ్ఞాపన పత్రం సమర్పించింది. ముఖ్యాంశాలు..

- భారత రాజ్యాంగంలో 'యూనియన్' అనే పదాన్ని తొలగించి 'సమాఖ్య' పదాన్ని చేర్చాలి.
- నూతన రాష్ట్రాల ఏర్పాటు ప్రక్రియలో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి.
- కేంద్ర ప్రభుత్వ అధికార పరిధిని తగ్గించాలి.
- రాజ్యసభకు కూడా లోక్‌సభతో సమానంగా అధికారాలను బదలాయించాలి.
- రాష్ట్రపతి పాలన, ఆర్థిక అత్యవసర పరిస్థితి లాంటి అధికారాలను తొలగించాలి.
- జాతీయ అభివృద్ధి మండలి పేరును జాతీయ ఆర్థికాభివృద్ధి మండలిగా మార్పు చేసి దాని అస్థిత్వాన్ని బలోపేతం చేసి పరిరక్షించాలి.
- త్రి భాషా సూత్రాన్ని అమలు చేయడానికి గట్టి ప్రయత్నం చేయాలి.
- ఆదాయ పన్నుపై సర్వీస్ చార్జీలను ప్రత్యేక సందర్భాల్లోనే విధించాలి.
- ఆర్థిక సంఘంలో సభ్యులుగా ఆర్థిక నిపుణులనే నియమించాలి.
- దేశంలోని అన్ని రాష్ట్రాలతో సంప్రదించి ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్, ఇండియన్ హెల్త్ సర్వీసు, ఇండియన్ ఎడ్యుకేషన్ సర్వీసులను ఏర్పాటు చేయాలి.
- మంత్రులపై విచారణ కమిషన్ ఏర్పాటు చేసే సందర్భంలో పార్లమెంట్ అనుమతి తీసుకోవాలనే నిబంధన విధించాలి.
- రాష్ట్రాల్లో శాసనమండలి ఏర్పాటు, రద్దు విషయంలో పార్లమెంట్ నిర్ణీత సమయంలోనే తన అభిప్రాయం వ్యక్తం చేయాలి.
- ప్రణాళిక సంఘం, ఆర్థిక సంఘం మధ్య విధుల విభజన హేతుబద్ధంగానే ఉంది కాబట్టి దీన్ని కొనసాగిస్తూ పరిపుష్టం చేయాలి.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

- దేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా జాతీయ స్థాయి కార్యక్రమాలను ప్రాంతీయ భాషల్లో ప్రచారం చేయాలి.
- ఉమ్మడి జాబితాలో పేర్కొన్న అంశాలపై పార్లమెంట్ చట్టం చేసేటప్పుడు రాష్ట్రాలను తప్పనిసరిగా సంప్రదించాలి.
- కేంద్ర ప్రభుత్వ బలగాలను రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి లేకుండా పంపించవద్దు.
- గవర్నర్ నియామకం చేపట్టేటప్పుడు సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రిని విధిగా సంప్రదించే విధంగా రాజ్యాంగ సవరణ చేయాలి.
- టెలివిజన్, రేడియోలకు స్వయం ప్రతిపత్తి అవసరం లేదు కాబట్టి వాటి పనితీరును వికేంద్రీకరించాలి.
- అంతర్రాష్ట్ర మండలి వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించాలి.
- అంతర్రాష్ట్ర మండలిని శాశ్వత ప్రాతిపదికపై ఏర్పాటు చేయాలి.
- రాష్ట్ర ప్రభుత్వాలకు కార్పొరేషన్ పన్నులో వాటా కల్పించాలి.
- భాషాపరమైన అల్ప సంఖ్యాక వర్గాల వారికి ప్రత్యేక కమిషన్ నియమించి అభివృద్ధిని సమీక్షిస్తూ ఉండాలి.

సర్కారియా కమిషన్ (1983)

కేంద్ర - రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేయడానికి 1983 జూన్ 9న కేంద్ర ప్రభుత్వం రంజిత్‌సింగ్ సర్కారియా అధ్యక్షతన కమిషన్‌ను నియమించింది. ఇందులో బి.శివరామన్, ఎస్.ఆర్. సేన్ సభ్యులుగా; ఆర్.ఎం.సుబ్రహ్మణ్యం కార్యదర్శిగా; ఎల్.ఎన్. సిన్హా రాజ్యాంగ సలహాదారుడిగా వ్యవహరించారు. ఈ కమిషన్ 247 సిఫార్సులతో సుమారు 5000 పేజీల నివేదికను 1987 అక్టోబర్ 27న కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. కేంద్ర ప్రభుత్వం సుమారు 230 సిఫార్సులపై నిర్ణయాలు తీసుకొని 170 సిఫార్సులను అమలు చేసింది.

ముఖ్యమైన సిఫార్సులు

కేంద్ర - రాష్ట్ర ఆర్థిక సంబంధాలు

కార్పొరేట్ పన్నును కేంద్ర – రాష్ట్రాలు పంచుకునేలా రాజ్యాంగాన్ని సవరించాలని సర్కారియా కమిషన్ సిఫార్సు చేసింది. తగిన రీతిలో పన్ను, ఎక్సైజ్ సుంకాలు పంచుకోవడంలో మార్పులు చేయాలని పేర్కొంది. అధికరణ 269ని సవరించి ప్రభుత్వ ప్రసార సంస్థల్లో వ్యాపార ప్రకటనలపై పన్ను విధించి దాన్ని పూర్తిగా రాష్ట్రాలకు ఇవ్వాలని సూచించింది. వృత్తి పన్ను, వాణిజ్య పన్నుల పరిమితిని పెంచాలని, ఆదాయ పన్ను మీద అదనపు సుంకం, పరిమిత ప్రయోజనాలకు పరిమిత గడువునే విధించాలని సిఫార్సు చేసింది.

రైల్వే ప్రయాణికుల చార్జీలపై పన్ను ప్రాతిపదికగా రాష్ట్రాలకు గ్రాంటులు ఇవ్వాలని సిఫార్సు చేసింది. ఖనిజాల రాయల్టీ రేట్లను ప్రతి నాలుగేళ్లకు కాకుండా రెండేళ్లకే సమీక్షించాలని సూచించింది. ఆర్థిక సంఘం నిర్ణయాలు తీసుకునే ముందు రాష్ట్రాలను సంప్రదించాలని సలహా ఇచ్చింది. సిఫార్సులను అమలు చేయడంలో ఆలస్యం చేయకూడదని కూడా పేర్కొంది.

కేంద్ర - రాష్ట్ర శాసన సంబంధాలు

- కేంద్ర జాబితాలోని ఎంట్రీ 97ను సవరించి అవశిష్ట అంశాలను (పన్నులు కాకుండా) ఉమ్మడి జాబితాలోకి మార్చాలని సూచించింది. ఉమ్మడి జాబితా విషయంలో కేంద్ర ప్రభుత్వం దేశ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని ఏదైనా నూతన చట్టాన్ని రూపొందించేటప్పుడు రాష్ట్రాలను తప్పక సంప్రదించాలని సూచించింది. ఈ విషయంలో మంచి సంప్రదాయాలను నెలకొల్పాలని పేర్కొంది.
- రాష్ట్ర విధానసభ, విధాన మండలి ఏర్పాటుకు లేదా రద్దుకు ఆమోదించిన తీర్మానాన్ని రాష్ట్రపతి సహేతుక కాల వ్యవధిలో అనుమతించాలని, కేంద్ర ప్రభుత్వ సూచనలతో పాటు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని సిఫార్సు చేసింది. పార్లమెంట్ దాన్ని ఆమోదించవచ్చు లేదా తోసిపుచ్చవచ్చు. ఆ శాసనం పార్లమెంట్ ఆమోదం పొందితే, కేంద్ర ప్రభుత్వం దాని అమలుకు చర్యలు తీసుకోవాలి.

అవసరమైతే అధికరణ 169ని దీనికి అనుగుణంగా సవరించాలని సూచించింది.

- రాష్ట్రానికి సంబంధించిన బిల్లులను గవర్నర్ కేంద్రం పరిశీలనకు పంపించడం గురించి సర్కారియా కమిషన్ సవివరమైన సూచనలు చేసింది. నిర్ణీత కాలంలో బిల్లులను పరిశీలించడంతో పాటు సాధారణ పరిస్థితుల్లో బిల్లును ఆమోదించాలని, విధానపర లోపాలున్నాయని లేదా త్వరలో సమగ్ర బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టబోతున్నామనే నెపంతో తిరస్కరించకూడదని కమిషన్ సూచించింది. బిల్లును తిరస్కరించడానికి కారణాలను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయాలి.

కేంద్ర - రాష్ట్ర పరిపాలనా సంబంధాలు

- అధికరణం 159ని సవరించి గవర్నర్ నియామకంలో రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించేలా చూడాలని సర్కారియా కమిషన్ సూచించింది. గవర్నర్‌గా నియమించే వ్యక్తికి కింద పేర్కొన్న లక్షణాలు ఉండాలని కమిషన్ సిఫార్సు చేసింది.
  1. ఏదైనా ఒక రంగంలో ప్రముఖ వ్యక్తిగా ఉండాలి.
  2. రాష్ట్రేతర వ్యక్తి అయియుండాలి.
  3. రాజకీయాల్లో ఎక్కువగా పాల్గొనని, ముఖ్యంగా.. ఆ ప్రాంత రాజకీయాలతో పెద్దగా సంబంధం లేని వ్యక్తి అయియుండాలి.

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి చెందిన వ్యక్తిని ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు గవర్నరుగా పంపవద్దని కూడా సర్కారియా కమిషన్ సూచించింది.

- గవర్నర్ నియామకంలో ఉప రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, ప్రధానమంత్రిని సంప్రదించడం మంచిదని కమిషన్ సూచన. గవర్నర్లను పదవీ కాలం పూర్తయ్యే వరకూ కొనసాగించాలని, ఒకవేళ ముందే తొలగిస్తే.. ఏ కారణం వల్ల అలా చేస్తున్నారో తెలపాలని పేర్కొంది. తగిన వివరణ ఇవ్వడానికి గవర్నర్‌కు అవకాశం కల్పించాలని సిఫార్సు చేసింది.
- గవర్నర్ ఇచ్చిన వివరణను రాష్ట్రపతి, స్పీకర్, పదవీ విరమణ చేసిన ఉన్నత న్యాయమూర్తితో కూడిన సలహా సంఘం పరిశీలించాలని కమిషన్ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ముందు ఆ గవర్నర్ తొలగింపునకు సంబంధించి వ్యాఖ్య చేయాలని సూచించింది. అలాంటి వ్యక్తి పదవీ విరమణ తర్వాత గవర్నర్, ఉప రాష్ట్రపతి పదవులు తప్ప ఎలాంటి కేంద్ర, రాష్ట్ర పదవులను చేపట్టకుండా, రాజకీయాల్లోకి రాకుండా అనర్హత విధించాలని సూచించింది. పదవీ విరమణ ప్రయోజనాలు ఏర్పరచాలని తెలిపింది. అధికరణం 163లో ఉన్న గవర్నర్ వివేచనాత్మక అధికారాన్ని ఏ మాత్రం మార్చకూడదని, ఆ అధికారాన్ని ఎలా ఉపయోగించాలనే విషయంలో మార్గదర్శక సూత్రాలు ఏర్పర్చడం సాధ్యం కాని పని అని తెలిపింది.

Sivani is a wiser girl than Bhavani

విశేషణాలు (Adjectives)

వాడుకలో కొన్ని ముఖ్య నియమాలు

Rule 1:

కొన్ని క్రియలను adverbsతో modify చేయలేం. వీటిని verbs of incomplete predication అంటాం. అంటే వీటి అర్థం Complete అవడానికి ఏదైనా Complement అవసరం. ఈ క్రియలకు Adjectivesను complementగా వాడతారు.

Verbs: 'be' దాని రూపాలు (is, am, are, was, were), become, seem, appear, taste, smell, round, feel, turn, get, grow, keep, look, make, prove etc.

'Her voice sounds...' ఈ వాక్యానికి అర్థం లేదు. sounds how? అని ప్రశ్నిస్తే sweet, bitter, harsh. ఇలా ఏదో ఒక adjective complement అవసరం.

Ex: 1) She appears sad.
2) His statements sounds queer.
3) He feels sick.
4) The flowers smell sweet.
5) You have grown wise.
6) She looked dainty.
7) Seema is smart.

Rule: 2

కొన్ని adjectivesని comparative, superlative degreesలో చెప్పకూడదు. ఈ adjectives వాటికవే absolute conditionని తెలియజేస్తాయి.

Such adjectives are: perfect, excellent, unique, ideal, extreme, complete, eternal, supreme, etc.

Ex: 1) I have never seen a more complete book on English figures of speech.('more' అవసరం లేదు)
2) Happiness is the chiefest aim of life. (chiefest తప్పు. 'chief'అని రాయాలి)
3) Each person's fingerprints are most unique. ('most' అవసరం లేదు)
4) Most extreme poverty still exists in many parts of India ('most' అవసరం లేదు)

Rule: 3

-orతో అంతమయ్యే కింది comparatives లాటిన్ భాష నుంచి వచ్చాయి. వీటిని to తో ప్రయోగిస్తాం. thanతో కాదు.

Ex: 1) Abdul is inferior to Amar in intelligence. (inferior than... అని రాయొద్దు)
2) Sunanda is senior to me.
3) All his friends are junior to him.
4) This incident took place prior to the fire accident.
5) The U turn is posterior to their deceptive win. (happened or existed later something else).

అలాగే –or తోనే అంతమయ్యే మరికొన్ని Comparative రూపాలు వాటి Comparative forceను కోల్పోతాయి. వాటిని మామూలు Positive Adjectives గానే వాడతాం. వీటిని Comparative, Superlative forms లేకుండానే ప్రయోగిస్తాం.

Ex: 1) The interior walls of the house are painted white.
2) The exterior walls of the house are studded with mosai.
3) His words are of minor/major importance.

రెండు లేదా అంతకంటే ఎక్కువ వస్తువులను లేదా వ్యక్తులను పోల్చినప్పుడు thanను వాడుతాం . ఎంపిక చేసిన వాటి గురించి చెప్పేటప్పుడు ofను Comparative adjectivesగా తీసుకుంటాం.

Ex: 1) Yogesh is more deceptive than Tabu.
2) Sivani is a wiser girl than Bhavani.

Note: Double comparative, double Superlativesను వాడొద్దు.

Ex: 1) She is more wiser than her Sister(ఇది తప్పు. పై వాక్యంలో moreను తొలగించాలి)

కానీ సాహిత్యంలో Shakespeare లాంటి మహామహులు దీనికి మినహాయింపుగా అంగీకరించాలి.

Ex: 1) The most Kindest Brutus.
2) The honester (in stead of 'more honest') attitude.

more hotter, most poorest ఇలా చాలా ప్రయోగాలు ఆయన సాహిత్యంలో మనకు కనిపిస్తాయి. మొత్తం మీద 'lesser'అనే ప్రయోగం వాడుకలో ఉంది. మంచి రచయితలు ఈ పదాన్ని స్వాగతిస్తున్నారు.

Ex: 1) He chose the lesser of the two evils.

అలాగే Prefer, preferable అనే పదాలు Comparative force ని కలిగి ఉన్నాయి. వీటిని 'to'తో ప్రయోగిస్తాం.'than'తో కాదు. 'more' అనే పదాన్ని వీటితో వాడొద్దు.

Ex: 1) He has his own scheme he thinks preferable to that of his own brother.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
జనరల్/ బేసిక్ ఇంగ్లిష్

ఎక్కడ 'fewer' అవసరమో అక్కడ 'less' వాడకూడదు. ఎందుకంటే 'less' quantityని, 'fewer' number ని denote చేస్తాయి. 'few' కు comparative.. fewer.

Ex: 1) Fewer women wear hats these days.
2) There are fewer (not 'less') tigers than there were a hundred years ago.
3) I don't accept less than (not' fewer) a thousand for my each article. (here, a thousand rupees. Though 'rupees' are countable, indicating number, it is considered a Sum of amount).
4) This is a less bad (or less bad a) solution than I thought possible

'older' and 'oldest'లను persons, things రెండింటికీ వాడొచ్చు. కానీ elder and eldest వ్యక్తులకు మాత్రమే వాడాలి. ప్రత్యేకించి ఒకే కుటుంబ సభ్యులకు మాత్రమే.

'older, oldest' refer both to age and time while 'old, elder, eldest' refer to age only.

Ex:
1) Babu is older than Jagan.
2) Pandu is my elder brother.
3) Patricia is the eldest of the Vicar's family.
4) This is the oldest tree in the garden (not 'eldest tree')

In the sense of 'one who is older than another'.
5) Respect your elders.
6) He is elder to me (not 'elder than I').

'few' and 'a few' have different meanings. 'few' is negative and equivalent to hardly any, not many.

Ex: 1) Many are called but few are chosen.
2) Few people or persons can keep a secret.

'A few' is positive and equivalent to 'some'.

Ex: 1) There are a few books in the old library.
2) I have a few friends.

' The few' denotes 'not many'. It has both a positive and a negative meaning.

Ex: 1) The few are rich, the many are poor.
2) He lost the few thousands he had.
3) The money he lost was not much (Negative).

He lost all the money he had (Positive) ఇలాగే little, a little, the little ప్రయోగం కూడా.

'Little' means 'hardly any' or 'not much'.

It has a negative meaning.

Ex: 1) There was little food left in the bowl.
2) There is little hope of his execution of promises made to the people.
3) 'A little' denotes 'some at least'. It has positive meaning.
4) Here is a little hope of his recovery.
5) I have a little money.
6) A little knowledge is always dangerous.

'the little' denotes 'the small quantity'. It has both a positive and a negative meaning.

Ex: 1) I spent the little money I had (నా దగ్గర ఉన్న కొంచెం డబ్బులు నేను ఖర్చు పెట్టేశాను).

It means:

The money I had wasn't much (negative).

I spent all the money I had (positive).

'Later' is the opposite of 'earlier' It refers to 'Time'.

Latest 'means ' recent', last up to now only'.

దీనికి మూడు రూపాలు:
'Late - later - latest.
'Last' mean 'final' or 'last-of all'
దీనికి 3 రూపాలు.
later - latter - last.

Practice Bits

1. Fill in the blank with suitable word.
There is no secret between her and______
1) I 2) me 3) mine 4) he
2. Fill in the blank with correct pronoun. ______were you talking to?
1) To whom 2) Whom
3) Who 4) Whom
3. Supply suitable article.
He is______ heir of the property besides his cousin.
1) the 2) an
3) a 4) No article needed.
4. He ______ (come) this morning. Supply the correct verb form.
1) came
2) will come
3) has come
4) is coming.
5. There ______ many a flower in the garden.
1) is 2) are
3) was 4) were
6. He died _______ a fatal blow.
1) from 2) of
3) with 4) for
7. His ruling is not ______ than the ruling of the past.
1) more better
2) much better
3) better 4) more fairer
8. ______ you please help me do this?
1) Would 2) Will
3) Could 4) Can
9. He is born ______ very rich parents.
1) to 2) of
3) by 4) for
10. One of my friends _______ saved the life of a boy.
1) have 2) are saved
3) has 4) has been
11. I_____ my bed. I will just come.
1) am making
2) am doing
3) am setting
4) am arranging
12. Dad, ______ Mr Sastry is on line for you. Come soon.
1) No article 2) a
3) the 4) one
13. He completed reading______ books he had.
1) a few 2) few
3) the few 4) some
14. If I had money, I ______ you.
1) will lend
2) will be lending
3) would have lent
4) could have lent
15. I am looking forward_____ you very soon.
1) to meet
2) to meeting
3) meet
4) to be met

Key:

1) 2	2) 2	3) 2	4) 3
5) 1	6) 1	7) 3	8) 3
9) 2	10) 3	11) 1	12) 2
13) 3	14) 4	15) 2	

వర్ణ వ్యవస్థ ప్రస్తావన ఏ 'వేదం'లో కనిపిస్తుంది?

భారతదేశంలో ఒక ప్రత్యేక రకమైన సామాజిక స్తరీకరణ (Social Stratification) కనిపిస్తుంది. దీన్ని 'కుల వ్యవస్థ'గా పేర్కొంటారు. ప్రపంచం మొత్తం మీద పరిశీలిస్తే కొన్ని ప్రాంతాల్లో కులం లక్షణాలు కనిపిస్తున్నప్పటికీ భారత్‌లోని కులవ్యవస్థ విశిష్టమైంది. హిందూ సామాజిక వ్యవస్థ కుల విధానంపై ఆధారపడి ఉంది. కులం అనేది ఏ మాత్రం సరళత లేని అంశంగా పరిణమించింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

కులం - కులతత్వం

కులం అనే పదం 'Caste' అనే పోర్చుగీస్ పదం నుంచి ఉద్భవించింది. కాస్ట్ అంటే..

1) వారసత్వం
2) వంశ పారంపర్యంగా కలిగేది

అనే అర్థాలున్నాయి.

కుల వ్యవస్థ భారతీయ సామాజిక వ్యవస్థకు ఒక 'మూలస్తంభం'గా ఉంది. హిందూ సమాజం మినహాయించి మరే ఇతర సమాజంలోనూ కులాలు కనిపించవు. వివిధ పరిశోధకులు కులానికి సంబంధించి భిన్న రకాల నిర్వచనాలు ఇచ్చారు.

'కొన్ని సమూహాలు లేదా కుటుంబాలు కలిసి ఒకే పేరుతో, ఒకే విధమైన వంశానుక్రమంతో ఉండి వంశపారంపర్యంగా ఒకే విధమైన పేరుతో గుర్తింపు పొందడాన్ని కులం అంటారు' – **హెర్బర్ట్ రిస్లీ**

'కులం అంటే ఒక పరధీకృతమైన సమూహం (Closed Group)'

– ***టి.ఎన్. మదన్, డి.ఎన్. మజుందార్***

'ఒక వర్గం (Single Group) కచ్చితంగా వారసత్వాన్ని పాటించినప్పుడు దాన్ని కులంగా పేర్కొనవచ్చు' – **సి.హెచ్. కూలే**

ఎమ్.ఎన్. శ్రీనివాసన్, హట్టన్ కులం ఆవిర్భావం గురించి పేర్కొన్నారు.

కులం ఆవిర్భావం

భారతదేశంలో సాహిత్య రచన ఆర్యుల కాలంలో (క్రీ.పూ. 1500 నుంచి క్రీ.పూ. 500 మధ్య) జరిగింది. ఈ సాహిత్యాన్ని ప్రధానంగా 8 రకాలుగా గుర్తించవచ్చు. **అవి:**

1) వేదాలు
2) బ్రాహ్మణాలు
3) అరణ్యకాలు
4) ఉపనిషత్తులు

- వేదాంగాలు
- పురాణాలు
- ఉపవేదాలు
- ఇతిహాసాలు

వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులను 'శృతి సాహిత్యం' అంటారు. అంటే 'అతి పవిత్రమైనవి' అని అర్థం. వీటినే 'ఆపౌరుషేయాలు'గా పేర్కొంటారు. అంటే దేవతలు రాసి ప్రజలకు ఇచ్చారు అని అర్థం.

వేదం అంటే 'నాలెడ్జ్ ' అని అర్థం. వేదాలు నాలుగు. **అవి:**

1) రుగ్వేదం
2) యజుర్వేదం
3) సామవేదం
4) అధర్వణ వేదం

రుగ్వేదంలో పదో అధ్యాయంలో 1028 శ్లోకాలు ఉన్నాయి. ఈ అధ్యాయంలోనే 'పురుష సూక్తం' గురించి ఉంది. సమాజాన్ని వర్ణం ఆధారంగా బ్రహ్మ నాలుగు రకాలుగా సృష్టించాడని 'పురుష సూక్తం'లో పేర్కొన్నారు.

వర్ణం అంటే రంగు అని అర్థం. వర్ణం ఆధారంగా బ్రహ్మ కింద పేర్కొన్న సామాజిక వర్గాలను సృష్టించాడని రుగ్వేదంలో తెలిపారు.

1) బ్రాహ్మణులు (తెలుపు)
2) క్షత్రియులు (ఎరుపు)
3) వైశ్యులు (పసుపు)
4) శూద్రులు (నలుపు)

ఈ వర్గీకరణలో మొదటి 3 వర్ణాలకు చెందినవారిని 'ద్విజులు' అంటారు. అంటే రెండు సార్లు (తల్లి గర్భం నుంచి, ఉపనయనం నుంచి) జన్మించినవారని అర్థం. శూద్రులకు ఉపనయనం లేదు. వీరికి కర్మకాండలు చేసే అర్హత కూడా లేదు.

ఆర్యుల సాహిత్యంలోని వేదాంగాలను ఆరు రకాలుగా వర్గీకరించవచ్చు.

అవి: 1) శిక్ష, 2) నిరుక్త, 3) వ్యాకరణం, 4) జ్యోతిషం, 5) ఛందస్సు, 6) కల్ప

'కల్ప' అనేది యజ్ఞయాగాదుల గురించి తెలుపుతుంది. ఇందులో మూడు రకాల సూత్రాలు ఉన్నాయి. వీటిలో గృహ సూత్రం ప్రధానమైంది.

గృహ సూత్రం: రాజు మోక్షం సాధించడానికి చేయాల్సిన 16 పౌరుశ కర్మల గురించి పేర్కొంటుంది. వీటిలో 11వ కర్మ 'ఉపనయనం' గురించి వివరిస్తుంది. ఈ కర్మ నిర్వహిస్తే మోక్షం పొందొచ్చని భావిస్తారు.

◆ శూద్రులతో పాటు స్త్రీలకు కూడా ఉపనయనం లేదు.

వర్ణ వ్యవస్థ నిర్మితి, ఆచరణ, వివరణ అంతా సమాజంలో సామరస్యం సాధించడానికే ఏర్పాటైంది. కానీ చాతుర్వర్ణ వ్యవస్థలో పైవర్ణంవారు కింది వర్ణం అయిన శూద్రులను 'దాసులు'గా చూడటం ప్రారంభించారు. ఆ తర్వాత క్రమంగా వివిధ వృత్తులు ఏర్పడ్డాయి.

కాలక్రమేణా బౌద్ధ, జైన మతాల అవిర్భావంతో సమాజంలో అనేక మార్పులు సంభవించాయి. అంతర్వర్ణ వివాహాలను అంగీకరించారు. అనులోమ, ప్రతిలోమ వివాహాలు కూడా జరిగాయి.

ఉన్నత వర్ణాలకు చెందిన పురుషుడు తక్కువ వర్ణాలకు చెందిన యువతిని వివాహం చేసుకోవడం 'అనులోమ వివాహం'. తక్కువ వర్ణంలోని పురుషుడు ఉన్నత వర్ణానికి చెందిన స్త్రీని వివాహం చేసుకోవడం 'ప్రతిలోమ (విలోమ) వివాహం'. ఈ విధంగా జరిగిన వివిధ రకాల వివాహాల కారణంగా 'వర్ణ సంకరం' ఏర్పడింది.

వర్ణ వ్యవస్థ పరివర్తన చెంది విస్తృతమవడం వల్ల జాతులు ఆవిర్భవించాయి. కాలక్రమేణా ఇవి కులాలుగా ఏర్పడ్డాయి. ఇలా ఏర్పడ్డ కులం తదనంతర కాలంలో అనేక ఉపకులాలుగా విభజితమైంది. ఈ విధంగా 'వర్ణ వ్యవస్థ' నుంచి 'కుల వ్యవస్థ' ఏర్పడింది.

కులం ఆవిర్భావ సిద్ధాంతాలు

